www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

నితిన్ నబీన్ నా బాస్

కార్యకర్తగా ఆదేశాలు పాటిస్తా: ప్రధాని మోదీ

లక్ష్మణ్.. ఓట్లు ఏమైనా చోరీ అయ్యాయా?

పార్టీ అధ్యక్ష ఎన్నిక రిటర్నింగ్ ఆఫీసర్ లక్ష్మణ్‌తో మోదీ సరదా సంభాషణ 2

బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబీన్ ఏకగ్రీవ ఎన్నిక.. బాధ్యతల స్వీకరణ

రానున్న అసెంబ్లీల ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేయాలని శ్రేణులకు పిలుపు




బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన నితిన్ నబీన్‌తో ప్రధాని మోదీ, అమిత్‌షా, రాజ్‌నాథ్‌సింగ్, నడ్డా, బీఎల్ సంతోష్

బుధవారం | 21-1-2026 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 | సంచిక (Issue) : 315 | గుంటూరు సిటీ

శ్రీ విశ్వావసు నామసంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, శుక్లపక్షం, తిథి: తదియ రా.2:47 తదుపరి చవితి, నక్షత్రం: ధనిష్ఠ మ.1:58 తదుపరి శతభిషం, వర్జ్యం: రా.9:18-10:56, దుర్ముహూర్తం: మ.12:04-12:48, అమృతఘడియలు:: లేవు, రాహుకాలం: మ.12:00-1:30, సూర్యోదయం: 6:52, సూర్యాస్తమయం: 6:00


Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

‘ఆంధ్రజ్యోతి’కి భూకేటాయింపును రద్దు చేస్తూ 2019లో జగన్ సర్కారు జారీ చేసిన ఉత్తర్వులను పక్కన పెడుతూ హైకోర్టు ఇచ్చిన తీర్పులో భాగం. ‘అసంబద్ధమైన కారణాలతో, సహజ న్యాయసూత్రాలకు విరుద్ధంగా ఏ మాత్రం బుర్ర వాడకుండా ఆదేశాలు జారీ చేశారు’ అని హైకోర్టు ఇందులో స్పష్టం చేసింది.



renders the show cause notice a travesty. Therefore, it can safely be construed that the order passed is without notice to the petitioner, and is in violation of the principles of natural justice and suffers from non application of mind for taking into consideration irrelevant factors while passing order of resumption. For all the above stated reasons, the order impugned in the Writ Petition is liable to be set aside. Accordingly the proceedings of the 1st respondent in G.O.Ms.No.21, dated 30-01-2020, are set aside.

ఎరుపు రంగు చదరంలో ఉన్నది 1986లో ‘ఆంధ్రజ్యోతి’కి అప్పటి ప్రభుత్వం కేటాయించిన స్థలం. ఇందులో... హైవేను ఆనుకుని ఉన్న 74 సెంట్లను బఫర్ జోన్ కోసం ప్రభుత్వం వెనక్కి తీసేసుకుంది. దీనికి ప్రత్యామ్నాయంగా, 2017లో అంతే విస్తీర్ణంలో వెనుకవైపున 50సెంట్లు, పక్కన 24 సెంట్లను ప్రభుత్వం కేటాయించింది. అంతే తప్ప... ఇది కొత్తగా జరిగిన కేటాయింపు కాదు. ఉచితంగా ఇచ్చిందీ కాదు.



ఛీ.. ఛీ.. సాక్షి

తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకుని..
అడ్డగోలుగా వేలకోట్లు వెనకేసుకుని..
స్వభజన, పరనిందే లక్ష్యంగా చేసుకుని..
అధికారానికీ, అవినీతికీ పుట్టిన విష పుత్రిక ‘సాక్షి’!
పేరుకే అది ‘సాక్షి’. కానీ, దాని తీరు ‘యాక్.. ఛీ’!
పేరుకే అది ‘దిన పత్రిక’. నిజానికది జగన్ భజన పత్రిక!

యాక్ ఛీ!

‘ఆంధ్రజ్యోతి’కి భూ నజరానా అంటూ బురద కథనం

చంద్రబాబు అప్పనంగా ఇచ్చేశారంటూ అసత్యాలు

కుళ్లు, కుట్రలు, కుతంత్రాలతో నిత్యం జనం మెదళ్లలో బురద నింపేందుకు... పెన్నులో సిరా బదులు విషం నింపుకొని రాసే కథనాలకు అది చిరునామా! అలాంటి ఒక కథనాన్నే ‘యాక్.. ఛీ’ పత్రిక మంగళవారం ప్రచురించింది. ‘ఆంధ్రజ్యోతికి భూ నజరానా’ అంటూ నిలువెల్లా విషం కక్కింది. నిజాలను నిస్సిగ్గుగా దాచేసింది. బాగా అలవాటైన

మిగతా 11వ పేజీలో...

ఆదేశాలు, ఉత్తర్వులు, తీర్పులకు ముసుగేసి రాతలు

అది.. 1986లో ఎన్టీఆర్ హయాంలో ఇచ్చిన భూమి

అప్పటి మార్కెట్ విలువ ప్రకారం ఎకరన్నర కేటాయింపు

అందులో.. 74 సెంట్లు హైవే బఫర్‌జోన్ కోసం వెనక్కి

ప్రత్యామ్నాయ స్థలం కోసం సుదీర్ఘ ఉత్తర ప్రత్యుత్తరాలు

2017లో అదే స్థలానికి ఆనుకుని, అంతే భూ కేటాయింపు

దీనికోసం రూ.50 లక్షలు చెల్లించిన ‘ఆంధ్రజ్యోతి’

2019లో జగన్ వచ్చీ రాగానే భూ కేటాయింపు రద్దు

చట్టప్రకారమే వెళ్లాలన్న హైకోర్టు ఆదేశాలు బేఖాతరు



‘రద్దు’ చెల్లదంటూ 2024 నవంబరులో హైకోర్టు తీర్పు

ఆపై 13 నెలలకు ప్రత్యామ్నాయ స్థలంపై ప్రభుత్వ ఉత్తర్వులు

అసలు వాస్తవాలు దాచి విషం చిమ్మిన రోత పత్రిక

91 వేల కోట్ల పెట్టుబడి లక్ష ఉద్యోగాలు

ముందుకొచ్చిన రియల్ ఎస్టేట్ సంస్థ ఆర్ఎంజెడ్



ఐబీఎం చైర్మన్ అండ్ సీఈవో అర్వింద్ కృష్ణతో సీఎం చంద్రబాబు, మంత్రులు టీజీ భరత్, లోకేశ్

- రాష్ట్రంలో పరిశ్రమలు స్థాపించడానికి వచ్చే వారిని అతిథుల్లా చూస్తున్నాం. వారిని గౌరవిస్తున్నాం. స్పీడ్ ఆఫ్ డూయింగ్ విధానంలో పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులు ఇస్తాం.
- అభివృద్ధి ఏ ఒక్కరికో పరిమితం కారాదు. అందరూ భాగస్వాములు కావాలి. ఈ ఫలాలు ప్రతి ఒక్కరికీ అందాలి. ఈ ఉద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం ‘వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్‌ప్రెన్యూర్’ విధానానికి శ్రీకారం చుట్టింది.

- దావోస్ సదస్సులో సీఎం చంద్రబాబు

విశాఖ, రాయలసీమలో డిజిటల్ ఇన్‌ఫ్రా ఇండస్ట్రియల్, లాజిస్టిక్స్ పార్కుల ఏర్పాటు

దావోస్‌లో ఏపీ సర్కారు, ఆర్ఎంజెడ్ ప్రకటన

సదస్సులో సీఎం చంద్రబాబు కీలక భేటీలు

ఐబీఎం చైర్మన్ అర్వింద్ కృష్ణతో సమావేశం

క్వాంటమ్ ఇన్నోవేషన్ సెంటర్ ఏర్పాటుకు వినతి

ఫుడ్ ప్రాసెసింగ్ క్లస్టర్ ఏర్పాటుకు యూఏఈ ఓకే

ఆ దేశ ఆర్థిక మంత్రితో ముఖ్యమంత్రి భేటీ

గూగుల్ క్లౌడ్ సీఈవోతోనూ సమావేశం

విశాఖలో ఏఐ డేటా సెంటర్ నిర్మాణంపై చర్చ

రామ్మోహన్ నాయుడు, లోకేశ్, భరత్ హాజరు

అమరావతి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి మరో భారీ పెట్టుబడి రానుంది. దాదాపు 91,000 కోట్ల రూపాయల పెట్టుబడితో లక్ష మందికి ఉద్యోగావకాశాలు కల్పించే దిశగా ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ ఆర్ఎంజెడ్ ముందుకొచ్చింది. దావోస్ ఆర్థిక సదస్సులో రాష్ట్ర ప్రభుత్వం, ఆర్ఎంజెడ్ ఈ విషయాన్ని ప్రకటించాయి. డిజిటల్ ఇన్‌ఫ్రా, ఇండస్ట్రియల్, లాజిస్టిక్స్ పార్కుల ఏర్పాటుకు ఆర్ఎంజెడ్ సంసిద్ధత వ్యక్తం చేసింది. దావోస్ ఆర్థిక సదస్సులో పాల్గొనేందుకు వెళ్లిన ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం పలు కీలక సమావేశాల్లో

మిగతా 14వ పేజీలో...

కళ్యాణదుర్గంలో ‘స్కై ఫ్యాక్టరీ’!

ఎలక్ట్రిక్ వర్టికల్ టేకాఫ్, ల్యాండింగ్ విమానాల తయారీ కేంద్రం ఏర్పాటు

1,300 కోట్ల పెట్టుబడితో 500 ఎకరాల్లో సర్లా ఏవియేషన్ సంస్థ సన్నాహాలు

ఏడాదికి 1,000 ఎయిర్‌క్రాఫ్ట్‌లు ఉత్పత్తి

2029 నాటికి పూర్తి చేయాలని లక్ష్యం

పెట్టుబడులకు గమ్యస్థానంగా ఏపీ

ఆవిష్కరణలు-పరిశ్రమల మధ్య అంతరాలు లేకుండా నిర్మాణాత్మక చర్యలు: లోకేశ్

కెనడా, గ్రీన్‌ల్యాండ్, వెనెజువెలా..

అన్నీ మావే!

ఆ మూడింటినీ అమెరికాలో భాగంగా చూపే ఏఐ చిత్రాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన డొనాల్డ్ ట్రంప్



నాటో దేశాల అధినేతలతో తాను భేటీ అయినట్లుగా ఏఐతో సృష్టించిన ట్రంప్ ఫొటో (వృత్తంలో మ్యాప్)

గ్రీన్‌ల్యాండ్‌లో అమెరికా జెండా ఎగరేస్తున్నట్టు మరో ఫొటో

ఫ్రెంచ్ వైన్లు, షాంపేన్లపై 200% సుంకాలు వేస్తా

అప్పుడు మేక్రాన్ దారికొచ్చి శాంతి వేదికలో చేరతారు

ఫ్రాన్స్ అధ్యక్షుడిపై ట్రంప్ వ్యాఖ్య

వాషింగ్టన్, జనవరి 20: కెనడా, వెనెజువెలా, గ్రీన్‌ల్యాండ్‌లను అమెరికా భూభాగాలుగా చూపించే మ్యాప్ ఉన్న ఫొటోను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన సొంత సామాజిక మాధ్యమమైన సోషల్‌ట్రూత్‌లో పోస్ట్ చేశారు! కృత్రిమ మేధ సాయంతో రూపొందించిన

మిగతా 2వ పేజీలో...

డీయెగో గార్సియాపై ట్రంప్ కన్ను

కీలక దీవిని మారిషస్‌కు తిరిగి ఇచ్చే యూకే నిర్ణయం మూర్ఖత్వమంటూ పోస్టు



క్వాంటమ్ మేమూ నేర్చుకుంటాం!

ఎన్‌పీటీఈఎల్ ఆధ్వర్యంలో క్వాంటమ్ కోర్సు ప్రారంభం

అన్ని కోర్సుల విద్యార్థుల నుంచి అనూహ్య స్పందన

ఇంజనీరింగ్, డెంటల్, ఫార్మసీ, అగ్రి విద్యార్థులు కూడా

రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 60 వేల మంది నమోదు

కోర్సు పూర్తి చేసిన వారికి ఇంటర్న్‌షిప్‌లో ఒక క్రెడిట్

ఉన్నత విద్యామండలి చర్యలతో సత్ఫలితాలు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

క్వాంటమ్ కంప్యూటింగ్.. ఇప్పుడు ప్రపంచమంతా ఈ టెక్నాలజీవైపే చూస్తోంది...! అయితే భవిష్యత్తుపై ఆశలు రేకెత్తిస్తున్న ఈ టెక్నాలజీని సొంతం చేసుకోవడం ఎలా..? ఇది సాఫ్ట్‌వేర్ రంగానికే పరిమితమా..? విద్యార్థుల కెరీర్‌కు కొత్త దిక్సూచిలా మారిన క్వాంటమ్ టెక్నాలజీని నేర్చుకోవడం.. కంప్యూటర్ సైన్స్, ఇంజనీరింగ్ విద్యార్థులకే సాధ్యమవుతుందా..? అనే అపోహలు నెలకొన్నాయి..! అయితే.. వీటన్నింటినీ పటాపంచలు చేస్తూ భవిష్యత్ గతిని మార్చేసే క్వాంటమ్ టెక్నాలజీని

మిగతా 13వ పేజీలో...

ఊగిసలాటొద్దు!

వివేకా హత్య కేసులో సీబీఐ తీరుపై సుప్రీం అసహనం

ఇంకా ఎవరినైనా విచారించాలా?

కస్టడీలోకి ఎవరిని తీసుకుంటారో చెప్పండి?

దానికి తగినట్టు ఉత్తర్వులు ఇస్తాం: బెంచ్

పిటిషన్‌లోని అంశాలు సీబీఐ కోర్టు పట్టించుకోలేదు

ప్రస్తావించనివే పరిగణించింది.. లూథ్రా వాదనలు

విచారణ వచ్చే నెల 5కు వాయిదా





న్యూఢిల్లీ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తులో సీబీఐ వ్యవహరిస్తున్న తీరుపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. దర్యాప్తు పట్ల స్పష్టమైన వైఖరితో ఉండాలని, ఊగిసలాట వద్దని సీబీఐని మందలించింది. ఈ కేసులో ఇంకా లోతైన దర్యాప్తు ఏమైనా మిగిలి ఉందా? అని ప్రశ్నించింది. మరింత విచారణ కోసం ఎవరినైనా కస్టడీలోకి తీసుకోవాలనుకుంటున్నారా? అని ఆరా తీసింది. ఒకవేళ అలా ఆలోచిస్తే, ఎవరిని విచారించాలనుకుంటున్నారో, ఆ వివరాలను స్పష్టంగా ఇవ్వాలని ఆదేశించింది. వైఎస్ వివేకానంద హత్య కేసులో

మిగతా 13వ పేజీలో...



భూముల మార్కెట్ విలువలు పెంపు

పట్టణ ప్రాంతాల్లో 1 నుంచి అమల్లోకి

కూటమి ప్రభుత్వం వచ్చాక ఇది రెండోసారి

అమరావతి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పట్టణప్రాంతాల్లో భూముల మార్కెట్ విలువలు పెరగనున్నాయి. మార్కెట్ ధరలు, డిమాండ్‌కు అనుగుణంగా సవరించిన భూముల మార్కెట్ ధరలను ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి తెచ్చేందుకు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ అనుమతిచ్చారు. ఈ మేరకు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీకి ఆయన మంగళవారం మెమో జారీచేశారు. అలాగే రెండు నెలల్లో భూముల మార్కెట్ విలువల సవరణ వ్యవస్థను ఆధునికీకరించాలని ఆదేశించారు. దీనివల్ల పారదర్శకత పెరుగుతుందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక భూముల మార్కెట్ విలువలు పెంచడం ఇది రెండోసారి. గత ఏడాది ఫిబ్రవరి 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోని భూముల మార్కెట్ విలువలను పెంచింది. కొన్ని ప్రాంతాల్లో వాస్తవ మార్కెట్ విలువలతో పోలిస్తే తగ్గినట్లు ప్రకటించింది. గత ఏడాది కొత్త జిల్లా కేంద్రాలు, వాణిజ్యప్రాంతాల్లో భూముల విలువలు 15 నుంచి 25 శాతం వరకు పెరిగాయి. కొత్త జిల్లాల

మిగతా 13వ పేజీలో...

ఉగాది నుంచి ‘గ్రీన్ కవర్’

50% పచ్చదనానికి కార్యాచరణ ప్రణాళిక

అమలులో శాఖలన్నీ భాగస్వామ్యం కావాలి

గ్రీన్ కవర్, గ్రేట్ గ్రీన్‌వాల్ ప్రాజెక్టుల్లో దేశీయ మొక్కలకు అధిక ప్రాధాన్యం

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సమీక్ష 11



ఊరికో రేటు!

పంపిణీ నష్టాల నివారణ పనుల్లో కక్కుర్తి

లైనెక్స్ కండక్టర్లతో నష్టాల తగ్గింపునకు ట్రాన్స్‌కో నిర్ణయం

200 కి.మీ. మేర కండక్టర్ల మార్పిడికి టెండరు

కిలోమీటరుకు రూ.2.43 లక్షలుగా ధర నిర్ణయం

నెల్లూరు జిల్లాలో అదే ధర ఖరారు

విశాఖ జిల్లాలో రూ.15 వేలు పెంపు 12

కేంద్ర ఉద్యోగుల అవినీతిపై

రాష్ట్ర పోలీసులు కేసు పెట్టొచ్చు

సీబీఐ ముందస్తు అనుమతి అక్కర్లేదు: సుప్రీం 2

కేంద్ర ఉద్యోగుల అవినీతిపై

రాష్ట్ర పోలీసులు కేసు పెట్టొచ్చు

- సీబీఐ ముందస్తు అనుమతి అవసరం లేదు: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, జనవరి 20: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు లంచాలు తీసుకుంటే అవినీతి నిరోధక చట్టం కింద రాష్ట్ర పోలీసులు కూడా వారిపై కేసు పెట్టవచ్చని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇందుకు సీబీఐ నుంచి రాష్ట్ర పోలీసులు ముందస్తు అనుమతి తీసుకోవాల్సిన అవసరమేమీ లేదని తెలిపింది. ఈ మేరకు జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ సతీష్ చంద్ర శర్మల ధర్మాసనం తీర్పు చెప్పింది. అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్-17 ప్రకారం రాష్ట్ర ఏజెన్సీ, కేంద్ర ఏజెన్సీతో పాటు ఏ ఇతర పోలీసు ఏజెన్సీ అయినా కేసు పెట్టవచ్చని తెలిపింది. అయితే ఒక స్థాయిగల అధికారికి మాత్రమే ఈ అధికారం ఉందని పేర్కొంది. పరిపాలనపరమైన సౌలభ్యం కోసం మాత్రమే కేంద్ర ఉద్యోగుల అవినీతి కేసులను సీబీఐకి అప్పగించారని, దానర్థం రాష్ట్రాల ఏసీబీ సంస్థలకు వారిపై అధికారం లేదని కాదని వివరణ ఇచ్చింది. అవినీతికి పాల్పడ్డ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగిపై రాజస్థాన్ ఏసీబీ కేసుపెట్టడాన్ని సమర్థిస్తూ అక్కడి హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులతో ఏకీభవించింది.

లండన్‌లో చైనా 'సూపర్ ఎంబసీ'

- 2.15 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో కొత్త భవనం

లండన్, జనవరి 20: లండన్‌లో చైనాకు చెందిన మెగా/సూపర్ ఎంబసీ ఏర్పాటుకు బ్రిటన్ ప్రభుత్వం మంగళవారం ఆమోదం తెలిపింది. లండన్ నగరం నడిబొడ్డున 2.15 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో మెగా దౌత్యకార్యాలయ భవనాన్ని నిర్మించాలని చైనా ప్రణాళికలు సిద్ధం చేసింది. లండన్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని రాయల్ మింట్ కోర్ట్ వద్ద ఈ మెగా ఎంబసీకి అవసరమైన స్థలాన్ని చైనా ఇప్పటికే కొనుగోలు చేసింది. అయితే, చైనా మెగా ఎంబసీ నిర్మాణాన్ని చట్టసభ సభ్యులు, సామాజిక ఉద్యమకారులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. భారీ భవనంతో భద్రతాపరమైన సమస్యలు ఎదురవుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయినా, బ్రిటన్ గృహ నిర్మాణ శాఖ మంత్రి స్టీవ్ రీడ్ మాత్రం చైనా ఎంబసీ నిర్మాణ ప్రణాళికలకు ఆమోదం తెలుపుతున్నట్లు ప్రకటించారు.

ఏమిటా హావభావాలు?

- మేనకా గాంధీపై సుప్రీం ధర్మాసనం ఆగ్రహం
- వీధి కుక్కల సమస్యపై విచారణ

న్యూఢిల్లీ, జనవరి 20: జంతు ప్రేమికురాలు, కేంద్ర మాజీ మంత్రి మేనకా గాంధీ హావభావాల (బాడీ లాంగ్వేజ్)పై మంగళవారం సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. వీధి కుక్కల బెడదపై సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలను విమర్శిస్తూ ఆమె ఓ ఇంటర్వ్యూలో వ్యక్తం చేసిన హావభావాలను తప్పుపట్టింది. ఇది కోర్టు ధిక్కరణ కిందకే వస్తుందని, కానీ ఉదారతతో ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని పేర్కొంది. వీధి కుక్కల బెడదపై గత వారం విచారణ జరిపిన సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. వీధి కుక్కల కారణంగా పిల్లలు, వృద్ధులు మరణించినా, గాయపడ్డా రాష్ట్ర ప్రభుత్వాలు పరిహారం చెల్లించాల్సి ఉంటుందని తెలిపింది. వీధి కుక్కలకు ఆహారం పెడుతున్నవారిని కూడా తప్పుపట్టింది. దీనిపై స్పందించిన మేనకా గాంధీ ఓ యూట్యూబ్ చానల్‌కు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ సందర్భంగా ఆమె ప్రదర్శించిన హావభావాలను కేసుపై తాజాగా విచారణ జరిపిన జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వి.అంజారియాల ధర్మాసనం ఈ మేరకు ప్రశ్నించింది.

ఏడాదిలో రెండుసార్లు ఆల్ ఇండియా బార్ ఎగ్జామ్

న్యూఢిల్లీ, జనవరి 20: ఆల్ ఇండియా బార్ ఎగ్జామ్ (ఏఐబీఈ)ను ఏడాదికి రెండుసార్లు నిర్వహించనున్నట్టు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) మంగళవారం సుప్రీం కోర్టుకు తెలియజేసింది. చివరి సంవత్సరం న్యాయ విద్యార్థులు ఏఐబీఈ రాసేందుకు వీలుగా నిబంధనలు రూపొందించినట్టు పేర్కొంది. ఏఐబీఈ న్యాయశాస్త్ర పట్టభద్రులు న్యాయవాదులుగా నమోదు చేసుకోవడానికి ఉద్దేశించిన అర్హత పరీక్ష. తుది సెమిస్టర్ విద్యార్థులు కూడా ఏఐబీఈ రాసేందుకు అనుమతించేలా ఆదేశాలివ్వాలని కోరుతూ 2024లో దాఖలైన పిటిషన్‌ను జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్‌మెహతాల ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా ఏఐబీఈని ఏడాదికి రెండుసార్లు నిర్వహించనున్నారని, ఎల్ఎల్‌బీ చివరి సెమిస్టర్ విద్యార్థులు పరీక్షకు హాజరయ్యేందుకు అనుమతించనున్నట్టు బీసీఐ తరఫు న్యాయవాది పేర్కొన్నారు.

అసోంలో ఆదివాసీలు, బోడోల మధ్య ఘర్షణలు

కోక్రఝార్, గువాహతి, జనవరి 20: అసోంలోని కోక్రఝార్‌లో బోడోలు ఆదివాసీల మధ్య మంగళవారం ఘర్షణలు చోటు చేసుకున్నాయి. దీంతో కోక్రఝార్, చిరాంగ్ జిల్లాల్లో ఇంటర్‌నెట్ సేవలను నిలిపివేసి రాపిడ్ యాక్షన్ ఫోర్స్‌ను మోహరించారు. సోమవారం ఆదివాసీల దాడిలో ఓ వ్యక్తి మృతి చెందడం బోడోలు, ఆదివాసీల మధ్య ఘర్షణలకు దారితీసింది. దీంతో ఘర్షణలకు దిగిన జనాన్ని చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీచార్జి చేసి టియర్ గ్యాస్ ఉపయోగించారు. అవసరమైతే సైన్యం కూడా రంగంలోకి దిగుతుందని ఆ రాష్ట్ర సీఎం హిమంత బిశ్వశర్మ తెలిపారు. వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ సదస్సుకు హాజరయ్యేందుకు దావోస్‌లో ఉన్న ఆయన ఈమేరకు 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

జెరూసలెంలోని ఐరాస కార్యాలయంపై ఇజ్రాయెల్ బుల్డోజర్లు

జెరూసలెం, జనవరి 20: ఐక్యరాజ్యసమితికి చెందిన యూఎన్ఆర్‌డబ్ల్యూఏ(యునైటెడ్ నేషన్స్ రిలీఫ్ అండ్ వర్క్స్ ఏజెన్సీ) హమాస్‌తో కలిసి పని చేస్తోందని కొంతకాలంగా ఆరోపిస్తున్న ఇజ్రాయెల్ తీవ్రమైన చర్యలు చేపట్టింది. తూర్పు జెరూసలెంలోని ఐక్యరాజ్యసమితి కార్యాలయాన్ని ఇజ్రాయెల్ అధికారులు మంగళవారం కూల్చివేశారు. అలాగే, జెరూసలెం శివారుల్లో ఐక్యరాజ్యసమితికి చెందిన పాలస్తీనా ట్రేడ్ స్కూల్ భవనంపై కూడా దాడులు చేశారు. టియర్ గ్యాస్ ప్రయోగించి భవనాన్ని ఖాళీ చేయించారు. పాలస్తీనా శరణార్థులకు మానవతాసాయం అందిస్తున్న సంస్థల విషయంలో ఇజ్రాయెల్ ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తున్న వేళ ఈ చర్యలు తీసుకున్నారు. తూర్పు జెరూసలెంలోని తమ ప్రధాన కార్యాలయంలో ఉన్న సిబ్బందిని ఇజ్రాయెల్ దళాలు బలవంతంగా బయటకు పంపేశాయని యూఎన్ఆర్‌డబ్ల్యూఏ 'ఎక్స్'లో ఓ పోస్టు చేసింది. కార్యాలయంలోని కొన్నివస్తువులనూ ఇజ్రాయెల్ దళాలు స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొంది. కాగా, యూఎన్ఆర్‌డబ్ల్యూఏ హమాస్‌తో కలిసి పని చేస్తోందంటూ ఇజ్రాయెల్ చేస్తున్న ఆరోపణలను ఐరాస ఖండిస్తూనే ఉంది.

బంగ్లాలోని దౌత్య సిబ్బంది కుటుంబాలు వెనక్కి

న్యూఢిల్లీ, జనవరి 20: బంగ్లాదేశ్‌లోని భారత దౌత్య కార్యాలయాల ఉద్యోగుల కుటుంబ సభ్యులంతా స్వదేశానికి తిరిగి రావాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆ దేశంలో నెలకొన్న అనిశ్చిత పరిస్థితుల దృష్ట్యా ముందు జాగ్రత్త చర్యగా ఈ ఆదేశాలు ఇచ్చింది. భార్యాపిల్లలు, ఇతర కుటుంబ సభ్యులంతా తిరిగిరావాలని తెలిపింది. అధికారులు, ఉద్యోగులు మాత్రం అక్కడే విధులు నిర్వర్తించనున్నారు. బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో భారత రాయబార కార్యాలయం ఉండగా, చిట్టగాంగ్, సైల్హెట్, రాజషాహి, ఖుల్నాల్లో అసిస్టెంట్ హైకమిషనర్ కార్యాలయాలు ఉన్నాయి.

పేదలు ఆకలితో చావాలా?

- గ్రామీణులకు కనీస వేతనం ఇవ్వడం మోదీకి ఇష్టం లేదు
- ఉపాధి చట్టం రద్దుపై రాహుల్ ధ్వజం

రాయ్‌బరేలీ, జనవరి 20: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంఎన్ఆర్‌జీఈఏ) రద్దు చేయడం ద్వారా పేదలు ఆకలితో చనిపోవాలని ప్రధాని మోదీ కోరుకుంటున్నారని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ విమర్శించారు. పేదల కంటే బ్యూరోక్రాట్లకే ఆయన ప్రాధాన్యమిస్తున్నారని ధ్వజమెత్తారు. యూపీలో తన సొంత నియోజకవర్గం పర్యటనలో భాగంగా మంగళవారం ఆయన యూత్ స్పోర్ట్స్ అకాడమీ నిర్వహిస్తున్న రాయ్‌బరేలీ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి దాని స్థానంలో తీసుకొచ్చిన జీ-రామ్-జీ చట్టానికి గాంధీజీ పేరు తొలగించడాన్ని తప్పుబట్టారు. 'ఆర్థిక జవాబుదారీతనంతో నిరుద్యోగ గ్రామీణులకు కనీస వేతనం అందించడం ఉపాధి చట్టం ఉద్దేశం. కానీ ఇది మోదీకి ఇష్టం లేదు. అధికారాన్ని కేంద్రీకరించి.. బ్యూరోక్రాట్లకు అప్పగించి.. పేదలు ఆకలితో చావాలని ఆయన కోరుకుంటున్నారు' అని దుయ్యబట్టారు.

డీయెగో గార్సియాపై ట్రంప్ కన్ను

కీలక దీవిని మారిషస్‌కు తిరిగిచ్చే యూకే నిర్ణయం మూర్ఖత్వమంటూ పోస్టు





న్యూఢిల్లీ, జనవరి 20: అమెరికా జాతీయ భద్రత పేరుతో గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్న ఆ దేశ అధ్యక్షుడు ట్రంప్.. భారత్‌కు అత్యంత సమీపంలో ఉన్న డీయెగో గార్సియాపైనా కన్నేశారు. హిందూ మహా సముద్రంలో కీలక ప్రాంతంలో ఉన్న ఈ చిన్న దీవిని తమ నియంత్రణలో ఉంచుకోవడం మేలన్న తరహాలో వ్యాఖ్యలు చేశారు. మారిషస్‌కు చెందిన ఈ దీవి ప్రస్తుతం యూకే ఆధీనంలో ఉంది. ఇక్కడ యూకే, అమెరికాల ఉమ్మడి సైనిక, నౌకా స్థావరం ఉంది. అయితే ఈ దీవిని మారిషస్‌కు తిరిగి ఇచ్చేందుకు గత ఏడాదే బ్రిటన్, మారిషస్ మధ్య ఒప్పందం కుదిరింది. దానిని తప్పుపడుతూ, తాను గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకోవడానికి లింకు పెడుతూ ట్రంప్ తాజాగా పోస్టు పెట్టారు. "మా తెలివైన నాటో మిత్రదేశం యూకే కీలక అమెరికా సైనిక స్థావరం ఉన్న డీయెగో గార్సియాను మారిషస్‌కు తిరిగి ఇచ్చేస్తోంది. ఎలాంటి కారణం లేకుండా ఇలా చేయడం ఆశ్చర్యకరం. ఇది మన అసమర్థతకు నిదర్శనమని చైనా, రష్యా గుర్తిస్తాయనడంలో సందేహమే లేదు. సమర్థతకు మాత్రమే విలువ ఇచ్చే అంతర్జాతీయ శక్తులు అవి. ఇప్పుడు అమెరికా నా ఏడాది నాయకత్వంలోనే ఎప్పుడూ లేనంతగా గౌరవం పొందుతోంది. అత్యంత కీలకమైన దీవిని తిరిగివ్వాలని యూకే నిర్ణయించడం పూర్తిగా మూర్ఖత్వం" అని ట్రంప్ పేర్కొన్నారు.

మారిషస్‌కు తిరిగి ఇచ్చేందుకు ఒప్పందం..


ఒకప్పుడు మారిషస్‌లో భాగమైన చాగో దీవుల సముదాయంలోని పెద్ద దీవి డీయెగో గార్సియా. మారిషస్ ప్రధాన భూభాగానికి 2,112 కిలోమీటర్ల దూరంలో ఉండే ఈ దీవి విస్తీర్ణం కేవలం 30 చదరపు కిలోమీటర్లే. హిందూ మహా సముద్రంలో భారత్‌కు దిగువన, మాల్దీవులకు సమీపంలో ఉంటుంది. భారత్, చైనాతోపాటు అటు గల్ఫ్, ఆఫ్రికా దేశాలు.. ఇటు ఆగ్నేయాసియా ప్రాంతాలకు మధ్యలో ఉండటంతో అటు సముద్ర రవాణాపై నిఘాకు, ఇటు సైనికపరంగా అత్యంత కీలక ప్రాంతమిది. మారిషస్ తమ వలస పాలనలో ఉన్నప్పటి నుంచీ డీయెగో గార్సియాపై బ్రిటన్‌కు పట్టుంది. మారిషస్‌కు 1968లో స్వాతంత్ర్యం ఇచ్చిన బ్రిటన్.. అప్పటి మారిషస్ పాలకులపై ఒత్తిడి తెచ్చి డీయెగో గార్సియా దీవిని కొనుగోలు చేసింది. అక్కడి ప్రజలను బయటికి తరలించి, అమెరికాతో కలిసి సైనిక స్థావరం ఏర్పాటుకు చర్యలు మొదలుపెట్టింది.

మారిషస్‌కు భారత్ మద్దతు

డీయెగో గార్సియాను తమకు తిరిగి ఇచ్చేయాలని కొన్నేళ్లుగా యూకేపై మారిషస్ ఒత్తిడి పెంచింది. అంతర్జాతీయ కోర్టులో కేసులు కూడా వేసింది. మారిషస్‌కు అనుకూలంగా అంతర్జాతీయ కోర్టు తీర్పు ఇచ్చింది. అయినా యూకే వినలేదు. అయితే హిందూ మహాసముద్రంలో అమెరికా సైనిక స్థావరంతో సమస్య ఉండటంతో.. మారిషస్‌కు భారత్ మద్దతుగా నిలిచి యూకేపై ఒత్తిడి తెచ్చింది. ఈ క్రమంలోనే 2025 మేలో డీయెగో గార్సియా సహా చాగో దీవులను మారిషస్‌కు తిరిగిచ్చేందుకు యూకే ఒప్పందం చేసుకుంది. అయితే 99 సంవత్సరాల పాటు అంటే 2124 వరకు మారిషస్ ఆ దీవులను యూకేకు లీజు కు ఇవ్వాల్సి ఉంటుంది. ఇందుకోసం యూకే ఏటా రూ.1,235 కోట్లు (10 కోట్ల పౌండ్లు) అద్దె కింద చెల్లిస్తుంది. ప్రధాన భూభాగానికి దూరంగా ఉన్న ఈ దీవుల నిర్వహణ, పర్యవేక్షణ కోసం మారిషస్‌కు భారత్ రూ.6,100 కోట్లు ఆర్థిక సాయం కూడా చేస్తోంది. అక్కడ ఒక శాటిలైట్ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేయనుంది. ఈ ఒప్పందానికి మొదట్లో ట్రంప్ కూడా మద్దతిచ్చారు. కానీ ఇప్పుడు నాలుక మడతేశారు.

అప్పట్లో భారత్.. తర్వాత చైనా టార్గెట్‌గా..

హిందూ మహా సముద్రంలో తన మిలటరీ అవసరాల కోసం మొదట్లో డీయెగో గార్సియాలో సాధారణ స్థావరాన్ని, కమ్యూనికేషన్ కేంద్రాన్ని అమెరికా ఏర్పాటు చేసింది. కానీ 1971 భారత్-పాక్ యుద్ధం, బంగ్లాదేశ్ విమోచన సమయంలోని పరిణామాలతో.. భారత్ లక్ష్యంగా డీయెగో గార్సియాను పెద్ద సైనిక, వైమానిక స్థావరంగా మార్చింది. ఆ యుద్ధ సమయంలో పాకిస్థాన్‌కు అండగా నిలిచేందుకు అమెరికా ముందుకొచ్చింది. యుద్ధంలో భారత్ విజయం సాధించి బంగ్లాదేశ్ విముక్తి జరిగిపోవడంతో.. అమెరికాను ఆలోచనలో పడేసింది. భారత్ లక్ష్యంగా, హిందూ మహా సముద్రంలో పట్టుకోసం డీయెగో గార్సియాను బలమైన వ్యూహాత్మక సైనిక, వైమానిక స్థావరంగా మార్చింది. ప్రపంచ యవనికపైకి చైనా కూడా పోటీగా దూసుకురావడంతో దీనిని మరింత విస్తరించింది. ప్రస్తుతం అక్కడ బీ2, బీ52 బాంబర్లు, ఎఫ్ సిరీస్ యుద్ధ విమానాలు, సైనిక రవాణా విమానాలు, హెలికాప్టర్లతోపాటు సుమారు 5 వేల మంది వరకు బలగాలు ఉన్నట్టు అంచనా.



భారీగా బీజేపీ ఎన్నికల ఖర్చు

2024-25లో 3,335 కోట్ల వ్యయం

- వార్షిక ఆడిట్ నివేదికలో ఈసీకి వివరాలు

న్యూఢిల్లీ, జనవరి 20: ఎన్నికల కోసం బీజేపీ భారీగా ఖర్చు పెడుతోంది. లోక్‌సభతో పాటు ఎనిమిది రాష్ట్రాల ఎన్నికల సందర్భంగా 2024-25లో బీజేపీ రూ. 3,335.36 కోట్లు ఖర్చు చేసింది. ఎన్నికల కమిషన్‌కు కమలం పార్టీ సమర్పించిన వార్షిక ఆడిట్ నివేదికను ఉటంకిస్తూ ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రిక ఆ వివరాలు వెల్లడించింది. ఆ పత్రిక కథనం ప్రకారం.. 2019-20 ఎన్నికల్లో రూ.1,352.92 కోట్లు బీజేపీ ఖర్చు చేయగా, దానికి రెండున్నర రెట్లు ఎక్కువగా గత ఎన్నికల్లో వ్యయం చేసింది. 2024 మార్చి 16న 18వ లోక్‌సభ కోసం ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచి బీజేపీ ఎన్నికల ప్రచారం ముమ్మరం చేసింది. ఆ ఏడాది ఏప్రిల్ 19న మొదలైన పోలింగ్ 44 రోజుల పాటు కొనసాగింది. ఇక అంతకుముందు ఏడాది కూడా ఎన్నికల ప్రచారానికి దాదాపు రూ. 1,754 కోట్లు ఖర్చు చేసింది. 2025 డిసెంబరు 27న ఈసీకి బీజేపీ ఆడిట్ నివేదిక సమర్పించగా, దానిని ఈసీ ఇటీవలే ప్రచురించింది. ఆ వార్షిక ఆడిట్ నివేదిక ప్రకారం.. 2024-25లో బీజేపీ మొత్తం ఖర్చు రూ. 3,774.58 కోట్లలో 88% ఎన్నికల వ్యయమే ఉంది. ఇక ఆ ఎన్నికల వ్యయంలో 68% (రూ.2,257 కోట్లు) ప్రచార ప్రకటనలకే ఖర్చు చేశారు. ఇక బీజేపీ ఆదాయం కూడా గణనీయంగా పెరిగింది. 2023-24లో రూ.4,340.47 కోట్లు ఉండగా, 2024- 25లో అది రూ. 6,769.14 కోట్లకు చేరింది. ఈ ఆదాయంలో స్వచ్ఛంద విరాళాల నుంచి రూ. 6,124.85 కోట్లు రాగా, మిగిలిన డబ్బు చందాలు, ఫీజులు, బ్యాంకు నిల్వలపై వడ్డీలు తదితర రూపంలో సమకూరింది. ఇక 2025 మార్చి 31 నాటికి తమ వద్ద సాధారణ నిధిలో నగదు, డిపాజిట్లు సుమారు రూ. 10 వేల కోట్లు ఉన్నట్లు బీజేపీ తెలిపింది.

యూఎస్‌కు

భారతీయ విద్యార్థులు నో

- 75% పడిపోయిన చేరికలు
- వీసా తిరస్కరణలు, స్లాట్ల కొరత, తీవ్ర ఆంక్షలే కారణం

న్యూఢిల్లీ, జనవరి 20: అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ రెండోసారి బాధ్యతలు చేపట్టిన తరువాత భారతీయ విద్యార్థులు తీవ్ర ఒడిదుడుకులకు గురయ్యారు. యూఎస్ కళాశాలల్లో భారతీయ విద్యార్థుల నమోదు 75% పడిపోయింది. వలసలపై ట్రంప్ చేస్తున్న తీవ్ర విమర్శలు, పెరుగుతున్న వీసా తిరస్కరణలు, విధిస్తున్న పలు తీవ్ర ఆంక్షలు అమెరికాలోని మొదటి 40 విశ్వవిద్యాలయాల్లో చేరాలనుకునే విద్యార్థులు వెనకడుగు వేయడానికి కారణమయ్యాయి. వర్సిటీల్లో చేరే మొత్తం విద్యార్థుల్లో 70% మంది శరదృతువులోనే(ఆగస్టు-అక్టోబరు ఫాల్) చేరతారు. ఇది గత ఏడాది దారుణంగా దెబ్బతింది. వీసా స్లాట్లు దొరక్కపోవడంతో చాలా మంది విద్యార్థులు యూఎస్ వెళ్లాలన్న తమ ఆలోచనను విరమించుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన కన్సల్టెంట్ అరవింద్ మండువ మాట్లాడుతూ, 'కొన్ని దశాబ్దాల తరువాత ఈ దుస్థితిని చూశాం. చాలా మంది విద్యార్థులు పరిస్థితి చక్కబడే వరకూ వేచిచూసే ధోరణితో తమ ప్రణాళికలను జనవరి-మార్చి నాటికి వాయిదా వేశారు. వీసా నిబంధనలను కఠినతరం చేయడం, నెలల తరబడి ఎదురుచూసినా ఇంటర్వ్యూ స్లాట్లు దొరక్కపోవడంతో విద్యార్థులు నిరాశకు లోనయ్యారు' అని పేర్కొన్నారు. మరోవైపు ఇప్పటికే అమెరికా వెళ్లిన విద్యార్థుల సామాజిక మాధ్యమాల ఖాతాలను లోతుగా పరిశీలించాలన్న ట్రంప్ నిర్ణయం అక్కడ వారిని మానసికంగా తీవ్ర ఆందోళనకు గురిచేసింది. డిసెంబరు, 2025 నాటికి 8,000 మంది విద్యార్థుల వీసాలను రద్దు చేసిన ప్రభుత్వం వారిని వారాల వ్యవధిలో దేశం వదిలి వెళ్లిపోవాలని ఆదేశించిందని అధికారిక డేటా పేర్కొంది.

స్టాలిన్, విజయన్ ప్రభుత్వాలతో

గవర్నర్ల లడాయి!

- తమిళనాడు అసెంబ్లీలో ప్రసంగమే చదవకుండా వెళ్లిపోయిన ఆర్ఎన్ రవి

చెన్నై-ఆంధ్రజ్యోతి/తిరువనంతపురం, జనవరి 20: తమిళనాడు, కేరళ ప్రభుత్వాలు, ఆ రాష్ట్ర గవర్నర్ల మధ్య మళ్లీ విభేదాలు తలెత్తాయి. తమిళనాడు అసెంబ్లీలో తమిళ గీతాలాపన తర్వాత జాతీయ గీతం ఆలపించాలని గవర్నర్ ఆర్ఎన్ రవి కోరగా.. స్పీకర్ నిరాకరించారు. దీంతో ఆయన ప్రసంగం చదవకుండానే సభ నుంచి వెళ్లిపోయారు. మంగళవారం ఉదయం 9.30 గంటలకు శాసనసభకు వచ్చిన గవర్నర్‌కు స్పీకర్ అప్పావు స్వాగతం పలికి.. హాలులోకి తోడ్కొని వెళ్లారు. సంప్రదాయానుగుణంగా తొలుత 'తమిళ తల్లి' ప్రార్థనా గీతాన్ని ఆలపించారు. ఆ వెంటనే జాతీయ గీతాలాపన చేయాలని రవి సూచించారు. అయితే గవర్నర్ ప్రసంగం అనంతరం జాతీయ గీతాలాపన ఉంటుందని, ఇదే సభ సంప్రదాయమని స్పీకర్ బదులిచ్చారు. ఆగ్రహించిన గవర్నర్ సభ నుంచి విసవిసా నిష్క్రమించారు. గవర్నర్ తీరును సీఎం స్టాలిన్ తీవ్రంగా ఖండించారు. నిబంధనలు, సంప్రదాయాలను ఆయన ఉల్లంఘించారని సభలో ఆరోపించారు.

కేరళ సీఎం వర్సెస్ లోక్‌భవన్

మంగళవారం కేరళ సభలో గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ 2 గంటలు ప్రసంగించి వెళ్లిపోయారు. ఆ తర్వాత సీఎం పినరయి విజయన్ మాట్లాడుతూ.. ప్రసంగ పాఠంలోని కొన్ని పేరాలను గవర్నర్ చదవలేదని చెప్పారు. అందులో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ద్రవ్య విధానంపైన.. బిల్లులను గవర్నర్ ఆమోదించకుండా దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉంచడంపై విమర్శలు ఉన్నందునే ఆయన కొన్ని పేరాలు చదవలేదని.. పైగా కొన్ని సొంత మాటలు చేర్చారని ఆరోపించారు. దీనిపై లోక్‌భవన్ తీవ్రంగా స్పందించింది. రాష్ట్రప్రభుత్వం పంపిన ప్రసంగం ముసాయిదాలో అర్ధసత్యాలు ఉండడంతో వాటిని తొలగించాలని గవర్నర్ కోరారని తెలిపింది.

పెండింగ్ టోల్ బకాయిలు చెల్లించాకే వాహనాలకు ఎన్‌వోసీ

- నిబంధనలు సవరించిన కేంద్రం

న్యూఢిల్లీ, జనవరి 20: వాహన యజమానులు తమ వాహనాన్ని విక్రయించడానికి ముందు లేదా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందడానికి టోల్ ప్లాజా బకాయిలన్నింటినీ చెల్లించడాన్ని కేంద్ర ప్రభుత్వం తప్పనిసరి చేసింది. టోల్ ప్లాజాల వద్ద చెల్లించని చార్జీలన్నింటినీ వాహన యజమానులు చెల్లించేలా చూసేందుకుగాను సవరించిన సెంట్రల్ మోటార్ వెహికిల్స్ నిబంధనలు, 2026ను కేంద్ర రోడ్డు రవాణా, హైవేల మంత్రిత్వ శాఖ నోటిఫై చేసింది. పెండింగ్ టోల్ బకాయిలు ఉంటే వాహన బదిలీ, ఫిట్‌నెస్ రెన్యూవల్, పర్మిట్లకు నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌వోసీ) జారీ కాదని తెలిపింది. ఎలాంటి అవరోధాలు లేని టోలింగ్ వ్యవస్థను ప్రవేశపెట్టే దిశగా ప్రయత్నాలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం తాజాగా నిబంధనలను సవరించింది.

నితిన్ నబీన్.. నా బాస్

పార్టీ కార్యకర్తగా ఆయన ఆదేశాలను పాటిస్తా.. ప్రధాని మోదీ


నితిన్ నబీన్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న పార్టీ సంస్థాగత ఎన్నికల రిటర్నింగ్ అధికారి లక్ష్మణ్

న్యూఢిల్లీ, జనవరి 20(ఆంధ్రజ్యోతి): బీజేపీ కార్యకర్తనైన తనకు పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ బాస్ అని ప్రధాని మోదీ అన్నారు. పార్టీపరంగా ఆయన చేసే సూచనలను పాటిస్తానని తెలిపారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన బిహార్‌కు చెందిన నితిన్ నబీన్(45) మంగళవారం ఆ బాధ్యతలు స్వీకరించారు. న్యూఢిల్లీలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ సంస్థాగత ఎన్నికల రిటర్నింగ్ అధికారి డాక్టర్ కె. లక్ష్మణ్.. తొలుత నితిన్ నబీన్ ఎన్నికను ప్రకటించారు. అనంతరం ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, జేపీ నడ్డా, నితిన్ గడ్కరీ, బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమక్షంలో నితిన్ నబీన్ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. పార్టీకి సంబంధించిన విషయాల్లో నితిన్ నబీన్ తనకు బాస్ అని స్పష్టం చేశారు. తనతోపాటు పార్టీలో ఉన్నవారందరికీ నితినే అధ్యక్షుడని పేర్కొన్నారు. బీజేపీ నడిపించడమే కాక మిత్రపక్షాలను సమన్వయం చేసుకునే బాధ్యత కూడా నితినేదేనని అన్నారు. 1981-1996 మధ్య కాలంలో జన్మించిన నబీన్ ఈ సహస్రాబ్ది నేత అని, భారత దేశంలో జరిగిన మార్పులన్నీ ప్రత్యక్షంగా చూసిన తరానికి చెందిన వ్యక్తి అని పేర్కొన్నారు. బాల్యంలో రేడియోలో వార్తలు విన్న తరం నుంచి ఏఐని ఉపయోగించడంలో ఆరితేరిన తరం వరకూ నితిన్ ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. బీజేపీ అధ్యక్షులు మారినా ఆదర్శాలు మారవని స్పష్టం చేశారు. గౌరవనీయులైన నితిన్ నబీన్ అంటూ ప్రసంగించిన ప్రధాని మోదీ.. గత 11 ఏళ్లలో తన హయాంలో బీజేపీ ప్రభుత్వం సాధించిన ప్రగతిని వివరించారు. తన పనిని అధ్యక్షుడి ముందు ఉంచానని, ఆయన ఆదేశాలు, సూచనలు కోసం ఎదురుచూస్తున్నానని వ్యాఖ్యానించారు. అక్రమ చొరబాట్లతో దేశ భద్రతకు ముప్పు అని ప్రధాని మోదీ ఈ సందర్భంగా అన్నారు. ప్రభుత్వాల పట్ల సానుకూలంగా ఉన్న వారిని, జర్నలిస్టులను అర్బన్ నక్సల్స్ బెదిరిస్తున్నారని తెలిపారు.

ఇక, పార్టీ నూతన అధ్యక్షుడు నితిన్ నబీన్ మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రధాన సేవకుడుగా పనిచేస్తూ కార్యకర్తలకు ప్రేరణగా నిలిచారని కొనియాడారు. ఓ సామాన్య కార్యకర్తను పార్టీలో అగ్రస్థానానికి ఎంపిక చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. రాజకీయాలు స్వల్పకాలిక ప్రయోగం కాదని, దీర్ఘకాలిక బాధ్యత అని భావించాలని కార్యకర్తలకు సూచించారు. తమిళనాడు, అస్సాం, పశ్చిమ బెంగాల్, కేరళ, పుదుచ్చేరిలో త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీని గెలిపించేందుకు శ్రమించాలని, వికసిత్ భారత్ లక్ష్య సాధనకు కృషి చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

లక్ష్మణ్.. ఓట్లు ఏమైనా చోరీ అయ్యాయా?

హైదరాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): బీజేపీ నూతన అధ్యక్షుడిగా నితిన్ నబీన్ బాధ్యతల స్వీకరణ సందర్భంగా ప్రధాని మోదీ, బీజేపీ సంస్థాగత ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఎంపీ కె.లక్ష్మణ్ మధ్య ఆసక్తికరణ సంభాషణ చోటు చేసుకుంది. 'ఓట్లు ఏమైనా చోరీ అయ్యాయా(కోయీ ఓట్ చోరీ హువా క్యా)?' అంటూ లక్ష్మణ్‌ను నవ్వుతూ ప్రశ్నించారు. ఇందుకు స్పందించిన లక్ష్మణ్.. 'సర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)'తో ఓటరు జాబితాను సరిచేశామంటూ అంతే సరదాగా మోదీకి బదులిచ్చారు. అంతేకాక, 'క్యా చునావ్ అధికారీ..? చునావ్ కైసే హువా..?(రిటర్నింగ్ అధికారీ ఎన్నిక ఎలా జరిగింది)' అని లక్ష్మణ్‌ను మోదీ ప్రశ్నించారు. ఇందుకు 'అచ్చా హువా.. సఫలతా భీ హువా.. (బాగా జరిగింది. విజయవంతమైంది)' అని లక్ష్మణ్ వివరించారు. ఇక, నితిన్ నబీన్‌కు మద్దతుగా ఉత్తరప్రదేశ్ నుంచి నామినేషన్ సెట్ దాఖలుకు వచ్చిన ఆ రాష్ట్ర సీఎం యోగి ఆదిత్యనాథ్ కూడా లక్ష్మణ్‌తో సరదాగా మాట్లాడారు. లోక్‌సభ, శాసనసభ ఎన్నికలను తలపించేలా అధ్యక్ష ఎన్నిక జరుగుతోందే? అని లక్ష్మణ్‌తో యోగి అన్నారు. అలాగే, కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ మాట్లాడుతూ 'ఇత్‌నా గంభీర్ హై..!(ఇంత గంభీరంగా ఉన్నారేంటి)' అని వ్యాఖ్యానించగా.. ఎలక్షన్ కోడ్ హై.. !(ఎన్నికల కోడ్ అమలులో ఉంది)అని లక్ష్మణ్ అన్నారు. కాగా, ప్రపంచంలోనే అతిపెద్ద సభ్యత్వం ఉన్న పార్టీకి జాతీయ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా బాధ్యతలు నిర్వహించడం తెలుగువాడిగా తనకు గర్వంగా ఉందని లక్ష్మణ్ 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు.

కెనడా, గ్రీన్‌ల్యాండ్, వెనెజువెలా.. అన్నీ మావే!

(మొదటి పేజీ తరువాయి)

ఆ ఫొటోలో.. ట్రంప్ వైట్‌హౌస్‌లోని తన కార్యాలయంలో (ఓవల్ ఆఫీస్) కూర్చుని ఉండగా, ఆయన ముందు తన గ్రీన్‌ల్యాండ్ ఆశలకు అడ్డంకిగా ఉన్న నాటో సభ్యదేశాల నేతలైన మేక్రాన్ (ఫ్రాన్స్ అధ్యక్షుడు), జార్జియా మెలోనీ (ఇటలీ పీఎం), కీర్ స్టార్మర్ (బ్రిటన్ ప్రధాని), యూరోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ ఉర్సులా వాన్‌డెర్ లెయెన్ తదితరులున్నారు! అలాగే మరో పోస్టులో ట్రంప్ ఇంకో ఫొటో పెట్టారు. ట్రంప్ అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, యూఎస్ విదేశాంగ మంత్రి మార్కో రుబియోతో కలిసి గ్రీన్‌ల్యాండ్‌లో అమెరికా జెండా ఎగరేస్తున్నట్టుగా ఉన్న ఫొటో అది. పక్కనే ఒక బోర్డు మీద.. 'గ్రీన్‌ల్యాండ్, అమెరికా భూభాగం' అని ఉంది. కాగా.. తాను ప్రతిపాదించిన 'శాంతి వేదిక(బోర్డ్ ఆఫ్ పీస్)'లో చేరడానికి నిరాకరిస్తున్న ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్‌పై డొనాల్డ్ ట్రంప్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఈ ఏడాది మేలో మేక్రాన్ పదవీకాలం ముగుస్తుందన్న విషయాన్ని పరోక్షంగా ప్రస్తావిస్తూ.. "త్వరలో పదవి నుంచి దిగిపోయే మేక్రాన్ శాంతి వేదికలో చేరాలని ఎవరూ అనుకోవట్లేదు" అని ఎద్దేవాగా అన్నారు. ఫ్రాన్స్ గనక బోర్డ్ ఆఫ్ పీస్‌లో చేరకపోతే ఫ్రెంచ్ వైన్లు, షాంపేన్లపై 200 శాతం సుంకం విధిస్తానని హెచ్చరించారు. అప్పుడు మేక్రాన్ తప్పనిసరిగా అందులో చేరుతారని పేర్కొన్నారు. అంతే కాదు... గ్రీన్‌ల్యాండ్ అంశంపై మేక్రాన్ తనకు పంపిన వ్యక్తిగత సందేశాలను కూడా ట్రంప్ బహిర్గతం చేశారు. "సిరియా విషయంలో మన ఆలోచనలు ఒకేలా ఉన్నాయి. ఇరాన్ విషయంలో మనం కలిసి గొప్ప పనులు చేయగలం. కానీ, గ్రీన్‌ల్యాండ్ విషయంలోనే మీరేం చేస్తున్నారో నాకు అర్థం కావట్లేదు. దీనిపై నేను దావోస్ భేటీ అనంతరం ప్యారిస్‌లో గురువారం మధ్యాహ్నం జీ7 దేశాల సమావేశాన్ని నిర్వహిస్తా. ఉక్రెయిన్, డెన్మార్క్, సిరియా, రష్యావారిని ఆహ్వానిస్తాను. ఆ రోజు మీరు అమెరికాకు తిరిగి వెళ్లే ముందు ప్యారిస్‌లో మనిద్దరం రాత్రి భోజనం చేద్దాం" అని మేక్రాన్ పంపిన ఆ సందేశాల్లో ఉంది. అంటే.. ట్రంప్ ప్రతిపాదించిన శాంతి వేదికకు బదులుగా, పలు అంశాల్లో తాను మధ్యవర్తిగా వ్యవహరించాలని మేక్రాన్ భావించారు! అది ట్రంప్‌కు నచ్చకపోవడంతో ఇలా 200% టారిఫ్‌లంటూ తనకు అలవాటైన రీతిలో సుంకాల రంకెలు వేశారు. అయితే.. ఇలాంటి బెదిరింపులేవీ పనిచేయవని, సుంకాల బెదిరింపులతో తమ విదేశాంగ విధానాన్ని ప్రభావితం చేస్తామంటే కుదరదని మేక్రాన్ వ్యాఖ్యానించినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. కాగా.. మేక్రాన్ తనకు పంపిన సందేశాలను బహిర్గతం చేసిన అనంతరం, నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రుట్టే (ఈయన నెదర్లాండ్స్ మాజీ ప్రధాని కూడా) పంపిన ప్రైవేటు సందేశాలను సైతం ట్రంప్ తన సోషల్‌మీడియా ఖాతాలో పోస్ట్ చేశారు. దావోస్‌లో తాను మీడియాతో ఏం మాట్లాడబోయేదీ.. ట్రంప్‌కు పంపిన ఆ సందేశాల్లో రుట్టే ముందే పేర్కొనడం గమనార్హం.

గణతంత్ర వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు

తుళ్లూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో జరగనున్న గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి జె.శ్యామలరావు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ స్పెషల్ పోలీస్ (ఏపీఎస్పీ) ఐజీ బి.రాజకుమారి, గుంటూరు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ వకుల్ జిందాల్ తదితర అధికారులతో జరిగిన సమావేశంలో శ్యామలరావు మాట్లాడుతూ, గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లలో లోపాలు ఉండరాదన్నారు. అతిథులు వేదిక వద్దకు వచ్చే మార్గాలు, పార్కింగ్ ఏర్పాట్లు పక్కాగా ఉండాలని ఆదేశించారు. పోలీసుల బందోబస్తు, ట్రాఫిక్ నిర్వహణకు 900 మంది పోలీసు సిబ్బందిని నియమించామని గుంటూరు ఎస్పీ వకుల్ జిందాల్ చెప్పారు. గుంటూరు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ, అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని వివరించారు. సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు కెఎస్ విశ్వనాథన్ మాట్లాడుతూ 21 శాఖలు తమ అభివృద్ధిని తెలియజేసే శకటాలను వేడుకలలో ప్రదర్శించనున్నాయని తెలిపారు.

టీటీడీ ఉచిత వివాహాలకు స్పందన

▸ పదేళ్లలో తిరుమలలో 26,777 పెళ్లిళ్లు

తిరుమల, జనవరి20(ఆంధ్రజ్యోతి): తిరుమల కొండపై టీటీడీ చేయిస్తున్న ఉచిత వివాహాలకు మంచి స్పందన వస్తోంది. వెంకన్న సన్నిధికి వచ్చి పెళ్లి చేసుకునే వారి సంఖ్య పెరుగుతోంది. పాపవినాశనం రోడ్డులో ఏర్పాటు చేసిన భారీ సామూహిక కల్యాణవేదికలో ఈ పెళ్లిళ్లు జరుగుతున్నాయి. ఇక్కడ గడిచిన పదేళ్లలో 26,777 వివాహాలు జరిగాయి. 2016-17 మధ్య 2,731 జంటలకు, 2017-18లో 4,705, 2018-19లో 5,047, 2019-20లో 4,443, 2020-21లో 91, 2021-22లో 1,298, 2022-23లో 2,133, 2023-24లో 2,458, 2024-25 డిసెంబరు వరకు 3,871 పెళ్లిళ్లు జరిగాయి. పురోహితుడు, మంగళవాయిద్యంతో పాటు పెళ్లి సమయంలో పసుపు, కుంకుమ, కంకణాలను టీటీడీ ఉచితంగా అందజేస్తోంది. 'టీటీదేవస్థానమ్స్ఏపీ.జీవోవీ.ఇన్' అనే వెబ్‌సైట్ ద్వారా కల్యాణాలకు బుక్ చేసుకోవచ్చు.

ఈసీఆర్‌ఎఫ్ డ్యాం పనులకు షీప్ ఫుట్ రోలర్లు వాడండి

అంతర్జాతీయ నిపుణుల సూచన

▸ పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలో రెండోరోజూ పర్యటన

▸ ఫిబ్రవరి నాటికి డయాఫ్రం వాల్ పూర్తవుతుందని అధికారుల వెల్లడి

పోలవరం/అమరావతి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టులో అంతర్జాతీయ నిపుణుల పర్యటన మంగళవారం రెండో రోజూ కొనసాగింది. డేవిడ్ బి.పాల్, గియాస్ ఫ్రాంకో డి.సిక్కో (అమెరికా), సీస్ హించ్‌బెర్గర్ (కెనడా).. కేంద్ర జలశక్తి శాఖ, కేంద్ర జలసంఘం, రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులతో కలిసి.. గ్యాప్ 1, గ్యాప్ 2, డయాఫ్రంవాల్ నిర్మాణ ప్రాంతాలను పరిశీలించారు. ఎర్త్‌కం రాక్ ఫిల్ (ఈసీఆర్‌ఎఫ్) డ్యాం, రోలింగ్ కోర్ పనులలో షీప్ ఫుట్ రోలర్లు వాడాలని, అంతర్జాతీయంగా వాటి వినియోగంతో మంచి ఫలితాలుంటాయని నిపుణుల బృందం అధికారులకు, కాంట్రాక్టు సంస్థకు సూచించారు. ఇప్పటి వరకూ జరిగిన రోలింగ్ పనుల్లో ఏ రోలర్లు వినియోగిస్తున్నారనే అడిగారు. ట్రయల్ ఎంబాక్‌మెంట్ పనుల్లో షీప్ ఫుట్ రోలర్ల వినియోగంతో సరైన ఫలితాలు రాకపోవడంతో ఫ్లాట్ ఫుట్, వైబ్రేటెడ్ ఫుట్ రోలర్లు వినియోగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టులో పనులు జరుగుతున్న తీరు, పనుల్లో ఇబ్బందులు, అవాంతరాలు, డిజైన్లు, డ్రాయింగులు తదితర అంశాలపైనా నిపుణులు ఆరా తీశారు. డి హిల్ గ్రౌడింగ్ పనులను స్వయంగా పరిశీలించారు. ఫిబ్రవరి నాటికి డయాఫ్రం వాల్ పనులు పూర్తవుతాయని అధికారులు తెలిపారు. అనంతరం రెండో రోజు పర్యటనకు సంబంధించిన విషయాలపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో కేంద్ర జలశక్తి శాఖ అధికారులు సరబ్జిత్ సింగ్ బక్షి, మనీశ్ రాథోడ్, గౌరవ్ తివారీ, హేమంత్ గౌతమ్, కేంద్ర మట్టి, రాతి నాణ్యతా పరిశీలన (సీఎస్ఎంఆర్ఎస్) అధికారులు మనీశ్ గుప్తా, రవి అగర్వాల్, సీడబ్ల్యూపీఆర్ఎస్ ప్రతినిధి వీఎస్ రామారావు, పీపీఏ సభ్య కార్యదర్శి ఎం.రఘురాం, జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ఈఎన్‌సీ కె.నరసింహమూర్తి, ఎస్ఈ రామచంద్రరావు, మేఘా జీఎం గంగాధర్, డీజీఎం మురళి పమ్మి పాల్గొన్నారు. విద్యుత్కేంద్రం నుంచి విడుదలయ్యే నీరు దిగువ కాఫర్ డ్యాం గుండా రావాలంటే తీసుకోవలసిన చర్యలపైనా చర్చ జరిగింది. ఇందుకోసం దిగువ కాఫర్ డ్యాంను కొంత మేర తొలగిస్తే సరిపోతుందన్న అభిప్రాయం వ్యక్తమైంది. గ్యాప్-1 ప్రాంతాన్ని నిపుణులు బుధవారం కూడా పరిశీలించనున్నారు.


పోలవరం ప్రాజెక్టు కార్యాలయంలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ చూస్తున్న విదేశీ నిపుణులు

డయాఫ్రం వాల్‌కు డీఎస్ఎం పితలాటకం!

పోలవరం ప్రాజెక్టు పనుల్లో ఆఖరిదైన ఈసీఆర్‌ఎఫ్ డ్యాం పనులు ప్రారంభించేందుకు సిద్ధమవుతున్న తరుణంలో డయాఫ్రం వాల్‌కు రెండు వైపులా డీప్ సాయిల్ మిక్సింగ్ (డీఎస్ఎం) చేయాలంటూ అంతర్జాతీయ నిపుణుడొకరు పట్టుబట్టడం అలజడి రేపింది. వాల్ డిజైన్లు ఖరారు చేసినప్పుడు డీఎస్ఎం అవసరం లేదని చెప్పిన నిపుణుడే ఇప్పుడు అకస్మాత్తుగా ఈ పితలాటకం పెట్టడంపై.. తోటి నిపుణులతో పాటు రాష్ట్ర అధికారులు కూడా అవాక్కయ్యారు. డీఎస్ఎం చేయడం పెద్ద కష్టంతో కూడుకున్నది కాదు. కానీ ఇందుకోసం ప్రత్యేకంగా యంత్ర సామగ్రి తీసుకురావాలి. కాకపోతే డీఎస్ఎం చేసేంత వరకూ ఈసీఆర్‌ఎఫ్ డ్యాం నిర్మాణం చేపట్టడం కుదరదు. ఇది పూర్తవడానికి కనీసం మూడు నెలలైనా పడుతుంది. అంటే 2027 మార్చినాటికి పూర్తి చేయాలనుకున్న పోలవరం ప్రాజెక్టు తొలిదశ జూన్ దాకా పూర్తికాదు. దీనిపై బుధవారం మరోసారి సమీక్షించి తుది నిర్ణయం తీసుకోనున్నారు.

ఐవీఆర్ఎస్ కాల్స్‌తో వీఆర్వోలపై అసత్య ప్రచారం

▸ ఏపీ వీఆర్వోల సంఘం అధ్యక్షుడు రవీంద్రరాజు

విజయవాడ (గాంధీనగర్), జనవరి 20 (ఆంధ్రజ్యోతి): వీఆర్వోలు, ఇతర అధికారులపై చేస్తున్న ఐవీఆర్ఎస్ కాల్స్ వల్ల ఉద్యోగుల మనోభావాలకు భంగం కలుగుతుందని ఏపీ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బీహెచ్.రవీంద్రరాజు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కాల్స్‌లో వస్తున్న రిపోర్టులు వాస్తవాలు కాదని, కొందరు అధికారులు తప్పుడు రిపోర్టులు చూపించి సీఎం చంద్రబాబును తప్పుదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. ఐవీఆర్ఎస్ కాల్స్ పేరుతో మెమోలు, షోకాజ్ నోటీసులు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఎవరైనా తప్పు చేసినట్టు ఆధారాలుంటే వారిపై తీసుకునే చర్యలను స్వాగతిస్తామన్నారు. ఐవీఆర్ఎస్ కాల్స్‌పై ఎక్కడైనా, ఎప్పుడైనా అధికారులతో బహిరంగ చర్చలకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. రైతులు ఫిర్యాదులు చేయకపోయినా వారి నుంచి డబ్బులు తీసుకుని వీఆర్వోలు పాస్‌బుక్‌లు ఇచ్చారని కొందరు అధికారులు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వర్క్ టూ రూల్ పాటించాలని ఈ నెల 12న రాష్ట్ర సీసీఎల్ఏ కార్యాలయంలో వినతిపత్రం అందజేశామని తెలిపారు. వీఆర్వోల సమస్యలు పరిష్కరించేంత వరకు ఈ విధానాన్ని పాటిస్తామని స్పష్టం చేశారు. వీఆర్వో, వీఆర్ఏ, సర్వేయర్లు, రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారమే అజెండాగా త్వరలో రెవెన్యూ జేఏసీ ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

కాటేసిన విధి!

▸ తల్లిని ఆస్పత్రికి తీసుకువెళుతుండగా కొడుకుకు ప్రమాదం

▸ ఆరోగ్యం విషమించి తల్లి, కోమాలోకి వెళ్లి కుమారుడు మృతి

▸ ప్రకాశం జిల్లా కందుకూరులో ఘటన


షాజిద్


కందుకూరు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): చావుబతుకుల్లో ఉన్న తల్లిని చికిత్స కోసం వైద్యశాలకు తరలిస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో కొడుకు తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో మృతి చెందాడు. ఆరోగ్యం విషమించి ఆస్పత్రికి చేరేలోగానే ఆ తల్లి కూడా చనిపోయింది. ఈ విషాద ఘటన ప్రకాశం జిల్లా కందుకూరులో సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకొంది. వివరాలు.. కందుకూరు పట్టణ పోలీసుస్టేషన్‌లో షాజిద్ (38) కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. సోమవారం రాత్రి విధుల్లో ఉండగా..తల్లి (70) పరిస్థితి విషమంగా ఉందని ఫోన్ రావడంతో హుటాహుటిన ఇంటికి వచ్చారు. అంబులెన్స్‌లో పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లేందుకు ఏర్పాట్లు చేశారు. ముందు అంబులెన్స్ వెళ్తుండగా వెనుక మోటారుసైకిల్‌పై షాజిద్ వెళుతున్నారు. వైద్యశాల సమీపంలో ఎదురుగా వస్తు న్న మరో మోటారుసైకిల్ ఢీకొట్టడంతో కిందపడిన ఆయన తీవ్ర గాయాలపాలై కోమాలోకి వెళ్లిపోయారు. ఈలోగా అంబులెన్స్ హాస్పిటల్‌కు చేరగా షాజిద్ తల్లిని పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు ప్రకటించారు. షాజిద్‌ను ఒంగోలు తరలించగా అక్కడ ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్సపొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందారు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

రథసప్తమి రోజుశ్రీ సూర్యనారాయణ స్వామికి ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు

అమరావతి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామికి రథసప్తమి రోజున రాష్ట్ర ప్రభుత్వం తరపున వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. ఈ మేరకు దేవదాయ శాఖ కార్యదర్శి ఎం.హరిజవహర్‌లాల్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 24వ తేదీ రాత్రి 12.05 గంటలకు సప్తమి తిథి ప్రారంభం కావడంతో ఆయన అదే రోజు పట్టువస్త్రాలు సమర్పించనున్నారు.

ఏప్రిల్ 20న అప్పన్న చందనోత్సవం

విశాఖపట్నం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సింహాచలం వరాహ లక్ష్మీనృసింహ స్వామి చందనోత్సవాన్ని ఈ ఏడాది ఏప్రిల్ 20న నిర్వహించనున్నట్టు జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి వెల్లడించారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లపై మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. దర్శనాలకు రూ.1,500, రూ.1,000, రూ.300 ధరలు కలిగిన టికెట్ల జారీ ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలన్నారు. కొండపైకి ప్రైవేటు వాహనాల రాకపోకలను నియంత్రించాలని సూచించారు.





ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

వేయివిధాల వెర్రి

అమెరికా అధ్యక్షుడు మరో విన్యాసం చేశారు. కెనడా, వెనెజువెలా, గ్రీన్‌ల్యాండ్‌లను తనదేశంలో కలిపేసుకున్నారు. మ్యాప్‌లో వీటిని చేర్చిన సంతోషాన్ని తన 'ట్రూత్ సోషల్' ద్వారా మిగతా ప్రపంచంతో పంచుకున్నారు. ఎవరి వెర్రి వారికి ఆనందం అని తేలికగా తీసిపారేయ డానికి లేదు. ఈ మూడింటినీ ఆయన ఎప్పటినుంచో కలవరిస్తున్నాడు, అమెరికాలో విలీనం చేయాలని కలలు గంటున్నాడు. నిన్నటివరకూ మాటలకే పరిమితమైనవాడు నేడు మ్యాపులవరకూ వచ్చాడు. రేపో మాపో తాను చేయబోయేదీ, ఆరునూరైనా జరగబోయేదీ ఇదేనని తేల్చి చెబుతున్నాడు.

సామాజిక మాధ్యమాల్లో ఆయన పోస్టుచేసిన రెండు చిత్రాలు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌తో రూపొందినవి. మిగతాదేశాధినేతలకంటే ఆయనకు కృత్రిమమేధ సహాయం ఎక్కువ అవసరం. ఒక చిత్రంలో ఆయన గ్రీన్‌ల్యాండ్‌లో అమెరికా జెండా పాతుతున్నాడు, పక్కన ఒక బోర్డుమీద అమెరికా భూభాగం–2026అని రాసివుంది. మరోపోస్టులో కొత్త అమెరికా మ్యాప్ వెనకన ఉండగా, ఓవల్ ఆఫీసులో నాటో దేశాధినేత లతో ముచ్చటిస్తున్నాడు. యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్‌డేర్, నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రట్టే సహా ఫ్రాన్స్, ఇటలీ, బ్రిటన్ ఇత్యాది నేతలంతా ట్రంప్ ఉపన్యాసాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో వింటున్నారు. ఆయన ఈ మూడుప్రాంతాలనూ దురాక్రమించి తన దేశంలో కలిపేసుకున్నప్పటికీ, వీళ్ళెవ్వరూ తలొంచడం వినా ఏమీ చేయ లేకపోయారని ఆ చిత్రం సందేశం. వాళ్ళకంత సీన్ లేదు అని ట్రంప్ చేస్తున్న వ్యాఖ్యలకు అనుగుణంగా ఇది రూపొందింది. గ్రీన్‌ల్యాండ్ విషయంలో తాను ఏమి చేసినా యూరోపియన్ యూనియన్ (ఈయూ) చేయగలిగేదేమీ ఉండబోదని ట్రంప్ ఇప్పటికే తేల్చేశారు. ఈ భూప్రపంచంమీద అమెరికాను మించిన శక్తిమంతమైన దేశం మరొకటి లేదని కూడా ఆయన సందర్భోచితంగా భయపెట్టారు.

అమెరికా రక్షణకు గ్రీన్‌ల్యాండ్ అత్యావశ్యకమని, దానిని సాధించి తీరు తానని ట్రంప్ చెబుతున్నారు. అది గనుక రష్యా, చైనాల చేతుల్లోకి పోతే అమెరికా ఉనికికే ప్రమాదం కనుక కలిపేసుకోవాలన్నది లక్ష్యం. ఈ ఆర్కిటిక్ ద్వీపం, పాక్షికంగా దానిని నియంత్రిస్తున్న డెన్మార్క్ అందుకు ఒప్పుకోవడం లేదు. గ్రీన్‌ల్యాండ్‌ను కాపాడుకోవడం కోసం డెన్మార్క్ ఏకంగా కొంత సైన్యాన్ని తరలించి, ప్రచ్ఛన్నయుద్ధకాలం నాటి కనిపిస్తే కాల్చివేత తరహా ఆదేశాలు కూడా అమల్లో పెట్టింది. అమెరికా సైనికులు కనిపించగానే, ఉన్నతస్థాయి ఆదేశాలకోసం కూడా ఎదురుచూడనక్కర లేకుండా డెన్మార్క్ యోధులు తుపాకులు పేల్చవచ్చు. దృశ్యాన్ని ఊహిస్తే గలివర్–లిలీపుట్ చిత్రం గుర్తుకు వస్తుంది కానీ, ఈ చర్యతో డెన్మార్క్ అందించిన ప్రతిఘటన సందేశం మెచ్చదగింది. అమెరికా పక్షాన నిలవకుండా డెన్మార్క్‌ను వెనకేసుకొస్తున్న ఐరోపా దేశాలమీద పదిశాతం సుంకాన్ని శిక్షగా విధించిన ట్రంప్, ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్ వంటివారు పంపిన రహస్య సయోధ్య సందేశాలను సైతం బహిర్గత పరుస్తూ కయ్యానికి కాలుదువ్వుతున్నారు. మరోపక్క, హిందుమహాసముద్రంలోని డీగోగార్షియా దీవిని మారిషస్‌కు అప్పగించడానికి సిద్ధపడిన బ్రిటన్ ప్రధానిని చేతకానివాడంటూ నిందిస్తూ, చైనా రష్యాలు దమ్మున్నవారిని మాత్రమే గుర్తిస్తాయనీ, అందుకే తాను అధికారంలోకి వచ్చిన ఈ ఏడాది లోనే అమెరికాకు ఎక్కడలేని గౌరవమూ దక్కిందని ఆయన చెప్పుకున్నాడు.

గ్రీన్‌ల్యాండ్ అమ్ముడుపోదని ఎందరు నినదించినా, మిత్రదేశాలు అడ్డం పడుతున్నా, 'నోరాడ్' ముసుగులో అమెరికా తన విమానాలను గ్రీన్ ల్యాండ్‌కు తరలించడం ఉద్రిక్తతలను పెంచుతోంది. అమెరికా అధ్యక్షుడి దూకుడునూ, తమపై విధించిన సుంకాలను నిరసిస్తూ ఆ దేశంతో కుదర్చుకున్న స్వేచ్ఛావాణిజ్య ఒప్పందాన్ని నిలిపివేయాలని ఈయూ పార్లమెంట్ నిర్ణయించుకోవడం, గ్రీన్‌లాండ్ ప్రజలపక్షాన నిలబడాలని ఐరోపా దేశాలు ఏకమాటగా అనుకోవడం విశేషమైన పరిణామాలు. దశాబ్దాల స్నేహాన్ని వమ్ముచేస్తూ అమెరికా తన పాశ్చాత్యమిత్రదేశాలపైనే కాలుదువ్వుతోంది. ట్రంప్ ఏలుబడిలో ఉన్నంతకాలం ఆ దేశాన్ని ఏమాత్రం నమ్మకూడదన్న జ్ఞానం వాటికి ఈ పాటికే కలిగివుండాలి. మిత్ర దేశాల సార్వభౌమత్వాన్ని గౌరవించని ట్రంప్ ధోరణి నాటో ఐక్యతను దెబ్బతీస్తోంది. కృత్రిమమేధతో తయారైన ఆ మ్యాప్ మూడింటిని మాత్రమే విలీనం చేసుకున్నప్పటికీ, అగ్రరాజ్య ప్రయోజనాల ముందు ఏ దేశ సార్వభౌమత్వమూ నిలవదని మిగతా ప్రపంచాన్ని హెచ్చరిస్తోంది.

హేతువాద, మానవవాద తాత్వికుడు

హేతువాదం, మానవవాదం అనే పదాల మీద విస్తృతమైన తెలుగు సాహిత్యాన్ని సృష్టించిన రచయిత, కార్యశీలి, తాత్వికుడు– రావిపూడి వెంకటాద్రి. చదివింది ఇంటర్మీడియట్ అయినా ఆయన సృష్టించిన సాహిత్యానికి ఎన్ని డిగ్రీలు, ఎన్ని డాక్టరేట్‌లు ఇచ్చినా సరిపోవేమో! ఆయన రచనలను స్థూలంగా పరిశీలించినప్పుడు– మానవ జీవన అంతరంగాన్ని తాకే ఏ అంశాన్నీ ఆయన వదిలిపెట్టలేదు. 1946లో విశ్వాన్వేషణతో మొదలైన ఆయన రచనా ప్రస్థానం 2023 జనవరి 21న మరణానికి 20 రోజుల ముందు వరకు కొనసాగింది.

చిన్నతనం నుంచి మత సాహిత్యాన్ని చదివి పెరిగిన ఆయన మాటల్లో, రచనల్లోనూ హిందూమతం, ఇతర మత భావజాలాలపై అధిక సాధి కారత కనిపిస్తుంది. అలాగే సమకాలీనంగా సాగిన శాస్త్ర పరిశోధనలను ఆసాంతం అర్థం చేసుకున్న వ్యక్తి ఆయన. మత సాహిత్యం చదివినా, విజ్ఞాన శాస్త్రాలను చదివినా ఆయన ఎక్కడా తన ఆలోచనలో ఉన్న మానవీయ తాత్విక భావజాలాన్ని వదిలిపెట్టలేదు. పైగా ప్రతీ విషయాన్ని 'హేతువాద ఆకురాయి'తో పరీక్షించకుండా వదిలిపెట్టలేదు.

మత గ్రంథాలను, పిడివాదాలను, జడవాదాలను ఆయన ప్రశ్నించిన తీరు చాలా ఘాటైనది. ఆయన చేసిన విమర్శలు, ఆయన అడిగిన ప్రశ్నలు దశాబ్దాలుగా వివరణలకు, జవాబులకు నోచుకోలేదంటే ఆయన హేతువాద స్థాయి, ప్రశ్నల స్థాయి ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు. ఆయన చిన్నత నంలో చేపట్టిన మత విమర్శను మాత్రమే కొనసాగించకుండా, మతాలకు విరుగుడు ఏమిటా? అని ఆలోచించారు. మత భావాలకు సరైన సమాధానాలు ఆధునిక విజ్ఞానశాస్త్ర పరిశోధనా ఫలితాలు మాత్రమే ఇవ్వగలవని గుర్తించి, తన అధ్యయనాన్ని అటువైపుగా మళ్ళించారు. వైజ్ఞానిక వెలుగులో పురాణేతిహాసాలను చూసి అందులో ఉన్న డొల్లతనాన్ని గుర్తించి, బాహాటంగానే ప్రకటించారు. అందరూ అచంచల విశ్వాసంతో పాటించే మతభావాలను శాస్త్రీయ దృక్పథంతో పరిశీలించి, మతం అంటే మూసుకుపోయిన ఆలోచనే అని, "అసలు మారేది మతమే కాదని, మారనిది సైన్సే కాద"ని నిర్ధారించి, సూత్రీకరించారు. మత వ్యతిరేకత, శాస్త్రీయ విజ్ఞానం వెంకటాద్రిని నాస్తికవాదం వైపు నడిపించాయి. అయితే ఆయన సత్యాన్వేషణ అక్కడితో ఆగిపోలేదు. హేతువాద ఉద్యమానికి కేవలం 'పురోహిత వ్యతిరేకత', 'దైవ నిరాకరణ' మాత్రమే లక్ష్యంగా ఉండరాదని ఆయన భావించారు. ఆ ఉద్యమాన్ని క్రమంగా మానవవాద బాట పట్టించారు.



మానవేంద్రనాథ్ రాయ్ (ఎం.ఎన్. రాయ్) భావజాలంతో ప్రభావితుడైన వెంకటాద్రి, రాడికల్ హ్యూమనిస్ట్... మెల్లగా ఆదర్శాల వైపు మళ్లారు. వాటిని తీవ్రంగా అధ్యయనం చేసిన ఆయన, మానవవాదం అంటే– ఏ వ్యక్తీ పుట్టుకతో వివక్ష అనుభవించరాదని, మానవులందరికీ అన్ని వ్యవస్థలలో, అన్ని విధానాలలోనూ– 'స్వేచ్ఛ' ప్రధానమైన విలువ అని గుర్తించారు. భావవాదం, ఆధ్యాత్మికత అనేవి కవల పిల్లలని, అవి ఆధునిక శాస్త్ర విజ్ఞానానికి వ్యతిరేకంగా మాట్లాడతాయని, కానీ ఆచరణలో మాత్రం స్వాములు, భక్తులు, బాబాలు, ప్రవచనకారులు అందరూ ఆధునిక శాస్త్ర విజ్ఞానం ఉప ఉత్పత్తిగా వచ్చిన సాంకేతిక శాస్త్రాన్ని... అంటే టెక్నాలజీని, శాస్త్రీయ పరికరాలన్నింటినీ అందరికంటే ఎక్కువగా వాడుకుంటారని సున్నితంగా చెప్పారు.

యూరప్‌లో వచ్చినట్టుగా శాస్త్ర విజ్ఞానాల పునర్జీవనం ఇంతవరకు భారతదేశంలో మొదలే కాలేదని గుర్తు చేశారు. రాజా రామ్మోహన్‌రాయ్‌ను భారతీయులు ఆదర్శంగా తీసుకోవడం చాలా పొరపాటని, అదే బెంగాల్ రాష్ట్రంలో పుట్టిన హెన్రీ డేరాజియాను, ఆయన భావాలను వెదజల్లగలిగితే భారతదేశ స్వరూపం ఇప్పుడు మరో విధంగా ఉండేదని తన రచనల నిండా చెప్పారు. మత సాహిత్యం చాలా ఉన్నదని, అది అజ్ఞానాన్ని, ఆచారాలను, సంప్రదాయాలను వ్యవస్థీకృతం చేస్తున్నదని వెంకటాద్రి తన రచనలలో తెలిపారు. ఆ స్థాయిలో హేతువాద మానవ వాద సాహిత్యం వచ్చినప్పుడే మన సమాజంలో మార్పు సాధ్యమన్నారు.

తెలుగు హేతువాద సాహిత్యంలో రావిపూడి వెంకటాద్రి పేరు ఒక రచయితగా మాత్రమే కాదు, ఒక ఆలోచనా ప్రవాహంగా నిలుస్తుంది. ఆయన చేసిన రచనలను, పుస్తకాల జాబితాగా చూస్తే సంఖ్యలు కనిపిస్తాయి. కానీ ఆ సంఖ్యల వెనుక ఒకే ప్రశ్న తిరుగుతుంది. అదేమిటంటే... మనిషి స్వేచ్ఛగా, గౌరవంగా, ఆనందంగా, వివక్ష లేకుండా బతకాలంటే– దేవుడు, మతం, ఆచారం, సంప్రదాయం, మూఢ నమ్మకాలు ఏ స్థాయిలోనూ ఉండకూడదు. ఈ ఒక్క అంశమే ఆయన జీవితాన్ని, రచనలను, ఉద్యమాన్ని ఒక తాత్విక ఏకత్వంలో నిలిపింది.

రావిపూడి వారి ప్రత్యేకత ఏమిటంటే ఆయన హేతువాద ఉద్యమాన్ని కూడా హేతువాదంతోనే పరిశీలించారు. హేతువాదం అంటే కేవలం దేవుడిని తిట్టడమా? మతాన్ని ఖండించడమేనా? అంతేనా మన లక్ష్యం? ఈ ప్రశ్నలు ఉద్యమం లోపల కన్నా, ఆయన నుంచే రావడం వల్ల అవి అసౌకర్యంగా అనిపించాయి. కానీ అవే ప్రశ్నలు ఉద్యమానికి సరైన దిశను చూపించాయి. మూసుకుపోయిన ఆలోచనలను సైతం మొగ్గ తొడిగించడం రావిపూడి వారి ప్రత్యేకత. అనేక ప్రత్యేకతలతో ప్రపంచంలో 102 సంవత్సరాలు నడయాడిన ఆధునిక హేతువాద మానవవాద తాత్వికుడు ఆయన.

ప్రపంచ తాత్విక చరిత్ర పుస్తకంపై ముఖచిత్రంగా వేయదగిన మహా'మనీషి' ఆయన. మన మధ్య లేకపోయినా, ఆయన ఆలోచనలు, భావాలు ఇంకా ఈ ప్రపంచ ప్రజల భావవీధుల్లో జీవిస్తూనే ఉంటాయి. మనిషిని కేంద్రంగా పెట్టని, గౌరవించని ఏ భావజాలమైనా చివరికి మనిషినే నాశనం చేస్తుంది.

• కె.శ్రీనివాసాచారి
అధ్యక్షులు, తెలంగాణ హేతువాద సంఘం

(నేడు రావిపూడి వెంకటాద్రి వర్ధంతి)

విపక్ష వైరుధ్యాలే బీజేపీ విజయ సోపానాలు



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

> జాతీయ స్థాయిలో బీజేపీయేతర ప్రత్యామ్నాయాన్ని ఏర్పాటు చేయడంలో వామపక్షాల పాత్ర క్షీణిస్తోంది. 'పోనీ దేశంలో ఉన్న రకరకాల వామపక్షాలన్నీ ఏకమై ఒక బలమైన శక్తిగా ఏర్పడొచ్చు కదా' అని సీపీఐ నేత నారాయణను అడిగితే 'సీపీఐ(ఎం) మూర్ఖత్వమే అందుకు అడ్డు' అని ఆయన జవాబిచ్చారు! ప్రాంతీయ పార్టీలు ముక్కలు ముక్కలు కావడం, ప్రత్యామ్నాయ శక్తులన్నీ సంఘటితం కాకపోవడమే బీజేపీకి శ్రీరామరక్ష!

'భారత రాజకీయాల్లో కులం పోషించే సంక్లిష్ట పాత్రను గుర్తించడంలో కమ్యూనిస్టులు విఫలమయ్యారని అంగీక రించాలి. అదే విధంగా ప్రజలపై మతం ప్రభావాన్ని పూర్తిగా అర్థం చేసుకోవడంలో కూడా మేము విఫలమయ్యాం. కమ్యూనిస్టులు అనుసరించే గతితార్కిక భౌతికవాదం ప్రజల చేతనలో భాగం కాలేదు' అని మరియం అలెగ్జాండర్ బేబీ గత ఏడాది పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన తర్వాత ఒక ఇంటర్వ్యూలో అన్నారు. కేరళకు చెందిన బేబీ హయాంలోనే ఇవాళ కమ్యూనిస్టుల ఏకైక కోట అయిన ఆ రాష్ట్రంలో సీపీఐ(ఎం) నేతృత్వంలోని ఎల్‌డీఎఫ్ అధికారం కోల్పోయే ప్రమాదాన్ని ఎదుర్కొంటోంది. ఆ స్థానంలో కాంగ్రెస్ సారథ్యంలోని ఎల్‌డీఎఫ్ పది సంవత్సరాల తర్వాత అధికారంలోకి వచ్చే అవకాశాలు ఉన్నప్పటికీ కేరళలో పెరుగుతోన్న బీజేపీ ప్రభావాన్ని అడ్డుకోలేక పోతోంది. మతపరమైన సంప్రదాయాలు, విశ్వాసాల గురించి జనంలో ప్రస్తావించేటప్పుడు ఆచితూచి మాట్లాడాలని ప్రస్తుత కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ కూడా పార్టీ నేతలకు హితవు చెప్పారంటే కేరళలో బీజేపీ ప్రభావాన్ని ఆయన కూడా తక్కువ అంచనా వేయడంలేదనే చెప్పాలి. ఇవాళ దేశ వ్యాప్తంగా బీజేపీ విస్తరించడానికి వామపక్షాల వైఫల్యమే కారణమని సీపీఎం నేతల మాటల ద్వారానే అర్థం చేసుకోవచ్చు.

భారతీయ జనతా పార్టీ చరిత్రలో ప్రప్రథమంగా బిహార్‌కు చెందిన యువ నేత నితిన్ నబీ జాతీయ అధ్యక్షుడుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ వెలువరించిన ప్రసంగంలో ఒక కొత్త ఉత్సాహం కొట్టొచ్చినట్లు కనపడుతోంది. 2014లో ఢిల్లీలో అడుగుపెట్టినప్పటి నుంచీ మోదీ క్రమక్రమంగా పార్టీపై పట్టు బిగుస్తూ పార్టీ యావత్తూ తన కనుసన్నలలో నడుస్తూ, తాను ఎవరిని సూచిస్తే వారిని కిమ్మనకుండా పార్టీ జాతీయ అధ్యక్షుడుగా ఎన్నుకునేలా చేస్తున్నారు. ఇదేమీ చిన్నవిషయం కాదు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఘనవిజయం, మహారాష్ట్రలో స్థానిక ఎన్నికల్లో అసాధారణ విజయం సాధించిన తర్వాత సంభవించిన పరిణామమిది. ముంబైతో సహా 25 ప్రధాన నగరాల్లో బీజేపీ జయకేతనం ఎగురవేసిన విషయాన్ని ప్రస్తావిస్తూ రాబోయే ఎన్నికల్లో కేరళలో కూడా బీజేపీని ప్రజలు ఆదరిస్తారన్న ఆశాభావాన్ని ప్రధానమంత్రి వ్యక్తం చేశారు.

కేంద్రంలో మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశ వ్యాప్తంగా రాజకీయాలు మారిపోతున్నాయి. మహారాష్ట్రలో అయితే మరీ వేగంగా మారుతున్నాయి. థాకరే, శరద్ పవార్ పార్టీలను చీల్చడంలో బీజేపీ విజయవంతమయింది. క్రమంగా కాంగ్రెస్ కానీ, ప్రాంతీయ పార్టీలు కానీ బీజేపీని ఎదుర్కోవడంలో విఫలమయ్యే పరిస్థితి ఏర్పడింది. ఈ విషయం ఇటీవల మహారాష్ట్ర మునిసిపల్ ఎన్నికల్లో మరింత స్పష్టమైంది. ఈ పార్టీలు విఫలమయినప్పుడు దేశంలో ముస్లిం ఓటర్లు తమకొక ప్రత్యామ్నాయం కోసం అన్వేషిస్తారని, ఏఐఎంఐఎం వంటి పార్టీని ఆశ్రయిస్తారని ఈ ఎన్నికలు తేల్చాయి. మహారాష్ట్రలో థాకరే, పవార్ కుటుంబాలు మొదటి నుంచీ బలంగా ఉన్న ప్రాంతాల్లో సైతం తమ పట్టును కోల్పోయాయి. మోదీ జాతీయ స్థాయిలో అడుగుపెట్టక ముందు మహారాష్ట్రలో బలహీనంగా ఉన్న బీజేపీ ఇప్పుడు ఆ రాష్ట్ర రాజకీయాల్లో కేంద్ర శక్తిగా మారింది. బీజేపీ వ్యతిరేక శక్తులన్నీ ఏకమై తాత్కాలిక విజయం సాధించినప్పటికీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆ కూటమి తుడిచిపెట్టుకుపోయింది. గ్రామ పంచాయతీ, మునిసిపల్ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని మహాయుతి ప్రబల శక్తిగా ఆవిర్భవించింది. 2014కు ముందు 15 సంవత్సరాలు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు మహారాష్ట్ర రాజకీయాల్లో తన స్థానమేమిటో తేల్చుకోలేని అగమ్య గోచర స్థితిలో ఉన్నది. గుజరాత్, బిహార్, ఒడిషాలో మాదిరి మహారాష్ట్రలో కూడా బీజేపీ అధికారం సుస్థిర మయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. దేశంలో అతి పెద్ద పార్టీగా ఇప్పటికే విస్తరించిన బీజేపీ స్వాతంత్ర్యానంతరం కొన్ని దశాబ్దాల పాటు కాంగ్రెస్ పార్టీకి లభించిన ప్రాబల్యాన్నే సాధించిందనడంలో అతిశయోక్తి లేదు. కాంగ్రెస్, వామపక్షాలు, ఇతర బీజేపీయేతర పార్టీల సైద్ధాంతిక వైఫల్యానికి ఇది నిదర్శనం.

కొత్త జాతీయ అధ్యక్షుడు ఎన్నికైన సమయంలో మహారాష్ట్ర స్థానిక ఎన్నికల తర్వాత కేరళ గురించి మోదీ ప్రస్తావించడం గమనార్హం. జనవరి 23న కేరళలో పర్యటించనున్న మోదీ ఆ రాష్ట్రంలో బీజేపీ ఎంతో కొంత కాలుమోపడంపై ఉత్సాహంతో ఉన్నారనడంలో సందేహం లేదు. 1980లో బీజేపీ ఆవిర్భవించిన తర్వాత దాదాపు రెండున్నర దశాబ్దాల వరకూ కేరళలో ఆ పార్టీకి ఉనికి కూడా లేదు. 2016లో బీజేపీ తొలి అసెంబ్లీ సీటు గెలుచు కుని అనేక నియోజకవర్గాల్లో ఓట్ల శాతాన్ని పెంచుకుంది. అయిదారు కార్పొరేషన్లలో ప్రతిపక్ష స్థానం సాధించింది. 2024లో తొలి లోక్‌సభ సీటును సాధించడమే కాక 19 శాతం ఓట్లను దక్కించుకుంది. అయిదు లోక్‌సభ సీట్లలో బీజేపీకి రెండు లక్షలకు పైగా ఓట్లు లభించాయి. 11 అసెంబ్లీ సెగ్మెంట్లలో అధిక ఓట్లు సాధించగా, 9 సీట్లలో రెండవ స్థానం సాధించింది.

గత ఏడాది కేరళ స్థానిక ఎన్నికల్లో తొలి మునిసిపల్ కార్పొరేషన్‌ను దక్కించుకుంది. రాష్ట్ర రాజధాని అయిన తిరువనంతపురం మునిసిపల్ కార్పొరేషన్‌లో 50 సీట్లు సాధించి 45 సంవత్సరాలుగా వామపక్ష ఫ్రంట్ గుప్పిట్లో ఉన్న అనేక స్థానాలను కైవసం చేసుకుంది. 174 గ్రామ పంచాయతీలు, 4 జిల్లా పంచాయతీలు, నాలుగు సిటీ కార్పొరేషన్లు దక్కించుకున్న బీజేపీ కేరళలో దాదాపు 15 శాతం ఓట్లు సాధించగలిగింది. అన్నిటికన్నా ఎక్కువగా తిరువనంతపురంలో 23 శాతం దక్కించుకోగా, అనేక చోట్ల 19 శాతం ఓట్లను సాధించింది. క్రమంగా కేరళలో యూడీఎఫ్, ఎల్‌డీఎఫ్‌ల తర్వాత బీజేపీ మూడో స్థానం కోసం ఉరకలు వేస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కనీసం 33 స్థానాల్లో 30 నుంచి 65వేల ఓట్ల వరకు సాధించిన బీజేపీ ఈ సారి ఓట్ల శాతం పెంచుకుంటుందనడంలో సందేహం లేదు. ఎన్ని సీట్లు గెలుచుకుంటుందో చెప్పలేము కాని దాదాపు 40 నుంచి 60 సీట్లలో బీజేపీ దాదాపు 20 శాతం ఓట్లను సాధించే అవకాశాలు లేకపోలేదు.



ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ వయనాడ్ సీటులో విజయం సాధించినప్పటికీ 2021 అసెంబ్లీ ఎన్నికల్లో వామపక్షాల చేతుల్లో తాము రెండవసారి ఎందుకు ఓడిపోయిందీ ఇప్పటికీ కాంగ్రెస్ పార్టీ నేతలకు అర్థం కావడం లేదు. అయితే పదేళ్ల వామపక్ష ఫ్రంట్ సర్కార్ పట్ల వ్యతిరేకత మాత్రం కొట్టొచ్చినట్లు కనపడుతోంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ 20 లోక్‌సభ సీట్లు సాధించడం, గత ఏడాది స్థానిక ఎన్నికల్లో అత్యధిక స్థానాలు దక్కించుకోవడం కేరళలో కాంగ్రెస్ పునరుత్థా నాన్ని సూచిస్తోంది. సాధారణంగా అధికారంలో ఉన్న ఏ పార్టీ అయినా స్థానిక ఎన్నికల్లో తన సత్తా చూపిస్తుంది. కాని కేరళలో అలా జరగలేదంటే ప్రజా వ్యతిరేకత తీవ్రంగా ఉన్నదన్నమాటే. అత్యధిక నిరుద్యోగం, పేదరికంతో పాటు భారీ ఎత్తున నిరుత్పాదక వ్యయం, మౌలిక సదుపాయాలు లేకపోవడం వంటి సమస్యలతో పాటు పినరయి విజయన్ ప్రభుత్వంపై గోల్డ్ స్మగ్లింగ్, శబరిమల బంగారం చోరీ వంటి అనేక ఆరోపణల మూలంగా వామపక్ష ప్రభుత్వం అధికారం కోల్పోయే ప్రమాదంలో ఉన్నది. ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే, స్థానిక ఎన్నికల్లో ప్రజలకు సీపీఐ(ఎం)ని ఎంత అసహ్యించు కుంటున్నారో తేలిందని, ఆ పార్టీ అహంకారమే దాన్ని ప్రజల నుంచి దూరం చేసే పరిస్థితికి దారి తీసిందని, యూడీఎఫ్‌లో భాగస్వామి అయిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి బినయ్ విశ్వం తీవ్రంగా విమర్శించారు. పినరయి విజయన్ ప్రభుత్వం తీసుకున్న కొన్ని హిందూత్వ అనుకూల చర్యల మూలంగా ముస్లిం ఓటర్లకు సీపీఐ(ఎం) కంటే కాంగ్రెస్ ఎక్కువ లౌకికవాద పార్టీగా కనపడడంలో ఆశ్చర్యం లేదు.

స్థానిక ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఆధిక్యత కనపరచిన కాంగ్రెస్‌కు ఈ పరిస్థితుల్లో అవలీలగా అధికారం దక్కాలి. కాని కాంగ్రెస్‌కు ప్రధాన సమస్య ముఠా రాజకీయాలు. ఏకే ఆంటోనీ, వాయలార్ రవి, ఊమెన్ చాందీ వంటి నేతలు ఇప్పుడు లేరు. సీనియర్ నేత రమేశ్ చెన్నితల, ప్రతిపక్ష నేత వీడీ సతీశన్, కె.సుధాకరన్, సన్నీజోసెఫ్‌తో పాటు పలువురు ముఖ్యమంత్రి పదవిని ఆశిస్తున్నారు. లోక్‌సభకు ఎన్నికైన కాంగ్రెస్ ఎంపీల్లో సగం మందికి పైగా అసెంబ్లీకి పోటీ చేసి ముఖ్యమంత్రి పదవినో, మంత్రిపదవినో దక్కించుకోవాలని చూస్తున్నారు. ముస్లిం లీగ్, కేరళ కాంగ్రెస్, ఆర్ఎస్‌పీలతో కూడా సీట్లు సర్దుబాటు చేసుకోవడం సులభం కాదు. బిహార్‌లో కాంగ్రెస్ వైఫల్యం తర్వాత కేరళలో ఆ పార్టీ తన అంతర్వై రుధ్యాలను పరిష్కరించుకుని సంఘటితంగా ఎంతమేరకు విజయం సాధించగలదో ఇప్పుడే చెప్పలేం. కేరళలో కాంగ్రెస్ గెలిస్తే ఆ పార్టీ చేతిలో తెలంగాణ, కర్ణాటక తర్వాత మరో రాష్ట్రం చేరుతుంది. దీనివల్ల పార్టీకి నైతిక స్థైర్యం పెరుగుతుందనడంలో సందేహం లేదు.

ఇప్పటికే పశ్చిమబెంగాల్, త్రిపురలో పూర్తిగా పట్టు కోల్పోయిన సీపీఐ(ఎం) తన చివరి కోట కేరళను సైతం కోల్పోయే అవకాశాలు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. 1970 తర్వాత మొదటిసారి దేశంలో ఎక్కడా ఉనికిలోలేని దుస్థితిని ఈ వామపక్షం ఎదుర్కొంటోంది. ఆ పార్టీ సంస్థాగత సామర్థ్యాన్ని, జాతీయ ఆవశ్యకతను ఇది ప్రశ్నార్థకం చేయనున్నది. బీజేపీ వ్యూహాత్మకంగా దక్షిణ, కేంద్ర ప్రాంతాల్లోని హిందూ మెజారిటీ ప్రాంతాల్లో వ్యాప్తి చెందడం మరో కీలక పరిణామం. తిరువనంతపురం, పలక్కాడ్, త్రిసూర్‌లలో పట్టణ హిందూ ఓటర్లు బీజేపీ వైపు మళ్లడమే ఇందుకు నిదర్శనం. దేశంలో బీజేపీయేతర ప్రత్యామ్నాయాన్ని ఏర్పాటు చేయడంలో అన్నిరకాల వామపక్షాల పాత్ర క్షీణిస్తోంది. 'పోనీ దేశంలో ఉన్న రకరకాల వామపక్షాలన్నీ ఏకమై ఒక బలమైన శక్తిగా ఏర్పడొచ్చు కదా' అని సీపీఐ నేత నారాయణను అడిగితే 'సీపీఐ(ఎం) మూర్ఖత్వమే అందుకు అడ్డు' అని ఆయన జవాబిచ్చారు! ప్రాంతీయ పార్టీలు ముక్కలు ముక్కలు కావడం, ప్రత్యామ్నాయ శక్తులన్నీ సంఘటితం కాక పోవడమే బీజేపీకి శ్రీరామరక్ష!

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

వస్త్రధారణలో మహిళా స్వేచ్ఛ: హక్కులు, హద్దులు

సమాజ జీవితాన్ని ప్రభావితం చేసే ఏదైనా ఒక అంశంపై అనుకూల, ప్రతికూల వాదనలు రెండూ ఉంటాయి. ఈ సత్యం తెలిసినందునే, సమకాలీన సమస్యలను సౌమ్యంగానూ, నిష్పాక్షికంగానూ, మృదు హాస్యంతో చర్చించిన 18వ శతాబ్ది ఆంగ్ల రచయితలు జోసెఫ్ ఎడిసన్, రిచర్డ్ స్టీల్ సృష్టించిన కాల్పనిక పాత్ర సర్ రోజర్ డి కవర్లీ 'రెండు వైపులా చాలా చెప్పవచ్చు' అని వ్యాఖ్యానిస్తుంది. ఒక సమస్యను పాఠకులు భిన్న దృక్కోణాలతో చూసే వెసులుబాటు కల్పిస్తూ పల్లెటూరి పెద్ద మనిషి అయిన సర్ రోజర్ ఒక సున్నితమైన విమర్శ సమకూర్చాడు. ఆంగ్లేయుల సహజ వివేకానికి నిదర్శనమైన ఈ తీర్పులేని దృక్పథం (Non– judgmental view– ఆలోచనలు, భావాలు, పరిస్థితులను మంచి, చెడు ముద్రవేయకుండా గమనించడం, వ్యక్తిగత అభిప్రాయాలను పక్కన పెట్టి వాస్తవాలను పరిశీలించడం, తక్షణ విమర్శ లేదా ముగింపు లేకుండా ఇతరుల దృక్పథాలను అనుమతించడం) ప్రస్తుతం మన సామాజిక మాధ్యమాలలో, వస్త్రధారణలో స్త్రీ స్వేచ్ఛపై కొనసాగుతున్న రభసకు కూడా వర్తిస్తుంది.

బహిరంగ ప్రదేశాల్లో సినీ హీరోయిన్లపై కొందరు అనుచితంగా ప్రవర్తించిన అంశంపై ఇటీవల ఒక సినీ నటుడు ప్రతిస్పందిస్తూ... బహిరంగ సభలు, కార్యక్రమాలలో పాల్గొనే నటీమణులు అభిమానుల మితిమీరిన అల్లరి ప్రవర్తనల మూలంగా ఎటువంటి ఇబ్బందులపాలు కాకుండా ఉండేందుకు గౌరవప్రదమైన రీతిలో, యుక్తమైన వస్త్రధారణతో రావడం మంచిదని వ్యాఖ్యానించాడు. ఇది నిరపాయకరమైన మాట కనుకనే చాలా మంది ఆ నటుడి సలహాను మెచ్చు కున్నారు. అయితే ఆ సూచన చేయడంలో ఆయన మర్యాదగాలేని రెండు మాటలను వాడటంతో, తన తప్పును అంగీకరిస్తూ ఆ తరువాత తెలంగాణ మహిళా కమిషన్‌కు క్షమాపణలు చెప్పారు.

తెలుగు టీవీ యాంకర్ ఒకరు తన అర్ధనగ్న చిత్రాలను సామాజిక మాధ్య మాలలో పోస్ట్ చేయడంపై వస్తున్న విమర్శలకు ప్రతిస్పందిస్తూ, ఆ చిత్రాలు తన వ్యక్తిగత స్వేచ్ఛకు తార్కాణాలంటూ వ్యాఖ్యానించడం సంచలనం సృష్టించింది. ఆమె వైఖరిని తీవ్రంగా ఖండించిన పలువురు స్త్రీ వాదుల అభిప్రా యాలకు టీవీ చానెల్స్ అమిత ప్రాధాన్యమిస్తూ వాటిని ప్రసారం చేశాయి. ఆ యాంకర్ అర్ధనగ్న చిత్రాలను పదేపదే తెరపై చూపిస్తూ ఆమె వ్యాఖ్యలను, వాటిపై ప్రతిస్పందనలను మరింత సంచలనశీలం చేశాయి. మనస్తాపం చెందిన ఆ యాంకర్, క్రిమినల్ కేసు దాఖలు చేశారు. భారతీయ న్యాయ సంహిత (ఇండియన్ పీనల్ కోడ్), ఐటీ చట్టం కింద సైబరాబాద్ పోలీసులు ఎఫ్ఐఆర్ జారీ చేశారు.

19వ శతాబ్ది బ్రిటిష్ పాత్రికేయ ప్రముఖుడు ఎ.జి.గార్డినర్ తన సుప్రసిద్ధ వ్యాసం 'On the Rule of the Road'లో స్వేచ్ఛను సంపూర్ణ వ్యక్తిగత స్వేచ్ఛగా కాకుండా పరస్పర సర్దుబాటు అవసరమయ్యే సామాజిక ఒప్పందంగా విపులీకరించారు. వ్యక్తిగత స్వేచ్ఛ తప్పనిసరిగా ఇతరుల హక్కులను గౌరవించి తీరాలని, సమష్టి శ్రేయస్సుకోసం వ్యక్తిగత ఆకాంక్షలను అదుపు చేసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. ఈ వివేకశీల అభిప్రాయాన్ని ప్రజాస్వామ్య సమాజాలు అన్నీ అంగీకరించాయి. మరింత స్పష్టంగా చెప్పాలంటే వ్యక్తిగత స్వేచ్ఛలు అపరిమితమై నవి కావు, షరతులు లేనివీ కావు. హక్కులు సైతం సంపూర్ణమూ, నిర పేక్షమైనవి కావు. అవి అనివార్యంగా ఇతరుల హక్కులతో ముడివడి ఉంటాయి. మహిళల గౌరవం, ప్రజానైతికత, వాక్ స్వాతంత్ర్యం, భావప్రకటనా స్వేచ్ఛలకు భారతీయ న్యాయవ్యవస్థ సమతూకంలో ప్రాధాన్యమిస్తోంది. మహిళా సమస్యలకు సంబంధించిన వివిధ కేసులలో సుప్రీంకోర్టు నిర్ణయాలు మనకొక ఆవశ్యక అంతర్దృష్టినిస్తున్నాయి. సమాజ జీవితంలో మహిళల సంపూర్ణ, సురక్షితమైన భాగస్వామ్యాన్ని సర్వోన్నత న్యాయస్థానం నిర్ణయాలు నిర్ధారిస్తున్నాయి.

> వ్యక్తిగత స్వేచ్ఛలు అపరిమితమైనవి కావు, షరతులు లేనివీ కావు. హక్కులు సైతం సంపూర్ణమూ, నిరపేక్షమైనవి కావు. అవి అనివార్యంగా ఇతరుల హక్కులతో ముడివడి ఉంటాయి.



'బాండిట్ క్వీన్' సినిమాలో పూలన్‌దేవి పాత్రను ఎటువంటి ఆచ్ఛాదనా లేని స్థితిలో చూపించడం సబబేనని బాబీ ఆర్ట్ ఇంటర్నేషనల్ వెర్సస్ ఓమ్‌పాల్ సింగ్ కేసులో సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. ఇది అణగారిన వర్గాల మహిళల కఠోర జీవనవాస్తవాలను చూపించడంగా భావించింది. భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ కింద ఆ సినిమాపై అభ్యంతరాలను తోసిపుచ్చింది. మహిళలను నగ్నంగా చూపించడం అన్ని సందర్భాలలోనూ అసభ్యతకు కిందకు రాదని, ముఖ్యంగా సామాజిక దౌష్ట్యాలను దృష్టాంతీకరించడంలో అలా చూపించవలసివస్తే అది అసభ్యకరమైన చిత్రణ కాదని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. భారతమాతను నగ్న మూర్తిగా చిత్రించడం ప్రజాసభ్యత (పబ్లిక్ డీసెన్సీ) ప్రమాణాలను ఉల్లంఘించడం లేదా మహిళల గౌరవాన్ని కించపరచడం కాదని, ఎమ్.ఎఫ్.హుస్సేన్ వెర్సస్ రాజ్ కుమార్ కేసు (2008)లో సుప్రీం కోర్టు అభిప్రాయపడింది. హుస్సేన్ కళా సృజనలో అభ్యంతరకరమైన దేమీ లేదని పేర్కొంది.

రంజిత్ ఉదేషి వెర్సస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర కేసు తీర్పు మన దేశంలో అశ్లీల చట్టాలను అర్థం చేసుకునేందుకు తగు ప్రాతిపదికలను నెలకొల్పింది. ఆంగ్ల నవలా రచయిత డి.హెచ్.లారెన్స్ నవల 'లేడీ చాటర్లీస్ లవర్' విక్రయాలకు సంబంధించిన కేసు ఇది. ఐపీసీ 292 కింద ఆ నవలను అశ్లీల రచనగా భావించవచ్చని ఆ తీర్పు పేర్కొంది. సుప్రీంకోర్టు ఆ కేసుకు హిక్లిన్ పరీక్ష (అత్యంత దుర్బల మనస్కులపై ప్రభావ పరిశీలన) ఉపయోగించి నగ్నత్వ వర్ణన, చిత్రణతో ప్రమేయమున్న కళా సృజన అనైతిక ప్రభావాలను నెరపిన పక్షంలో అది అశ్లీలమైనది అవుతుందని స్పష్టం చేస్తూ తీర్పు వెలువరించింది. ఈ తీర్పు 'మహిళల అసభ్య చిత్రణ (నిషేధ) చట్టం–1986 (ఐఆర్‌డబ్ల్యూఏ)కు న్యాయప్రాతిపదిక నేర్పాటుచేసింది.

ఒక మ్యాగజైన్‌లో ప్రచురితమైన అర్ధనగ్న ఛాయా చిత్రాన్ని సమకాలీన సమాజ ప్రమాణాలకు, సందర్భానికి అనుగుణంగా మూల్యాంకనం చేయాలని అవీక్ సర్కార్ వెర్సస్ స్టేట్ ఆఫ్ వెస్ట్ బెంగాల్ కేసులో సుప్రీంకోర్టు అభిప్రాయ పడింది. సుప్రీంకోర్టు వ్యక్తం చేసిన ఈ అభిప్రాయం కళాసృజన, భావ వ్యక్తీ కరణలో మహిళలకు గౌరభంగం కలిగించడాన్ని నిరోధించేందుకు ఉద్దేశించిన పైన పేర్కొన్న చట్టంతో ఏకీభవిస్తుంది. అసభ్యకర చిత్రీకరణ అంటే ఏమిటో ఈ చట్టం నిర్వచించింది: 'స్త్రీ రూపాన్ని లేదా శరీరాన్ని అవమానకరంగా, దిగజారుడుగా లేదా ప్రజానైతికతకు హాని కలిగించే విధంగా ప్రదర్శించడం'.

అశ్లీలతను అమెరికా చట్టం అభ్యంతరకర, అనుచిత, అవమానకరమైనదిగా ప్రస్తావిస్తున్నది. ఇది తరచూ లైంగికత, నగ్నత్వంతో ముడివడి ఉంటుంది. ఏదైనా ఒక కళాకృతి లేదా సాహిత్యరచన అశ్లీలమైనది అని నిర్ధారించేందుకు మిల్లర్ టెస్ట్ ఉపయోగిస్తారు. అశ్లీలమైనది అని నిర్ధారణ అయితే అమెరికా రాజ్యాంగ మొదటి సవరణ కింద ఆ అశ్లీలతకు కారకులైనవారికి రక్షణ ఉండదు.

వ్యక్తిగత స్వేచ్ఛ పేరిట సామాజిక మాధ్యమాలలో అర్ధనగ్న చిత్రాలను పోస్ట్ చేయడం, మరులు గొలిపే ఆ చిత్రాలను టీవీ చానెల్స్ పదేపదే ప్రసారం చేయడం చట్టబద్ధంగా సమర్థించలేనివి. ఈ విషయంలో కేసు దాఖలు చేసిన వారు, ఆ కేసులో ప్రతివాదిగా ఉన్నవారు ఇరువురూ ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టాలను ఉల్లంఘించినవారే. వస్త్రధారణలో స్త్రీ స్వేచ్ఛ విషయమై రేగిన రభసతో ప్రమేయమున్న ఇరుపక్షాల తరఫున ఎంతైనా చెప్పవచ్చు.

■ ఇ.దామోదర్
రిటైర్డ్ ఐపీఎస్

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్: editpage@andhrajyothy.com





మారిన అనుబంధ జీవనచక్రం

- స్త్రీశక్తికి చేదోడుగా ఉచిత బస్సు ప్రయాణం



- వేడుకలకు, శుభకార్యాలకు రెట్టింపైన మహిళల హాజరు
- మునుపెన్నడూ లేని స్థాయిలో సంక్రాంతి సంబరం
- దేవాలయాలు, పుణ్యక్షేత్రాల్లోనూ పెరిగిన రద్దీ

8



శుభలగ్నం

- ఇది వివాహ నామ సంవత్సరం
- ఫిబ్రవరి 19 నుంచి అద్భుతమైన ముహూర్తాలు
- పెళ్లిళ్లతో ఒక్కటి కానున్న కొత్త జంటలు



గుంటూరు సిటీ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పెళ్లి బాజాలు మోగనున్నాయి. కల్యాణ మండపాలు కళకళలాడనున్నాయి. కోటిఆశలతో కొత్త జంటలు మూడు ముళ్ల బంధంలోకి అడుగు పెట్టనున్నాయి. 2026 వివాహ నామ సంవత్సరంగా నిలవనుంది. ఈ సంవత్సరంలో వివాహాలకు అనుకూలమైన శుభ ముహూర్తాలు అధికంగా ఉన్నట్లు పండితులు చెబుతున్నారు. శుక్ర మౌఢ్యమి కారణంగా ఈ నెల 19 నుంచి ఫిబ్రవరి 13 వరకు వివాహ ముహూర్తాలు లేవు. మౌఢ్యమి అమావాస్య అనంతరం ఫిబ్రవరి 19 నుంచి పెళ్లిళ్లకు గ్రీన్ (మిగతా 8వ పేజీలో)

ఇది వివాహాల సంవత్సరం

ఒక రకంగా చెప్పాలంటే ఇది వివాహ సంవత్సరం. ఫిబ్రవరి మాసం రెండో భాగం నుంచి ఏడాది పొడవునా శుభ ముహూర్తాలున్నాయి. అవి కూడా చాలా మంచి లగ్నంతో ఉన్నాయి. ఈ సమయాల్లో వివాహం జరిగితే ఆ ఇంట మూడు పువ్వులు ఆరు కాయలు అన్నట్లు ఉంటుంది. ఇప్పటికే చాలా మంది శుభ ముహూర్తం కోసం ఎదురు చూస్తున్నారు. వాళ్లకి ఇది చక్కని అవకాశం.




- జంధ్యాల వెంకట రామ లింగేశ్వర శాస్త్రి, జ్యోతిష, వాస్తు పండితులు, గుంటూరు

రైస్ డాన్!

- ఎమ్మెల్యేల ఆదేశాలు సైతం బేఖాతరు
- డాన్ మంత్రాంగం.. యంత్రాంగం సహకారం
- రేషన్ షాపు నుంచి 50 శాతం బియ్యం చేరాలని హుకుం
- వాహన డ్రైవర్లపై కేసులతో సరి..



చెలరేగిపోతున్న బియ్యం మాఫియా!



పేదల బియ్యాన్ని మాఫియా గద్దలు యథేచ్ఛగా తన్నుకు పోతున్నాయి. గుంటూరు కేంద్రంగా పనిచేస్తున్న రేషన్ మాఫియా మొత్తం ఉమ్మడి జిల్లాపై ఏక ఛత్రాధిపత్యం చెలాయిస్తోంది. జిల్లాలో ఎక్కడ బియ్యం సేకరించాలన్నా, అది ఎక్కడి నుంచి ఎక్కడికి చేరాలన్నా అన్నీ మాఫియా డాన్ కనుసన్నల్లోనే నడుస్తున్నాయంటే ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు. ఇంత జరుగుతున్నా అధికారులు ఏమీ జరగనట్లు మిన్నకుండడం మాత్రం పలు అనుమానాలకు తావిస్తోంది. గుంటూరు నగరం కేంద్రంగా పనిచేస్తున్న రేషన్ మాఫియా డాన్‌ను ఏ ప్రభుత్వమూ ఏమీ చేయలేకపోతోంది.

గుంటూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో అప్పటి అధికార పార్టీ అండతో అడ్డగోలు అక్రమాలకు పాల్పడిన రైస్‌డాన్.. కూటమి ప్రభుత్వంలో నూ చక్రం తిప్పుతున్నాడు. పలువురు నేతల తోడ్పాటు, అధికారుల సహకారంతో గతాన్ని మించిన స్థాయిలో అ క్రమాలకు పాల్పడుతున్నాడు. అతడి ఆగడాలు శృతి మించడంతో పలు చోట్ల ఎమ్మెల్యేలే రంగంలోకి దిగాల్సి వస్తోంది. అక్రమా లు అడ్డుకోవడానికి మూడు నెలలుగా శతవిధాలా ప్రయత్నిస్తున్నా.. మాఫియా డాన్ వారి ఆజ్ఞలను, హెచ్చరికలను కూడా లెక్క చేయకుండా అక్రమాలు సాగిస్తున్నాడు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే సాక్షాత్తూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా.. ఎలాంటి మార్పు లేకపోవడం పరిస్థితికి అద్దం పడుతోంది. పొన్నూరు నియోజకవర్గంలో నూ అక్కడి ఎమ్మెల్యే అక్రమాలను ప్రతిఘటిస్తున్నారు. ఈ నియోజకవర్గంలో ఇటీవలి (మిగతా 8వ పేజీలో)

అధికారుల సహకారం?

రేషన్ మాఫియా డాన్ జిల్లాలోని కిందిస్థాయి ఉద్యోగులు మొదలు ఉన్నతస్థాయి యంత్రాంగం వరకూ అందరినీ తన గుప్పెట్లో పెట్టుకుని వ్యవహారం నడిపిస్తున్నాడు. గుంటూరు తూర్పు నియోజకవర్గం ప్రధాన స్థావరంగా చేసుకున్న డాన్ అక్కడి నుంచే పావులు కదుపుతున్నాడు. ఆ కారణంగా అధికారులు ఆ వైపు కూడా చూడడం లేదు. ఒకవేళ అక్కడ కేసులు నమోదు చేయాల్సి వస్తే వాహన డ్రైవర్లపై కేసులు నమోదు చేస్తున్నారు తప్ప మాఫియా పెద్దల జోలికి పోవడం లేదు. అదే సమయంలో మాఫియా డాన్‌తో సంబంధం లేని కేసుల్లో నేరుగా అక్రమార్కులపైనే కేసులు నమోదు చేస్తున్నారన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ ద్వంద్వ ప్రమాణాల కారణంగా గుంటూరు జిల్లాలో మాఫియా డాన్‌కు జిల్లాలో ఎదురేలేకుండా పోయింది.

నేటి నుంచి జేఈఈ మెయిన్స్

గుంటూరు (విద్య) జనవరి 20(ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్‌కు ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. బుధవారం నుంచి ఈ నెల 29 వరకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ) నిర్వహించ నుంది. ఉమ్మడి జిల్లాలో 15 వేల మందికి పైగా విద్యార్థులు హాజరుకానున్నారు. పరీక్షల నిర్వహణకు గుంటూరు సమీపం లోని ఇంజనీరింగ్ కళాశాలలు, ప్రైవేట్ కంప్యూటర్ సెంటర్స్‌లో ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే అభ్యర్థులు అడ్మిట్ కార్డులు ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకున్నారు. పేపర్ 1 ప్రవేశ పరీక్ష ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో షిఫ్ట్ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరగ నుంది. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు కనీసం రెండు గంటల ముందుగా చేరుకోవాలి. నిర్దేశించిన డ్రెస్ కోడ్ పాటించాలి. ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురాకూడదని హాల్ టికెట్లలో స్పష్టం చేశారు. పాస్‌పోర్టు సైజు ఫొటో, ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా గుర్తింపు కార్డు తెచ్చుకోవాలి. విద్యార్థులు వాటర్ బాటిల్, బ్లూ, బ్లాక్ కలర్ బాల్ పాయింట్ పెన్ను తీసుకు వెళ్లాలి. ఎన్‌టీఏ నిబంధనలు పాటించుకుంటే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని సంబంధిత అధికారులు స్పష్టం చేశారు.

అధికారికంగా వాసవిమాత ఆత్మార్పణ దినోత్సవం

- పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి మనోహర్
- పొన్నూరు కలశ యాత్రలో ఎమ్మెల్యే ధూళిపాళ్ల

తెనాలి అర్బన్, పొన్నూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం మంగళవారం భక్తి శ్రద్ధలతో జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం శ్రీవాసవీ అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని ఆదేశించింది. ఈ క్రమంలో తెనాలి బోసురోడ్డులోని ఆలయానికి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారిక లాంఛనాలతో హాజరయ్యి.. కన్యకా పరమేశ్వరి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అమ్మవారి ఆత్మార్పణ సమాజానికి స్ఫూర్తి కలిగించేలా ఉందని మంత్రి పేర్కొన్నారు. ఆలయ కమిటీ పాలక వర్గ ప్రతినిధి మునగాల మోహనశ్యాంప్రసాద్, ప్రముఖులు పాల్గొన్నారు.

పొన్నూరులో కలశయాత్ర

పొన్నూరు పట్టణంలో మహిళలు భారీగా కలశయాత్ర నిర్వహించారు. శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం వరకు మహిళలతో కలిసి స్థానిక ఎమ్మెల్యే నరేంద్రకుమార్ కలశ యాత్రలో పాల్గొన్నారు. అమ్మవారికి మంత్ర జలాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక పూజలో ఎమ్మెల్యే ధూళిపాళ్ల అమ్మవారికి భక్తిశ్రద్ధలతో సారె సమర్పించారు.



పట్టువస్త్రాలు తీసుకువెళుతున్న మంత్రి మనోహర్

పకడ్బందీగా ఇంటర్మీడియెట్ పరీక్షలు

- కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా

గుంటూరు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్మీడియెట్ పరీక్షల నిర్వహణకు పటిష్ట ప్రణాళిక ప్రకారం అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఇంటర్మీడియెట్ పరీక్షల సన్నద్ధత, నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేసి, పరీక్ష కేంద్రాల్లో అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. విద్యార్థుల అవసరం మేరకు బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. సమస్యాత్మక పరీక్ష కేంద్రాలు వద్ద ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఇంటర్మీడియట్ విద్య ఆర్ఐవో జి.సునీత మాట్లాడుతూ.. ఫిబ్రవరి 23 నుంచి మార్చి 24వ తేదీ వరకు జరగనున్న పరీక్షలకు.. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం, వొకేషనల్ విద్యార్థులు మొత్తం 68,951 మంది 87 పరీక్ష కేంద్రాలకు హాజరుకానున్నట్లు తెలిపారు. ప్రాక్టికల్స్ వచ్చే నెల ఒకటి నుంచి 10వ తేదీ వరకు 126 పరీక్ష కేంద్రాలు, వొకేషనల్ ప్రాక్టికల్స్ ఈ నెల 27 నుంచి ఫిబ్రవరి 10వ తేదీ వరకు 17 పరీక్ష కేంద్రాల్లో జరగనున్నాయని తెలిపారు. ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్‌కు 27,960, వొకేషనల్ ప్రాక్టికల్స్‌కు 2,292 మంది విద్యార్థులు హాజరుకానున్నారని చెప్పారు. ఈ నెల 21న నైతిక విలువలు, 23న పర్యావరణం సబ్జెక్టుల పరీక్షలు జరుగుతా యని తెలిపారు. ఈ సమావేశంలో ఈస్ట్ డీఎస్పీ అరవింద్, ఇంటర్మీడియెట్ ఆర్జేడీ పద్మ, విద్యుత్‌శాఖ ఈఈ నాగేశ్వరరావు, ఆర్టీసీ డిపో మేనేజర్ రామకృష్ణ ,అధికారులు పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి మనోహర్

తెనాలిలో రూ.26 కోట్లతో ఆయుష్ హాస్పటల్

మంత్రి నాదెండ్ల మనోహర్

తెనాలి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): తెనాలిలో కొత్తగా ఆయుష్ హాస్పటల్ నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నట్లు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. మంగళవారం తెనాలిలోని పాత ప్రభుత్వ వైద్యశాలలో ఖాళీ స్థలాన్ని మున్సిపల్ కమిషనర్ అప్పలనాయుడు, తహసీల్దార్ గోపాలకృష్ణ, ఇతర శాఖల అధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు. పట్టణంలో ఖాళీ స్థలాలు లేకపోవడంతో.. పాత ప్రభుత్వ వైద్యశాల ప్రాంగణంలోనే ఆయుష్ హాస్పటల్ నిర్మాణానికి నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి చెప్పారు. కేంద్రం రాష్ట్రానికి ఐదు ఆయుష్ హాస్పటల్స్ మంజూరు చేస్తే దానిలో ఒకటి తెనాలికి దక్కడం సంతోషంగా ఉందన్నారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌కు, కేంద్ర ప్రభుత్వ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. హాస్పిటల్‌కు రూ.26 కోట్ల నిధులు కేంద్రమే అందిస్తుందని, దీంతో 50 పడకలతో రోగులు వైద్యసేవలు పొందేలా భవన నిర్మాణాలు ఉంటాయన్నారు. సాధ్యమైనంత త్వరగా వైద్యసేవలు అందుబాటులోకి తెస్తామని మంత్రి వెల్లడించారు.

సకాలంలో ఆస్తి పన్ను చెల్లించండి

కమిషనర్ కె.మయూర్ అశోక్

గుంటూరు కార్పొరేషన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆస్తి పన్ను సకాలంలో చెల్లించాలని కమిషనర్ కె.మయూర్ అశోక్ నగర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందన మార్చి వరకు వేచి చూడకుండా.. ఆస్తి, నీటి, ఖాళీ స్థల పన్నులు, ట్రేడ్ లైసెన్స్ ఫీజు చెల్లించాలని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. జీఎంసీ ప్రధాన కార్యాలయం, సర్కిల్ కార్యాలయాల్లోని క్యాష్ కౌంటర్లలో పన్ను చెల్లించవచ్చని తెలిపారు. ఈ నెల ఒకటి నుంచి వడ్డీ నమోదయిందని పేర్కొన్నారు. అవసరమైతే సెలవు రోజుల్లో కూడా కౌంటర్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. సీడీఎంఏ.ఏపీ. జీవోవి. ఇన్ వెబ్‌సైట్, పురమిత్ర యాప్ ద్వారా కూడా చెల్లింపులు చేయవచ్చన్నారు.

గణతంత్ర వేడుకల ఏర్పాట్ల పరిశీలన

తుళ్లూరు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలోని రాయపూడిలో గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం ఏర్పా ట్లు చేస్తోంది. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ భవన సముదాయాల నుంచి హైకోర్టు వెళ్లే మార్గంలో జరుగుతున్న వేడుకల ఏర్పా ట్లను సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి జె.శ్యామలరావు, ఐజీ రాజకుమారి, గుం టూరు కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా, ఎస్పీ వకుల్ జిందాల్, ఐ అండ్ పీఆర్ డైరెక్టర్ కేఎస్ విశ్వనాథన్ తదితరులు మంగళవారం పరిశీలించారు. గవర్నర్, సీఎం, మంత్రులు విచ్చేసే మార్గాలు, కూర్చునే ప్రదేశాలు, పరేడ్ నిర్వహించే ప్రక్రియ తదితర అంశాలను విపులంగా పరిశీలించారు. అనంతరం జరిగిన సమావేశంలో శ్యామలరావు మాట్లాడు తూ ఏర్పాట్లలో ఎటువంటి లోపాలు ఉం డకూడదని అధికా రులకు స్పష్టం చేశారు. అతిథులు వేదిక వద్దకు వచ్చే మార్గాలు, పార్కింగ్ ఏర్పాట్లు పక్కాగా ఉండాలని ఆదేశించారు. తాగునీరు సరఫరా, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సా రించాలన్నారు. బందోబస్తు, ట్రాఫిక్ నిర్వహణకు 900 మంది పోలీసు సిబ్బందిని కేటాయించామని ఎస్పీ తెలిపారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న సాధారణ పరిపాలన ముఖ్య కార్యదర్శి జె. శ్యామలరావు, కలెక్టర్ అన్సారియా, ఎస్పీ వకుల్ జిందాల్

బైబిల్ మిషన్ మహోత్సవాలకు **భారీ ఏర్పాట్లు**

- ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు నిర్వహణ
- కన్వీనర్, ప్రెసిడెంట్ రెవరెండ్ శామ్యూల్ కిరణ్

6

రేపు కోటప్పకొండకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

కాసుల చక్కెరకేళి

- రూ.400 నుంచి రూ.500కు చేరిన ధర
- ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు

8

గుంటూరుకు అమృత్ భారత్ రైలు

● ప్రతి మంగళవారం చర్లపల్లి నుంచి వీక్లీ సర్వీసు
● సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, బాపట్లలో హాల్టింగ్‌లు



అమృత్ భారత్ రైలు

గుంటూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): అమృత్ భారత్ రైలును గుంటూరు మీదుగా రైల్వేబోర్డు మంజూరు చేసింది. ఈ కొత్త రైలు వారానికి ఒకరోజు గుంటూరు మీదుగా తిరువనంతపురానికి రాకపోకలు సాగించనుంది. ప్రస్తుతం గుంటూరు మీదుగా సికింద్రాబాద్- తిరువనంతపురం శబరి ఎక్స్‌ప్రెస్ రైలు డైలీ సర్వీసు అందుబాటులో ఉంది. ఈ రైలుకు విపరీతమైన డిమాండ్ ఉండడంతో మరో రైలును ప్రవేశపెట్టాలని ఎప్పటినుంచో ప్రయాణికులు రైల్వేశాఖను కోరుతున్నారు. ఎట్టకేలకు ప్రయాణికుల మొరను రైల్వేబోర్డు ఆలకించి అమృత్ భారత్ రైలును మంజూరు చేసింది. ప్రతి మంగళవారం తిరిగే ఈ రైలుకు సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, బాపట్లలో హాల్టింగ్‌లు కల్పించారు.

బైబిల్ మిషన్ మహోత్సవాలకు భారీ ఏర్పాట్లు

● ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు నిర్వహణ
● కన్వీనర్, ప్రెసిడెంట్ రెవరెండ్ శామ్యూల్ కిరణ్



ఏర్పాటు చేసిన ప్రవేశ ద్వారం

పెదకాకాని, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): బైబిల్ మిషన్ 88వ మహోత్సవాల నిర్వహణకు భారీ ఏర్పాట్లు చేసినట్లు బైబిల్ మిషన్ అధ్యక్షుడు, మహోత్సవాల కన్వీనర్ రెవరెండ్ జె.శామ్యూల్ కిరణ్ తెలిపారు. బైబిల్ మిషన్ సభలకు హాజరుకానున్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సదుపాయాలు కల్పించినట్లు చెప్పారు. ఇరు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్, కేరళ, బిహార్, పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాలతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన భక్తులు మహోత్సవానికి హాజరవుతారని తెలిపారు. సింగపూర్, మలేసియా, అమెరికా, దుబాయ్ నుంచి కూడా వస్తారని చెప్పారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట బైబిల్ మిషన్ ప్రాంగణంలో ఈ నెల 25వ తేదీ నుంచి 27 వరకు మహోత్సవాలు జరుగుతాయన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు తిరిగి సాయంత్రం 6:00 నుంచి రాత్రి 10 గంటల వరకు దైవ వర్తమానాలు అందిస్తారని శామ్యూల్ కిరణ్ పేర్కొన్నారు.

పంటకాల్వలో పడి వృద్ధురాలి మృతి



మండే భూలక్ష్మీ (ఫైల్)

పిట్టలవానిపాలెం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆరమండ పంటకాల్వలో పడి మంగళవారం ఓ వృద్ధురాలు మృతి చెందింది. మండలంలోని చందోలు గ్రామపంచాయతీకి చెందిన మండే భూలక్ష్మీ (70) కాల్వలో పడి మృతి చెందిందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చందోలు ఎస్సై మర్రి వెంకటశివకుమార్ తెలిపారు.

రాయలసీమలోనూ ఎడ్ల పందేలు

● చిలకలూరిపేట స్ఫూర్తితో నిర్వహణ ● మంత్రి సవిత

చిలకలూరిపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట స్ఫూర్తితో ఇకపై రాయలసీమలోనూ ఎడ్ల పందేలు నిర్వహిస్తామని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత మంగళవారం అన్నారు. చిలకలూరిపేటలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి ఎడ్ల పందేలలో మూడో రోజు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేసి మాట్లాడారు. రాయలసీమలా పల్నాడు ప్రాంతాన్ని హార్టికల్చర్ హబ్‌గా మార్చాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పమని అన్నారు. రైలు, రోడ్డు, ఓడరేవుల కనెక్టివిటీతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ, గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎడ్ల పందేలను రద్దు చేస్తే, ప్రత్తిపాటి పుల్లారావు చొరవతో చంద్రబాబు నాయుడు వాటిని పునరుద్ధరించారని గుర్తు చేశారు. అనంతరం అతిథులను ప్రత్తిపాటి పుల్లారావు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జీడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, ప్రత్తిపాటి ఫౌండేషన్ సభ్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

● రెండు పళ్ళ విభాగంలో దొండపాడు ఎడ్లు విజయం

రెండు పళ్ళ విభాగంలో దొండపాడుకు చెందిన యర్రం రాజశేఖర్, యశ్వంత్ ఎడ్ల జత 4,095 అడుగుల 4 అంగుళాల దూరం బండను లాగి ప్రథమ స్థానంలో నిలిచింది. వీరికి నగదు బహుమతిగా రూ.35 వేలు అందచేశారు. చుండూరు మండలం వేటపాలెంకు చెందిన అత్తోట శిరీషా చౌదరి, శివకృష్ణ చౌదరికి చెందిన ఎడ్ల జత 4,082 అడుగుల 10 అంగుళాల దూరం బండ లాగి ద్వితీయ స్థానంలో నిలిచింది. శ్రీశైలం కమ్మ సత్రం కోశాధికారి ముత్తినేని వెంకటేశ్వర్లు నగదు బహుమతులు సమకూర్చారు. నాలుగు పళ్ళ విభాగంలో మేళ్లచెరువుకు చెందిన గోవర్ధన రెడ్డి, ప్రవళి రెడ్డికి చెందిన ఎడ్ల జాత 3,966 అడుగుల 4 అంగుళాల దూరం బండనులాగి ప్రథమ స్థానంలో నిలిచి రూ.40 వేల నగదు బహుమతి గెలుచుకుంది. జె.పంగులూరుకు చెందిన చిలుకూరి నాగేశ్వరరావు, వెంకటగిరికి చెందిన శశాంక శ్రేయల ఎడ్ల జత 3,946 అడుగుల 6 అంగుళాల దూరం బండను లాగి ద్వితీయ స్థానంలో నిలిచింది. వీరికి కౌన్సిలర్ జాలాది సుబ్బారావు నగదు బహుమతులు సమకూర్చారు. ఆరు పళ్ళ విభాగంలో పల్నాడు జిల్లా కేసానుపల్లికి చెందిన నెల్లూరు రామకోటయ్య, యనమలకుదురుకు చెందిన కావ్య, మధుకు చెందిన ఎడ్ల జత 3,900 దూరం బండను లాగి ప్రథమ స్థానంలో నిలిచింది. వీరికి నగదు బహుమతిగా రూ.45 వేలు అందచేశారు. ప్రత్తిపాడుకు చెందిన అంజయ్య చౌదరి, రావిపాడుకు చెందిన మనోజ్ కుమార్‌కు చెందిన ఎడ్ల జతలు 3,300 అడుగుల దూరం బండను లాగి ద్వితీయ స్థానంలో నిలిచింది. వీరికి స్థానిక డాక్టర్ వరలక్ష్మి నగదు బహుమతులు సమకూర్చారు.



పోటీలో పాల్గొన్న ఎడ్ల జతతో మంత్రి సవిత, చీఫ్ విప్ జీవీ, ఎమ్మెల్యే ప్రత్తిపాటి

పిన్నెల్లిలో రాజకీయ హత్య కాదు

● ఉనికి కాపాడుకునేందుకే జగన్ అనుచరుల రచ్చ ● టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య

పిడుగురాళ్ల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): జగన్ అతని అనుచరులు ఎన్నికలలో 11 సీట్లకే పరిమితమయ్యాక తమ ఉనికిని కాపాడుకునేందుకు ప్రతిచిన్న విషయానికి రాజకీయ రంగు పులుముతున్నారని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, జాతీయ ప్రధానకార్యదర్శి వర్ల రామయ్య మండిపడ్డారు. మంగళవారం పిడుగురాళ్ల ఆర్‌అండ్‌బీ బంగ్లాలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్ అతని బ్యాచ్‌కు ఏ విషయాలు దొరక్క, ప్రతి చిన్నదాన్ని పట్టుకొని రాజకీయ రంగు పులుముతున్నారన్నారు. పిన్నెల్లిలో గతవారం జరిగిన మందా సాల్మన్ హత్య ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిందే తప్ప రాజకీయ హత్య కాదని రామయ్య తెలిపారు. ఇది పోలీసుల దర్యాప్తులో తేలిందని చెప్పారు. ఈ హత్యకు రాజకీయ రంగు పులిమి కులాల మధ్య చిచ్చురేపేలా జగన్, కాసు మహేష్‌రెడ్డి, వైసీపీ నేతలు చేస్తున్న పిడి వాదానికి ఎక్కడా పొంతన లేదన్నారు. హత్య విషయంలో స్థానిక పోలీసులను కలవకుండా డీజీపీనే కలవాలని వైసీపీ నేతలు ఎందుకు ప్రయత్నిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. చంద్రబాబుకు మాదిగ...మాల... సామాజికవర్గాలు రెండు కళ్లలాంటివని అన్నారు. వారి అభివృద్ధికి ఆయన నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.

అప్పుడెందుకు మాట్లాడలేదు..

కరోనా సమయంలో మాస్క్ అడిగిన డాక్టర్ సుధాకర్‌ను రోడ్డుపై ఈడ్చుకుంటూ వెళ్లి చిత్రహింసలకు గురిచేశారని, మద్యం నాణ్యత లేదని మరో యువకు డిని, ఎస్సీ కాలనీ మీదుగా ఇసుక ట్రాక్టర్ వెళ్తుండటాన్ని ప్రశ్నించిన వరప్రసాద్ అనే దళిత యువకుడికి గుండు కొట్టించినప్పుడు జగన్ అతని బ్యాచ్ ఎందుకు మాట్లాడలేదని, దళితులపై వారికి అంత ప్రేముంటే అప్పుడు మాట్లాడకుండా ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన గొడవపై మాట్లాడటం చూస్తే హాస్యాస్పదంగా ఉందన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ సొంత నియోజకవర్గంలో ఒక మహిళను అత్యాచారం చేసి చంపేస్తే ఆయన ఎందుకు స్పందించలేదని అన్నారు. అమరావతి రాజధాని కోసం పోరాటం చేస్తున్న దళితు లను, మహిళలను బేడీలు వేసి రోడ్డుపై నడిపించింది జగన్ అని రామయ్య గుర్తుచేశారు. గురజాల నియోజకవర్గం అంబాపురంలో దోమతోటి విక్రమ్ హత్య పాశవికంగా పోలీసుల ప్రోద్బలంతో వైసీపీ నేతలు చేసినప్పుడు కాసు మహేష్‌రెడ్డి, వైసీపీ నేతలు ఎందుకు ఆ దళిత కుటుంబంపై ప్రేమ చూపలేదని ప్రశ్నించారు. ఈ సమావేశంలో పిల్లి చెన్నారావు, ఏఎంసీ ఛైర్మన్ వీరస్వామి, షేక్ బాబావలి, మందా డేవిడ్, సయ్యద్ అమీర్‌అలి, పాండురంగ శ్రీను, కనిగిరి శ్రీను, వడ్డవల్లి సాంబశివరావు, కామిశెట్టి రమేష్, షేక్ సైదా, వర్ల రత్నం, చిలుముల దుర్గారావు, వర్ల శ్రీను, శనగపూల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య తదితరులు

పశు ఔషధి విక్రయ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు

● కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా

గుంటూరు సిటీ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పశు ఔషధి విక్రయ కేంద్రాలు ఏర్పాటుకు నిర్దేశిత మార్గదర్శకాలు ప్రకారం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారి యా పశుసంవర్ధక శాఖ అధికారుల ను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన పశు ఔషధి కేంద్రాల ఏర్పాటుపై జిల్లాస్థాయి కమిటీ సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు సరసమైన ధరలకు నాణ్యత గల జనరిక్ మందులను అందించడం కోసం పశు ఔషధి విక్రయ కేంద్రాలను ప్రతి రెవెన్యూ డివిజన్‌లో ఏర్పాటు చేసేందుకు మార్గదర్శకాలు జారీ చేసిందన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న వారి నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ కేవీవీ సత్యనారాయణ స్పందిస్తూ.. సహకార సొసైటీలు, బీ ఫార్మసీ, డీ ఫార్మసీ డిగ్రీ కలిగిన వారు పశు ఔషధి విక్రయ కేంద్రాల ఏర్పాటుకు అర్హులని తెలిపారు. ప్రాథమికం గా గుంటూరు, తెనాలి రెవెన్యూ డివిజన్ పరిధిలో విక్రయ కేంద్రాల ఏర్పాటు చేయనున్నమని, కనీసం 120 చదరపు అడుగుల సొంత, అద్దె స్థలం ఉండాలని, డ్రగ్ సేల్ లైసెన్స్ కలిగిన ఫార్మసిస్ట్ రిజిస్ట్రేషన్ వివరాలు ఉండాలని చెప్పారు. సహకార శాఖ అధికారి వీరాచారి, డ్రగ్ కంట్రోలర్ లక్ష్మణ్, ఏడీ డాక్టర్ మోహనరావు పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన ఆర్వోబీ పనులు : మేయర్



శంకర్ విలాస్ ఆర్వోబీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మేయర్ రవీంద్ర, కమిషనర్ మయూర్ అశోక్, అధికారులు

గుంటూరు కార్పొరేషన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): నగరానికి కీలకమైన శంకర్ విలాస్ ఆర్వోబీ నిర్మాణంలో.. నగరపాలక సంస్థకు సంబంధించిన పనులను యుద్ధ ప్రాతిపదినక పూర్తిచేస్తామని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. మంగళవారం కమిషనర్ కె.మయూర్ అశోక్‌తో కలిసి బ్రిడ్జి నిర్మాణ ప్రాంతాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ శంకర్ విలాస్ ఆర్వోబీ నిర్మాణం నిర్దేశిత గడువులోగా పూర్తయ్యేలా కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ నిత్యం సమీక్షిస్తున్నారని తెలిపారు. నిర్మాణ సంస్థ పనులు చేపట్టడానికి వీలుగా సైట్ క్లియర్స్‌కు జీఎంసీ అధికారులు కృషి చేయాలన్నారు. ప్రభావిత భవన యజమానులతో బుధవారం కమిషనర్ నేతృత్వంలో మరో సమావేశం నిర్వహిస్తా మన్నారు. కమిషనర్ మాట్లాడుతూ బ్రాడీపేట వైపు పెండింగ్‌లో ఉన్న పిల్లర్లలో ఒకదానికి సైట్ క్లియర్‌గా ఉన్నందున పనులు చేపట్టవచ్చన్నారు. అంగీకారం తెలిపిన భవనాలను తక్షణం తొలగించాలన్నారు. అంగీకారం తెలపని వారి సమస్యలు తెలుసుకొని, జీఎంసీ నుంచి పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు. ఈ నెలలో జీజీహెచ్‌లో నూతన భవన ప్రారంభానికి సీఎం చంద్రబాబు నాయుడు హాజరు కానున్న నేపథ్యంలో పర్యటన మార్గంలో ప్రత్యేక పారిశుధ్య, ఆక్రమణల తొలగింపు, రోడ్ల ప్యాచ్‌వర్కులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సిటీ ప్లానర్ రాంబాబు, డిప్యూటీ కమిషనర్ టి.వెంకట కృష్ణయ్య ఇతర అధికారులు పాల్గొన్నారు.

రేపటి నుంచి విజ్ఞాన్‌లో ఏపీ స్పేస్ టెక్ సమ్మిట్

● ప్రత్యేక ఆకర్షణగా సౌత్ ఇండియా రాకెట్రీ చాలెంజ్
● హాజరుకానున్న షార్ డైరెక్టర్ ఈఎస్ పద్మకుమార్



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న విజ్ఞాన్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, ఏపీ సైన్స్ సిటీ సీఈవో కేశినేని వెంకట్, విజ్ఞాన్ వర్సిటీ ఇన్‌ఛార్జి వీసీ కేవీ క్రిష్ణకిషోర్ తదితరులు

గుంటూరు (విద్య), జనవరి 20 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు ఏపీ స్పేస్ టెక్ సమ్మిట్ జరగనుంది. అమరావతిలోని ఆంధ్రప్రదేశ్ స్పేస్ టెక్ అకాడమీ, హైదరాబాద్‌లోని అనంత్ టెక్నాలజీస్, విజ్ఞాన్ వర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో దీనిని నిర్వహిస్తున్నట్లు వర్సిటీ ఇంచార్జి వైస్ చాన్సలర్ డాక్టర్ కేవీ క్రిష్ణకిషోర్ తెలిపారు. ఈ సందర్భంగా సమ్మిట్‌కు సంబంధించిన బ్రోచర్‌ను మంగళవారం విజ్ఞాన్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, ఏపీ సైన్స్ సిటీ సీఈవో కేశినేని వెంకట్‌తో కలిసి ఆవిష్కరించారు. కేవీ క్రిష్ణకిషోర్ మాట్లాడుతూ, ఈ సమ్మిట్‌కు శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ డైరెక్టర్ ఈఎస్ పద్మకుమార్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారన్నారు.ఎన్ఆర్ఎస్‌సీ డైరెక్టర్ డాక్టర్ ప్రకాష్ చౌహాన్, డీఆర్‌డీవో మాజీ ఛైర్మన్ డాక్టర్ జి.సతీష్‌రెడ్డి, రాష్ట్ర రోడ్డు రవాణా మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి గౌరవ అతిథులుగా పాల్గొంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు,ఆయా విభాగాల డీన్లు,విభాగాధిపతులు పాల్గొన్నారు.

23న సీఆర్‌డీఏ స్కిల్ హబ్‌లో జాబ్ మేళా

● ఆరు దిగ్గజ కంపెనీల్లో 263 ఖాళీల భర్తీ
● అన్ని పురుషులకే కేటాయింపు

గుంటూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధానిలోని తుళ్లూరులో ఉన్న సీఆర్‌డీఏ స్కిల్ హబ్‌లో ఈ నెల 23వ తేదీన జాబ్‌మేళా జరగనుంది. స్కిల్స్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ విభాగం ఆధ్వర్యంలో జరగనున్న ఈ జాబ్‌మేళాలో ప్రముఖ కంపెనీల్లోని 263 ఖాళీలను భర్తీ చేయనున్నారు. కంపెనీలన్ని నిర్మాణరంగానికి చెందినవే కావడంతో పురుషులనే ఎంపిక చేసుకోవాలని నిర్ణయించాయి. ఆర్‌వీఆర్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ సైట్ ఇంజనీర్, సూపర్‌వైజర్, ఎలక్ట్రీషియన్, ప్లంబర్, ఎన్ఎంఆర్ లేబర్, మెకానికల్ ఎగ్జిక్యూటివ్‌లను నియమించుకోనుంది. వీళ్లందరికి అమరావతిలోనే పనిచేసే అవకాశాన్ని కల్పిస్తుంది. ఎన్‌సీసీ లిమిటెడ్ లింగాయపాలెం సంస్థ సూపర్‌వైజర్లు, సైట్ ఇంజనీర్లను, ఎంవీఆర్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ సైట్ ఇంజనీర్, సైట్ సూపర్‌వైజర్లను నియమించుకొని అమరావతిలో పోస్టింగ్ కల్పిస్తాయి. బీఎస్ఆర్ ఇన్‌ఫ్రాటెక్ ఇండియా లిమిటెడ్ సివిల్ ఇంజనీర్, మెకానికల్ ఇంజనీర్, క్యూఏ, క్యూసీ ఇంజనీర్, ఇంజనీర్ క్యూఎస్ అండ్ ప్లానింగ్, అకౌంటెంట్స్ ఎస్ఏపీ ఫికోతో, సివిల్ ఇంజనీర్ (టెక్నికల్) ఉద్యోగాలను కల్పించి ఏపీ, తెలంగాణ, కర్ణాటకలో పోస్టింగ్‌లు ఇవ్వనుంది. ఎల్అండ్‌టీ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ కన్‌స్ట్రక్షన్ ఎలక్ట్రీషియన్, ప్లంబింగ్, వెల్డింగ్, ఫోరం వర్కు, కార్పెంటరీ మాసనరీ, బార్ బెండింగ్, సీఫోల్డింగ్ ట్రేడ్‌లో 100 మందిని నియమించుకోనుంది. ఇందుకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ విద్యార్హతలు నిర్ణయించింది. బీఎస్‌సీపీఎల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ సంస్థ ఫీల్డ్ కో-ఆర్డినేటర్ (వర్క్స్), ఫీల్డ్ అసిస్టెంట్ (వర్క్స్), అకౌంట్స్ అండ్ ఇన్వెంటరీ, ఇంటర్నల్ ఆడిట్, ఓహెచ్ఎస్, ఈ అండ్ ఎస్, కన్‌స్ట్రక్షన్ సేఫ్టీ విభాగాల్లో ఉద్యోగాలు కల్పించనుంది. జాబ్‌మేళాలో పాల్గొనదలచిన అభ్యర్థులు నైపుణ్యం.ఏపీ.జీవోవీ.ఇన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సీఆర్డీఏ వర్గాలు తెలిపాయి. మరిన్ని వివరాలకు 9963425999, 9988853335, 8712655686, 8790118349, 8790117279 నెంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నాయి.

రుణాల వసూళ్ళపై దృష్టి సారించాలి

● జీడీసీసీ బ్యాంకు ఛైర్మన్ మక్కెన

గుంటూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు బ్రాంచ్‌లలో రుణాల వసూ ళ్ళపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని బ్యాంకు ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు పేర్కొన్నారు. గుంటూరు బ్రాడీపేటలోని ఎన్టీఆర్ సహకార భవన్‌లో మంగళవారం అధికారులతో ఆయన ప్రత్యేక సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ, బ్యాంకు బ్రాంచ్‌లలో రుణాల రికవరీలో వెనుకబడుతున్నారని అన్నారు. రుణాల రికవరీ కోసం ప్రత్యేక అధికారులను నియమిస్తున్నట్లు తెలిపారు. దీనికి సబంధించి ప్రత్యేక అధికారుల జాబితాను సిద్ధం చేసి ప్రకటించారు. రికవరీతో పాటు డిపాజిట్ల పెంపుపై కూడా శ్రద్ధ చూపాలన్నారు. సమావేశంలో బ్యాంకు సీఈవో ఫణికుమార్ ఇతర అధికారులున్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, పక్కన సీఈవో ఫణికుమార్ తదితరులు

రూ.48 లక్షల అదనపు ఆదాయం

● సంక్రాంతి స్పెషల్ సర్వీసులతో ఆర్టీసీ ఆర్జన ● 80కి పెరిగిన ఆక్యుపెన్సీ

గుంటూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ ఆర్టీసీకి అదనపు ఆదాయాన్ని సమకూర్చింది. పండుగ రద్దీ దృష్టిలో ఉంచుకొని సాధారణ షెడ్యూల్ సర్వీసులతో పాటు అదనంగా మరో 180 సర్వీసులను ఏర్పాటు చేయటం ఆ సంస్థకు కలిసొచ్చింది. విభజిత జిల్లా పరిధిలోని గుంటూరు-1, 2 డిపోలతో పాటు పొన్నూరు, మంగళగిరి, తెనాలి డిపోల నుంచి అదనపు బస్సులను ఏర్పాటు చేసినట్లు జిల్లా ప్రజా రవాణాధికారి సామ్రాజ్యం తెలిపారు. పండుగ ముందు ఈ నెల 9వ తేదీ నుంచి 13వ తేదీ వరకు స్పెషల్ బస్సులను ప్రారంభించామని, అలాగే పండుగ ముగిసిన తరువాత కూడా 17వ తేదీ నుంచి ఏర్పాటు చేశామన్నారు. మొత్తం 180 సర్వీసులతో రూ. 48 లక్షల అదనపు ఆదాయం సమకూరిందని తెలిపారు. ఇవి షెడ్యూల్ బస్సుల నుంచి కాకుండా కేవలం అదనపు బస్సుల ద్వారా వచ్చిన ఆదాయంగా పేర్కొన్నారు. ఇక ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) 80గా నమోదైందని చెప్పారు. పండుగ సందర్భంగా ఎక్కడా ప్రజలకు అసౌకర్యం లేకుండా విజయవం తంగా సర్వీసులను ఏర్పాటు చేశామన్నారు.

● స్పెషల్ బస్సుల్లోనూ సాధారణ చార్జీలే

పండుగ సందర్భాల్లో ఏర్పాటు చేసిన స్పెషల్ సర్వీసులకు సాధారణ చార్జీలు వసూలు చేశారు. గతంలో స్పెషల్ సర్వీసులకు 50 శాతం అదనంగా వసూలు చేసేవారు. కూటమి ప్రభుత్వ నిర్ణయంతో సాధారణ చార్జీలే వసూలు చేసినట్లు అధికారులు తెలిపారు.

నేడు రైల్వే జీఎం రాక

గుంటూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ బుధవారం గుంటూరు రైల్వే డివిజన్ పర్యటనకు రానున్నారు. డీఆర్ఎం సుదేష్ణ సేన్, ఇతర అధికారులతో కలిసి నంద్యాల యార్డును పరిశీలించనున్నారు. ఆ తర్వాత దిగువమెట్ట, చెలమ, కంభం, మార్కాపురం యార్డు ఇన్‌స్పెక్షన్ నిర్వహిస్తారు. అనంతరం స్పీడ్‌టెస్టు నిర్వహిస్తారు. వినుకొండ, శావల్యా పురం, నల్లపాడులో ఫ్రైట్ ఎగ్జామినేషన్ చేసి సికింద్రాబాద్‌కు బయలుదేరి వెళతారు. ఈ పర్యటన పూర్తిగా సాంకేతికపరమైనది కావడంతో ఇతరులెవ్వరిని అనుమతించడంలేదని హెడ్‌క్వార్టర్స్ నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి.

జాతీయ రహదారులుగా నాలుగు రోడ్లు

● ప్రతిపాదించిన రాష్ట్ర ప్రభుత్వం

గుంటూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో నాలుగు రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా అప్‌గ్రేడ్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదించింది. గుంటూరు-ప్రత్తిపాడు-ఒంగోలు 107 కిలోమీటర్లు, గుంటూరు-నల్లపాడు -పేరేచర్ల-తాడికొండ-కాజ 50.76 కిలోమీటర్లు, గుంటూరు- నారాకోడూరు-చేబ్రోలు-పొన్నూరు-బాపట్ల 63.80 కిలోమీటర్లు, నరసరావుపేట- సత్తెనపల్లి- అమరావతి- తాడికొండ- కాజ 96 కిలోమీటర్ల రోడ్లను జాతీయ రహదారులుగా అప్‌గ్రేడ్ చేయాలని కోరింది. దీనిపై కేంద్ర ఉపరితల, రోడ్డు రవాణ శాఖ సానుకూలంగా స్పందిస్తే ఈ రోడ్లను నాలుగు వరుసలుగా విస్తరించి అభివృద్ధి చేసే అవకాశం ఉంటుంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	180, 189, 200
చికెన్ విత్ స్కిన్(కిలో)	350.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	360.00

మిర్చియార్డు సమాచారం

(మంగళవారం ధరలు)

వచ్చిన బస్తాలు	54,236
అమ్మకాలు	50,639
నిల్వ	13,633

నాన్ ఏసీ కామన్ వెరైటీ

334	13000	22000
నెంబరు. 5	13500	21000
273	----	----
341	13500	23500
4884	----	----
సూపర్ 10	----	----

నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ

తేజ	12500	18200
షార్క్-1	-----	----
బ్యాడిగి	13500	21000
దేవనూరు డీలక్స్	14000	24000
ఆర్మూరు	12000	17000

ఏసీ కామన్ వెరైటీ

334	12000	20000
నెంబరు. 5	----	----
	----	----
341	15000	21500
4884	----	----
సూపర్ 10	----	----

ఏసీ స్పెషల్ వెరైటీ

తేజ	12000	16500
బ్యాడిగి 355	12000	19500
దేవనూరు డీలక్స్	----	----
తాలుకాయలు	6000	10000

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

పశ్చిమను అభివృద్ధిలో అగ్ర భాగాన నిలుపుతా

● ఎమ్మెల్యే గళ్ళా మాధవి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మాధవి

గుంటూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు పశ్చిమ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రభాగాన నిలుపుతామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి చెప్పారు. నియోజకవర్గంలో మంగళవారం ఆమె రూ.3.10 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హజరత్ కాలే మస్తాన్ వలి బాబా దర్గా వెనుక వైపు, డీబీఎస్ బ్యాంక్ నుంచి మూడు బొమ్మల సెంటర్ వరకు ఎప్పటినుంచో పెండింగ్‌లో ఉన్న రోడ్డును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో రూ.50 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేశామన్నారు. కృష్ణ నగర్ 1వ లైన్, 2వ లైన్, దేవాలయం రోడ్డు ప్రాంతాల్లో రూ.1.50 కోట్లతో సీసీ డ్రెయిన్లు, కల్వర్టుల నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. సరస్ మేళా అద్భుతంగా జరిగిందని, ఇది కేవలం ప్రదర్శన మాత్రమే కాదు, మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచిన వేదిక అన్నారు.

మహిళల సాధికారత లక్ష్యంగా మహిళా గ్రీవెన్స్ డే

పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో మంగళవారం మహిళా గ్రీవెన్స్ డే జరిగింది. ఎమ్మెల్యే గళ్ళా మాధవి మహిళల నుంచి వినతులు స్వీకరించి వాటిని తక్షణమే పరిష్కరించాల్సిందిగా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని ఎయిడెడ్, మున్సిపల్ పాఠశాలల ఉపాధ్యాయులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో ఎదురవుతున్న సమస్యలు ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు.

కమిషనర్‌ను కలిసిన బీజేపీ నాయకులు

గుంటూరు(తూర్పు), జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : నగర కమిషనర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కె.మయూర్ అశోక్‌ను ఆయన ఛాంబర్‌లో మంగళవారం బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, జాతీయ స్పైసెస్ బోర్డు సభ్యుడు కొత్తూరు వెంకట సుబ్బారావు, నేరెళ్ల మాధవరావు, బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్, నాయకులు చరక కుమార్ గౌడ్, తోట శ్రీనివాస్, పాండురంగ విఠల్, షేక్ రఫీ, సాధు రామకృష్ణ పాల్గొన్నారు.

రేట్ పెయర్స్ నాయకులు...

గుంటూరు కార్పొరేషన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ది గుంటూరు సిటీ మున్సిపల్ రేట్ పేయర్స్ అసోసియేషన్ నాయకులు మంగళవారం నూతనంగా పదవి బాధ్యతలు స్వీకరించిన నగర కమిషనర్ మయూర్ అశోక్, సూపరింటెండెంట్ ఇంజనీర్ జి.వెంకటేశ్వరరావులను కలసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు ఓరుగంటి నారాయణరెడ్డి, ఉపాధ్యక్షులు టీ.ధనుంజయ రెడ్డి, కార్యదర్శి కర్లపూడి రాఘవరావు, కేవీ చలపతిరావు, మేడూరి రాజేంద్రప్రసాద్, జై వీరారెడ్డి, ఎం.రామారావు, కే.పావని, జె.సుబ్బాయమ్మ, జి.లక్ష్మీనారాయణ, ఏ.అనంతరామయ్య, శరత్ తదితరులు పాల్గొన్నారు

టీడీపీ మాజీ ఫ్లోర్ లీడర్ రాజేష్...

నగర కమిషనర్ మయూర్ అశోక్‌ని తెలుగుదేశం పార్టీ నగరపాలక సంస్థ మాజీ ఫ్లోర్ లీడర్ ముత్తినేని రాజేష్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలుసుకొని అభినందనలు తెలిపారు. బాధ్యతలు చేపట్టిన ఆయనను పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించారు.

పంచాయతీల సమస్యలను పరిష్కరించండి

● డిప్యూటీ సీఎంకు సర్పంచ్‌ల సంఘం వినతిపత్రం

గుంటూరు సిటీ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల అభివృద్ధి, సర్పంచుల సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్ర సర్పంచుల సంక్షేమ సంఘం ప్రతినిధులు మంగళవారం ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్‌కు వినతి పత్రం అందజేశారు. డిప్యూటీ సీఎంతో సచివాలయంలో జరిగిన సమావేశంలో రాష్ట్ర సర్పంచుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు, అగ్నికుల క్షత్రియ అభివృద్ధి సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మన్ చిలకలపూడి పాపారావు, అఖిల భారత పంచాయతీ పరిషత్ (ఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, రాష్ట్ర సర్పంచుల కార్యవర్గ సభ్యులు చందు వెంకట సాంబశివరావు, వైఎస్సార్ కడప జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి పాల్గొన్నారు. అనంతరం పంచాయతీరాజ్ కమిషనర్ మైలవరపు కృష్ణతేజను కలిసిన సర్పంచుల సంక్షేమ సంఘం ప్రతినిధులు వినతిపత్రం అందజేసి సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు.

ప్రభుత్వాస్పత్రి చుట్టూ ఆక్రమణలు తొలగించరూ...

● కమిషనర్‌కు జీజీహెచ్ సూపరింటెండెంట్ లేఖ

గుంటూరు మెడికల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి చుట్టూ ఉన్న ఆక్రమణలు తొలగించాలని కోరుతూ జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి మంగళవారం నగర కమిషనర్‌కు లేఖ రాశారు. ప్రభుత్వాస్పత్రిలో నిర్మించిన డాక్టర్ కానూరి జింకానా తల్లీ బిడ్డల ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించేందుకు సీఎం చంద్రబాబు ఈ నెల 30న గుంటూరు జీజీహెచ్‌కు వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆసుపత్రి చుట్టూ ఉన్న తోపుడు బండ్లు, ఇతర బడ్డీ కొట్లను తొలగించేందుకు కార్పొరేషన్ అధికారులు సిద్ధమవుతున్నారు. అలాగే అమరావతి రోడ్‌లోని గుంటూరు వైద్య కళాశాల పురుషుల వసతి గృహం బయట వైపు ఉన్న ఆక్రమణలు, భవనం కనిపించకుండా ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లను తొలగించాలని కోరుతూ జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారీ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్, మేయర్ కోవెలమూడి రవీంద్రను కలసి వినతిపత్రం అందజేశారు. ఆక్రమణలు తొలగిస్తామని మేయర్ హామీ ఇచ్చారు.

వేడుకగా శ్రీ కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం

● అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే నసీర్



శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి గ్రామోత్సవంలో ఎమ్మెల్యే నసీర్, సత్యం, వరప్రసాద్ తదితరులు

గుంటూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఏటుకూరు రోడ్డులోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాలు మంగళవారం వేడుకగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో ఉదయం అమ్మవారి మూలవిరాట్ కి పంచామృతాభిషేకం, సామూహిక కంకుమార్చనలతో ప్రత్యేక అభిషేకాలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ పండుగగా గుర్తింపు రావటంతో తూర్పు ఎమ్మెల్యే ఎండీ నసీర్ అహ్మద్ ఆలయాన్ని దర్శించుకొని అమ్మవారికి ప్రత్యేకంగా పట్టువస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సాయంత్రం 108 మంది కన్యలతో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయంలో ఆధునీకరించిన కార్యాలయ రూమ్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 35 డివిజన్ కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్, ఏపీ ఆర్యవైశ్య మహాసభ ఈసీ నెంబర్ కొనకళ్ళ సత్యం, ఆలయ ఈవో నిడుమానూరు శ్రీనివాసులు, ఉత్సవ కమిటీ ఛైర్మన్ కోటా శేషగిరిరావు, గీతా మందిరం ఛైర్మన్ జుజ్జూరి శ్రీనివాసరావు, వైస్ ఛైర్మన్ టంగుటూరి అర్జునరావు తదితరులున్నారు.

కమిషనర్ మయూర్ అశోక్‌తో ఎమ్మెల్యే నసీర్ భేటి

గుంటూరు కార్పొరేషన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): తూర్పు నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్‌ను తూర్పు ఎమ్మెల్యే నసీర్ కోరారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో మంగళవారం కమిషనర్‌ను కూటమి నాయకులతో ఎమ్మెల్యే నసీర్ మర్యాదపూర్వకంగా కలిశారు. తూర్పు నియోజకవర్గంలో ఇప్పటికే వందల కోట్ల రూపాయలతో సీసీ రోడ్లు, డ్రెయిన్లు వంటి అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని, వీటిని ప్రణాళికాబద్ధంగా పూర్తి చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ నాయకుడు జాగర్లమూడి శ్రీనివాసరావు, కార్పొరేటర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రూ.2.05 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

గుంటూరు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అభివృద్ధి నిరోధకులుగా ఉన్న జగన్ సైన్యం ప్రజలు సంతోషంగా ఉంటే ఓర్వలేకపోతున్నారని తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. నగరంలోని సీతానగర్‌లో రూ.28.40 లక్షలు, షాప్ ఎంప్లాయీస్ కాలనీలో రూ.30.50 లక్షలు, వినోబా నగర్‌లో రూ.40 లక్షలు, బసవతారక నగర్‌లో రూ.37.50 లక్షలు, మద్దిరాల కాలనీలో రూ.37.50 లక్షలు, మోతీలాల్ నగర్‌లో రూ.31 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి ఎమ్మెల్యే నసీర్ శంకుస్థాపన చేశారు.

హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తున్న వైసీపీ

గుంటూరు(తూర్పు), జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైసీపీ హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తుందని వడ్డెర కార్పొరేషన్ ఛైర్మన్ మల్లె ఈశ్వరరావు ఆరోపించారు. స్థానిక గుంటూరు, హౌసింగ్ బోర్డు కాలనీలోని ఆయన కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 34 శాతం బీసీలకు రిజర్వేషన్లు ఇచ్చి వారి సంక్షేమానికి పాటు పడితే, జగన్ మాత్రం బీసీలను నిర్ధాక్షణ్యంగా హత్యలు చేశారని అన్నారు. అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, గౌతు శిరీషపై నాయకులపై కేసులు పెట్టి వేధించారని అన్నారు. సమావేశంలో టీడీపీ వడ్డెర సాధికార సమితి జిల్లా కన్వీనర్ బత్తుల జాన్ సైదా, వడ్డెర సంఘ జిల్లా, నగర అధ్యక్షురాలు మణికుమారి, చల్లా రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులు సంఘటిత శక్తిగా మారి హక్కులు సాధించుకోవాలి

గుంటూరు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): సమాజంలో వేస్ట్ పిక్కర్లు, హెయిర్ పిక్కర్లు సంఘటిత శక్తిగా మారి తమ హక్కులను సాధించుకోవాలని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ డైరెక్టర్ అల్లడి దేవకుమార్ పిలుపునిచ్చారు. గోరంట్లలోని డి స్క్వేర్ కన్వెన్షన్ హాల్‌లో మంగళవారం దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి వేస్ట్ పిక్కర్ల సదస్సు జరిగింది. సదస్సుకు ప్రోగ్రామ్స్ డిప్యూటి డైరెక్టర్ చుక్కా శామ్యూల్ అనీల్‌కుమార్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్స్ డీడీ శామ్యూల్ అనీల్‌కుమార్, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ సూపరింటెండెంట్ పద్మావతి, మెప్మా ఐబీ డి హనుమానాయక్, ఎన్‌టీఆర్ జిల్లా కో ఆర్డినేటర్ జామి రమాదేవి, మల్లెల చిన్నప్ప, బి రమేష్, రవితేజ, భగవాన్‌దాస్, శ్రీలత, సురేష్ తదితరులున్నారు.

విద్యుత్‌శాఖ విజిలెన్స్ విస్తృత తనిఖీలు

గుంటూరు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): నగరంలోని డి 10 సెక్షన్ పరిధిలోని సంగడిగుంట, బుడంపాడు ప్రాంతాల్లో విద్యుత్ ఆపరేషన్, విజిలెన్స్ బృందాలు మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేశాయి. గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఎస్‌ఈ చల్లా రమేష్ నేతృత్వంలో సెక్షన్ పరిధిలో 5298 సర్వీసులను తనిఖీ చేసినట్లు డీపీఈ ఈఈలు కేఏ కరీమ్(గుంటూరు), సుందరబాబు(పల్నాడు)లు తెలిపారు. మొత్తం రూ.10.46 లక్షల అపరాధ రుసుం విధించినట్లు పేర్కొన్నారు. గుంటూరు టౌన్-1 డివిజన్ ఆపరేషన్ ఈఈ పీహెచ్ ఖాన్, డిప్యూటీ ఈఈ ముస్తాక్ అహ్మద్, డీపీఈ డిప్యూటీ ఈఈలు కె రవికుమార్, శ్రీనివాసరావు, ఏఈ దేవదాస్, సతీష్‌కుమార్, శివశంకర్, కోటేశ్వరరావు ఉన్నారు.

24 నుంచి ఓపెన్ పికిల్ బాల్ పోటీలు

గుంటూరు(తూర్పు), జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : పికిల్ బాల్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో స్థానిక గోరంట్లలోని నెక్స్‌జెన్ ఇంటర్నేషనల్ స్కూల్లో ఈనెల 24, 25 తేదీలలో గుంటూరు ఓపెన్ పికిల్ బాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్టు జిల్లా పికిల్ బాల్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఎం.శివకుమార్ తెలిపారు. పాఠశాల ఆవరణలో మంగళవారం పోస్టర్లను ఆవిష్కరించి వివరాలను వెల్లడించారు. ఈ పోటీలు పురుషుల డబుల్స్, మిక్సడ్ డబుల్స్ విభాగాల్లో జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కే.శ్రీకాంత్ డాక్టర్ బి.పేరయ్య చౌదరి, డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి, పికిల్ బాల్ సంఘం కార్యదర్శి జీవీఎస్ ప్రసాదు, భరత్ కుమార్, మన్సూర్ వలి, కే.అరుణ్ కుమార్, పి.ఆనంద్ కుమార్ పాల్గొన్నారు.

ముగిసిన ఎన్టీఆర్ కళాపరిషత్ నాటకోత్సవాలు

గుంటూరు(తూర్పు), జనవరి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై కె.ఆర్.కె.ఈవెంట్స్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ కళాపరిషత్ 21వ నాటకోత్సవాలు ఘనంగా ముగిసాయి. మంగళవారం రంగస్థల ప్రముఖులకు గౌరవ సత్కారం, సినీ సంగీత విభావరి జరిగాయి. సీహెచ్ మస్తానయ్య, ఉపాధ్యక్షుడు లంకా విజయబాబు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, బొప్పన నరసింహారావు, డాక్టర్ లంకా లక్ష్మీనారాయణ, జి మల్లికార్జునరావు, యస్వీ రామారావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అలజడులు సృష్టించేందుకే వైసీపీ కుట్ర

● టీడీపీ బీసీ విభాగం అధ్యక్షుడు వేములకొండ



మాట్లాడుతున్న వేములకొండ శ్రీనివాస్

గుంటూరు(తూర్పు), జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో అలజడులు సృష్టించేందుకే వైసీపీ కుట్ర పన్నుతుందని టీడీపీ బీసీ విభాగం అధ్యక్షుడు వేములకొండ శ్రీనివాస్ తీవ్రంగా విమర్శించారు. స్థానిక అరండల్‌పేట, టీడీపీ కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ నిర్లక్ష్య పాలనతో రాష్ట్రాన్ని తీవ్రంగా నష్టపరిచిన వైసీపీ నాయకులు, ఇప్పుడు బీసీ నేతలపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని ఆరోపించారు. బీసీ సబ్ ప్లాన్ నిధులైన రూ.75,760 కోట్లను దారిమళ్లించి, 8,000 ఎకరాల ల్యాండ్ బ్యాంకులను లాక్కొని ఉపయోగించారని విమర్శించారు. వైసీపీ పాలనలో బీసీలకు జరిగిన అన్యాయాన్ని ప్రజలు ఎప్పటికి మరిచిపోరని, రాబోయే ఎన్నికల్లో బీసీ సమాజం మొత్తం కలిసి వైసీపీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పే రోజు దగ్గర్లోనే ఉందని ఆయన స్పష్టం చేశారు.

సెమినార్‌ని జయప్రద చేయాలి

గుంటూరు విద్య, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : జనవిజ్ఞాన వేదిక, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జనవరి 25న విజయవాడలో జరిగే భారత రాజ్యాంగం-సవాళ్లు జాతీయ సెమినార్ జయప్రదం చేయాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్ లక్ష్మణరావు విజ్ఞప్తి చేశారు. యూటీఎఫ్ కార్యాలయంలో పోస్టర్స్ ఆవిష్కరించారు.





భిక్షాటన చేయాలని ఒత్తిడి

● కూతురిని తీసుకొని పారిపోయిన భార్య

గుంటూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఏడాది గడచినా తల్లీ కూతుళ్ళ మిస్సింగ్ కేసును పోలీసులు పట్టించుకోవడం లేదని వచ్చిన ఆరోపణలను ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్ ఖండించారు. భిక్షాటన చేయాలని భర్త ఒత్తిడి చేయడంతో ఇష్టం లేక కూతురిని తీసుకొని తల్లి ఇంటి నుంచి వెళ్ళిపోయిందని తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆర్ అగ్రహారం నిమ్మలపేటకు చెందిన పిళ్ళా యేసోబు, తన భార్య అంజలి, కూతురు బ్లెస్సీ (14)ని భిక్షాటన చేయాలంటూ ఒత్తిడి చేయడంతో వారు ఇంటి నుంచి స్వచ్ఛంధంగా వెళ్లిపోయారన్నారు. యేసోబు ఫిర్యాదు మేరకు లాలాపేట పోలీసులు పారిపోయిన మహిళ, బాలికను గుర్తించి వారితో మాట్లాడారని చెప్పారు. తనను, తన కుమార్తెను భిక్షాటన చేయాలని ఒత్తిడి చేయడంతో ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు మహిళ తమకు వెల్లడించిందన్నారు. తన భర్త మరో మహిళను వివాహం చేసుకొని, తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నాడని వాపోయిందన్నారు. ప్రస్తుతం వారు తెలంగాణలోని ఓ గ్రామంలో నివసిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.

సింగిల్ నంబర్ లాటరీ నిర్వాహకుల అరెస్టు

గుంటూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సింగిల్ నంబర్ లాటరీ నిర్వాహకులను టాస్క్ ఫోర్స్ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. సోమవారం అరండల్‌పేట 15వ లైనులోని ఓ ఇంట్లో ఆర్గనైజింగ్ సింగిల్ నంబర్ లాటరీ నిర్వహిస్తున్నారని టాస్క్ ఫోర్స్ బృందానికి సమాచారం రావడంతో వారు దాడి చేశారు. ఈ దాడిలో ఇరువురు చిక్కారు. వారిని అదుపులోకి తీసుకొని విచారించి, వారి నుంచి రూ.800 నగదు, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకన్నామని పోలీసులు తెలిపారు.

నిత్య పెళ్లి కొడుకుపై చీటింగ్ కేసు

గుంటూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఒకరికి తెలియకుండా ఇంకొకరిని పెళ్లి చేసుకొని ఇరువురు యువతులను మోసం చేసిన నిత్యా పెళ్లి కొడుకు పులి శ్రీకాంత్‌పై నల్లపాడు పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న నగరంలోని ఇన్నర్ రింగ్ రోడ్డు ప్రాంతానికి చెందిన పులి శ్రీకాంత్ ఇరువురు యువతులను పెళ్లి చేసుకొని మోసం చేశాడు. ఇప్పుడు మూడో పెళ్లికి సిద్ధపడగా ఇరువురు యువతులు ఎస్పీ వకుల్ జిందాల్‌కు ఫిర్యాదు చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు నల్లపాడు పోలీసులు నిందితుడు శ్రీకాంత్‌తో పాటు అతని కుటుంబసభ్యులపై చీటింగ్ కేసుతో పాటు వేధింపుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మారిన అనుబంధ జీవనచక్రం





● స్త్రీశక్తికి చేదోడుగా ఉచిత బస్సు ప్రయాణం ● వేడుకలకు, శుభకార్యాలకు రెట్టింపైన మహిళల హాజరు ● మునుపెన్నడూ లేని స్థాయిలో సంక్రాంతి సంబరం ● దేవాలయాలు, పుణ్యక్షేత్రాల్లోనూ పెరిగిన రద్దీ

దేవాలయాల్లోనూ సందడి

ఉచిత బస్సు ప్రయాణం కారణంగా దేవాలయాలు, పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రదేశాల్లో కూడా సందడి పెరిగింది. గతంలో పర్యాటక ప్రదేశాలకు వెళ్లాలన్నా, పుణ్యక్షేత్రాలను సందర్శించాలన్నా ప్రత్యేకంగా కార్లు, వ్యాన్లు, క్యాబులు మాట్లాడుకొని వెళ్ళాల్సి ఉండేది. లేదంటే బస్సుల్లోనే చార్జీలు పెట్టుకొని వెళ్లేవారు. ఆర్థిక భారం కారణంగా చాలా మంది వాటికి దూరంగా ఉండేవారు. కానీ ఇప్పుడు ఉచిత బస్సు ప్రయాణానికి ప్రాధాన్యమిస్తున్నారు. దగ్గరలో ఉన్న దేవాలయాలు, పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రదేశాలకు బస్సుల్లోనే ప్రయాణమవుతున్నారు. ఆ కారణంగా దేవాలయాలు, పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రదేశాల్లో భక్తుల రద్దీ పెరిగింది.

గుంటూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఒకరు బంధువులు గృహప్రవేశం చేశారు. కార్యక్రమానికి వారి బంధువులను ఆహ్వానించారు. ఈ ఆహ్వానాలు గతంలోనూ ఉండేవే. అయితే అప్పుడు ఇంటి పెద్దగా ఉన్న ఒకరు వెళ్లేవారు. అయితే ఈ సారి ఇంటి పెద్దతోపాటు ఆయన భార్య, పిల్లలు కూడా కార్యక్రమానికి వెళ్లారు. దాదాపు పది.. పదిహేనేళ్ల తరువాత వారంతా ఇలా కలుసుకున్నారు. సంతోషంతో ఉబ్బితబ్బిబైపోయారు. పదేళ్లుగా ఒక్కరే వెళ్లే కార్యక్రమానికి నేడు కుటుంబమంతా వెళ్లడానికి కారణం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఉచిత బస్సు ప్రయాణమే. కూటమి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 'స్త్రీ శక్తి' పథకం కారణంగా ప్రతి ఇంటా ఇలాంటి అనుభవాలు ఎదురవుతున్నాయి. ఏనాడో తెగిపోయాయనుకుంటున్న బంధాలు తిరిగి ప్రాణం పోసుకుంటున్నాయి.

● వారిది ఒక సామాన్య కుటుంబం. ఒక్కగానొక్క కూతురు. పెళ్ళయ్యాక భర్తతోపాటు బతుకుదెరువు కోసం విశాఖపట్నం వెళ్లిపోయింది. దాదాపు పదేళ్లుగా పెద్దగా రాకపోకలు లేవు. అత్యవసరమైతే తప్ప పండగలకు, వేడుకలకు కూడా ఆమె, ఆమె పిల్లలు పుట్టింటికి వచ్చే పరిస్థితి లేదు. కానీ ఈసారి సంక్రాంతికి ఆమె, తన ఇద్దరు ఆడపిల్లలుతో గుంటూరులో ఉన్న తన పుట్టింటికి వారం రోజుల ముందుగానే వచ్చింది. ఇలాంటివి ఈ సంక్రాంతికి ప్రతి ఊళ్లో, ప్రతి వీధిలో కనిపించాయి. అందుకు సాక్ష్యం నిండిపోయిన సంక్రాంతి బస్సులు.. కిక్కిరిసిపోయిన బస్టాపులు!

● ఇనుమడించిన సంక్రాంతి సంబరం..!

తెలుగునాట సంక్రాంతి పండుగకు ఉన్న ప్రాధాన్యం అంతా ఇంతా కాదు. అయితే ఈ సారి పండుగ సంబరాలు, సంతోషాలు రెట్టింపయ్యాయి. అందుకు గత ఏడాదిన్నర కాలంగా రాష్ట్రంలో నెలకొన్న ప్రశాంత వాతావరణం ఒక కారణమైతే, అంతకు మించి 'స్త్రీ శక్తి' పథకం ద్వారా మహిళలకు రాష్ట్రవ్యాప్తంగా ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించడం. ప్రయాణ ఖర్చుల భారం తగ్గడంతో ఆడబిడ్డల పుట్టినిళ్లు పండుగ సందడితో కళకళలాడిపోయాయి. దేవాలయాలు, పుణ్యక్షేత్రాలు రద్దీగా మారిపోయాయి. పండుగకు వారం రోజుల ముందు నుంచే ఏ బస్సు చూసినా 80 నుంచి 90 శాతం మంది మహిళలతో నిండిపోయి కనిపించింది. ఇంకా చెప్పాలంటే బస్సు ప్రారంభస్టేషన్లో తప్ప మరే ఇతర బస్టాపుల్లో ఆపడానికి వీలు లేనంతగా బస్సులు నిండిపోయాయి. ఇదంతా ఒక్క పండగల సమయంలోనే అనుకుంటే పొరపాటే. ఉచిత బస్సు ప్రయాణం కారణంగా ఇళ్లలో జరిగే శుభకార్యాలు, వేడుకల్లో కూడా మహిళల హడావుడి పెరిగింది.

పెరిగిన అనుబంధాలు

సాధారణంగా ప్రతి ఇంట్లో శుభకార్యాలు జరుగుతుంటాయి. అయితే వీటన్నింటికీ హాజరవడం వారి బంధువులు అందరికీ సాధ్యమయ్యేది కాదు. ప్రధానంగా సామాన్య, మధ్య తరగతి కుటుంబాలు ప్రయాణ భారాన్ని మోయలేక ఆ కార్యక్రమానికి ముఖ్యమైనవారు ఎవరో ఒకరు వెళ్లి వచ్చేవారు. చాలా కుటుంబాల్లో ఈ కారణం గానే పెద్దల వరకూ కార్యక్రమాలకు హాజరై పిల్లలను ఇళ్లదగ్గరే వదిలేసి వెళ్లేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి మారిపోయింది. ఫంక్షన్ అనే పేరు వినిపించగానే ఎంత దూరమైనా కుటుంబసభ్యులందరూ తయారై పోతున్నారు. గతంలో కేవలం ఇంటి పెద్దగా ఉన్న ఒక్క మగ వ్యక్తే ఆ కార్యక్రమానికి వెళ్లే పరిస్థితి ఉండగా, ఇప్పుడు అందరూ ప్రయాణమవుతున్నారు.

రేపు కోటప్పకొండకు పవన్ కల్యాణ్

● ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ కృతికా శుక్లా

నరసరావుపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గురువారం కోటప్పకొండలో పర్యటించనున్నారు. గంట పదిహేను నిమిషాల పాటు సాగే అయన పర్యటన కోసం అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఏర్పాట్లను కలెక్టర్ కృతికా శుక్లా, ఎస్పీ బి.కృష్ణారావు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఉదయం 10:30 గంటలకు హెలికాప్టర్‌లో కోటప్పకొండకు చేరుకుంటారని, అక్కడి నుంచి కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి దేవాలయానికి వచ్చి స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొం టారని తెలిపారు. పర్యాటక కేంద్రంలోని జింకల పార్కులను అయన పరిశీలిస్తా రని, కోటప్పకొండ- కొత్తపల్లి రహదారిని ప్రారంభిస్తారని చెప్పారు. అనంతరం 11.45 గంటలకు హెలిప్యాడ్‌కు చేరుకొని తిరిగి వెళతారని కలెక్టర్ తెలిపారు. పవన్ కల్యాణ్ పర్యటనకు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ బి.కృష్ణారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఎస్పీ నిరంజన్, డీఆర్‌వో మురళీ, ఆర్డీవో మధులత, డీఎస్పీ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు

గర్భాలయ అభిషేకాలు ఉండవు

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కోటప్పకొండ పర్యటన నేపథ్యంలో భద్రతా కారణాల రీత్యా శ్రీ త్రికోటేశ్వర స్వామి మూలవిరాట్ అభిషేకాలు గురువారం ఉండవని ఈవో డి.చంద్రశేఖరరావు తెలిపారు. ఈ మార్పును గమనించి భక్తులు సహకరించాలని ఈవో కోరారు.

కాసుల చక్కెరకేళి

● రూ.400 నుంచి రూ.500కు చేరిన ధర ● ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు

కొల్లిపర, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కొల్లిపర అరటి కాయల మార్కెట్‌లో చక్కెరకేళికి డిమాండ్ పెరిగింది. రైతులు ఊహించని విధంగా చక్కెరకేళి గెలలకు ఒక్కసారిగా ధర పెరిగింది. ప్రతి సంవత్సరం జనవరి నెలలో చక్కెరకేళి గెలలకు ధర తక్కువగా ఉంటుంది. అటువంటిది ఈ ఏడాది చక్కెరకేళి గెలలకు రెక్కలొచ్చాయి.



మార్కెట్‌లో పాటకు సిద్ధంగా ఉన్న చక్కెరకేళి గెలలు

గతంలో ఎప్పుడూ లేని విధంగా పెరిగిన ధర

గతంలో ఎప్పుడు లేని విధంగా చక్కెరకేళి గెలలకు ధరలు పలుకుతున్నాయి. దీనికి తోడు మొంథా తుఫాన్ కారణంగా డెల్టా ప్రాంతంలో అరటి తోటలు దెబ్బతిన్నాయి. దీంతో గెలలు తక్కువగా ఉండటంతో మార్కెట్‌లలో అరటి గెలల ధరలు అమాంతంగా పెరిగినట్లు వ్యాపారస్థులు తెలుపుతున్నారు. కొల్లిపర మార్కెట్‌కు మాచర్ల, దాచేపల్లి, పిడుగురాళ్ళ, సత్తెనపల్లి, అమరావతి, రావులపాలెం, విజయవాడ తదితర ప్రాంతాల నుంచి వ్యాపారస్థులు వచ్చి చక్కెరకేళి గెలలను పోటీలు పడి కొనుగోలు చేస్తున్నారు. జనవరి నెలలోనే చక్కెరకేళి గెలలకు ధర పెరిగిందని, మే, జూన్ నెలల్లో చక్కెరకేళి జ్యూస్‌ను ప్రజలు ఎక్కువగా ఇష్టపడతారు కాబట్టి ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారస్థులు భావిస్తున్నారు.

● రెండు వారాల క్రితం రూ.200 ఇప్పుడు రూ.500

రెండు వారాలు క్రితం చక్కెరకేళి అరటిగెల ధర మొదటి రకం రూ.200 నుంచి రూ.300, రెండో రకం రూ.150 నుంచి రూ.200 పలికింది. ప్రస్తుతం మార్కెట్‌లో మొదటి రకం చక్కెరకేళి ధర రూ.400 నుంచి రూ.500 పలుకుతుండగా, రెండో రకం రూ.200 నుంచి రూ.300 వరకు ధర పలుకుతుంది. దీంతో అరటి రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌లో ధర ఎక్కువగా ఉండటంతో కొంత మంది వ్యాపారస్థులు చక్కెరకేళి గెలలను తోటల్లోనే కొనుగోలు చేసి మినీలారీల ద్వారా ఎగుమతి చేస్తున్నారు. రైతులు కూడా ఖర్చులు తగ్గుతాయని తోటల్లోనే గెలలను అమ్మటానికి సిద్ధపడుతున్నారు.



మినీలారీలకు ఎగుమతి చేస్తున్న చక్కెరకేళి గెలలు

డ్వాక్రా సంఘాలు బలోపేతం

● కంప్యూటర్ దీదీ పైలట్ ప్రాజెక్టుకు తాడికొండ మండలం ఎంపిక ● ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్

తాడికొండ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డ్వాక్రా సంఘాలు బలోపేతం చేయటానికి యూనిసెఫ్, సెర్ప్ సంస్థలు రాష్ట్ర ప్రభుత్వం కలిసి పనిచేస్తున్నాయని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం తాడికొండ మండల పరిషత్ కార్యాలయంలో కంప్యూటర్ దీదీ ప్రోగ్రామ్‌లో భాగంగా డ్వాక్రా మహిళలకు ల్యాప్‌ట్యాప్‌ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ, డ్వాక్రా మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయటానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. యూనిసెఫ్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో దేశంలో రాజస్థాన్, మధ్యప్రదేశ్, జార్ఖండ్, ఛత్తీస్‌ఘడ్, ఆంధ్రప్ర దేశ్‌లలో కంప్యూటర్ దీదీ పైలెట్ ప్రాజెక్టులను చేపట్టిందని తెలిపారు. రాష్ట్రంలో గుం టూరు జిల్లాలోని తాడికొండ మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినట్లు చెప్పా రు. మండల పరిధిలోని 15 గ్రామాల్లో 60 డ్వాక్రా గ్రూపులకు ల్యాప్‌ట్యాప్‌లను అంది స్తున్నట్లు తెలిపారు. మొదటి విడతలో 6 గ్రూపులకు 24 ల్యాప్‌ట్యాప్‌లను పంపిణీ చేస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో అడల్ట్ ఎడ్యూకేషన్ యూత్ డెవలప్‌మెంట్ నేషనల్ ఆఫీసర్ మురళీకృష్ణ, యూనిసెఫ్ అధికారి అనురూప్ రాజ్, బీఏబుల్ ఫౌండేషన్ నుంచి భగవాన్ పాండే, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయలక్ష్మి, డీఆర్‌డీఏ డీపీఎం అశోక్‌కుమార్, ఎంపీడీవో సమతావాణి, తహసీల్దార్ మెహర్‌కుమార్, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు తలశిల ప్రసన్నకుమార్, ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డ్ మెంబర్ యడ్లపల్లి సాంబశివరావు, మార్కెట్ యార్డు ఛైర్మన్ నీలాల కృష్ణారావు, సొసైటీ మాజీ అధ్యక్షుడు ఎద్దూరి హనుమంతరావు, నీటి సంఘం అధ్యక్షుడు గుంటుపల్లి మధుసూదనరావు, నాలుగు మండలాల ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఏపీఎం సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



డ్వాక్రా మహిళలకు ల్యాప్‌ట్యాప్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్

శుభలగ్నం

(5వ పేజీ తరువాయి)

సిగ్నల్ లభించనుంది. ఇక అక్కడి నుంచి ఏడాది పొడవునా నెలవారీగా అనేక శుభ ముహూర్తాలు ఉన్నాయి. మార్చి 19న ఉగాది, మార్చి 27న శ్రీరామ నవమి పర్వదినాలు ముగిసిన తర్వాత మంచి ముహూర్తాలు ఉన్నాయన్నది పండితుల మాట. మౌఢ్యమి కారణంగా ఈ నెల 19 వరకు చాలామంది శుభకార్యాలను వాయిదా వేసుకున్నట్లు పండితులు చెబుతున్నారు. వివాహ ముహూర్తాల విషయంలోనూ ఇదే పరిస్థితి కొనసాగిందని అంటున్నారు. అలాగే అధిక జ్యేష్ఠ మాసం కారణంగా మే 18 నుంచి జూన్ 11 వరకు వివాహ ముహూర్తాలు లేవని పండితులు స్పష్టం చేస్తున్నారు.

నెలవారీగా వివాహ శుభ ముహూర్తాలు

ఫిబ్రవరి: 19, 20, 21, 22, 25, 26
మార్చి: 4, 5, 6, 8, 11, 12, 13, 20, 21, 25, 29
ఏప్రిల్: 1, 2, 3, 4, 5, 8, 10, 11, 12, 23, 26, 29, 30
మే: 1, 3, 6, 7, 8, 9, 10, 13
జూన్: 17, 19, 20, 21, 24, 25, 27, 28
జూలై: 1, 2, 3, 4, 5, 8, 9
ఆగస్టు: 13, 15, 16, 19, 20, 21, 22, 23, 26, 27, 28, 30
సెప్టెంబరు: 3, 4, 5
అక్టోబరు: 11, 14, 16, 29, 30
నవంబరు (కార్తీక మాసం): 11, 12, 13, 14, 18, 20, 21, 22, 25, 26
డిసెంబరు: 2, 3, 4, 10, 11, 12, 13, 16, 18, 19, 23, 30

రైస్ డాన్!

(5వ పేజీ తరువాయి)

కాలంలో తరచుగా కేసులు నమోదవుతుండడంతో నియోజకవర్గ సరిహద్దుల్లో సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేసుకుని బియ్యాన్ని తరలిస్తున్నారు.

రేషన్ షాపుల్లో 50శాతం బియ్యం వారికే

గతంలో ఎండీయూ వాహనాల నిర్వాహకుల ద్వారా బియ్యం సేకరించేవారు. ఇప్పుడు నేరుగా డీలర్ల ద్వారానే బియ్యం సేకరిస్తున్నారు. మెజారిటీ షాపులను తమ గుప్పెట్లో పెట్టుకుని వాటి ద్వారా మిగిలిన షాపుల డీలర్లను తమ అదుపులోకి తెచ్చుకుని, నయానో, భయానో వారి నుంచి బియ్యాన్ని సేకరిస్తున్నారు. కార్డుదారులు షాపులకు వెళ్లకుండానే బియ్యాన్ని తరలిస్తున్నారు. ప్రతి షాపుకూ టార్గెట్ పెట్టి బియ్యం తీసుకుంటున్నారు. ఒక్కో షాపు సగటున 50 శాతం బియ్యం తమకే ఇవ్వాలని హుకుం జారీ చేస్తున్నారు. దీనిపై ఎవరైనా ఎదురు ప్రశ్నిస్తే వారిని బెదిరిస్తున్నారు. అధికారులతో కేసులు పెట్టిస్తున్నారు. ఈ కారణంగా డీలర్లు మాఫియా గుప్పెట్లో చిక్కి నలిగిపోతున్నారు.

పేదలకు చేరాల్సిన బియ్యం చేరకుండా వారే మార్గాలను చూపిస్తున్నారు. తరచుగా షాపులు మార్చుతుండడం ద్వారా లబ్ధిదారులను గందరగోళపరచడం, రెండో రోజు నుంచే బియ్యం అయిపోయాయని చెప్పి డబ్బులు ముట్టజెప్పడం వంటి పద్ధతులను సూచించి బియ్యం అక్రమాల్లో వారిని భాగస్వాములను చేస్తున్నారు. తద్వారా మాఫియా ఒక వ్యవస్థగా బలపడి పేదల బియ్యాన్ని దర్జాగా దోచుకుపోతోంది. ఇప్పటికైనా రాష్ట్ర, జిల్లా అధికార యంత్రాంగం, ప్రభుత్వం దీనిపై దృష్టి సారించకపోతే పరిస్థితి మరింత దిగజారే ప్రమాదం ఉంది.

పనులు.. చకచకా

● వేగంగా వినుకొండ దేవాలయ పునర్నిర్మాణం

● రూ.4 కోట్లతో ప్రాకార మండపం
● మరో రూ.4 కోట్లతో ఘాట్ రోడ్డు పనులు



కొండపై నిర్మాణంలో ఉన్న రామలింగేశ్వరస్వామి దేవాలయం

వినుకొండటౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే ప్రముఖ ఆలయాల్లో ఒకటిగా ప్రసిద్ధి గాంచిన వినుకొండ రామలింగేశ్వరస్వామి దేవాలయ నిర్మాణ పనులు చకచకా జరుగుతున్నాయి. సుమారు రూ.3.25 కోట్లతో కొండపై రామలింగేశ్వరస్వామి దేవాల య పునర్నిర్మాణం పనులు చేపట్టగా మరో రూ.కోటితో దేవాల యంలో అద్భుతమైన శిలల పనులు చేపట్టనున్నారు. శివాల యంతో పాటు అంత్రాలయం, స్వామి సన్నిధిలో ద్వాదశి జ్యోతి ర్లింగాలు, ఏకరాసిపై అద్భుతమైన దేవతామూర్తులతో ముఖ ద్వారా, అష్టభైరవులు, పార్వతీపరమేశ్వరులు వంటి శిలల ఏర్పాటు, అమ్మవారి దేవాలయంలో సుమారు రూ.15లక్షల విలువ చేసే అష్టలక్ష్మి ద్వారం ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. 22 స్తంభాలతో ముఖమండపం, ధ్వజస్తంభంతో పాటు ప్రాకార మండపం, అర్చనాలయం, ఆఫీస్ రూమ్, భోజనశాల, క్యూ కాంప్లెక్స్, అభిషేక మండపం, స్వామివారి కల్యాణమండపం వంటి అభివృద్ధి పనులకు ప్రణాళికలు సిద్ధం చేశారు. టెండర్ దశ పూర్తయిన వెంటనే నెల రోజుల వ్యవధిలో పనులు ప్రారంభిస్తామని దేవస్థాన అభివృద్ధి కమిటీ సభ్యులు అచ్యుత కోటేశ్వరరావు తెలిపారు.



రూ.4కోట్లతో నూతనంగా నిర్మించనున్న ప్రాకార మండపం



కొండపైకి రూ.4కోట్లతో ఏర్పాటు చేయనున్న ఘాట్‌రోడ్డు

● చీఫ్ విప్ జీవీ రూ.33 లక్షలు ప్రకటన

గత ప్రభుత్వ హయాంలో దేవస్థానం నిర్మాణం అర్ధాంతరంగా ఆగిపోవడంతో ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు కొండపై దేవాలయం నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దేవాలయ నిర్మాణానికి ఆయన స్వయంగా రూ. 33 లక్షలు విరాళం ప్రకటించి ఇప్పటికే రూ. 11 లక్షలను కమిటీ సభ్యులకు అందజేశారు. కమిటీని ఏర్పాటు చేసి దేవాదాయ శాఖ సహకారంతో ప్రాకార మండపానికి రూ.4కోట్లు ప్రభుత్వం నుంచి నిధులు తెచ్చారు. మ్యాచింగ్ గ్రాంట్ ద్వారా మంజూరైన నిధులతో ప్రాకార మండపాన్ని నిర్మించనున్నారు.

● రూ.4 కోట్లతో ఘాట్ రోడ్డు

పట్టణంలోని వెల్లటూరు రోడ్డు నుంచి కొండపైకి ఘాట్ రోడ్డు నిర్మాణానికి గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే శ్రీకారం చుట్టారు. స్వయంగా తన సొంత నిధులతో పనులు చేపడతామని హామీ ఇచ్చిన బొల్లా నేటి వరకు దాని ఊసెత్తిన దాఖలాలు లేవు. దీంతో ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహకారంతో సుమారు రూ. 4 కోట్లతో ఘాట్ రోడ్డు నిర్మాణ పనులను చేపట్టనున్నారు.

● కొండపై నిత్యాన్నదాన కార్యక్రమానికి శ్రీకారం

అమ్మ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు జ్ఞాన ప్రసన్న స్వామి సూచనల మేరకు ఫిబ్రవరి 17వ తేదీ నుంచి కొండపై నిత్యాన్నదాన కార్యక్రమం నిర్వహించేందుకు ఇప్పటికే కొండపై భోజనశాల ఏర్పాటుకు వినుకొండలోని ప్రముఖ వ్యాపారవేత్త రామచంద్రరావు ముందుకు రావడం గమనార్హం. అన్నదాన కార్యక్రమానికి ఇప్పటికే జీవీ తన వంతు సాయంగా మూడు సంవత్సరాల పాటు ప్రతి సోమవారం 11 మందికి అన్నదానం చేస్తామని ప్రకటించడంతో భక్తులు ఎంతో మంది అన్నదాన కార్యక్రమానికి సాయం అందించేందుకు ముందుకొస్తున్నారు.



ధోతీ ధమాకా

కుర్తీ అడుగున ధరించే బాటమ్స్, ట్రెండ్‌కు తగ్గట్టు మారిపోతూ ఉంటాయి. ప్రస్తుతం 'ధోతీ ప్యాంట్' తాజా ఫ్యాషన్ ట్రెండ్‌గా మారింది. ధోతీని తలపించే ఈ ప్యాంట్ ప్రత్యేకతలు ఇవే!



- కుర్తీ పొట్టిగా ఉన్నా, పొడవుగా ఉన్నా... స్లీవ్స్ ఉన్నా, లేకున్నా ధోతీ ప్యాంట్ చక్కగా సూటవుతుంది. వీటిలో సాదావే ధరించాలనే నియమం లేదు. డిజైన్ ఉన్నవీ ఎంచుకోవచ్చు
- అనార్కలి, అంబ్రెల్లా, స్ట్రెయిట్.... మోడల్ ఏదైనా కుర్తీకి కొత్త రూపం తీసుకురావాలంటే ధోతీ ప్యాంట్ ఎంచుకోవాలి.

అయితే ఈ ప్యాంట్ ఎంచుకునేటప్పుడు, పొడవు చీలమండలం వరకూ ఉండేలా చూసుకోవాలి. కురచగా ఉంటేనే ఈ తరహా ప్యాంట్లు అందంగా కనిపిస్తాయి

- క్యాజువల్ వేర్‌గా ధరించదగిన ఈ ప్యాంట్లకు శాండిల్స్, ఫ్లాట్స్ చక్కగా సూటవుతాయి. డ్రస్, సందర్భాలను బట్టి హై హీల్స్ కూడా వేసుకోవచ్చు
- వేడుకల కోసం, సెక్విన్స్ ఎంబ్రాయిడరీ కలిగిన ధోతీ ప్యాంట్స్ ఎంచుకోవచ్చు
- శాటిన్‌తో పాటు కాటన్ ధోతీ ప్యాంట్స్‌ను కూడా సందర్భానుసారంగా ఎంచుకోవచ్చు. వేసవిలో కాటన్ ధోతీ ప్యాంట్స్ ఎంతో సౌకర్యవంతంగా ఉంటాయి.

స్ట్రెచ్ మార్క్స్ పోయేదెలా?

బరువు పెరిగి తగ్గినప్పుడు, గర్భధారణ తరువాత చర్మంపై స్ట్రెచ్ మార్క్స్ ఏర్పడుతుంటాయి. ఇవి ఎక్కువగా కాళ్లు, భుజాలు, కడుపు, నడుము భాగాల్లో కనిపిస్తుంటాయి. వీటిని చిన్న చిట్కాలతో పోగొట్టుకోవచ్చు.

- రాత్రి పడుకునేముందు గోరువెచ్చగా వేడి చేసిన ఆముదాన్ని స్ట్రెచ్ మార్క్స్ మీద రాస్తూ సున్నితంగా మర్దన చేయాలి. ఉదయాన్నే వేడి నీళ్లతో స్నానం చేయాలి. ఇలా మూడు నెలలపాటు చేస్తూ ఉంటే క్రమంగా స్ట్రెచ్ మార్క్స్ మాయమవుతాయి.



- ఒక గాజు గిన్నెలో రెండు చెంచాల కలబంద జెల్, రెండు చెంచాల ఆలివ్ ఆయిల్, రెండు ఇ విటమిన్ క్యాప్సూల్స్‌లో ఉండే ఆయిల్ వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని వేలితో కొద్ది కొద్దిగా తీసుకుంటూ స్ట్రెచ్ మార్క్స్ మీద మర్దన చేయాలి. ఇలా రోజుకు మూడుసార్లు చేస్తూ ఉంటే మంచి ఫలితం కనిపిస్తుంది. కోకో బటర్, టీ ట్రీ ఆయిల్, జోజోబా ఆయిల్ లేదా కొబ్బరి నూనె రాస్తూ ఉన్నా ప్రయోజనం ఉంటుంది.
- రెండు చెంచాల బాదం నూనెలో అర చెంచా చక్కెర కలిపి స్క్రబ్‌లా వాడితే రక్తప్రసరణ జరిగి స్ట్రెచ్ మార్క్స్ తగ్గుతాయి.
- రెండు చెంచాల బంగాళదుంప రసంలో చిటికెడు పసుపు కలిపిన మిశ్రమాన్ని రాసినా ఫలితం కనిపిస్తుంది.
- తరచూ మంచినీళ్లు తాగుతూ చర్మం తేమగా ఉండేలా చూసుకోవాలి. చర్మానికి మేలు చేసే ఎ, సి, ఇ విటమిన్లు అధికంగా ఉండే పండ్లను తినాలి. వీటివల్ల పోషణ అంది చర్మం యథాస్థితికి వస్తుంది.

సంకల్పం

అల్ట్రా రన్‌లో అదరగొట్టారు

మట్టి రోడ్లు... కొండ కొనలు... ఇరవై వేల అడుగుల ఎత్తులో... నిటారుగా ఉన్న పర్వత మార్గాల ద్వారా సాగే పరుగు. ప్రపంచంలోనే అత్యంత కఠినమైన అల్ట్రా రన్‌గా చెప్పుకొనే 'బ్రెజిల్ 135'ను విజయవంతంగా పూర్తి చేశారు పూజా కృష్ణమూర్తి. రెండు దశాబ్దాలు పైబడిన మారథాన్ చరిత్రలో ఈ ఘనత సాధించిన మొట్టమొదటి భారతీయురాలిగా నిలిచారు. ఆ అనుభవాలు... దానికి సన్నద్ధమైన తీరు... ఆమె మాటల్లోనే...



"జనవరి పది... నా జీవితంలో ఒక చరిత్రాత్మక రోజు. అసాధ్యమనుకున్నది సాధించిన రోజు. 'బ్రెజిల్ 135 అల్ట్రా'ను విజయవంతంగా పూర్తి చేసిన రోజు. ఇలాంటి ఘట్టం ఒకటి నా జీవన ప్రయాణంలో ఉంటుందని ఎన్నడూ ఊహించలేదు. విశేషమేంటంటే... నేను కోరి రన్నర్‌ను కాలేదు. అసలు బ్రెజిల్ పరుగు నా ప్రణాళికల్లోనే లేదు. అన్నీ అలా జరిగిపోయాయంతే. కానీ ఒక్కటి మాత్రం కచ్చితంగా చెప్పగలను... కృషికి పట్టుదల తోడైతే అసాధ్యమన్నది లేదని. భారత ఆర్థిక రాజధాని ముంబయి మాది. సెయింట్ జేవియర్ కాలేజీలో పొలిటికల్ సైన్స్‌లో డిగ్రీ చదివాను. తరువాత సినీ రంగంపై మక్కువతో ఫిలిమ్ మేకింగ్ కోర్సు చేశాను. కొంత కాలం ఓ వాణిజ్య ప్రకటనల సంస్థలో ఉద్యోగం.

చిన్ననాటి అభిరుచి...

అయితే నాకు చిన్నప్పటి నుంచి పర్వతారోహణపై మక్కువ. నా ఆసక్తిని మా అమ్మ గమనించి... నన్ను, మా అక్క ప్రియను మౌంటెనీరింగ్ శిక్షణలో చేర్పించింది. ఆ తరువాత నుంచి మేం తరచూ హిమాలయాలకు వెళ్లడం మొదలుపెట్టాం. అమ్మ కూడా మమ్మల్ని ఎంతో ప్రోత్సహించేది. వయసుతో పాటు ట్రెక్కింగ్ అనుభవాలూ పెరుగుతూ వచ్చాయి. నాకైతే ఒక అభిరుచిగానే కాకుండా... జీవితంలో ఒక భాగం అయిపోయింది. నాలాంటి ఔత్సాహికులకు మార్గదర్శకులుగా వ్యవహరించడం, వారిని వెంటబెట్టుకొని పర్వతారోహణకు తీసుకువెళ్లడం... కొన్నేళ్లు ఇదే మా అక్కచెల్లెళ్ల ఉద్యోగం అయిపోయింది. దీనివల్ల తెలియకుండానే నాకు నాయకత్వ లక్షణాలు అబ్బాయి. శరీరం ఎంతో దృఢంగా మారింది.

అనుకోకుండా అలా...



అది 2011. మా అక్కకు తోడుగా ఉండటం కోసం నేను కూడా హాఫ్ మారథాన్‌కు పేరు నమోదు చేసుకున్నా. అప్పటివరకు నాకు అందులో అనుభవం లేదు. ఏకధాటిగా అన్ని కిలోమీటర్లు ఎప్పుడూ నడిచిందీ లేదు. అలా అనుకోకుండా పరుగు మొదలైంది. ఇక ఆ రోజు నుంచీ స్థానికంగా మారథాన్ జరిగితే వదిలిపెట్టలేదు. ఆరంభంలో పది కిలోమీటర్ల రేస్‌లకే పరిమితమయ్యాను. రణగొణ ధ్వనుల నుంచి ఉపశమనం పొందడానికి వారాంతాల్లో నగరానికి దూరంగా వెళ్లే ఉద్దేశంతో రేస్‌ల్లో పాల్గొనేదాన్ని. ఏడెనిమిదేళ్లు అలా గడిచిపోయాయి. రన్నింగ్‌ను ఒక అభిరుచిలాగానే కాకుండా, సవాలుగా తీసుకోవాలని అనుకున్నాను. దానికోసం వ్యక్తిగత కోచ్‌ను నియమించుకున్నాను. శిక్షణ మొదలుపెట్టాను. హాఫ్ మారథాన్ (21 కి.మీ.)లో పోటీపడ్డాను. ఎంతో ఉత్సాహంగా సాగిపోతోంది కెరీర్. అదేసమయంలో లాక్‌డౌన్ ప్రకటించడంతో రన్నింగ్‌కు బ్రేక్ పడింది.

రెండేళ్ల తరువాత...

రెండేళ్ల విరామం తరువాత 2022లో మళ్లీ రన్నింగ్ మొదలుపెట్టాను. నా ఫిట్‌నెస్‌ను తిరిగి సంపాదించుకోవడానికి ఎంతో కష్టపడాల్సివచ్చింది. అయితే నా కోచ్ అదిల్ మిర్జా అమెరికాలోని కాలిఫోర్నియాలో జరిగే 'బ్యాడ్‌వాటర్'కు అర్హత సాధించాడు. మండే ఎండల్లో మన సామర్థ్యానికి పరీక్ష పెట్టే 135 మైళ్ల అల్ట్రామారథాన్ అది. నాకు యూఎస్ వీసా ఉండటంతో అతడి సహాయక బృందం సభ్యురాలిగా వెళ్లాను. ఆ సమయంలో నా సామర్థ్యం చూసిన అదిల్... 'హాఫ్ మారథాన్‌లు ఎందుకు చేస్తున్నావు? నువ్వు అల్ట్రారన్నర్‌వి' అంటూ ప్రశంసించాడు. ఆ ప్రశంస నా ఆలోచననే కాదు, నా జీవితాన్నే మార్చేసింది.

మలుపు తిప్పిన పయనం...

కాలిఫోర్నియాలో భారత సంతతికి చెందిన అమెరికన్ రన్నర్ సోనియా అహూజాను కలిశాను. తను 'బ్రెజిల్ 135 అల్ట్రారన్' విన్నర్. 'బ్యాడ్‌వాటర్' పూర్తి చేసిన అనుభవం. ఆమెతో పరిచయం నన్ను మరో ఎత్తుకు తీసుకువెళ్లింది. కోచ్, సోనియా సలహాలు, సూచనలతో ముందుగా 'బ్రెజిల్ 135'కు వెళ్లాలని నిర్ణయించుకున్నాను. అయితే అప్పటివరకు నేను ఫుల్ మారథాన్ పరుగెత్తలేదు. అలాంటిది కఠినమైన బ్రెజిల్ మారథాన్‌ను ఎలా పూర్తి చేస్తావని చాలామంది సందేహం వ్యక్తం చేశారు. అవేవీ పట్టించుకోలేదు. ఎందుకంటే ట్రెక్కింగ్‌వల్ల నా కండరాలు దృఢంగా మారాయి. పరుగులోనూ అనుభవం ఉంది. కావల్సిందల్లా సరైన మార్గదర్శనం. అందుకు వీరిద్దరూ ఉన్నారు. ఆ ధైర్యంతోనే రెండేళ్ల కిందట లద్దాక్, అనంతరం పుణే మారథాన్‌లలో పాల్గొన్నాను.

ఏదైనా సాధ్యమే...

ఫుల్ మారథాన్‌లు పూర్తి చేసిన నేపథ్యంలో నాలో ఆత్మవిశ్వాసం రెట్టింపయింది. దాంతో ఈ నెల 10న జరిగిన 'బ్రెజిల్ 135 అల్ట్రామారథాన్'కు వెళ్లాను. 135 అనేది పరుగెత్తే దూరం... మైళ్లలో. అంటే 217 కిలోమీటర్లు. ఈ మార్గమంతా కొండ ప్రాంతాల మీదుగా సాగుతుంది. ఎంతో కఠినంగా ఉంటుంది. మన శక్తిసామర్థ్యాలకు అసలైన పరీక్ష. అరవై గంటల్లో పూర్తి చేయాలి. కానీ నేను 48 గంటల్లోనే ముగించాను. మొత్తంగా చూస్తే ఆరో స్థానంలో నిలిచాను. కానీ మహిళల్లో మొదటి స్థానం నాదే. ఈ ఘనత సాధించిన తొలి భారతీయ మహిళను నేనే అని తెలిశాక నా ఆనందానికి హద్దులు లేవు. ఎంతో గర్వంగా అనిపించింది. దీంతోపాటు మహిళను సాధికారత వైపు అడుగులు వేయించేందుకు నా వంతు బాధ్యత తీసుకున్నాను. అందుకోసం ఒక ఎన్‌జీఓతో కలిసి పని చేస్తున్నాను. మారథాన్ సందర్భంగా నా గళం వినిపించాను."

వీటితో నీరసం మాయం...

ఏ అనారోగ్యమూ లేకపోయినా, సమయానుసారం భోజనం చేసి నిద్రకు ఉపక్రమించినా ఒక్కోసారి నీరసం, నిస్సత్తువ ఆవహిస్తూ ఉంటాయి. అలాంటప్పుడు తినే ఆహారంలో కొన్ని మార్పులు చేసుకుంటే సరిపోతుంది.

- తేలికగా జీర్ణమయ్యే ఆహారాన్ని తీసుకోవాలి. వేడి వేడి అన్నంలో పలుచగా తయారు చేసిన పప్పు లేదా ఏదైనా కూర కలుపుకుని తింటే వెంటనే నీరసం తగ్గుతుంది.
- వివిధ రకాల కూరగాయలు, మిరియాలతో తయారు చేసిన కిచిడీని తినడం వల్ల నిస్సత్తువ తగ్గుతుంది. శరీరానికి తక్షణ శక్తి లభిస్తుంది.
- వేడి వేడిగా వెజిటబుల్ సూప్ తాగితే శరీరానికి కావాల్సిన పోషకాలు, నీరు లభిస్తాయి. ఉత్సాహంగా అనిపిస్తుంది.



- మధ్యాహ్న భోజనం చివరలో పెరుగన్నం తింటే ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. రాత్రి పడుకునేముందు ఒక గ్లాసు పలుచని మజ్జిగా తాగితే ఉదయానికల్లా నిరసం మాయమవుతుంది.
- నీరసంగా అనిపించినప్పుడు అరటిపండు తింటే వెంటనే ప్రయోజనం కనిపిస్తుంది. జంక్ ఫుడ్‌కు బదులు విటమిన్లు, ప్రొటీన్లు, మినరల్స్‌తో కూడిన పోషకాహారాన్ని తీసుకుంటే ఎప్పుడూ చురుకుగా, ఉత్సాహంగా ఉండవచ్చు.
- ఉదయం పూట అల్పాహారం తీసుకోవడం మానకూడదు. దాహంగా అనిపించకపోయినా కనీసం రెండు గంటలకు ఒకసారైనా గ్లాసుడు మంచినీళ్లు తాగుతూ ఉండాలి.
- శరీరంలో డి విటమిన్ లోపించినా నీరసంగా అనిపిస్తుంది కాబట్టి తృణధాన్యాలు, పాలు, గుడ్లు, చేపలను తప్పనిసరిగా ఆహారంలో చేర్చుకోవాలి. శరీరానికి సూర్యరశ్మి తగిలేలా చూసుకోవాలి.

స్ఫూర్తి

విధాతను ఢీకొన్న వనిత

సవాళ్లు ఎదురైనప్పుడు కొందరు కుంగిపోతారు. మరికొందరు వాటిని మెట్లుగా మార్చుకుని ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారు. బాల్య వివాహపు సంకెళ్లు, గృహహింస గాయాలు, ఒంటరి పోరాటం.. ఇలా ఎన్నో తుపానులను తట్టుకుని తన జీవిత నౌకను విజయతీరాలకు చేర్చారు సంతోషీ దేవ్. వంటింటికే పరిమితం కావాల్సిన చేతులతో ఆటో నుంచి భారీ ట్రక్కులను నడిపి నేడు ఒక విజయవంతమైన పారిశ్రామికవేత్తగా నిలిచిన ఈ ఒడిశా ధీరవనిత గాథ ఇది.

సంతోషీ దేవ్ కథ గెలుపు గురించి మాత్రమే కాదు, అది తిరుగుబాటు గురించి కూడా. 16 ఏళ్ల వయసులోనే తల్లిదండ్రులు ఆమెకు పెళ్లి చేశారు. హర్యానాలో అడుగుపెట్టిన ఆ చిన్నారికి ఎదురైంది పూలబాట కాదు... వరకట్న వేధింపులు, గృహహింస. భర్త వదిలేసినా కుంగిపోకుండా తన కుమార్తె భవిష్యత్తు కోసం మళ్లీ తన సొంతగడ్డ అయిన ఒడిశాలోని కియోంఝర్ చేరుకుంది. సింగిల్ మదర్‌గా తన బిడ్డను గౌరవంగా పెంచాలనే సంకల్పం ఆమెలో కొత్త శక్తిని నింపింది.

ఒడిశాలో తొలి మహిళా ఆటో డ్రైవర్‌గా

చెన్నైలో ఒక మహిళా ఆటోడ్రైవర్‌ను చూసినప్పుడు సంతోషిలో ఒక ఆలోచన మెరిసింది. 'ఆమె చేయగలిగింది నేను ఎందుకు చేయలేను' అనుకుంది. వెంటనే డ్రైవింగ్ నేర్చుకుని 2015లో కియోంఝర్ జిల్లాలోనే తొలి మహిళా ఆటో డ్రైవర్‌గా చరిత్ర సృష్టించింది. ఆటో స్టీరింగ్ పట్టుకున్న ఆ చేతులు వాహనాన్ని మాత్రమే కాదు, తన జీవితాన్ని కూడా సరైన దిశలో నడిపించడం మొదలుపెట్టాయి. సంతోషి ప్రయాణం అక్కడితో ఆగిపోలేదు. 2021లో భువనేశ్వర్‌లో 'మో బస్' (ప్రస్తుతం అమ బస్) నడిపిన తొలి మహిళా డ్రైవర్‌గా మరో మైలురాయిని చేరుకుంది. ఆ తర్వాత ఆమె తన పరిధిని మరింత విస్తరించుకుంటూ వెళ్లింది. కియోంఝర్‌లోని గ్యాలి మైనింగ్



ప్రాంతంలో 40 టన్నుల భారీ ట్రక్కును నడిపి పురుషులకు సాధ్యమనుకునే రంగంలో తన సత్తా చాటింది.

ఆటోలో 1,600 కిలోమీటర్లు

సంతోషి తన ఆటోలోనే కియోంఝర్ నుంచి ఢిల్లీ వరకు సుమారు 1,600 కిలోమీటర్లు ప్రయాణించడం ఆమె పట్టుదలకు నిదర్శనం. తానెదుర్కొన్న గృహహింస కేసులో న్యాయం కోసం, జాతీయ నాయకుల మద్దతు కోసం ఆమె చేసిన ఈ సాహసం అందరినీ ఆశ్చర్యపరిచింది. రామమందిర ప్రారంభోత్సవానికి కూడా ఆటోలోనే స్వయంగా డ్రైవ్ చేసుకుంటూ వెళ్లింది.



పారిశ్రామికవేత్తగా

ఒడిశా ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'అమ సువాహక్' పథకం సంతోషి జీవితంలో కొత్త వెలుగులు నింపింది. ఈ పథకం ద్వారా లభించిన వడ్డీలేని రుణం, సబ్సిడీలతో ఆమె నేడు ఒక ఫోర్ వీలర్‌కు యజమాని అయింది. డ్రైవర్‌గానే మిగిలిపోకుండా రవాణా రంగంలో ఒక మహిళా పారిశ్రామికవేత్తగా ఎదుగుతోంది.

ఒడిశా ముద్దుబిడ్డ

సంతోషి ప్రయాణాన్ని చూసి ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ ఆమెను 'కియోంఝర్ ముద్దుబిడ్డ' అని, ఒడిశాకు గర్వకారణమని కొనియాడారు. కష్టాలు ఎదురైనప్పుడు కన్నీళ్లు పెట్టుకోవడం కాదు, కసిగా పోరాడితే విజయం వరిస్తుందని సంతోషి దేవ్ నిరూపించింది.

కుమార్తెకు 'సూపర్ హీరో'

ప్రస్తుతం భువనేశ్వర్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న సంతోషి దేవ్ కుమార్తెకు తల్లి ఒక సూపర్ హీరో. గృహహింస బాధితురాలిగా కుంగిపోకుండా స్టీరింగ్ పట్టి శిఖరాలు అధిరోహిస్తున్న ఆమె ప్రస్థానం కష్టాల్లో ఉన్న ప్రతి మహిళకు స్ఫూర్తిదాయకం.

పచ్చి కొబ్బరితో ప్రయోజనాలెన్నో..!

పచ్చి కొబ్బరిని ఇష్టపడని వారుండరు. దీన్ని ఆహారంలో చేర్చుకోవడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు...

- పచ్చి కొబ్బరిలో ఉండే పీచు జీర్ణక్రియను వేగవంతం చేసి పొట్టను శుభ్రం చేస్తుంది. శరీరంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తుంది. ఆకలిని నియంత్రిస్తుంది.
- దీనిలో ఉండే మీడియం చెయిన్ ట్రైగ్లిసరైడ్స్. శరీరానికి తక్షణ శక్తిని అందిస్తాయి. గుండెకు అవసరమైన మంచి కొలెస్ట్రాల్‌ను ఉత్పత్తి చేస్తాయి. కాలేయంలో పేరుకునే వ్యర్థాలను తొలగిస్తాయి.
- కొబ్బరిలో ఉండే లారిక్ ఆమ్లం.. రోగనిరోధక శక్తిని పెంచుతుంది.
- దీనిలో బి, ఇ విటమిన్లతోపాటు మాంగనీస్, జింక్, పొటాషియం, కాపర్, ఐరన్, సిలీనియం లాంటి మినరల్స్ అధికంగా ఉంటాయి. ఇవి ఎముకలు, కండరాల వృద్ధికి తోడ్పడతాయి. మెదడును చురుకుగా ఉంచుతాయి. చర్మం బిగుతుగా నిగారించేందుకు, శిరోజాలు ఒత్తుగా పెరిగేందుకు దోహదం చేస్తాయి.
- తరచూ కొబ్బరి తినడం వల్ల శరీరంలో నీటిశాతం తగ్గకుండా ఉంటుంది. జీవక్రియలు వేగవంతమవుతాయి. శరీర ఉష్ణోగ్రత నియంత్రణలో ఉంటుంది.



- వ్యాయామం చేసినప్పుడు, ఆటలు ఆడిన తరువాత అధికంగా చెమట పట్టినట్లయితే పచ్చి కొబ్బరి తినడం మంచిది. దీని వల్ల శరీరానికి కావాల్సిన ఎలక్ట్రొలైట్లు భర్తీ అవుతాయి.
- పచ్చి కొబ్బరిని బెల్లంతో కలిపి తింటే శరీరానికి ఆక్సిజన్ సరఫరా పెరిగి అలసట తగ్గుతుంది. రక్తంలో హెమోగ్లోబిన్ శాతం పెరుగుతుంది.

స్విచ్ బోర్డులు మెరిసేలా...

- ముందుగా విద్యుత్ సరఫరాను ఆపాలి. చేతులకు గ్లౌజ్‌లు, కాళ్లకు చెప్పులు వేసుకోవాలి. చిన్న దూది ఉండ మీద కొద్దిగా నెయిల్ పాలిష్ రిమూవర్‌ను వేయాలి. దానితో స్విచ్ బోర్డులను రుద్దుతూ తుడిస్తే మరకలన్నీ తొలగిపోతాయి.
- చిన్న గిన్నెలో రెండు చెంచాల వెనిగర్, ఒక చెంచా నిమ్మరసం వేసి కలపాలి. పాత టూత్‌బ్రష్‌ను ఈ మిశ్రమంలో ముంచి దానితో స్విచ్ బోర్డులను రుద్ది ఆపైన పాత గుడ్డతో తుడిచేస్తే సరిపోతుంది.
- పాత బ్రష్ మీద కొద్దిగా షేవింగ్ క్రీమ్‌ను వేసి దానితో రుద్దినా మంచి ఫలితం కనిపిస్తుంది.



కఠిన నిర్ణయమే.. తప్పలేదు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

త్వరగా ముగిసిపోయినట్టు అనిపించింది ● ఇప్పుడే కోచ్ కావాలనుకోవడం లేదు

దేశ క్రీడా ముఖ చిత్రానికి తన రాకెట్‌తో కొత్త సొబగులద్దిన ఆమెను ఇకపై బ్యాడ్మింటన్ కోర్టులో చూడలేము. రెండేళ్లుగా తన శరీరం సహకరించకపోయినా ఇంకా ఆడాలన్న తపన ఆమెను బ్యాడ్మింటన్‌కు వీడ్కోలు పలకకుండా ఆపింది. మునుపటి వేగాన్ని ఇకపై అందుకోలేనని తెలిసి.. కఠిన నిర్ణయమే అయినా తప్పని స్థితిలో బ్యాడ్మింటన్‌కు సైనా నెహ్వాల్ గుడ్‌బై చెప్పింది. మూడు కామన్వెల్త్ స్వర్ణాలు, రెండు ఆసియాడ్ పతకాలు, లండన్ ఒలింపిక్స్‌లో కాంస్యం అన్నింటికి మించి వరల్డ్ నెంబర్ వన్ టైటిల్.. ఇలా చెప్పుకుంటే పోతే సైనా నెహ్వాల్ లిఖించిన రికార్డులు అనేకం. తన బ్యాడ్మింటన్ జీవిత విశేషాల గురించి ఆంధ్రజ్యోతితో సైనా పంచుకున్న విశేషాలు...

ఆమె మాటల్లోనే..

క్రీడాకారుల కెరీర్‌లో ప్రతి ఒక్కరు ఏదోఒక దశలో ఆటకు వీడ్కోలు పలకాల్సిందే. నా విషయంలో ఆ సమయం ఇప్పుడు వచ్చింది. రెండున్నర దశాబ్దాలకుపైగా బ్యాడ్మింటన్‌తో సహ జీవనం చేశా. వీడ్కోలు పలకాలన్న నిర్ణయం కఠినమైనదే కానీ, తప్పలేదు. 2023 సింగపూర్ ఓపెన్ తర్వాత మోకాలి సమస్యపై వైద్యులను సంప్రదించా. మోకాలులోని కార్టిలేజ్‌ను పునరుద్ధరించలేమని చెప్పారు. అలాగే ఆర్థరైటిస్ వచ్చింది. ఈ పరిస్థితుల్లో మునుపటిలా రోజుకు 8-9 గంటలు సాధన చేయడం అసాధ్యమని వైద్యులు చెప్పారు. ప్రస్తుత పోటీని తట్టుకొని నిలబడాలంటే నేను చేసే 1-2 గంటల సాధన సరిపోదు. ఆ ప్రాక్టీసు తర్వాత కూడా కాళ్ల వాపు, నొప్పులు రావడంతో చాలా ఇబ్బంది పడిన సందర్భాలున్నాయి. ఇక, పాత ఫామ్‌ను అందుకునేందుకు నా శరీరం సహకరించదని తెలుసుకున్నా. అందుకే రెండేళ్లుగా ఆటకు పూర్తిగా దూరమయ్యా. ఇదే విషయాన్ని నా కుటుంబ సభ్యులు, కోచ్‌లకు కూడా తెలియజేశా.

మానసికంగా ఆడాలని ఉన్నా..

సుదీర్ఘ ప్రయాణమే కానీ ఎందుకో కెరీర్ త్వరగా ముగిసిపోయినట్టు అనిపించింది. ఇప్పటికీ ఆడాలని మనసులో ఉంది కానీ, శరీరం సహకరించదని తెలిసి ఆ ప్రయత్నం చేయకపోవడమే శ్రేయస్కరమని ఈ నిర్ణయం తీసుకున్నా. వెనక్కి తిరిగి చూసుకుంటే చాలా సంతోషంగా అనిపిస్తోంది. వరల్డ్ నెంబర్‌వన్ కిరీటం, లండన్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం కెరీర్‌లో అత్యంత ఆనందాన్నిచ్చిన విజయాలు. ఈ ప్రయాణంలో నా వెన్నంటే నిలిచిన తల్లిదండ్రులకు, సహకరించిన కోచ్‌లకు, మిత్రులకు ధన్యవాదాలు.

ఆ సమయంలో అర్థం కాలేదు..

ఉదయాన్నే నిద్ర లేవడం, బస్సుల్లో ప్రయాణాలు, ఆర్థిక ఇబ్బందులు తదితర వ్యక్తిగత త్యాగాల గురించి ఆ సమయంలో అర్థం కాలేదు. వాటి ప్రతిఫలం ఆ తర్వాత చూశా. మంచి పెంపకం అంటే పిల్లలను కఠినంగా నియంత్రించడం, నిబంధనలు విధించడం కాదు. ఎలాంటి పరిస్థితులనైనా ఒంటరిగా ఎదుర్కోగలిగే వారిగా తీర్చిదిద్దినప్పుడే వారు విజయవంతమవుతారు. ఈ విషయంలో నా తల్లిదండ్రులు పడిన శ్రమ, వారు చేసిన త్యాగాలు నేను పెరిగేకొద్దీ అర్థమయ్యాయి. వారే లేకపోతే నేనీ స్థాయిలో ఉండేదాణ్ణి కాను.

వాంగ్, తైజుతో గట్టి పోటీ..

ఒలింపిక్స్‌తో సహా ప్రతీ పోటీలోనూ అనేక క్లిష్టమైన సవాళ్లు ఎదుర్కొన్నా. అయితే, అన్ని పోటీల్లో వాంగ్ యి హాన్ (చైనా), తైజు యింగ్ (చైనీస్ తైపీ)తో పోరును బాగా ఆస్వాదించేదాన్ని. వీరితో ఆట కోర్టుపై యుద్ధంలానే ఉండేది.

ఇప్పుడే కోచింగ్ చేపట్టను..

ప్లేయర్‌గా కెరీర్‌కు వీడ్కోలు పలికా కాబట్టి వెంటనే కోచ్‌గా మారిపోవాలని లేదు. కొంత సమయం తీసుకొని కొన్నేళ్ల తర్వాత ఆ విభాగంలోకి అడుగుపెడతా. అంతవరకు యువ షట్లర్లకు అవసరమైన సలహాలు, సూచనలిస్తా.

(హైదరాబాద్- ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి)

ఆఖరి అవకాశం

టీ20 మెగా టోర్నీకి రిహార్సల్ ● కెప్టెన్ సూర్యపై ఒత్తిడి

● హార్దిక్, బుమ్రా రాక ● నేటి నుంచి కివీస్‌తో ధనాధన్ పోరు



గంభీర్ సూర్య కుమార్

రాత్రి 7 గం. నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో

నాగ్‌పూర్: దాదాపు మరో మూడు వారాల్లో ప్రతిష్ఠాత్మక టీ20 వరల్డ్‌కప్‌నకు తెర లేవనుంది. ఈ మెగా టోర్నీకి ముందు భారత్ పొట్టి ఫార్మాట్‌లో తమ బలాబలాలను అంచనా వేసుకునేందుకు ఆఖరిసారిగా బరిలోకి దిగబోతోంది. నేటి నుంచి న్యూజిలాండ్‌తో ఐదు టీ20ల సిరీస్ జరగనుంది. అలాగే ఇటీవలే వన్డే సిరీస్‌ను ప్రత్యర్థికి కోల్పోయిన టీమిండియాకు ఈ సిరీస్ కీలకం కానుంది. జట్టులోని లోపాలను సరిదిద్దుకునేందుకు ఈ మ్యాచ్‌లను సద్వినియోగం చేసుకోవాలనుకుంటోంది. కెప్టెన్ సూర్యకుమార్ ఫామ్ అన్నింటికంటే ముఖ్యం కానుంది. 2024లో అతను సారథిగా బాధ్యతలు తీసుకున్నాక జట్టు 72 శాతం విజయాలతో మెరుగ్గానే ఆడుతోంది. పొట్టి ప్రపంచకప్ తర్వాత జట్టు ఆడిన ఎనిమిది ద్వైపాక్షిక సిరీస్‌లను కూడా గెలవడం విశేషం. అయితే సూర్య బ్యాట్ నుంచి మాత్రం పరుగులు రావడం లేదు. ఇలాంటి ఒత్తిడి మధ్య రాణించడంతో పాటు సిరీస్‌ను గెలిపించాల్సిన బాధ్యత కూడా అతడిపై ఉంది. అటు ప్రత్యర్థి న్యూజిలాండ్ ఇప్పటి వరకు భారత్‌లో టీ20 సిరీస్ గెలవలేదు. అందుకే 2024లో ఇక్కడ టెస్టు సిరీస్‌ను తాజాగా 37 ఏళ్ల తర్వాత వన్డే సిరీస్‌ను వశం చేసుకున్న మాదిరే పొట్టి ఫార్మాట్‌లోనూ సత్తా చూపాలనుకుంటోంది.

వన్‌డౌన్‌లో ఇషాన్: గాయం కారణంగా తిలక్ వర్మ తొలి మూడు మ్యాచ్‌లకు దూరమయ్యాడు. దీంతో మూడో నెంబర్‌లో ఇషాన్ కిషన్‌కు స్థానం కల్పించనున్నారు. ఇక గతేడాది 19 మ్యాచ్‌లాడిన సూర్య కేవలం 218 పరుగులే చేశాడు. దీంతో బ్యాటింగ్ పరంగా ఈ సిరీస్ అతడికి చావోరేవో లాంటిదే. ఓపెనర్ అభిషేక్ భీకర ఫామ్‌తో బౌలర్లను వణికిస్తుండగా.. శాంసన్ నిలకడ చూపాల్సి ఉంది. పేసర్ బుమ్రాతో పాటు ఆల్‌రౌండర్ హార్దిక్ జట్టులోకి రావడం సానుకూలాంశం. అర్ష్‌దీప్, హర్షిత్ ఇతర పేసర్లు. స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి బౌలింగ్‌ను కివీస్ బ్యాటర్లు పెద్దగా ఆడలేదు కాబట్టి అతను కీలకం కానున్నాడు.

తుది జట్లు (అంచనా)

భారత్: అభిషేక్, శాంసన్, ఇషాన్, సూర్యకుమార్ (కెప్టెన్), హార్దిక్, అక్షర్, రింకూ సింగ్, దూబే, బుమ్రా, హర్షిత్/అర్ష్‌దీప్, వరుణ్.

న్యూజిలాండ్: రాబిన్సన్, కాన్వే, రచిన్, మిచెల్, ఫిలిప్స్, చాప్‌మన్, నీషమ్, శాంట్నర్ (కెప్టెన్), హెన్రీ, సోఢీ, డఫీ.

పిచ్ భారత్‌లోని అతిపెద్ద మైదానాల్లో నాగ్‌పూర్ ఒకటి. పరిమిత ఓవర్ల మ్యాచ్‌ల్లో ఇక్కడ స్పిన్నర్లు కీలక పాత్ర పోషించారు. 2016లో చివరిసారి ఈ స్టేడియంలో జరిగిన టీ20 మ్యాచ్‌లో కివీస్ ముగ్గురు స్పిన్నర్లతో బరిలోకి దిగి భారత్‌ను 79 పరుగులకే కట్టడి చేసింది.



శాంట్నర్

ఆత్మవిశ్వాసంతో కివీస్: మిచెల్ శాంట్నర్ కెప్టెన్సీలో న్యూజిలాండ్ పూర్తి స్థాయి జట్టుతో పొట్టి ఫార్మాట్‌లో బరిలోకి దిగనుంది. అందుకే వన్డే సిరీస్ మాదిరే ఇందులోనూ ఆధిపత్యం చూపేందుకు ఎదురుచూస్తోంది. అటు వన్డే సిరీస్‌లో ఏడు వికెట్లతో ఆకట్టుకున్న పేస్ ఆల్‌రౌండర్ క్రిస్టియాన్ క్లార్క్‌ను తొలి మూడు టీ20ల కోసం ఎంపిక చేశారు. అలాగే రచిన్, హెన్రీ, డఫీ జట్టులోకి వచ్చారు. బ్యాటింగ్‌లో డారిల్ మిచెల్, ఫిలిప్స్ భీకర ఫామ్‌లో ఉండగా కాన్వే, రచిన్, రాబిన్సన్ కూడా కీలకం కానున్నారు.

జెమీమా అదుర్స్

ముంబైపై ఢిల్లీ విజయం — మహిళల ప్రీమియర్ లీగ్



జెమీమా (51 నాటౌట్)

వడోదర: ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ జెమీమా రోడ్రిగ్స్ (37 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్‌తో 51 నాటౌట్) అజేయ అర్ధసెంచరీతో రాణించింది. దీంతో మంగళవారం ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో డీసీ 7 వికెట్ల తేడాతో నెగ్గింది. అటు ముంబైకిది హ్యాట్రిక్ ఓటమి కావడం గమనార్హం. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ముంబై 20 ఓవర్లలో 5 వికెట్లకు 154 పరుగులు చేసింది. నాట్ సివర్ బ్రంట్ (65 నాటౌట్), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (41) మాత్రమే రాణించారు. ఆరంభంలో ఢిల్లీ బౌలర్ల ధాటికి పవర్‌ప్లేలో ముంబై 23/2 పరుగులతో కష్టాల్లో పడింది. ఈ దశలో సివర్-హర్మన్ జోడీ మూడో వికెట్‌కు 78 పరుగుల భాగస్వామ్యం సమకూర్చింది. శ్రీచరణికి మూడు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా జెమీమా నిలిచింది. ఓ మాదిరి ఛేదనలో ఢిల్లీ 19 ఓవర్లలో 3 వికెట్లకు 155 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్లు లీ (46), షఫాలీ (29) వేగంగా ఆడి తొలి వికెట్‌కు 63 పరుగులతో శుభారంభం అందించారు. అయితే వీరి నిష్క్రమణతో ఆట కాస్త నెమ్మదించినా.. కెప్టెన్ జెమీమా పోరాడింది. 36 బంతుల్లో అజేయ అర్ధసెంచరీ చేసిన తనకు వోల్వార్ట్ (17), కాప్ (10 నాటౌట్) సహకరించారు. దీంతో మరో ఓవర్ ఉండగానే ఢిల్లీ విజయం అందుకుంది.

సంక్షిప్త స్కోర్లు :ముంబై: 20 ఓవర్లలో 154/5 (సివర్ 65 నాటౌట్, హర్మన్ 41; శ్రీచరణి 3/33); **ఢిల్లీ:** 19 ఓవర్లలో 155/3. (జెమీమా 51 నాటౌట్, లీ 46, షఫాలీ 29; వైష్ణవి 1/20).

కోహ్లీ, రోహిత్‌కు షాక్?

కాంట్రాక్టుల్లో బి-గ్రేడ్‌కు మార్చనున్న బీసీసీఐ

ముంబై: సెంట్రల్ కాంట్రాక్టుల వ్యవహారంలో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలకు బీసీసీఐ షాకివ్వనుందని తెలుస్తోంది. టెస్టులు, టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించి, వన్డేలు మాత్రమే ఆడుతున్న వీరిద్దరినీ బి-గ్రేడ్‌కు మార్చే అవకాశముందని సమాచారం. ప్రస్తుతం ఉన్న ఎ-ప్లస్ గ్రేడ్‌ను పూర్తిగా తొలగించి ఇకపై ఎ,బి,సి గ్రేడ్‌లను మాత్రమే కొనసాగించాలని అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలెక్షన్ కమిటీ ప్రతిపాదించింది. అపెక్స్ కౌన్సిల్ దీన్ని ఆమోదిస్తే రో-కోకు బి-గ్రేడ్ తప్పదని భావిస్తున్నారు.

మలాయ్‌చుక్ ప్రపంచ రికార్డు

జపాన్‌పై ఆసీస్ గెలుపు

విండ్‌హోక్ (నమీబియా): ఆస్ట్రేలియాకు చెందిన విల్ మలాయ్‌చుక్ అండర్-19 వన్డే ప్రపంచకప్ చరిత్రలోనే వేగవంతమైన సెంచరీ (51 బంతుల్లో)తో అదరగొట్టాడు. దీంతో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో ఆసీస్ 8 వికెట్లతో జపాన్‌ను ఓడించి సూపర్ సిక్స్‌కు చేరింది. 202 పరుగుల లక్ష్యఛేదనలో మలాయ్‌చుక్ (55 బంతుల్లో 12 ఫోర్లు, 5 సిక్సర్లతో 102) చెలరేగడంతో ఆసీస్ 29.1 ఓవర్లలోనే గెలుపొందింది.


చాంపియన్ల ముందంజ

రెండోరౌండ్‌కు సినర్, కీస్ ● ఆస్ట్రేలియన్ ఓపెన్

మెల్‌బోర్న్: పురుషుల డబుల్ డిఫెండింగ్ చాంపియన్ యానిక్ సినర్ (ఇటలీ)ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ముందంజ వేశాడు. అలాగే మహిళల డిఫెండింగ్ చాంప్ మాడిసన్ కీస్ కూడా శుభారంభం చేసింది. మంగళవారం జరిగిన సింగిల్స్ ఆరంభ రౌండ్లో సినర్ 6-2, 6-1తో ఆధిక్యంలో ఉన్న దశలో ప్రత్యర్థి హ్యూగో గాస్టన్ (ఫ్రాన్స్)వాకోవర్ ప్రకటించాడు. దీంతో సినర్ రెండో రౌండ్లోకి ప్రవేశించాడు. మరోవైపు, తనకిదే చివరి ఆస్ట్రేలియన్ ఓపెన్ అని ప్రకటించిన మోన్‌ఫిల్స్. స్థానిక క్వాలిఫయర్ డేన్ స్వీనీ చేతిలో ఓటమి తప్పలేదు. మిగతా టాప్ ఆటగాళ్లలో 5వ సీడ్ ముసెట్టి, 9వ సీడ్ టేలర్ ఫ్రిట్జ్, 8వ సీడ్ బెన్ షెల్టన్, 15వ సీడ్ ఖచనోవ్ రెండో రౌండ్లోకి ప్రవేశించారు. మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో డిఫెండింగ్ చాంప్, 9వ సీడ్ మాడిసన్ కీస్ 7-6 (6), 6-1తో ఉక్రెయిన్‌కు చెందిన ఒలినీకోవాపై, 5వ సీడ్ రిబకినా 6-4, 6-3తో జువాన్‌పై, 10వ సీడ్ బెన్‌సిచ్ 6-0, 7-5తో బౌల్టర్‌పై, మాజీ చాంపియన్ నవోమి ఒసాకా 6-3, 3-6, 6-4తో రూజిక్ (క్రొయేషియా)పై, ఓస్టాపెంకో 6-4, 6-4తో స్రామ్‌కోవాపై గెలిచి రెండోరౌండ్ చేరారు.

డబుల్స్‌లో నిక్కీకి నిరాశ..: పురుషుల డబుల్స్ బరిలోకి దిగిన భారత ఆటగాడు నిక్కీ పూనాచకు నిరాశే ఎదురైంది. డబుల్స్ తొలి రౌండ్లో నిక్కీ/ప్రూచ్యా ఇసారో (థాయ్‌లాండ్) జోడీ స్పెయిన్ జంట మార్టినెజ్/మునార్ చేతిలో ఓటమిపాలైంది.

బసవారెడ్డి బోణీ అదిరింది..



అమెరికా తరఫున ఆడుతున్న తెలుగు సంతతి ఆటగాడు నిశేష్ బసవారెడ్డి ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో శుభారంభం చేశాడు. నాలుగు గంటలా 11 నిమిషాల పాటు సాగిన హోరాహోరీ పోరులో క్వాలిఫయర్ బసవారెడ్డి 4-6, 7-6(7), 6-7(3), 6-2, 6-3తో స్థానిక ఆటగాడు, 31 ఏళ్ల క్రిస్ ఓ కానెల్‌పై నెగ్గాడు. బసవారెడ్డి తల్లిదండ్రులు మురళీ రెడ్డి, ప్రసన్న అమెరికాలో స్థిరపడ్డారు.



ఒక్కరోజే రూ.5,100 పెరుగుదల

బంగారం @ రూ.1.53 లక్షలు

వెండిదీ అదే జోరు ● రూ.20,400 పెరిగిన కేజీ సిల్వర్
రూ.3.23 లక్షలకు చేరిక ● 'బులియన్'లో ఆగని రికార్డుల హోరు

న్యూఢిల్లీ: బులియన్ మార్కెట్లో రికార్డుల హోరు కొనసాగుతోంది. బంగారం, వెండి ధరలు రేసుగుర్రాల్లా దూసుకుపోతున్నాయి. మంగళవారం ఢిల్లీ స్పాట్ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (24 క్యారట్స్) బంగారం ఏకంగా రూ.1,53,200కు చేరి సరికొత్త రికార్డు సృష్టించింది. సోమవారం ముగింపుతో పోలిస్తే ఇది రూ.5,100 ఎక్కువ. మరోవైపు వెండి ధర కూడా మరింత భగ్గుమంది. కిలో వెండి ధర రూ.20,400 పెరిగి రూ.3.23 లక్షలకు చేరి రికార్డు సృష్టించింది.

ఫ్యూచర్స్ మార్కెట్లోనూ అదే హవా: ఫ్యూచర్స్ మార్కెట్లోనూ బంగారం, వెండి ధరలు పరుగులు తీస్తున్నాయి. మల్టీ కమోడిటీస్ ఎక్స్ఛేంజీ (ఎంసీఎక్స్)లో ఫిబ్రవరిలో డెలివరీ ఇచ్చే 10 గ్రాముల మేలిమి పసిడి ధర రూ.6,861 (4.7 శాతం) పెరిగి రూ.1,52,500 రికార్డు స్థాయికి చేరింది. కిలో వెండి ధర కూడా రూ.17,723 పెరుగుదలతో జీవితకాల గరిష్ఠ స్థాయి రూ.3,27,998కు చేరింది. గత రెండు రోజుల్లోనే ఎంసీఎక్స్‌లో కిలో వెండి ధర రూ.32,187 (11.18 శాతం) పెరగటం గమనార్హం. అంతర్జాతీయ ఫ్యూచర్స్ మార్కెట్లోనూ పసిడి, వెండి ధరలు సెగలు కక్కుతున్నాయి. ఫిబ్రవరిలో డెలివరీ ఇచ్చే ఔన్స్ (31.10 గ్రాములు) పసిడి ధర సోమవారంతో పోలిస్తే 147.5 డాలర్లు (3.21 శాతం) పెరిగి 4,742.17 డాలర్లకు చేరి సరికొత్త రికార్డు నమోదు చేసింది. మార్చిలో డెలివరీ ఇచ్చే ఔన్స్ వెండి ధరా 6.87 డాలర్ల (7.76 శాతం) లాభంతో 95.41 డాలర్ల రికార్డు స్థాయికి చేరింది.


మార్కెట్లోకి టయోటా ఈవీ

అర్బన్ క్రూయిజర్ ఇబెల్లా విడుదల



ముంబై: టయోటా కిర్లోస్కర్ మోటార్ (టీకేఎం).. దేశీయ మార్కెట్లోకి తొలి బ్యాటరీ ఎలక్ట్రిక్ వాహనం (బీఈవీ) అర్బన్ క్రూయిజర్ ఇబెల్లాను విడుదల చేసింది. అత్యాధునిక ఫీచర్లతో కూడిన ఈ కారును గుజరాత్‌లోని సుజుకీ మోటార్ ప్లాంట్‌లో ఉత్పత్తి చేయనున్నట్లు టీకేఎం డిప్యూటీ ఎండీ తడాషీ అసజుమా తెలిపారు. 49.61 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీ ఆప్షన్లతో ఇది అందుబాటులో ఉండనుంది. ఒకసారి చార్జింగ్‌తో 543 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుందన్నారు.

టాటా మోటార్స్ నుంచి 17 సరికొత్త ట్రక్కులు



న్యూఢిల్లీ: టాటా మోటార్స్. మార్కెట్లోకి సరికొత్త ట్రక్కులను తీసుకువచ్చింది. మంగళవారం నాడిక్కడ 7 నుంచి 55 టన్నుల సామర్థ్యం కలిగిన 17 ట్రక్కులను కంపెనీ విడుదల చేసింది. ఇందులో ఎలక్ట్రిక్ వాహన (ఈవీ) ట్రక్కులు కూడా ఉన్నాయి. అలాగే కొత్తగా అజురా సిరీస్‌లో మధ్య, తేలికపాటి వాణిజ్య వాహనాల (ఐఎల్ఎంసీవీ)ను తీసుకువచ్చింది. దీంతోపాటు ఇంటలిజెంట్ మాడ్యులర్ ఎలక్ట్రిక్ వెహికల్ ఆర్కిటెక్చర్ (ఐ-ఎంఈవీ) ఆధారంగా ఎలక్ట్రిక్ ట్రక్కుల శ్రేణి వాహనాలను టాటా ట్రక్స్.ఈవీ కింద మార్కెట్లోకి విడుదల చేసింది. ప్రస్తుత రవాణా రంగ అవసరాలకు తగ్గట్టుగా సరికొత్త రూపం, సదుపాయాలతో ఈ వాహన శ్రేణిని తీసుకువచ్చినట్లు టాటా మోటార్స్ ఎండీ, సీఈఓ గిరీష్ వాఘ్ వెల్లడించారు.

అమ్మకాల హోరు సూచీలు బేజారు

సెన్సెక్స్ 1,066 పాయింట్లు డౌన్, 83,000 దిగువకు చేరిక

353 పాయింట్లు నష్టపోయిన నిఫ్టీ. 25,232 వద్ద క్లోజింగ్

ఒక్కరోజే రూ.9.86 లక్షల కోట్ల మదుపరుల సంపద హాంఫట్



ముంబై: గ్రీన్‌లాండ్ స్వాధీనానికి సహకరించని దేశాలపై సుంకాల పోటు తప్పదంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేస్తున్న హెచ్చరికల ప్రభావం వరుసగా రెండో రోజు కూడా ఈక్విటీ మార్కెట్‌ను కల్లోలితం చేసింది. పెరిగిన భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల కారణంగా పెట్టుబడుల భద్రతపై అప్రమత్తమైన ఇన్వెస్టర్లు అమ్మకాలకు పరుగులు తీశారు. ట్రంప్ హెచ్చరికల నేపథ్యంలో ప్రపంచ మార్కెట్ల నుంచి కూడా ప్రతికూల పవనాలు వీచడం ఇన్వెస్టర్ సెంటిమెంట్‌ను బలహీనపరిచింది. దీనికి తోడు మన మార్కెట్ నుంచి తరలిపోతున్న విదేశీ నిధులు పరిస్థితిని మరింత బలహీనపరిచాయి.

ఇన్ని ప్రతికూలతల నేపథ్యంలో సెన్సెక్స్ 1065.71 పాయింట్లు నష్టపోయి 82,180.47 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఏకంగా 1,235.6 పాయింట్లు దిగజారి 82,010.58 పాయింట్ల కనిష్ఠ స్థాయిని నమోదు చేసింది. బీఎస్ఈలో 3,503 స్టాక్స్ నష్టాలతో ముగియగా కేవలం 780 స్టాక్స్ మాత్రమే లాభపడ్డాయి. 119 మాత్రం ఎలాంటి మార్పు లేకుండా స్థిరంగా ఉన్నాయి. నిఫ్టీ సైతం 353 పాయింట్లు నష్టపోయి 25,232.50 వద్ద ముగిసింది.

ఈ కల్లోలం ట్రంప్ పుణ్యమే...

పిడుక్కీ, బియ్యానికీ ఒకే మంత్రం అన్న చందంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విదేశీ విధానంలో ప్రధాన సాధనంగా సుంకాలను వాడుతూ ఉండడమే కల్లోలానికి కారణమన్నది విశ్లేషకుల అభిప్రాయం. ఆయన ధోరణి ప్రపంచంలోని ఆర్థిక మార్కెట్లన్నింటిలోనూ అసహనంతో కూడిన వాతావరణం సృష్టిస్తోంది. ఈ కారణంగా ఆటుపోట్లు పెరిగిపోయాయని, ఫలితంగా ఇన్వెస్టర్లు రిస్క్‌తో కూడిన అసెట్లను భారీగా విక్రయిస్తూ సురక్షిత పెట్టుబడి సాధనాల వైపు పరుగులు తీస్తున్నారని వారు విశ్లేషించారు. ఈ కారణంగానే ఇటీవల కాలంలో ఈక్విటీ మార్కెట్లు భారీగా నష్టపోతుంటే బంగారం, వెండి వంటి లోహాల ధరలు మాత్రం వెనుక చూపనేదే లేకుండా దూసుకుపోతున్నాయన్నారు. ఈ నేపథ్యంలోనే మార్కెట్ ఆటుపోట్ల తీరుతెన్నులను తెలిపే ఇండియా వీఐఎక్స్ ఇండెక్స్ సుమారు 8 శాతానికి చేరింది. సమీప భవిష్యత్తులో మార్కెట్లో ఆటుపోట్లు కొనసాగుతాయనేందుకు ఇది సంకేతం.

రెండు రోజుల్లో రూ.12 లక్షల కోట్ల నష్టం: మంగళవారం ఒక్క రోజే బీఎస్ఈలో లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ రూ.9,86,093.96 కోట్లు దిగజారి రూ.4,55,82,683.29 కోట్లకు (5.01 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది. సోమవారం నాటి నష్టాన్ని కూడా పరిగణనలోకి తీసుకుంటే రెండు సెషన్లలో ఇన్వెస్టర్లు రూ.12 లక్షల కోట్ల మేరకు సంపదను నష్టపోయారు.

రూపాయి బలహీనత: ఫారెక్స్ మార్కెట్లో దేశీయ కరెన్సీ రూపాయి బలహీనత కూడా ఈక్విటీ మార్కెట్‌ను వెన్నాడుతోంది. మంగళవారం అమెరికా డాలర్ మారకంలో రూపాయి 7 పైసలు నష్టపోయి చారిత్రక కనిష్ఠ స్థాయి 90.97 వద్ద ముగిసింది. డిసెంబరు 16వ తేదీన రూపాయి ఇంట్రాడేలో చారిత్రక కనిష్ఠ స్థాయి 91.14ని నమోదు చేసింది. అమెరికా సామ్రాజ్య విస్తరణ కాంక్ష.. వర్ధమాన మార్కెట్లపై ఒత్తిడిని పెంచిందని విశ్లేషకులంటున్నారు.

బడ్జెట్ ముందు అప్రమత్తత: ఫిబ్రవరి ఒకటో తేదీన కొత్త బడ్జెట్ ప్రతిపాదన నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తం కావడం కూడా మార్కెట్‌కు ప్రతికూలంగా మారింది. బడ్జెట్‌పై ప్రజల్లో భారీ అంచనాలున్నాయని.. ప్రధానంగా ఆర్థిక వృద్ధిలో జోరును పెంచి, ఉపాధి అవకాశాలు కల్పించగల, కన్స్యూమర్ డిమాండును పెంచగల చర్యలు ప్రభుత్వం ప్రకటించాలని వారు కోరుకుంటున్నారని పరిశీలకులంటున్నారు. అయితే ప్రభుత్వం మాత్రం అటు వృద్ధిని, ఇటు విత్త కన్సాలిడేషన్‌ను సమతూకం చేసే చర్యలు ప్రకటించే ఆస్కారం ఉన్నట్టు వారు చెబుతున్నారు.

ఫోన్ పే ఐపీఓకి సెబీ గ్రీన్‌సిగ్నల్: వాల్‌మార్ట్ సారథ్యంలోని పేమెంట్స్ సంస్థ ఫోన్‌పే పబ్లిక్ ఇష్యూకి మార్కెట్ నియంత్రణ మండలి సెబీ అనుమతించింది. ఎంతో కాలంగా కంపెనీ యాజమాన్యం పబ్లిక్ ఇష్యూ జారీ చేసే విషయం పరిశీలిస్తున్నదని, గత సెప్టెంబరులో కాన్ఫిడెన్షియల్ విధానంలో సెబీకి దరఖాస్తు పత్రాలు అందించిందని కంపెనీ వర్గాలు తెలిపాయి. కంపెనీ ఇప్పటికే మర్చంట్ బ్యాంకర్లను కూడా నియమించుకుంది. ఈ ఇష్యూ ద్వారా ఫోన్‌పే రూ.11,000-12,000 కోట్లు సమీకరించే ఆస్కారం ఉన్నట్టు చెబుతున్నారు.

యూపీలో ఏఎం గ్రూప్ కంప్యూట్ హబ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఏఎం గ్రూప్ తన కార్యకలాపాలను ఉత్తరప్రదేశ్‌కు విస్తరిస్తోంది. ఆ రాష్ట్రంలోని గ్రేటర్ నోయిడా ప్రాంతంలో 1,000 మెగావాట్ల సామర్థ్యం ఉన్న హై పెర్ఫార్మెన్స్ కంప్యూట్ హబ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. దీనికి సంబంధించి ఉత్తరప్రదేశ్ ప్రభుత్వంతో ఒక అవగాహనా ఒప్పందంపై సంతకాలు చేసినట్లు తెలిపింది. దాదాపు 2,500 కోట్ల డాలర్ల పెట్టుబడితో ఏర్పాటు చేసే ఈ ఏఐ ఇన్‌ఫ్రా హబ్ ప్రాజెక్టు మొదటి దశ 2028 నాటికి, తుది దశ 2030 నాటికి పూర్తవుతుందని ప్రకటించింది. హరిత ఇంధన రంగంలో ఉన్న గ్రీన్‌కో గ్రూప్ ప్రమోటర్లే ఏఎం గ్రూప్‌ను ప్రమోట్ చేశారు.

వింగ్స్ ఇండియాలో ఎయిర్‌బస్ కొత్త విమానాలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఈ నెల 28 నుంచి 31 వరకు హైదరాబాద్‌లో జరిగే 'వింగ్స్ ఇండియా 2026 వైమానిక ప్రదర్శనలో ఎయిర్‌బస్.. తన సరికొత్త విమానాలు, హెలికాప్టర్లను ప్రదర్శించనుంది. ఈ ఎయిర్‌షోలో ఏ321 నియో, ఏ220 విమానాలతో పాటు హెచ్160 హెలికాప్టర్, అనేక అవసరాలకు ఉపయోగపడే హెచ్125 విమానాన్ని కూడా ప్రదర్శించబోతున్నట్టు తెలిపింది. ఇందులో హెచ్125 విమానాన్ని కంపెనీ భారత్‌లోనూ అసెంబుల్ చేస్తోంది. వీటితో పాటు వైమానిక రంగానికి సంబంధించి తమ సేవల వివరాలను కూడా తమ స్టాల్‌లో వివరించనున్నట్టు తెలిపింది.

▸▸ బెంగళూరుకు చెందిన ఎనర్జీ టెక్ సంస్థ ఎక్స్‌పోనెంట్ ఎనర్జీతో ఎలక్ట్రిక్ ఇంటర్‌సిటీ బస్ సర్వీస్ ఆపరేటర్ ఫ్రెష్ బస్ ఒప్పందం కుదుర్చుకుంది. ఒప్పందంలో భాగంగా ర్యాపిడ్ చార్జింగ్ సదుపాయాలతో సుదూర ప్రాంతాలకు ప్రయాణించే విధంగా 250 ఎలక్ట్రిక్ స్లీపర్ బస్‌లను అందుబాటులోకి తీసుకురానుంది.

▸▸ బీఎండబ్ల్యూ గ్రూప్ భారత్‌లో గత ఏడాది (2025) 18,001 కార్లను విక్రయించింది. అంతకు ముందు ఏడాదితో పోల్చితే అమ్మకాల్లో 14 శాతం వృద్ధిని నమోదు చేసింది. గత ఏడాది బీఎండబ్ల్యూ 17,271 కార్లు, 730 మినీ కార్లు, 5,841 మోటార్‌సైకిళ్లను డెలివరీ చేసింది. గడచిన నాలుగేళ్లుగా కంపెనీ రెండంకెల వృద్ధిని నమోదు చేస్తూ వస్తోంది.

బిజినెస్

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,48,370 ▲	1,36,000 ▲	3,25,000 ▲
విజయవాడ	1,51,750 ▲	1,40,500 ▲	3,16,000 ▲
విశాఖపట్నం	1,52,530 ▲	1,36,100 ▲	3,40,000 ▲
రాజమండ్రి	1,48,360 ▲	1,36,000 ▲	3,01,000 ▲
ప్రొద్దుటూరు	1,49,000 ▲	1,37,080 ▲	3,10,000 ▲
ముంబై	1,47,409 ▲	1,35,027 ▲	3,09,345 ▲

'ఏఐ' ప్రయోజనాలు అందరికీ అందాలి

- లేకపోతే అదో గాలి బుడగే
- మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల

దావోస్ (స్విట్జర్లాండ్): ప్రతి ఒక్కరి జీవితాలను మెరుగు పరచడమే కృత్రిమ మేధ (ఏఐ) లక్ష్యం కావాలని అంతర్జాతీయ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల స్పష్టం చేశారు. దీని ప్రయోజనాలు అందరికీ సమానంగా అందలాన్నారు. లేకపోతే అదో గాలి బుడగలా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఏఐ ప్రయోజనాలు కేవలం టెక్ కంపెనీలు, సరఫరాలకే పరిమితమైతే అదో చెప్పుడు కథలా మారుతుందన్నారు. స్విట్జర్లాండ్‌లో జరుగుతున్న వార్షిక ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యుఈఎఫ్) సదస్సులో ఆయన ఈ విషయాలు స్పష్టం చేశారు. ఏఐ సాయంతో ఫార్మా కంపెనీలు కొత్త ఔషధాలు, ఔషధ పరీక్షలను ఎంత వేగంగా పూర్తి చేస్తాయనే విషయాన్ని పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. ఏఐ, ఇతర అధునాతన సాంకేతిక పరిజ్ఞానాలతో ఉత్పాదకత పెరగడంతో పాటు పని విధానాలూ మారిపోతున్న విషయాన్ని నాదెళ్ల గుర్తు చేశారు.


ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

21వ తేదీ			
హైదరాబాద్	500	విజయవాడ	500
వరంగల్	502	గోదావరి	495
చిత్తూరు	523	విశాఖపట్నం	500
		డజను గుడ్లు రూ.	75

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	156	విజయవాడ	157
వరంగల్	156	గుంటూరు	164
కరీంనగర్	156	ఒంగోలు	164
మహబూబ్‌నగర్	156	చిత్తూరు	164
కర్నూలు	156	నెల్లూరు	169
విశాఖపట్నం	145	అనంతపురం	169
గోదావరి	157		

ఛీఛీ.. సాక్షి.. యాక్ ఛీ!


No. 2?4/86 B2 dt.14-11-86 Collector's Office Visakhapatnam.

PROCEEDINGS OF THE DISTRICT COLLECTOR VISAKHAPATNAM
Present: K.V.Rao, I.A.S

Sub: Land-Alienation of land-Visakhapatnam Dist and Mandal-Paradesipalem village S.No.100 P Ac.1.50-Alienation in favour of Andhra Jyothi Handing over of land-Orders issued.

ORDER:

Pending finalisation of alienation proposals the Mandal Revenue Officer, Visakhapatnam is hereby directed to hand over an extent of Ac.1.50 in S.No.100 part of Paradesipalem village to the representative of Andhra Jyothi for establishment of Andhra Jyothi Press at Visakhapatnam.

The Mandal Revenue Officer, Visakhapatnam is also requested to fix up reasonable market value for the land and submit proposals in complete shape within a fortnight without fail.

He should hand over the land immediately and send delivery receipt for record in this office.

sd. K.V.Rao
Collector
Visakhapatnam

(true copy)

Huzur Sheristhadar

To
The Mandal Revenue Officer, Visakhapatnam
Copy to the Revenue Divisional Officer, Visakhapatnam
Copy to M/s Adhra Jyothi Press, Vijayawada.

'ఆంధ్రజ్యోతి'కి 1986లో పరదేశీపాలెంలో స్థలం కేటాయిస్తూ అప్పటి ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వు.

(మొదటి పేజీ తరువాయి)

అబద్ధాలను వండి వార్చింది. భూ కేటాయింపు తీరు, 'ప్రత్యామ్నాయం'గా ఇచ్చిన స్థలం, కోర్టు ఉత్తర్వులు, ప్రభుత్వ ఆదేశాలు, ఆయా తేదీలు... ఇలా అన్ని అంశాల్లోనూ 'యాక్ ఛీ' అబద్ధాలే! తప్పుడు సమాచారం అందించి సొంత పాఠకులను పక్కదారి పట్టించింది. 'ఆంధ్రజ్యోతికి భూ కేటాయింపు' అంటూ సోమవారమే సోషల్ మీడియాలో 'నీలి విషం' చిమ్మారు. ఇక... రోత పత్రిక మంగళవారం మరింత రోతగా వాంతి చేసుకుంది. 'ఆంధ్రజ్యోతి'ని అపఖ్యాతి పాలుచేయాలనే ఆత్రంతో తానే బురదలో కూరుకుపోయింది. కూటమి సర్కారు నిజంగానే 'ఆంధ్రజ్యోతి'కి భూమిని నజరానాగా ఇచ్చిందా? దీనిపై 'యాక్ ఛీ' పత్రిక రాసిందేమిటి? అసలు వాస్తవాలు ఏమిటి?

రోత పత్రిక: 'ఆంధ్రజ్యోతికి భూ నజరానా! 15 కోట్ల విలువైన భూమి కేటాయింపు!

అసలు నిజం: 'ఆంధ్రజ్యోతి'కి చంద్రబాబు కొత్తగా భూ నజరానా ఇచ్చిందేమీ లేదు. 1986లోనే అంటే, జగన్మోహన్ రెడ్డి బడికి వెళ్లే వయసులో, నాడు ఎన్టీఆర్ ముఖ్యమంత్రి ఉండగా 'ఆంధ్రజ్యోతి'కి విశాఖలోని పరదేశీపాలెంలో 1.5 ఎకరాల భూమిని కేటాయించారు. నాడు ఎకరం 10వేల చొప్పున మార్కెట్ విలువ చెల్లించాకే భూమిని కేటాయించారు. అయితే, ఆ తర్వాతి క్రమంలో అదే భూమిలో 74 సెంట్ల ను జాతీయ రహదారి కోసం తీసేసుకున్నారు. 'ఆంధ్రజ్యోతి'కి మిగిలింది 76సెంట్లు మాత్రమే. అది పత్రిక కార్యాలయ నిర్మాణ అవసరాలకు సరిపోయేంత విస్తీర్ణం కాదు. దీంతో ఆ స్థలాన్ని ఉపయోగించుకోలేకపోతున్నామని, హైవే విస్తరణ (బఫర్ జోన్) కోసం తీసుకున్న భూమికి ప్రత్యామ్నాయంగా అంతే విస్తీర్ణంలో స్థలాన్ని కేటాయించాలని 2016లో రాష్ట్ర ప్రభుత్వాన్ని 'ఆంధ్రజ్యోతి' కోరింది. ఈ విన్నపాన్ని పరిశీలించిన నాటి ప్రభుత్వం... 1986లో కేటాయించి, హైవేకోసం తీసుకోగా మిగిలిన 76 సెంట్లకు ఆనుకుని వెనుక వైపున 50 సెంట్లు, పక్కన 24 సెంట్లు కేటాయించింది. ఇది కూడా ఉచితంగా కాదు. ఆ రోజున్న మార్కెట్ (రిజిస్ట్రేషన్ బుక్ వ్యాల్యూ ప్రకారం) విలువ మేరకు రూ.50 లక్షలను 'ఆంధ్రజ్యోతి' చెల్లించింది. హైవే బఫర్ జోన్‌కోసం కోల్పోయిన భూమికి బదులుగా ఇస్తున్న భూమి కాబట్టి... కొత్తగా ధర చెల్లించాల్సిన అవసరం లేదని వాదించే అవకాశమున్నా 'ఆంధ్రజ్యోతి' ఆ పని చేయలేదు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రూ.50 లక్షలు చెల్లించింది. పైగా... రాష్ట్రంలో మీడియా సంస్థలు, కంపెనీలు, సంస్థలకు సంబంధించి 2012లో తీసుకొచ్చిన నూతన భూ కేటాయింపు విధానం, రెవెన్యూ బోర్డు స్టాండింగ్ ఆర్డర్స్ (బీఎస్ఓ) ప్రకారమే ప్రభుత్వం నడుచుకుంది. ఇదీ అసలు విషయం. వెరసి... 'ఆంధ్రజ్యోతి'కి కూటమి సర్కారు నజరానా ఇవ్వడం నిజం కాదు. ఎన్టీఆర్ హయాం నుంచీ పెండింగ్‌లో ఉన్న ఒక అంశాన్ని పరిష్కరించడమే ఇప్పుడు జరిగింది.

రోత పత్రిక: 'ఆంధ్రజ్యోతి'కి భూకేటాయింపు నిబంధనలకు విరుద్ధమని తేలడంతో 2020లో వైసీపీ ప్రభుత్వం దీనిని రద్దు చేసింది.

అసలు నిజం: 'ఆంధ్రజ్యోతి' అంటే జగన్‌కు విద్వేషం. రాజకీయంగా భజన చేయదన్న కోపం. అందుకే, 2019లో అధికారంలోకి రాగానే విశాఖలోని 'ఆంధ్రజ్యోతి' భూమిపై కన్నేశారు. భూమిని తీసుకున్న తర్వాత మూడేళ్లలోగా భవనం నిర్మించలేదు కాబట్టి దానిని ప్రభుత్వం ఎందుకు వెనక్కి తీసుకోకూడదో వివరణ ఇవ్వాలని నోటీసులు ఇప్పించారు. నిజానికి 'ఆంధ్రజ్యోతి'కి భూమి కేటాయిస్తూ 2017లో ఇచ్చిన జీఓ 251 ప్రకారం ఇంకా మూడేళ్ల కాలపరిమితి పూర్తవ్వలేదు. అప్పటికి తమకిచ్చిన భూమిలో ఉన్న కొండలు, గుట్టలను తొలగించే పనిలో 'ఆంధ్రజ్యోతి' చాలావరకు పనులు పూర్తి చేసింది. అయినా సరే... నాటి జగన్ ప్రభుత్వం కక్షకొద్దీ నోటీసులు జారీ చేసింది. దీనిని సవాలు చేస్తూ 2019 అక్టోబరులో 'ఆంధ్రజ్యోతి' సంస్థ హైకోర్టును ఆశ్రయించింది. ఈ విషయంలో చట్టప్రకారమే నడుచుకోవాలని జగన్ సర్కారును న్యాయస్థానం ఆదేశించింది. అయినా నాటి జగన్ సర్కారు పట్టించుకోలేదు. భూ కేటాయింపు నిబంధనల ఉల్లంఘనలు జరిగాయంటూ రెవెన్యూ బోర్డు స్టాండింగ్ ఆర్డర్స్ (బీఎస్ఓ) 24(6)(3) ప్రకారం ఆ భూమిని ఎందుకు వెనక్కి తీసుకోకూడదో 10 రోజుల్లోగా వివరణ ఇవ్వాలని మరోసారి 2019 నవంబరు 25ననోటీసులు జారీ చేసింది. ఎలాంటి ఉల్లంఘనలు జరగలేదని 'ఆంధ్రజ్యోతి' వివరణ ఇచ్చింది. అయినప్పటికీ... 'ప్రజా ప్రయోజనాల కోసం' అంటూ 2020 జనవరి 30వ తేదీన జీఓ 21 జారీ చేసి, 'ఆంధ్రజ్యోతి'కి కేటాయించిన భూములను నాటి జగన్ సర్కారు స్వాధీనం చేసుకుంది. ఈ నిర్ణయాన్ని 'ఆంధ్రజ్యోతి' హైకోర్టులో సవాల్ చేసింది. నాటి ఉత్తర్వులను పక్కన పెడుతూ 2024 నవంబరులో తుది తీర్పు వెలువడింది.

రోత పత్రిక: విశాఖపట్నం రూరల్ మండలం పరదేశీపాలెంలో 'ఆంధ్రజ్యోతి'కి 2012లో 1.5 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించింది.

నిజం: ప్రభుత్వ ఉత్తర్వులు, దాని వెనక నడిచిన ఫైళ్ల, సమాచారం గురించిన కనీస పరిశీలన కూడా చేయకుండానే జగన్ 'యాక్ ఛీ' పత్రిక అబద్ధాలను అచ్చోసిందనడానికి ఇదే నిదర్శనం. 1986లో తొలుత కేటాయించిన భూమిలో కోల్పోయిన స్థలానికి ప్రత్యామ్నాయంగా... 2017 జూన్ 28న ప్రభుత్వం జీఓ 251 ద్వారా 'ఆంధ్రజ్యోతి'కి ప్రత్యామ్నాయ భూమిని కేటాయించింది. 2012లో వచ్చిన నూతన భూకేటాయింపు విధానంలోని అంశాలను అనుసరించి ఈ ఉత్తర్వులు జారీ చేసింది. అంతే తప్ప... 'యాక్ ఛీ' చెప్పినట్లుగా 2012లో ఎకరన్నర రాసివ్వలేదు.

రోత పత్రిక: ప్రజాప్రయోజనాలకు విరుద్ధంగా భూమి కేటాయించినట్లు నిర్ధారణ అవ్వడంతో 2020లో వైసీపీ ప్రభుత్వం ఆ ఉత్తర్వును రద్దుచేసింది.

నిజం: 'ప్రజాప్రయోజనాలకు విరుద్ధం' అనేది ఒట్టి సాకు మాత్రమే. ఆ కారణంపై 'ఆంధ్రజ్యోతి'కి నోటీసులే ఇవ్వలేదు. ఇది స్వయానా రాష్ట్ర హైకోర్టు చెప్పింది.

రోత పత్రిక: 'ఆంధ్రజ్యోతి'కి భూ కేటాయింపు రద్దు నిర్ణయంపై చట్టప్రకారం ముందుకెళ్లాలని హైకోర్టు గత ఏడాది నవంబరు 29న తీర్పు ఇచ్చింది

నిజం: ఇదో పచ్చి అబద్ధం. చట్టప్రకారం ముందుకు వెళ్లాలని 2019 అక్టోబరు 17న హైకోర్టు జగన్ సర్కారును ఆదేశించింది. ఇక... 2024 నవంబరు 29న హైకోర్టు ఈ కేసులో తుది తీర్పు ఇచ్చింది. 'ఆంధ్రజ్యోతి'కి భూ కేటాయింపు రద్దు ఉత్తర్వుల(జీఓ 21) అమలును నిలిపివేసింది. 'యాక్‌ఛీ' చెప్పినట్లుగా గత ఏడాది (2025)లో దీనికి సంబంధించి ఎలాంటి ఉత్తర్వులూ లేవు.

రోత పత్రిక: చట్టప్రకారం ముందుకెళ్లాలని గత ఏడాది నవంబరు 29న హైకోర్టు ఇచ్చిన తీర్పును సాకుగా చూపించి చంద్రబాబు ప్రభుత్వం గతంలో ఇచ్చిన భూమి కంటే విలువైన భూమిని 'ఆంధ్రజ్యోతి'కి ఉచితంగా కేటాయించింది

నిజం: కనీస వివరాలు, విలువలు లేకుండానే కథనం రాశారనేందుకు ఇది మరో నిదర్శనం. భూకేటాయింపును రద్దు చేస్తూ జగన్ సర్కారు ఇచ్చిన ఉత్తర్వులను 2024లోనే హైకోర్టు పక్కన పెట్టేసింది. 2017లో అన్ని రకాల చట్టాల ప్రకారమే 'ఆంధ్రజ్యోతి'కి ప్రభుత్వం ప్రత్యామ్నాయ భూమి కేటాయించింది. హైకోర్టు తీర్పు ప్రకారం ఆ ఉత్తర్వులను అమలు చేయాల్సిందే. ప్రస్తుత ప్రభుత్వం చేసిందదే!

రోత పత్రిక: గతంలో ఇచ్చిన భూమికంటే విలువైన భూమిని 'ఆంధ్రజ్యోతి'కి ఉచితంగా ఇచ్చారు.

నిజం: కాలకూట విషం కక్కడమంటే ఇదే! మరెక్కడో అతి ముఖ్యమైన ప్రదేశంలో, మరింత విలువైన భూమిని 'ఆంధ్రజ్యోతి'కి చంద్రబాబు కేటాయించారన్నట్లుగా 'యాక్ ఛీ' పత్రిక చిత్రీకరించింది. ఇది నిజం కానే కాదు. 1986లో ఎన్టీఆర్ హయాంలో ఇచ్చిన స్థలంలో హైవే బఫర్ జోన్‌కు తీసుకోగా మిగిలిన స్థలానికి వెనుకవైపు 50 సెంట్లు, పక్కన 24 సెంట్లను ఇప్పుడు కేటాయించారు. హైవేను ఆనుకుని ఉన్న భూమికి ప్రత్యామ్నాయంగా... వెనుకా, పక్కనా స్థలం ఇచ్చారు. మరి... రహదారికి ఆనుకుని ఉన్న భూమి విలువైనదా? వెనకాల ఉన్న భూమి విలువైనదా?

హైకోర్టు తీర్పు అపహాస్యం...

భూమిని వెనక్కి తీసుకోవడానికి ఇచ్చిన నోటీసుల్లో ప్రభుత్వం 'ఆంధ్రజ్యోతి'పై చేసిన ఆరోపణలు, ఆ తర్వాత భూమిని వెనక్కి తీసుకోవడానికి చూపిన కారణాల మధ్య తేడా ఉన్నట్లు హైకోర్టు గుర్తించింది. తొలుత ఇచ్చిన నోటీసులో... 'నిబంధనలకు విరుద్ధంగా భూకేటాయింపు' అని పేర్కొని, తర్వాత 'ప్రజా ప్రయోజనాల కోసం' పేరిట భూములను లాక్కోవడాన్ని హైకోర్టు ప్రశ్నించింది. నిజంగా, ప్రజా ప్రయోజనాల కోసం ఆ భూమి అవసరమైతే, దానికి సంబంధించిన విధి విధానాల ప్రకారం నడుచుకుని ఉండాల్సిందని స్పష్టం చేసింది. 'ఆంధ్రజ్యోతి'కి భూకేటాయింపు రద్దు చేస్తూ జారీ చేసిన జీవోను 2024 నవంబరు 29న హైకోర్టు నిలిపివేసింది. అంతేకాదు... 'కనీసం బుర్రపెట్టి ఆలోచించకుండా ఆ ఉత్తర్వు జారీ చేశారు' అని కర్రుకాల్చి వాతలు పెట్టింది. 'యాక్ ఛీ' పత్రిక తన కథనంలో ఈ వివరాలేవీ ప్రస్తావించకుండా, పాఠకులను తప్పుదారి పట్టించే తప్పుడు కథనం ప్రచురించింది. చంద్రబాబు సర్కారు 'ఆంధ్రజ్యోతి'కి అప్పనంగా 74 సెంట్ల స్థలం ఇచ్చేశారన్నట్లుగా విషం కక్కింది.

అది ఉచితం కాదు...

'ఆంధ్రజ్యోతి'కి చంద్రబాబు సర్కారు ఇప్పుడు అప్పనంగా, అయాచితంగా, ఉచితంగా విలువైన భూమి కేటాయించినట్లుగా 'యాక్‌ఛీ' పత్రిక వాపోయింది. ఇందులో ఒక్క అక్షరం కూడా నిజం కాదు. 1986లో ఎన్టీఆర్ హయాంలో తొలుత భూమి కేటాయించినప్పుడు అప్పటి మార్కెట్ (రిజిస్ట్రేషన్ వాల్యూ) విలువ చెల్లించిన తర్వాతే భూమి కేటాయించారు. ఇక... హైవే బఫర్ జోన్‌కోసం తీసుకుని భూమికి ప్రత్యామ్నాయంగా ఇచ్చిన స్థలానికీ 'ఆంధ్రజ్యోతి' రూ.50 లక్షలు చెల్లించింది. ఇక... 'ఉచితం' ప్రస్తావన ఎక్కడ?

13 నెలలు... బుల్లెట్ వేగమా?

'ఆంధ్రజ్యోతి'కి భూమి ఇచ్చేందుకు బుల్లెట్ వేగంతో ఫైలు నడిపారని... కేవలం 12 రోజుల్లోనే ఫైలు క్లియర్ అయిందని 'యాక్ ఛీ' పత్రిక తన అజ్ఞానాన్ని చాటుకుంది. 'ఆంధ్రజ్యోతి'కి భూ కేటాయింపును రద్దుచేస్తూ ఇచ్చిన ఉత్తర్వులను హైకోర్టు 2024 నవంబరు 29న పక్కన పెట్టేసింది. రోత పత్రిక వాపోతున్నట్లుగా 'ఫైలు బుల్లెట్ వేగం'తో కదిలి ఉంటే ఎప్పుడో 'ఆంధ్రజ్యోతి'కి న్యాయం జరిగేది. కానీ... ఈ విషయంలో ప్రభుత్వ యంత్రాంగం పద్ధతి ప్రకారం నడుచుకుంది. 2024 డిసెంబరు 21న... అంటే తీర్పు వచ్చిన 23 రోజుల తర్వాత అప్పటి రెవెన్యూశాఖ స్పెషల్ సీఎస్ దీనిపై స్పందించారు. హైకోర్టు తీర్పు మేరకు చర్యలు చేపట్టాలని ఆదేశిస్తూ విశాఖ కలెక్టర్‌కు మెమో జారీ చేశారు. తమకు కేటాయించిన భూమిలో 74 సెంట్లు ఎన్‌హెచ్-5 బఫర్ జోన్‌లో ఉందని, తమకు ప్రత్యామ్నాయ భూమి ఇవ్వాలని 'ఆంధ్రజ్యోతి' 2025 జనవరిలో విశాఖ కలెక్టర్‌ను కోరింది. ఈ విషయంలో నిర్ణయం తీసుకోవాలని విశాఖ కలెక్టర్ 2025 ఏప్రిల్‌లో రెవెన్యూ శాఖకు ప్రతిపాదన పంపించారు. దీనిని రెవెన్యూశాఖ పరిశీలించి... ఆర్థిక శాఖ, హౌసింగ్ విభాగాల అభిప్రాయాలు తీసుకుంది. 'ఆంధ్రజ్యోతి' కోల్పోయిన స్థలం విలువ ఎక్కువా? లేక ప్రత్యామ్నాయంగా అడుగుతున్న భూమి విలువ ఎక్కువా? అని ఆరాతీసింది. అడుగుతున్న దానికంటే, కోల్పోయిన భూమి విలువే ఎక్కువని నిర్ధారణకు వచ్చింది. 'ప్రత్యామ్నాయ భూమి' కేటాయింపునకు అంగీకరించింది. 2025 అక్టోబరు 30న జరిగిన ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ మేనేజ్‌మెంట్ అథారిటీ (ఏపీఎల్ఎంఏ)లో దీనిపై తీర్మానం చేశారు. ఆ తర్వాత నెలన్నరకు... అంటే డిసెంబరులో భూ మార్పిడి ప్రతిపాదనను మంత్రివర్గ ఆమోదం కోసం పంపించారు. భూ మార్పిడి ప్రతిపాదనకు ఆమోదం తెలుపుతూ 2025 డిసెంబరు 12న రెవెన్యూశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. 2024లో హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చిన 13 నెలలకుగానీ తుది ఉత్తర్వులు వెలువడలేదు. ఇది బుల్లెట్ వేగమా?

'ఎనిమిదేళ్ల' లెక్క ఎక్కడిది?

'ఆంధ్రజ్యోతి'కి 2012లో భూమిని కేటాయిస్తే, ఎనిమిదేళ్ల తర్వాత కూడా నిర్మాణాలు చేపట్టలేదని, అందువల్లే వైసీపీ ప్రభుత్వం భూ కేటాయింపును 2020లో రద్దుచేసిందని 'యాక్ ఛీ' పత్రిక పేర్కొంది. నిజానికి ఈ మొత్తం వివాదంలో '2012' అనే ప్రస్తావన లేనే లేదు. తొలుత భూమి కేటాయించింది 1986లో. తర్వాత ప్రత్యామ్నాయ స్థలం కేటాయించింది 2017లో. ఆపై మూడేళ్ల గడువు కూడా ముగియకముందే నాటి జగన్ సర్కారు 'రద్దు' ఉత్తర్వులు జారీ చేసింది. ఎనిమిదేళ్ల కాల వ్యవధి అనేది బూటకం. జగన్ పత్రిక కల్పిత కట్టుకథ. జీఓలు, ఉత్తర్వుల్లో కనిపించని మాయ అది.

కోర్టు తీర్పు తేదీలూ తెలియవా?

'హైకోర్టు తీర్పు రాకముందే... గత ఏడాది అక్టోబరు 30న ఏపీఎల్ఎంఏలో 'ఆంధ్రజ్యోతి'కి భూ మార్పిడి చేసేందుకు ఆమోదం తెలిపారు' అని జగన్ పత్రిక అచ్చోసింది. ఇది.. అజ్ఞానమా లేక లేని బురద జల్లేందుకు ప్రదర్శించిన వికారమా? వాళ్లకే తెలియాలి. ఎందుకంటే... హైకోర్టు తీర్పు వచ్చింది 2024 నవంబరు 29న. దీనిపై ఏపీఎల్ఎంఏ తీర్మానం జరిగింది 2025 అక్టోబరు 30న. అంటే... తీర్పు ఇచ్చిన 11 నెలలకు తీర్మానం జరిగింది. అయినా సరే... 'తీర్పు రాకముందే' అంటూ చీప్ రాతలు రాసేసింది.

ఇన్నాళ్లకు... ఇప్పుడే ఈ ఏడుపు ఎందుకో?

'ఆంధ్రజ్యోతి'కి ప్రత్యామ్నాయ స్థలం కేటాయిస్తూ 2025 డిసెంబరు 12వ తేదీనే రెవెన్యూ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. జగన్ హయాంలోలాగా జీవోలను ఇప్పుడు చీకటి కొట్లలో వేసి బంధించడంలేదు. అందరికీ అందుబాటులోనే ఉన్నాయి. అంటే... ఈ విషయం జగన్ పత్రికకు అప్పుడే తెలిసినా, నెల తర్వాతే విషం చిమ్మడానికి కారణమేమిటి? తెలంగాణలో తన 'అస్మదీయుల'కు ఇబ్బంది తలెత్తడాన్ని జీర్ణించుకోలేక, ఇప్పుడు ఈ రూపంలో 'ఆంధ్రజ్యోతి'పై అక్కసు వెళ్లగక్కారని అర్థమవుతోంది.

జోగి బ్రదర్స్‌కు బెయిల్!

నకిలీ మద్యం తయారీ కేసులో మంజూరు

- అయినా బయటకు రాలేని పరిస్థితి
- మరో కేసులో బెయిల్ పిటిషన్లపై కొనసాగుతున్న విచారణ

విజయవాడ, జనవరి 20(ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం తయారీ కేసులో మాజీ మంత్రి జోగి రమేశ్, ఆయన సోదరుడు రాముకు విజయవాడ ఆరో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. విజయవాడలోని భవానీపురం ఎక్సైజ్ పోలీసులు నమోదు చేసిన నకిలీ మద్యం తయారీ కేసులో జోగి రమేశ్ ఏ18గా, రాము ఏ19గా ఉన్నారు. ఈ కేసులో తమకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ కొద్ది రోజుల క్రితం వీరు పిటిషన్లు దాఖలు చేశారు. వాటిపై వాదప్రతివాదనలు ముగియడంతో న్యాయాధికారి జి.లెనిన్‌బాబు మంగళవారం తీర్పును వెలువరించారు. ఇరువురికీ బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఒక్కొక్కరు రూ.50 వేల చొప్పున రెండు పూచీకత్తులు సమర్పించాలని నిర్దేశించారు. కోర్టు అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లరాదని, ఈ కేసులో నిందితులు, సాక్షులుగా ఉన్నవారిని కలవరాదని షరతులు విధించారు. జోగి బ్రదర్‌ను గతేడాది నవంబరు 2న ఎక్సైజ్ సిట్ అధికారులు అరెస్టు చేశారు. తొలుత నెల్లూరులోని కేంద్ర కారాగారంలో వీరిని ఉంచారు. తర్వాత కోర్టు ఆదేశాలతో విజయవాడలోని జిల్లా జైలుకు తరలించారు. ఇప్పటి వరకు 80 రోజులపాటు వీరు జైల్లో ఉన్నారు. ఈ కేసులో బెయిల్ మంజూరైనా వీరు బయటకు రాలేని పరిస్థితి ఉంది. ములకలచెరువు ఎక్సైజ్ పోలీసులు నమోదు చేసిన కేసులోనూ వీరు నిందితులుగా ఉన్నారు. ఆ కేసులోనూ వీరు బెయిల్ పిటిషన్లు దాఖలు చేయగా, వాటిపై మదనపల్లె కోర్టులో విచారణ కొనసాగుతోంది. దీంతో ఇక్కడి కోర్టులో బెయిల్ వచ్చినప్పటికీ జైల్లోనే ఉండాల్సిన పరిస్థితి.

విజయసాయిరెడ్డి అప్రూవర్‌గా మారాలి: వర్ల

పిడుగురాళ్ల, జనవరి 20(ఆంధ్రజ్యోతి): 'జగన్‌కు అన్నివిధాలా తోడుగా వున్న ఏ 2 విజయసాయిరెడ్డికి ఈడీ నుంచి పిలుపు అందింది. ఆయన అన్ని విషయాలను అధికారులకు చెప్పి అప్రూవర్‌గా మారాలి. అప్పుడు కనీసం ప్రజలు విజయసాయిరెడ్డిని కాస్త మంచి వ్యక్తిగానైనా చెప్పుకుంటారు' అని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య అన్నారు. మంగళవారం పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో విలేకరులతో ఆయన మాట్లాడారు. 'జగన్‌లాంటి దుష్టశక్తులను రాజకీయాల నుంచి వెలివేయాలి. అతని ఆలోచనలను సమూలంగా నాశనం చేయాలి. మద్యం కేసులో అన్ని దారులు జోగి రమేశ్ వైపే చూపిస్తున్నాయి. ఎంపీ మిథున్‌రెడ్డికి ఈడీ నుంచి పిలుపు అందితే జగన్ వెన్నులో వణుకు పుడుతుంది. 11 సీట్లకు పరిమితమయ్యాక తమ ఉనికిని కాపాడుకునే ప్రయత్నంలో భాగంగానే వైసీపీ నేతలు ప్రతి చిన్న విషయానికి రాజకీయ రంగు పులుముతున్నారు' అని వర్ల విమర్శించారు.

ఈ-పంట నమోదుకు ఏఈవోలు దూరం

అమరావతి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రైతు సేవా కేంద్రాల్లో ఈ-పంట నమోదుకు వ్యవసాయ విస్తరణ అధికారుల(ఏఈవో)ను నియమించబోమని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు హామీ ఇచ్చినట్లు రాష్ట్ర వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం అధ్యక్షుడు వేణుమాధవరావు తెలిపారు. మంగళవారం విజయవాడలోని క్యాంప్ కార్యాలయంలో సంఘ నేతలు మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా సంఘం డైరీని అచ్చెన్న ఆవిష్కరించారు. ఏఈవోల జాబ్‌చార్ట్ తదితర సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చినట్లు వేణుమాధవరావు తెలిపారు. వ్యవసాయశాఖ డైరెక్టర్ జిలానీ ఏఈవోల డైరీని విడుదల చేశారు.

ఉగాది నుంచి 'గ్రీన్ కవర్'

- 50% పచ్చదనానికి కార్యాచరణ ప్రణాళిక
- అమలులో శాఖలన్నీ భాగస్వామ్యం కావాలి
- గ్రీన్ కవర్, గ్రేట్ గ్రీన్‌వాల్ ప్రాజెక్టుల్లో దేశీయ మొక్కలకు అధిక ప్రాధాన్యం
- డిప్యూటీ సీఎం పవన్ సమీక్ష



అమరావతి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని 50 శాతం పచ్చదనంతో నింపే 'గ్రీన్ కవర్' ప్రాజెక్టులో అన్ని శాఖలు త్రికరణ శుద్ధిగా భాగస్వామ్యం కావాలని ఉపముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ఈ లక్ష్య సాధనకు ఉగాది పండుగలోపు అన్ని శాఖలు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఉగాది నుంచి గ్రీన్‌కవర్ ప్రాజెక్టు అమలు కావాలని నిర్దేశించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో గ్రీన్‌కవర్, గ్రేట్ గ్రీన్‌వాల్ ప్రాజెక్టులపై ఆయా శాఖల ఉన్నతాధికారులతో ఆయన సమీక్షించారు. కాలుష్యాన్ని నియంత్రించే మొక్కలు నాడటంతో పాటు తీర ప్రాంతాల్లో పెనుగాలులు, ఉప్పునీటిని తట్టుకునే మొక్కల పెంపకానికి పరిశ్రమల శాఖ సిద్ధం కావాలని సూచించారు. 'గ్రీన్‌కవర్, గ్రేట్ గ్రీన్‌వాల్ ప్రాజెక్టుల్లో దేశీయ మొక్కలకు ప్రాధాన్యం ఇవ్వాలి. రాష్ట్రాన్ని 50 శాతం పచ్చదనంతో నింపే ఈ ప్రాజెక్టుకు సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. 2047 నాటికి ఈ లక్ష్యాన్ని సాధించాలి. ఇందుకోసం 32.60 లక్షల ఎకరాల్లో మొక్కలు నాటాల్సి ఉంది. ప్రస్తుతం రాష్ట్రంలో 30 శాతం గ్రీనరీ ఉండగా, 2030 నాటికి 37శాతం పచ్చదనాన్ని నింపాలి. వచ్చే నాలుగేళ్లలో ఏడు శాతం గ్రీనరీ పెంచడానికి గాను దాదాపు తొమ్మిది లక్షల హెక్టార్లలో మొక్కలు నాటాలి. ఈ యజ్ఞంలో అన్ని శాఖలు తమవంతు పాత్ర పోషించాలి. 12 శాతం మొక్కలు నాటే బాధ్యతను ఉద్యానశాఖ స్వీకరించాలి. ప్రతి మొక్కా పర్యావరణ పరిరక్షణకు ఉపయోగపడాలి. అటవీ, పర్యావరణ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, నీటి పారుదల, పాఠశాల విద్య, ఆర్అండ్‌బీ, వ్యవసాయ, పరిశ్రమల శాఖ, రైల్వే తదితర శాఖలు తమ పరిధిలో ఈ లక్ష్యాన్ని ప్రణాళికాబద్ధంగా తీసుకెళ్లాలి. జాతీయ, రాష్ట్ర రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటాలి. 970 ఎకరాల తీర ప్రాంతంలో 40శాతం అటవీశాఖ పరిధిలో ఉండగా, మిగతా భూభాగంలోనూ గ్రీన్ కవర్ చేపట్టాలి. రైతుల భూముల్లో దీర్ఘకాల ఫలాలు ఇచ్చేలా పండ్ల మొక్కలు పెంచాలి. కాలువలు, చెరువుల గట్లపైనా తప్పనిసరిగా మొక్కలు నాటాలి. ఈప్రాజెక్టుకు నిధుల కేటాయింపుపై సీఎంతో చర్చిస్తాం. వచ్చే నెల 5న జరిగే సమావేశానికి ఆయా శాఖలు పూర్తిస్థాయి ప్రణాళికలతో రావాలి' అని పవన్ దిశానిర్దేశం చేశారు.

సీమ ద్రోహి జగన్!

వైసీపీ పాలనలో ప్రాజెక్టులు పూర్తిగా నిర్వీర్యం

ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ధ్వజం

- భైరవానితిప్ప కాలువ పనుల పరిశీలన
- 2029లోపు పూర్తి చేసి.. చెరువులు నింపుతామని వెల్లడి



బీటీపీ కాలువ పనులను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

బ్రహ్మసముద్రం, కళ్యాణదుర్గం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో ప్రాజెక్టులు పూర్తిగా నిర్వీర్యమయ్యాయని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం మండల పరిధిలోని బోరంపల్లి, ఒంటిమిద్దె, బ్రహ్మసముద్రం మండల పరిధిలోని పొబ్బర్లపల్లి ప్రాంతాల్లో జరుగుతున్న భైరవానితిప్ప ప్రాజెక్టు(బీటీపీ) కాలువ పనులను కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుతో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ పాలనలో గంపెడు మట్టి తియ్యకుండా దోచుకో, దాచుకో అన్నట్లు వ్యవహరించారని విమర్శించారు. రాయలసీమ ద్రోహిగా జగన్ చరిత్రలో నిలిచిపోయారన్నారు. అప్పటి మంత్రి ఉషశ్రీచరణ్ దందాలు, దోపిడీలకు ఈ ప్రాంతాన్ని అడ్డాగా మార్చేశారని ఆరోపించారు. కళ్యాణదుర్గం, రాయదుర్గం ప్రాంతాలకు జీవనాడి అయిన బీటీపీ గురించి ఐదేళ్ల పాలనలో జగన్ ఏమాత్రం పట్టించుకోలేదని అమిలినేని సురేంద్రబాబు తెలిపారు. ఈ ప్రాంత రైతులను నట్టేట ముంచారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం బీటీపీ కాలువ పనులను ముందుకు తీసుకెళ్తుంటే ఓర్వలేక, సీమ ద్రోహులు రాజకీయ విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. ఇలాంటి నాయకులను రాజకీయంగా భూస్థాపితం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. 2029లోపు బీటీపీ కాలువ పనులను పూర్తి చేసి, కృష్ణాజలాలతో చెరువులను నింపుతామన్నారు. ఈ కాలువ ద్వారా కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని 114 చెరువులు, రాయదుర్గం నియోజకవర్గంలోని కుడి, ఎడమ కాలువల ద్వారా 12 వేల ఎకరాలకు సాగు, తాగునీరు అందుతుందని తెలిపారు.

జగన్ హయాంలో దళిత నరమేధాన్ని మర్చిపోలేదు: ఎంఎస్ రాజు

అమరావతి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలో దళితులపై జరిగిన నరమేధాన్ని ఇంకా ఎవరూ మర్చిపోలేదని టీటీడీ బోర్డు సభ్యుడు, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ హయాంలో దళితులపై జరిగిన ఊచకోతలపై దళిత సంఘాలు చర్చకు సిద్ధంగా ఉన్నాయన్నారు. గురజాలలో ఇద్దరి వ్యక్తుల మీద జరిగిన దాడిని పార్టీలకు ఆపాదించడం హేయమైన చర్య అన్నారు. కూటమి ప్రభుత్వంలోనే దళితులకు రక్షణ అని తెలిపారు. డీజీపీ కార్యాలయం ముందు సోమవారం వైసీపీ రౌడీషీటర్లు ధర్నా డ్రామా ఆడటం విడ్డూరంగా ఉందన్నారు.

యూరియా మోతాదు మించితే పంటలకు విషం

- ఎన్జీ రంగా వర్సిటీ వీసీ జయలక్ష్మిదేవి హెచ్చరిక

అమరావతి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పంటలకు యూరియా అధిక మోతాదులో విచక్షణారహితంగా వాడటం వల్ల అనేక దుష్పరిణామాలు ఎదురవుతాయని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉపకులపతి (వీసీ) శారదా జయలక్ష్మిదేవి హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'యూరియాను శాస్త్రీయంగా 4:2:1 నిష్పత్తికి బదులు 7:2:8:1 నిష్పత్తిలో రైతులు విపరీతంగా వాడుతున్నారు. దీంతో నేల నిస్సారం కావడం, తెగుళ్ల పెరగడం, పెట్టుబడులు పెరగడం, వాతావరణ, నీటి కాలుష్యం ఏర్పడతాయి. శాస్త్రవేత్తలు, ప్రభుత్వం సూచించిన కొన్ని ఆధునిక పద్ధతులతో ఈ సమస్యను అధిగమించొచ్చు. 500 మిల్లీలీటర్ల నానో యూరియా (బాటిల్) 45 కిలోల (బస్తా) యూరియాకు సమానం. భూసార పరీక్షల ద్వారా 20 శాతం వరకు యూరియా వాడకాన్ని తగ్గించొచ్చు. వేప పూత పూసిన (నీమ్ కోటెడ్) యూరియా వాడకం వల్ల నత్రజని మొక్కలకు ఎక్కువ కాలం అందుబాటులోకి ఉంటుంది. యూరియా అనేది పంటకు మందు లాంటిది. మోతాదు మించితే విషంగా మారుతుంది. సుస్థిర, లాభదాయక వ్యవసాయానికి శాస్త్రీయ పద్ధతులు పాటించాలి' అని వీసీ సూచించారు.

డీజీపీ రామచంద్రరావు సస్పెన్షన్

- కర్ణాటక ప్రభుత్వం ఉత్తర్వులు

బెంగళూరు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): రాసలీలల ఆరోపణలు ఎదుర్కొంటున్న డైరెక్టరేట్ ఆఫ్ సివిల్ రైట్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (డీసీఆర్ఈ) డీజీపీ కె.రామచంద్రరావును సస్పెండ్ చేస్తూ కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన అశ్లీల వీడియోలు వైరల్ కావడంతో ముఖ్యమంత్రి సిద్దరామయ్య విచారణకు ఆదేశించారు. సీనియర్ ఐపీఎస్ అధికారిగా రామచంద్రరావు నిబంధనలు ఉల్లంఘించారని ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ వ్యవహారం ప్రభుత్వానికి ఇబ్బందిగా పరిణమించిందని, ఈ క్రమంలోనే ఆయన్ను సస్పెండ్ చేస్తున్నట్టు వెల్లడించింది. సస్పెన్షన్ సమయంలో రామచంద్రరావు ఎట్టి పరిస్థితుల్లోనూ హెడ్‌క్వార్టర్ వీడి వెళ్లరాదని ఆదేశించింది. కాగా.. ప్రస్తుతం బయటపడిన రాసలీలల వీడియోలు రామచంద్రరావు బెళగావి విభాగం ఐజీపీగా పనిచేస్తున్న నాటివని సమాచారం. మరోవైపు వీడియోలు వైరల్ కాగానే తాను పది రోజులపాటు సెలవులో వెళుతున్నట్టు కార్యాలయ సిబ్బందికి ఆయన సమాచారం ఇచ్చినట్టు తెలిసింది. ప్రభుత్వం శాఖాపరమైన చర్యలు తీసుకోవచ్చని భావించి, ఆయన ముందుగానే సెలవులో వెళ్లినట్టు తెలుస్తోంది. ఈ అంశంపై హోం మంత్రి పరమేశ్వర్ కోలారు జిల్లా కేజీఎఫ్‌లో మంగళవారం మీడియాతో మాట్లాడారు. చట్టం ముందు అందరూ సమానమేనని, ఇటువంటి సంఘటనలు ఎవరికీ గౌరవం కాదని తెలిపారు. అనారోగ్యం కారణంగా తాను సోమవారం విశ్రాంతి తీసుకున్నానని, మధ్యాహ్నం తర్వాత సమాచారం తెలిసిన వెంటనే ముఖ్యమంత్రితో చర్చించానని తెలిపారు.

శ్రీశైలం ప్లంజ్‌పూల్ మరమ్మతుకు సాంకేతిక నిపుణుల బృందం

» ఏర్పాటు చేసిన జలసంఘం

అమరావతి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ప్లంజ్ పూల్ మరమ్మతు పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థనపై కేంద్ర జలసంఘం సాంకేతిక నిపుణుల బృందాన్ని నియమించింది. తన చీఫ్ ఇంజనీర్ (డిజైన్స్) వివేక్ త్రిపాఠి అధ్యక్షతన పై బృందాన్ని ఏర్పాటుచేసింది. ఇందులో సోమేశ్‌కుమార్, సుమంత్, అరుణ్ ప్రతాప్, మధుకాంత్ గోయల్ (జల సంఘం), మనీశ్ గుప్తా (సీఎస్ఎంఆర్ఎస్) ఎంకే వర్మ (సీడబ్ల్యూపీఆర్ఎస్), శైలేంద్రసింగ్ (జియొలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా), శ్రీశైలం డ్యాం చీఫ్ ఇంజనీర్ సభ్యులుగా ఉంటారు. బృందం ప్రాజెక్టు ప్రాంతంలో పర్యటించి ప్లంజ్‌పూల్ మరమ్మతులు ఎలా చేయాలో అధ్యయనం చేస్తుంది.

హాస్టళ్లలో తనిఖీలకు జేఏసీలు

» తొమ్మిది శాఖల అధికారులతో ఏర్పాటు

ప్రభుత్వ విద్యాసంస్థలు, సంక్షేమ వసతి గృహాల్లో తనిఖీలు నిర్వహించేందుకు తొమ్మిది శాఖల అధికారులతో జాయింట్ యాక్షన్ కమిటీలు ఏర్పాటు చేయాలని ఆరోగ్యశాఖ ఆదేశించింది. రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ కమిటీ చేసిన సిఫారసుల మేరకు జిల్లా కలెక్టర్లకు ఆరోగ్యశాఖ కమిషనర్ వీర పాండియన్ మంగళవారం ఈ ఉత్తర్వులు జారీ చేశారు. వైద్య ఆరోగ్య శాఖ, ఆహార భద్రత, పంచాయతీ, మున్సిపల్, పశుసంవర్థక, వ్యవసాయ, బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖలు, గ్రామీణ నీటి పారుదల, విద్యాశాఖ జిల్లా అధికారులతో కలిపి జిల్లాల కలెక్టర్లు జేఏసీలు ఏర్పాటు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ కమిటీలు క్రమం తప్పకుండా విద్యాసంస్థలు, వసతిగృహాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలి. విద్యార్థులు జ్వరాలు, విరోచనాలు, చర్మవ్యాధులతో విద్యార్థులు బాధపడుతున్నారా.? ప్రాథమిక చికిత్సకు కనీస మందులు అందుబాటులో ఉంటున్నాయా..? తదితర అంశాలను సభ్యులు పరిశీలించాల్సి ఉంది.

మిషన్ వాత్సల్యకు 40 కోట్లు అదనపు నిధులు

రాష్ట్రంలో అనాథ, కుటుంబ సంరక్షణ లేని చిన్నారులకు కుటుంబ వాతావరణాన్ని కల్పించేందుకు ఉద్దేశించిన మిషన్ వాత్సల్య పథకానికి ప్రభుత్వం రూ.40,52,78,725 అదనపు నిధులు మంజూరు చేసింది. ఎవరూ లేని చిన్నారులకు కుటుంబ వాతావరణంలో ప్రేమ, భద్రత కల్పించేందుకు నాన్-ఇన్‌స్టిట్యూషనల్ కేర్ పథకం కింద అమలవుతున్న స్పాన్సర్ షిప్, ఫోస్టర్ కేర్, ఆఫ్టర్ కేర్ కార్యక్రమాల అమలుకు ఈ అదనపు నిధులు వినియోగించనున్నారు. మంగళవారం రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి సూర్యకుమారి ఈ ఉత్తర్వులు జారీ చేశారు.

20 స్కూళ్లకు స్వచ్ఛ-హరిత్ రేటింగ్

రాష్ట్రంలోని 20 పాఠశాలలకు స్వచ్ఛ ఏవం హరిత్ రేటింగ్ లభించింది. పాఠశాలల్లో స్వచ్ఛమైన తాగునీరు, మరుగుదొడ్ల నిర్వహణ, పరిశుభ్రత, పచ్చదనం తదితర అంశాల ప్రామాణికంగా పాఠశాలలకు ఈ రేటింగ్ ఇస్తారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, గుంటూరు, ఎన్టీఆర్, ప్రకాశం, నెల్లూరు, అన్నమయ్య జిల్లాల్లోని పాఠశాలలు రేటింగ్‌కు ఎంపికయ్యాయి. గణతంత్ర దినోత్సవం రోజున ఆ పాఠశాలల హెచ్ఎంలకు సర్టిఫికెట్లు అందజేస్తారు.

బాలికలకు మరుగుదొడ్లు తప్పనిసరి!

» స్కూల్ ఇన్‌ఫ్రా కమిషనర్ రంజిత్ బాషా ఉత్తర్వులు

అమరావతి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో బాలికలకు మరుగుదొడ్లు తప్పనిసరిగా ఏర్పాటుచేయాలని స్కూల్ ఇన్‌ఫ్రా కమిషనర్ పి.రంజిత్ బాషా కలెక్టర్లకు ఉత్తర్వులు జారీచేశారు. ఇందుకోసం సమగ్రశిక్ష వద్ద ఉన్న నిధులను వినియోగించుకోవాలని సూచించారు. ఫిబ్రవరి 20 నాటికి అన్ని పాఠశాలల్లో బాలికల మరుగుదొడ్లు ఉండేలా కాల పరిమితితో ప్రణాళిక రూపొందించాలని నిర్దేశించారు.

ఊరికో రేటు..!

» పంపిణీ నష్టాల నివారణ పనుల్లో కక్కుర్తి

» లైనిక్స్ కండక్టర్లతో నష్టాల తగ్గింపునకు ట్రాన్స్‌కో నిర్ణయం

» 200 కి.మీ.ల మేర కండక్టర్ల మార్పిడికి టెండరు

» కి.మీకు 2.43 లక్షలుగా ధర నిర్ణయం

» నెల్లూరు జిల్లాలో అదే ధర ఖరారు

» విశాఖలో మాత్రం 15 వేలు పెంపు

(అమరావతి, ఆంధ్రజ్యోతి)



విద్యుత్తు వినియోగదారులపై చార్జీల భారాన్ని తగ్గించాలన్న లక్ష్యాన్ని చేరుకునేందుకు విద్యుత్తు పంపిణీ సంస్థలు భారీ కసరత్తే చేస్తున్నాయి. విద్యుత్తు లైన్లలో అత్యాధునిక పరికరాలను అమర్చడం ద్వారా పంపిణీ నష్టాలను తగ్గించాలని నిర్ణయించాయి. ఆయా డిస్కంల పరిధిలో ఈ పనులకు టెండర్లను పిలుస్తున్నాయి. అయితే ఈ పనులు కొందరు విద్యుత్ అధికారులకు కాసుల వర్షాన్ని కురిపిస్తున్నాయి. ఒకే రకమైన లైనిక్స్ కండక్టర్‌కు నెల్లూరు జిల్లాలో ఒక ధర....విశాఖపట్నం జిల్లాలో మరో ధర నిర్ణయించడంపై విమర్శలు వస్తున్నాయి.

ఏమిటీ లైనిక్స్ కండక్టర్లు?

విద్యుత్తు పంపిణీ నష్టాల నివారణలో కండక్టర్ల పాత్ర కీలకం. ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విద్యుత్తు లైన్లలో అల్యూమినియం కండక్టర్ స్టీల్ రీఇన్‌ఫోర్స్‌డ్(ఏసీఎస్ఆర్) లైనిక్స్ కండక్టర్లను ఎక్కువగా వినియోగిస్తున్నారు. వీటి స్థానంలో ఏసీఎస్ఎస్ (అల్యూమినియం కండక్టర్ స్టీల్ సపోర్టెడ్) లైనిక్స్ కండక్టర్లను వినియోగించాలని నిర్ణయించారు. ఏసీఎస్ఆర్ కండక్టర్లు అధిక ఉష్ణోగ్రతల్లో ఎక్కువ విద్యుత్తును నష్టపోతాయి. ఏసీఎస్ఎస్ కండక్టర్లు 200 డిగ్రీ సెంటిగ్రేడ్‌లోనూ విద్యుత్తును నష్టపోకుండా సరఫరా చేస్తాయి. ఏసీఎస్ఆర్ కన్నా ఏసీఎస్ఎస్ లైనిక్స్ కండక్టర్ల విద్యుత్తు సరఫరా సామర్థ్యం రెండున్నర రెట్లు అధికం. ఈ కారణంగా రాష్ట్రవ్యాప్తంగా ఏసీఎస్ఎస్ లైనిక్స్ కండక్టర్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

ధర నిర్ణయంలో ఇష్టారాజ్యం

ట్రాన్స్‌కో ఏటా వివిధ మెటీరియల్స్‌కు సంబంధించి స్టాండర్డ్ షెడ్యూల్ రేట్లను (ఎస్ఎస్ఆర్) నిర్ణయిస్తుంది. ఆ మేరకు ఏసీఎస్ఎస్ లైనిక్స్ కండక్టర్ ధర కిలోమీటరుకు రూ.2.43 లక్షలు. రాష్ట్రంలో ఎక్కడ టెండరు పిలిచినా ఇదే ధరను నిర్ణయించాలి. కానీ, ఈ నెల నెల్లూరు జిల్లా, విశాఖపట్నం జిల్లాలో సుమారు 200 కిలోమీటర్ల మేర లైనిక్స్ కండక్టర్ల మార్పిడికి పిలిచిన టెండర్లలో వేర్వేరు రేట్లు పెట్టారు. రెండు చోట్లా ఒకే కండక్టర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. అయినా, నెల్లూరు జిల్లాలో నిర్ణయించిన ధర కన్నా విశాఖపట్నం జిల్లాలో నిర్ణయించిన ధర రూ.15వేలు ఎక్కువగా ఉండటం గమనార్హం. ఎస్పీడీసీఎల్ పరిధిలోని నెల్లూరు జిల్లాలోని రాచర్లపాడు - కావలి మధ్య 132 కేవీ లైన్‌లో 76 కిలోమీటర్ల మేర కండక్టర్‌ను ఏర్పాటు చేసేందుకు టెండరు పిలిచారు. ఎస్ఎస్ఆర్‌లో నిర్ణయించిన మేరకే ఇక్కడ ధర నిర్ణయించారు. అయితే ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని విశాఖపట్నం జిల్లాలో మాత్రం ధర పెంచేశారు. ఇక్కడ బ్రాండిక్స్ ఫ్యాక్టరీ నుంచి నర్సింగబిల్లి వరకు 77 కిలోమీటర్లు, పెందుర్తి నుంచి ఆనందపురం వరకు 118.5 కిలోమీటర్లు మేర కండక్టర్ ఏర్పాటుకు టెండరు పిలిచారు. కిలోమీటరుకు ఇక్కడ రూ.2,58,095 లుగా ధరను నిర్ణయించడంపై ఆరోపణలు వస్తున్నాయి. సుమారు 200 కిలోమీటర్ల మేర రూ.15వేలు చొప్పున దోపిడీకి అధికారులు తెర దీశారన్న విమర్శలున్నాయి. ముమ్ముందు ఇంకా కొన్ని వందల కిలోమీటర్ల మేర లైనిక్స్ కండక్టర్లను మార్చాల్సి ఉన్న నేపథ్యంలో, ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని ఆదిలోనే ఈ దోపిడీకి చెక్ పెట్టాల్సి ఉంది.

ఎన్జీటీ ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోం

» నెల్లూరు జిల్లా సిలికా మైనింగ్ వ్యవహారంలో హైకోర్టు ధర్మాసనం స్పష్టీకరణ

» ఎన్జీటీ నిర్ణయాలపై హైకోర్టునూ ఆశ్రయించవచ్చు

» వ్యాజ్యాలకు విచారణార్హత ఉంటుంది

అమరావతి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ (ఎన్జీటీ) నిర్ణయాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో దాఖలు చేసే వ్యాజ్యాలకు విచారణార్హత ఉంటుందని హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. ఎన్జీటీ చట్టంలోని సెక్షన్ 22 ప్రకారం ఆ సంస్థ నిర్ణయాలపై సుప్రీంకోర్టును ఆశ్రయించాల్సి ఉన్నప్పటికీ.. బాధితుడు హైకోర్టుకు కూడా రావచ్చని పేర్కొంది. నెల్లూరు జిల్లా మోమిడి గ్రామంలో సిలికా మైనింగ్‌కు పర్యావరణ అనుమతులను తాత్కాలికంగా నిలుపుదల చేస్తూ ఎన్జీటీ ఇచ్చిన ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోబోమని చెప్పింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ రవినాథ్ తిల్హరి, జస్టిస్ కుంచం మహేశ్వరరావు ధర్మాసనం ఇటీవల తీర్పునిస్తూ పైవ్యాఖ్యలు చేసింది. నెల్లూరు జిల్లా చిల్లకూరు మండలం మోమిడి గ్రామంలో సిలికా మైనింగ్‌కు శ్రీకుమారస్వామి సిలికా మైన్స్ సంస్థకు అధికారులు 2020 ఏప్రిల్ 16న పర్యావరణ అనుమతులు ఇచ్చారు. దీన్ని సవాల్ చేస్తూ ఆ గ్రామానికి చెందిన మదన్‌కుమార్‌రెడ్డి చెన్నైలోని ఎన్జీటీలో అప్పీల్ చేశారు. విచారించిన ఎన్జీటీ.. పర్యావరణ అనుమతులను తాత్కాలికంగా నిలుపుదల చేస్తూ 2021 నవంబరు 15న ఉత్తర్వులిచ్చింది. దీన్ని సవాల్ చేస్తూ సిలికా మైన్స్ సంస్థ 2021 డిసెంబరులో హైకోర్టులో రిట్ వేసింది. మదన్‌కుమార్‌రెడ్డి బాధితుడు కానందున కేంద్ర పర్యావరణ శాఖ ఇచ్చిన పర్యావరణ అనుమతులను ఎన్జీటీలో సవాల్ చేయలేరన్నారు. మదన్‌కుమార్‌రెడ్డి తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. అన్ని అంశాలను పరిశీలించాకే ఎన్జీటీ ఈసీని నిలుపుదల చేసిందన్నారు. పిటిషనర్ స్థానిక గ్రామస్తుడని, పర్యావరణ అనుమతులు కారణంగా బాధితుడిగా మారినందున ఎన్జీటీలో అప్పీల్ వేసే అర్హత ఆయనకు ఉందన్నారు. ఇరువైపుల వాదనలు పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం. ఎన్జీటీ ఉత్తర్వులు సరైనవేనని స్పష్టం చేసింది. సహజ న్యాయసూత్రాలకు విరుద్ధంగా ఉన్నాయన్న మైనింగ్ సంస్థ వాదనను తోసిపుచ్చింది. ఎన్జీటీ ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోలేమని తేల్చిచెప్పింది. ఎన్జీటీ ఉత్తర్వులకు అనుగుణంగా ఈసీ జారీ విషయంలో నిర్ణయం తీసుకోవాలని, సుప్రీం కోర్టు తీర్పులు, చట్ట నిబంధనలు అనుసరించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది.



మంత్రి నారాయణతో మాట్లాడుతున్న గారెత్ విన్ ఓవెన్, పక్కన శ్రీనివాస్

మంత్రి నారాయణతో బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ భేటీ

» అమరావతి అభివృద్ధికి కలిసి పనిచేస్తామని వెల్లడి

అమరావతి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ గారెత్ విన్ ఓవెన్ మంగళవారం రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అమరావతి నిర్మాణ పనుల పురోగతిని నారాయణ ఆయనకు వివరించారు. అమరావతి అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామని ఓవెన్ పేర్కొన్నారు. సమావేశంలో అమరావతి గ్రోత్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఎండీ శ్రీనివాస్ కూడా పాల్గొన్నారు.

తిరుపతిలో ఏపీఈఆర్సీ ప్రజాభిప్రాయ సేకరణ

» నేరుగా ముగ్గురు, వర్చువల్‌గా నలుగురు హాజరు



తిరుపతి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): 2026-27 ఆర్థిక సంవత్సరానికి అమలు చేయనున్న విద్యుత్తు టారిఫ్‌లపై తిరుపతి వేదికగా మంగళవారం ఏపీఈఆర్సీ ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టింది. ఏపీఈఆర్సీ చైర్మన్ పీవీ రెడ్డి నేతృత్వంలో నిర్వహించిన ఈ సమావేశంలో నేరుగా ముగ్గురు (వీరిలో ఒకరు వ్యక్తిగత సమస్యను ప్రస్తావించారు), వర్చువల్‌గా నలుగురు తమ అభిప్రాయాలను వ్యక్తపరిచారు. సీపీఎం నేత కందారపు మురళి మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తొమ్మిదిసార్లు చార్జీలు పెంచి రూ.37 వేల కోట్ల భారాన్ని మోపారని తెలిపారు. గత ప్రభుత్వం పెంచిన విద్యుత్తు సుంకాన్ని, చార్జీలను ప్రస్తుత ప్రభుత్వం యథాతథంగా వసూలు చేస్తోందని చెప్పారు. డిస్కంలు సమర్పించిన నివేదికల్లో బోగస్ లెక్కల కారణంగానే రూ.12,771 కోట్ల భారం వేయాలని ప్రభుత్వం తరపున పంపిణీ సంస్థలు కుట్ర పన్నాయని ఆరోపించారు. ఒక్క సంతకంతో రూ.84 కోట్ల లబ్ధి పొందారని మాజీ సీఎండీ గురించి మీడియాలో వార్తలు వస్తున్నా, ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. వాటర్ ప్లాంట్లకు ఇచ్చే విద్యుత్తు సర్వీసు కేటగిరీని రెండు నుంచి మూడుకు మార్చాలని అనంతపురానికి చెందిన రామ్మోహన్ కోరారు. తిరుచానూరు పరిధిలోని తమ స్థలంలో కబ్జాదారులు గది కడితే కరెంటు మీటరు ఇచ్చేశారని, దీనిని ఆసరాగా చేసుకుని అక్రమార్కులు తమను ఇబ్బంది పెడుతున్నారని ప్రభుత్వ టీచర్ కమల కృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్వా కరెంటు చార్జీలు తగ్గించాలని పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ఇద్దరు రైతులు వర్చువల్‌గా కోరారు.

చిత్రజ్యోతి ★ SINCE 1965 ★

థియేటర్ల సంఖ్య పెరుగుతోంది

- శర్వానంద్



శర్వానంద్ కథానాయకుడిగా రామ్ అబ్బరాజు రూపొందించిన చిత్రం 'నారి నారి నడుమ మురారి'. అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మించారు. సినిమా ఇటీవలె విడుదలైన సందర్భంగా శర్వానంద్ మీడియాతో ముచ్చటించారు. 'ప్రతి సినిమాతో హిట్ కొట్టాలనే కష్టపడి పని చేస్తాం. అనుకున్న ఫలితం వస్తే ఆనందిస్తాం. 'నారి నారి నడుమ మురారి' చిత్రానికి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. రోజు రోజుకీ థియేటర్ల సంఖ్య పెరుగుతోంది. మంచి లాంగ్ రన్ ఉందనే మాటలు వినిపిస్తున్నాయి. నా రాబోయే చిత్రం 'బైకర్'లో రెండు రకాల క్యారెక్టర్లు ఉన్నాయి. అందులో ఒకటి తండ్రి పాత్ర. నేను ఒక జానర్‌కే పరిమితం కావాలని అనుకోవడం లేదు. ప్రతి సినిమా కొత్తగా చేయాలి, కొత్త కథలతో తీయాలి అనే తపన నాలో ఉంటుంది' అని శర్వానంద్ తెలిపారు.

మాతృత్వపు మధురక్షణాలు






బాలీవుడ్ అగ్ర కథానాయిక దీపికా పదుకొణె ప్రస్తుతం తన జీవితంలోని అత్యంత అందమైన దశను ఆస్వాదిస్తున్నారు. అమ్మతనంలోని మాధుర్యాన్ని అనుభవిస్తున్న ఆమె తాజాగా ఇన్‌స్టాగ్రామ్ ద్వారా అభిమానులతో ఒక హృద్యమైన దృశ్యాన్ని పంచుకున్నారు.

అందమైన కానుకలు



పాప దువా కోసం వచ్చిన కానుకల చిత్రాలను దీపిక షేర్ చేశారు. పుష్పగుచ్ఛం, ప్రత్యేకమైన గిఫ్ట్ బాక్స్‌తో పాటు దువాకు శుభాకాంక్షలు తెలుపుతూ చేతిరాతతో రాసిన నోట్ అందులో ఉన్నాయి. ఈ పోస్ట్‌కు దీపిక ఎలాంటి క్యాప్షన్ ఇవ్వలేదు. ఆ ఫొటోలతో దీపిక అమ్మగా తను పొందుతున్న ఆనందాన్ని చెప్పకనే చెప్పారనీ, తన చిన్నారి కూతురు 'దువా' పట్ల కురుస్తున్న ప్రేమాభిమానాలను ప్రతిబింబించేలా ఈ పోస్ట్ ఉందని అభిమానులు ప్రశంసిస్తున్నారు. ప్రస్తుతం షారూఖ్‌ఖాన్ 'కింగ్', అట్లీ - అల్లు అర్జున్ చిత్రాల్లో దీపిక నటిస్తున్నారు.

దునియా రఫ్ లుక్!



తమిళ నటుడు విజయ్ సేతుపతి, దర్శకుడు పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న పాన్ ఇండియా మూవీ 'స్లమ్‌డాగ్ 33 టెంపుల్ రోడ్' చిత్రం షూటింగ్ పార్ట్ పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. ఈ సినిమాలో కీలక పాత్ర పోషిస్తున్న 'దునియా' విజయ్‌కుమార్ లుక్‌ను మంగళవారం విడుదల చేశారు. ఈ లుక్ పోస్టర్‌లో రఫ్ లుక్‌లో కనిపించారు విజయకుమార్. చిత్రంలో ఆయన పాత్ర చాలా విభిన్నంగా ఉంటుందని పూరి జగన్నాథ్ చెప్పారు. సినిమాలో సంయుక్త మీనన్ కథానాయికగా నటిస్తుండగా టబు మరో కీలక పాత్ర పోషిస్తున్నారు. 'అర్జున్‌రెడ్డి', 'యానిమల్' చిత్రాలకు సంగీతం సమకూర్చిన హర్షవర్ధన్ రామేశ్వర్ ఈ సినిమాకు సంగీత దర్శకుడు. ఐదు భాషల్లో విడుదల కానున్న 'స్లమ్‌డాగ్' చిత్రాన్ని పూరి జగన్నాథ్, ఛార్మి కౌర్, జేబీ నారాయణరావు నిర్మిస్తున్నారు.

విజయ్ రష్మికల పెళ్లికి డచ్ గులాబీల సోయగం



టాలీవుడ్ అగ్రతారలు విజయ్‌దేవరకొండ, రష్మిక మందన్నల వివాహానికి సంబంధించి కొత్త విషయం హాట్ టాపిక్‌గా మారింది. ఈ స్టార్ జంట పెళ్లి వేడుకను మరింత శోభాయమానంగా మార్చేందుకు 'ఫ్లవర్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా' తమ వంతు కానుకను అందించనుంది. వీరి వివాహానికి ప్రత్యేకమైన డచ్ గులాబీలను పంపుతున్నట్లు కౌన్సిల్ అధ్యక్షుడు శ్రీకాంత్ బొల్లేపల్లి తెలిపారు. 'విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నలకు వివాహ శుభాకాంక్షలు తెలియజేస్తున్నాం. వారి పెళ్లి వేడుకకు ఫ్లవర్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా తరపున అత్యంత నాణ్యమైన డచ్ గులాబీలను పంపిస్తున్నాం. ఈ పూలు వారి ఆనందకరమైన క్షణాలను మరింత అందంగా మారుస్తాయని ఆశిస్తున్నాం' అని శ్రీకాంత్ అన్నారు.

విజయ్ రష్మిక లాంటి సెలబ్రిటీల పెళ్లి అంటే డెకరేషన్‌కు అత్యంత ప్రాధాన్యం ఉంటుంది. ఈ నేపథ్యంలో అలంకరణలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచేందుకు అత్యుత్తమ నాణ్యత కలిగిన డచ్ జాతి గులాబీలను ఎంపిక చేశారు. ఇవి చూడడానికి ఎంతో ఆకర్షణీయంగా ఉండడమే కాకుండా, వేడుకకు అంతర్జాతీయ స్థాయి లుక్‌ను, రాజసాన్ని తీసుకొస్తాయి. గతేడాది అక్టోబర్‌లో హైదరాబాద్‌లోని విజయ్ ఇంట్లో కుటుంబ సభ్యులు, సన్నిహితుల సమక్షంలో రహస్యంగా వీరి నిశ్చితార్థం జరిగినట్లు వార్తలు వచ్చాయి. అయితే అధికారికంగా ప్రకటించలేదు. ఫిబ్రవరి 26న ఉదయ్‌పూర్‌లోని వీరి పెళ్లి జరగనున్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

నాలుగేళ్లుగా రూమర్స్ వస్తూనే ఉన్నాయి

అయితే విజయ్ దేవరకొండతో తన వివాహం గురించి ఖండించకుండా, అలా అని ధృవీకరించకుండా రష్మిక ఇచ్చిన సమాధానం ఇప్పుడు చర్చనీయాంశమైంది. వారి వివాహం గురించి జరుగుతున్న ఎడతెగని ప్రచారంపై హీరోయిన్ రష్మిక మందన్న ఓ ఇంటర్వ్యూలో స్పందిస్తూ, 'గత నాలుగేళ్లుగా కొన్ని రూమర్స్ ప్రచారంలో ఉన్నాయి. వాటి గురించి మాట్లాడడానికి ఇది సమయం కాదు. సరైన సమయం వచ్చినప్పుడు మేము దీనిపై స్పందిస్తాం. అప్పుడే అందరికీ నిజం తెలుస్తుంది' అని ఆమె వ్యాఖ్యానించారు.

తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ 2025 నోటిఫికేషన్

- 2025లో సెన్సార్ అయిన చిత్రాల నుంచి ఎంట్రీలకు ఆహ్వానం
- ఫిబ్రవరి 3 వరకూ గడువు



ప్రతిష్ఠాత్మక తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ (టీజీఎఫ్ఏ)కు నిర్వహణకు ప్రభుత్వం సన్నద్ధమైంది. ఈ మేరకు 2025 సంవత్సరానికి గాను సినీ పురస్కారాల ఎంపిక కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మంగళవారం ప్రకటించారు. తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ విడుదల చేసిన ఉత్తర్వులు ప్రకారం 2025 జనవరి 1 నుంచి డిసెంబర్ 31 మధ్య సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) పొందిన చిత్రాలు ఈ అవార్డులకు పోటీ పడేందుకు అర్హత కలిగి ఉంటాయి.

కేవలం కమర్షియల్ చిత్రాలకే కాకుండా ఈసారి సామాజిక సందేశం, జాతీయ సమైక్యత విభాగాల్లో ప్రత్యేక పురస్కారాలు అందించనున్నారు. డాక్టర్ సి. నారాయణరెడ్డి స్మారకార్థం ఆయన పేరుతో ప్రత్యేక పురస్కారం అందించనున్నారు. అలాగే ఉర్దూ చిత్రాలతో పాటు, లఘు చిత్రాలు, పుస్తకాలకు పురస్కారాలు ఇవ్వనున్నారు.

దరఖాస్తుల లభ్యత: ఈ నెల 21 నుంచి 31 వరకూ దరఖాస్తులు లభిస్తాయి.

సమర్పణకు చివరి తేదీ: పూర్తి చేసిన దరఖాస్తులను ఫిబ్రవరి 3 సాయంత్రం 3 గంటల లోపు ఎఫ్‌డీసీ కార్యాలయంలో అందజేయాలి.

ఫీజు వివరాలు: దరఖాస్తు రుసుము రూ. 5900 (జీఎస్టీతో కలిపి)గా నిర్ణయించారు.

వీవీ వినాయక్ నాకు స్ఫూర్తి

ఏఆర్ సజీవ్



'నాకు డైరెక్టర్ కావాలనే స్ఫూర్తినిచ్చింది వి.వి.వినాయక్ గారు. ప్రేక్షకులు ఆయనకు బ్రహ్మరథం పట్టడం చూసి, డైరెక్టర్‌ని కావాలనే ఆశ నాలో చిగురించింది' అని అన్నారు దర్శకుడు ఏఆర్ సజీవ్. తరుణ్ భాస్కర్, ఈషా రెబ్బ జంటగా ఆయన తెరకెక్కించిన చిత్రం 'ఓం శాంతి శాంతి శాంతిః'. సృజన్ యరబోలు, ఆదిత్య పిట్టీ, వివేక్ కృష్ణని, అనుప్ చంద్రశేఖరన్, సాధిక్ షేక్, నవీన్ శనివరపు నిర్మించారు. ఈనెల 30న విడుదలవుతున్న సందర్భంగా సజీవ్ మీడియాతో సినిమా విశేషాలు పంచుకున్నారు. 'తరుణ్ గారి వద్దనే అసిస్టెంట్‌గా చేరాలనుకున్నాను. అలాంటిది ఆయన్ని డైరెక్ట్ చేసే అవకాశం వచ్చినందుకు చాలా ఆనందంగా ఉంది.

'ఓం శాంతి శాంతి శాంతిః' మలయాళ చిత్రానికి రీమేక్. ఆ కథలోని కోర్ పాయింట్‌ని మాత్రమే తీసుకున్నాము. నేపథ్యాన్ని గోదావరి ప్రాంతానికి మార్చాము. చివరి ముప్ఫై నిమిషాలు కొత్త కథలాగే అనిపిస్తుంది. కుటుంబంలో అమ్మాయి ప్రాముఖ్యతను తెలిపేలా ఈషా రెబ్బ పాత్ర ఉంటుంది. అందరికీ కనెక్ట్ అయ్యే మంచి కమర్షియల్ ఎంటర్‌టైనర్ చిత్రమిది' అని ఆయన తెలిపారు.

'జన నాయగన్' కేసు అరుదైనదిగా పరిగణించలేం

● సెన్సార్ వివాదంపై మద్రాస్ హైకోర్టు వ్యాఖ్య ● ముగిసిన వాదనలు ● తుది తీర్పు వాయిదా



తమిళ హీరో విజయ్ నటించిన 'జన నాయగన్' చిత్రం సెన్సార్ సర్టిఫికెట్ జారీ వివాదంపై మద్రాస్ హైకోర్టులో మంగళవారం వాదనలు ముగిశాయి. తమ పిటిషన్‌పై వెంటనే ఆదేశాలు జారీ చేయాలంటూ చిత్ర నిర్మాణ సంస్థ చేసిన వినతిని హైకోర్టు తోసిపుచ్చింది. ఈ కేసు అరుదైనదిగా పరిగణించలేమని పేర్కొంటూ తీర్పును వాయిదా వేసింది. కేవీఎన్ ప్రొడక్షన్ పతాకంపై హెచ్.వినోద్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం జనవరి 9వ తేదీన విడుదలకావాల్సివుంది. అయితే, చివరి నిమిషంలో సర్టిఫికెట్ జారీ ఆలస్యం కావడంతో వాయిదా పడింది. దీంతో సర్టిఫికెట్ జారీ చేయాలని కోరుతూ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్ మద్రాస్ హైకోర్టు ఆశ్రయించింది. సింగిల్ జడ్జి సెన్సార్ సర్టిఫికేట్‌ను జారీ చేయాలని సెన్సార్ బోర్డును ఆదేశించారు. ఈ తీర్పుపై సెన్సార్ బోర్డు తక్షణం అప్పీల్ చేయగా, దీనిపై విచారణ జరిపిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ శ్రీవాత్సవ, జస్టిస్ అరుల్ మురుగన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ జరిపి తీర్పును 20వ తేదీకి వాయిదా వేసింది. ఇదిలావుంటే, సెన్సార్ సర్టిఫికేట్‌ను త్వరగా జారీ చేసేలా ఆదేశించాలని కోరుతూ నిర్మాణ సంస్థ సుప్రీంకోర్టును ఆశ్రయించగా, హైకోర్టునే ఆశ్రయించాలని సూచించింది. అంతేగాక ఈ నెల 20వ తేదీ లోగా తీర్పు వెలువరించాలని హైకోర్టును ఆదేశించింది. దీంతో మంగళవారం ద్విసభ్య ధర్మాసనం ముందు ఇరు వర్గాలు వాదనలు వినిపించాయి. సెన్సార్ బోర్డు తరపున హాజరైన న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. 'జన నాయగన్' మూవీని రీ సెన్సార్ చేసేందుకు 20 రోజుల సమయం పడుతుందని తెలిపారు. నిర్మాణ సంస్థ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ, 'అనుకున్న ప్రణాళిక మేరకు చిత్రాన్ని విడుదల చేయకపోవడంతో నష్టాలను చవిచూస్తున్నామని వివరించారు. ఇరు వర్గాల వాదనలు ఆలకించిన ద్విసభ్య ధర్మాసనం.. తీర్పును వాయిదా వేసింది.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

భావోద్వేగాల సమ్మేళనం



సౌమిత్ పోలాడి, శ్రేయాసి సేన్ జంటగా నటించిన మ్యూజికల్ లవ్‌స్టోరి 'నిలవే'. సాయి కే వెన్నంతో కలసి సౌమిత్ పోలాడి దర్శకత్వం వహించారు. మంగళవారం చిత్రబృందం విడుదల తేదీని ప్రకటించింది. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఫిబ్రవరి 13న ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకొస్తున్నట్లు యూనిట్ తెలిపింది. కొత్తతరహా కథతో భావోద్వేగాల సమ్మేళనంగా ఈ చిత్రం తెరకెక్కింది, వినోద భరితంగా నడిపిస్తూనే భావోద్వేగభరితంగా ఆవిష్కరించే ప్రయత్నం ప్రేక్షకులను అలరిస్తుంది అని నిర్మాతలు రాజ్ అల్లాడ, గిరిధర్ రావు పోలాడి, సాయి పోలాడి తెలిపారు. సంగీతం: కళ్యాణ్ నాయక్, సినిమాటోగ్రఫీ: దిలీప్ కే కుమార్



డెలివరీ బాయ్‌గా ఎమ్మెల్యే బోడె ప్రసాద్!

వారి కష్టాలు తెలుసుకొనేందుకు సరికొత్త అవతారం

పెనమలూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లా పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మంగళవారం ఓ సరికొత్త అవతారం ఎత్తి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా ఆహారం, నిత్యావసరాలు వంటి ఆర్డర్లను ఇంటింటికీ తిరుగుతూ అందించే డెలివరీ బాయ్‌ల కష్టాలు తెలుసుకొనేందుకు ఆయనే స్వయంగా డెలివరీ బాయ్‌గా మారిపోయారు. కాసేపు ఇంటింటికీ వెళ్లి.. ఆర్డర్లను డెలివరీ చేశారు. డెలివరీ బాయ్స్ ఎదుర్కొనే కష్టాలేంటి? వారి పని ఎంత కఠినంగా ఉంటుంది.. ఇవన్నీ తెలుసుకోవడానికి ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఇన్‌స్టామార్ట్ డెలివరీ బాయ్‌గా చేశారు. ఆ వేషంలో ఆర్డర్లను డెలివరీ చేసి.. వారి సమస్యలను ప్రత్యక్షంగా అనుభవించారు. ప్రతి రోజూ ఎండనకా, వాననకా, ట్రాఫిక్ సమస్యలను సైతం లెక్క చేయకుండా డెలివరీ బాయ్స్ రోజువారీ జీవితంలో పడుతున్న ఇబ్బందులను స్వయంగా చూడడానికే తాను ఈ వేషం వేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు.



పట్టు వస్త్రాలు తీసుకెళ్తున్న నిమ్మల, పితాని

వాసవీ మాత... అమరత్వానికి ప్రతీక

- ఘనంగా ఆత్మార్పణ దినం
- ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలను సమర్పించిన మంత్రి నిమ్మల

వాసవి పెనుగొండ, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ధర్మం కోసం నిలిచిన వాసవీ మాత అమరత్వానికి ప్రతిక అని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా వాసవీ పెనుగొండలో వాసవీ కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వం తరపున మంత్రి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 'వాసవీ కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినాన్ని రాష్ట్ర పండుగగా నిర్వహించడం గర్వకారణం. పెనుగొండ పేరును వాసవీ పెనుగొండగా మార్చడం ద్వారా ఆర్య వైశ్యులపై ఉన్న ప్రేమను చాటుకున్నాం. వారి అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం. అమ్మవారి సందేశం ఏ కులానికో, మతానికో పరిమితం కాదు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలి' అని ఆకాంక్షించారు. తొలుత మంత్రి నిమ్మల దంపతులు, ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ దంపతులకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్, జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, దేవదాయ ఆర్‌జేసీ వి.త్రినాథరావు, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ పరేపల్లి రాకేశ్ పాల్గొన్నారు.

ఎన్టీఆర్ విగ్రహంపై వైసీపీ రచ్చ!

దాని మాటున కులచిచ్చుకు యత్నం

- నిధుల సమీకరణపై నిర్ణయమే తీసుకోలేదు
- అయినా 1,750 కోట్లు దుర్వినియోగమంటూ వైసీపీ నేతల అసత్య ఆరోపణలు
- నాడు పోలవరం పూర్తి కాకుండానే.. భారీ వైఎస్ విగ్రహం ఏర్పాటుకు సిద్ధం
- విమర్శలు రావడంతో వెనక్కితగ్గిన వైనం
- వీటిని జనంలోకి తీసుకెళ్లాలని టీడీపీ నిర్ణయం

అమరావతి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రాజధానిలో అమరావతిలో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు విషయంలో వైసీపీ దుష్ప్రచారంపై ఎన్టీఆర్ అభిమానులు, టీడీపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిని కులాలకు ఆపాదిస్తూ కులాల మధ్య చిచ్చు పెట్టేలా వైసీపీ నాయకులు వ్యవహరిస్తున్నారని ఎన్టీఆర్ అభిమానులు మండిపడుతున్నారు. ఫేక్ ఐడీలతో సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్న వైసీపీ సోషల్ మీడియా బృందం ఇంతటితో ఆగకుండా వైసీపీ నేతలనూ రంగంలోకి దించి రెచ్చగొట్టేలా మాట్లాడిస్తోందని టీడీపీ శ్రేణులు పేర్కొంటున్నాయి. 'గుజరాత్ ప్రైడ్' పేరుతో ఆ రాష్ట్రంలో సర్దార్ పటేల్ విగ్రహాన్ని 'ఏకతా విగ్రహం (స్టాట్యూ ఆఫ్ యూనిటీ)' పేరుతో ఏర్పాటు చేసి పర్యాటకంగా పెద్దఎత్తున అభివృద్ధి చేశారు. అదే తరహాలో అమరావతిలో 'తెలుగు ప్రైడ్' థీమ్‌తో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్నది ప్రభుత్వ ఆలోచన. అయితే దీనికి నిధులు ఎలా సమీకరించాలో ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. ఈలోగానే వైసీపీ ఎన్టీఆర్ విగ్రహానికి రూ.1,750 కోట్లు ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేస్తున్నారంటూ దుష్ప్రచారం ప్రారంభించింది. నీరుకొండలో ఆ విగ్రహం ఏర్పాటు చేయడమంటే.. దళితులను కించపరచడమేనని ఆ పార్టీ నాయకులు గగ్గోలు పెడుతున్నారు. వాస్తవానికి ఎన్టీఆర్ విగ్రహాన్ని పీపీపీ పద్ధతిన ఏర్పాటు చేయాలని ప్రాథమికంగా నిర్ణయించారు. ఎక్కువ శాతం నిధులను సమీకరించి ప్రభుత్వ భాగస్వామ్యం వీలైనంత తక్కువగా ఉండేలా చూసేందుకు ప్రభుత్వ పెద్దలు కసరత్తు చేస్తున్నారు. ఎన్టీఆర్ విగ్రహం చెంతనే ఆహ్లాదకమైన పార్కు, పర్యాటకాన్ని ఆకర్షించేలా ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని, ఫ్యూచర్ మ్యూజియం వంటివి ఏర్పాటు చేయాలని సర్కారు యోచిస్తోంది. ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేయాలని స్వయంగా నీరుకొండ గ్రామస్థులే ప్రభుత్వాన్ని కోరుతుండగా.. వైసీపీ నాయకులు అందుకు భిన్నంగా దుష్ప్రచారం చేస్తుండటం గమనార్హం. నిత్యం కులాల మధ్య చిచ్చు పెట్టేలా వ్యవహరిస్తున్న వైసీపీ నేతలు, ఆ పార్టీ సోషల్ మీడియా బృందం తీరును ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగట్టాలని టీడీపీ శ్రేణులు, ఎన్టీఆర్ అభిమానులు భావిస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు జగన్ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు మధ్యలో భారీ వైఎస్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. అయితే నిర్మాణం పూర్తికాకుండానే విగ్రహం ఏర్పాటు ఏమిటన్న విమర్శలతో వెనక్కి తగ్గింది. వీటిని ప్రజల్లోకి పెద్దఎత్తున తీసుకెళ్లాలని టీడీపీ శ్రేణులు భావిస్తున్నాయి.

బంగారాన్ని రాగి ప్లేట్లుగా రాశారు!

శబరిమల కేసులో భారీ కుట్ర ఉందన్న ఈడీ

- ఏకకాలంలో మూడు రాష్ట్రాల్లో సోదాలు
- 21 చోట్ల తనిఖీలు నిర్వహించిన అధికారులు
- వ్యవహారం బంగారం చోరీకే పరిమితం కాదు
- ఆర్థిక అవకతవకలు, కుంభకోణాలు కూడా..
- రెండు దశాబ్దాలు కొనసాగినట్టు అనుమానాలు

శబరిమల, జనవరి 20: శబరిమల ఆలయ బంగారం చోరీ కేసులో మనీలాండరింగ్ దర్యాప్తులో భాగంగా ఈడీ(ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్) మంగళవారం మూడు రాష్ట్రాల్లోని 21 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించింది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆలయంలో ఏళ్ల తరబడి కొనసాగిన బంగారం చోరీ వరకే దర్యాప్తు పరిమితం కాలేదు. శబరిమలలోని ఇతర ఆలయ ఆస్తుల దుర్వినియోగంపైనా దర్యాప్తు జరుగుతోంది. భక్తులు సమర్పించిన కానుకల దుర్వినియోగం సహా శబరిమలలో ఆర్థిక అవకతవకలు, కుంభకోణాలు కూడా జరిగినట్టు ఈడీ దర్యాప్తు తెలియజేస్తోంది. సుదీర్ఘకాలంగా వివిధ స్థాయిల్లోని వ్యక్తులు కుమ్మక్కై ఈ వ్యవహారాలు నడిపినట్టు స్పష్టమవుతోంది. 'ఇందులో టీడీబీ(ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు) అధికారులు, ప్రైవేటు వ్యక్తులు, మధ్యవర్తులు, స్వర్ణకారుల నేరపూరిత కుట్ర ఉంది' అని ఈడీ మంగళవారం వెల్లడించింది. ఈ వ్యవహారంలో ఈడీ ఈనెల 9న మనీలాండరింగ్ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. దర్యాప్తులో విస్తుగొలిపే విషయాలు వెల్లడవుతున్నాయి. 'బంగారం పూత పూసిన పవిత్ర కళాఖండాలను రికార్డుల్లో ఉద్దేశపూర్వకంగా రాగి పలకలుగా నమోదు చేశారు. వాటిని 2019-2025 మధ్య ఆలయ పరిసరాల నుంచి తొలగించారు' అని ఈడీ తెలిపింది. చెన్నై, కర్ణాటకల్లోని ప్రైవేటు సంస్థల్లో రసాయనిక ప్రక్రియల ద్వారా బంగారాన్ని స్వాహా చేసినట్టు పేర్కొంది. ఈ వ్యవహారంలో ఎంతవరకు మనీలాండరింగ్ ఉందో నిర్ధారించేందుకు సోదాలు జరిపినట్టు ఈడీ పేర్కొంది. బంగారం చోరీ వ్యవహారం తొలిసారిగా 2019లో వెలుగులోకి వచ్చినప్పటికీ, సుమారు రెండు దశాబ్దాలుగా కొనసాగుతుండొచ్చని ఈడీ వర్గాలు తెలిపాయి. '2019లో 42.8 కిలోల బరువున్న బంగారు విగ్రహాలను మరమ్మతుల కోసం తీసుకెళ్లారు. వాటిని తిరిగి తీసుకొచ్చినప్పుడు వాటి బరువు 38.2 కిలోలే ఉంది. అంటే సుమారు 4.5 కిలోల బంగారాన్ని స్వాహా చేసేశారు' అని ఆ వర్గాలు పేర్కొన్నాయి. విగ్రహాల పునః బంగారు తాపడం కోసం చెన్నైకి చెందిన ప్రైవేటు సంస్థకు అప్పగించినట్టు దర్యాప్తులో వెల్లడైంది. కాగా, కేరళ, కర్ణాటక, తమిళనాడుల్లోని మొత్తం 21 ప్రాంతాల్లో మంగళవారం ఈడీ సోదాలు నిర్వహించింది. ప్రధాన నిందితుడు ఉన్నికృష్ణన్ పొట్టి, టీడీబీ మాజీ అధ్యక్షుడు ఎ.పద్మకుమార్‌లకు సంబంధించిన ప్రాంగణాల్లో ఈ సోదాలు జరిగినట్టు తెలుస్తోంది.

క్వాంటమ్ మేమూ నేర్చుకుంటాం!



(మొదటి పేజీ తరువాయి)

మేమూ నేర్చుకుంటాం అంటూ ఇతర కోర్సుల విద్యార్థులూ ముందుకొస్తున్నారు. కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ పరిధిలోని 'నేషనల్ ప్రోగ్రామ్ ఆన్ టెక్నాలజీ ఎన్‌హాన్స్‌డ్ లెర్నింగ్' (ఎన్‌పీటీఈఎల్).. ఐఐటీ మద్రాస్, ఐబీఎం సహకారంతో చేపట్టిన క్వాంటమ్ కోర్సులు నేర్చుకునేందుకు రాష్ట్రం నుంచి రికార్డు స్థాయిలో విద్యార్థులు నమోదు చేసుకున్నారు. దేశంలోనే అత్యధిక స్థాయిలో 60 వేల మంది ఈ కోర్సు నేర్చుకునేందుకు ముందుకొచ్చారు. దాదాపు అన్ని కోర్సుల విద్యార్థులూ దీనిపై ఆసక్తి చూపుతున్నారు. 'ఇంట్రడక్షన్ టు క్వాంటమ్ కంప్యూటింగ్: క్వాంటమ్ అల్గరిథమ్స్ అండ్ క్విస్కిట్' పేరిట ఎన్‌పీటీఈఎల్ చేపట్టిన క్వాంటమ్ కోర్సు ఈ నెల 19న ప్రారంభమైంది. ఐఐటీ మద్రాస్, ఐబీఎం ప్రొఫెసర్లు దీన్ని అందిస్తున్నారు. కోర్సు అనంతరం సర్టిఫికెట్ కావాలనుకున్నవారికి పరీక్ష నిర్వహిస్తారు. సర్టిఫికెట్ పొందిన విద్యార్థులకు ఈ కోర్సును ఇంటర్న్‌షిప్‌గా భావించి ఒక క్రెడిట్ ఇస్తారు. తద్వారా అటు రెగ్యులర్ కోర్సుతో పాటు భవిష్యత్తులోనూ ఈ సర్టిఫికెట్ విద్యార్థులకు ఉపయోగపడనుంది.

నాలుగు వారాల ఆన్‌లైన్ కోర్సు

నాలుగు వారాల పాటు సాగే ఈ కోర్సు పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో ఉంటుంది. కోర్సుకు ఇంకా నమోదు చేసుకుంటూనే ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రగతి ఇంజనీరింగ్ కాలేజీ నుంచి అత్యధికంగా 3,774 మంది, కెహెచ్‌ఐటీ నుంచి 2,616, ఎస్‌ఆర్‌ఐ కాలేజీ నుంచి 2,550, అన్నమాచార్య ప్రైవేటు యూనివర్సిటీ నుంచి 1,998, లక్కిరెడ్డి బాలిరెడ్డి కాలేజీ నుంచి 1,873, శ్రీవిష్ణు కాలేజీ నుంచి 1,758, రఘు ఇంజనీరింగ్ కాలేజీ నుంచి 1,678, పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం నుంచి 1,357, ఒంగోలులోని క్యూఐఎస్ కాలేజీ నుంచి 1,330, ఆదిత్య కాలేజీ నుంచి 1,323, విజయవాడ సిద్ధార్థ అకాడమీ నుంచి 1,151, మిట్స్ నుంచి 1,100 మంది విద్యార్థులు క్వాంటమ్ కోర్సు నేర్చుకుంటున్నారు.

కోర్సులకు అతీతంగా...

క్వాంటమ్ టెక్నాలజీస్ కేవలం సాఫ్ట్‌వేర్ రంగానికే పరిమితం కాదు. అన్ని రంగాలకూ ఉపయోగపడుతుందని క్వాంటమ్ నిపుణులు చెబుతున్నారు. అందుకు తగ్గట్టుగానే రాష్ట్రంలో అన్ని కోర్సుల విద్యార్థులు క్వాంటమ్ టెక్నాలజీస్‌పై ఆసక్తి చూపిస్తున్నారు. ఇంజనీరింగ్‌తో పాటు సాధారణ డిగ్రీ విద్యార్థులు అనేక మంది క్వాంటమ్ కోర్సు నేర్చుకుంటున్నారు. ఫార్మసీ, పాలిటెక్నిక్, డెంటల్, పీజీ, ఇంజనీరింగ్, అగ్రికల్చర్, వైద్య, బిజినెస్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు కూడా క్వాంటమ్ కోర్సులో చేరారు. లక్ష మంది క్వాంటమ్ నిపుణుల్ని తయారుచేయడమే తమ లక్ష్యమని చంద్రబాబు చెబుతున్నారు. ఉన్నత విద్యామండలితో పాటు నైపుణ్యాభివృద్ధి శాఖ ద్వారా కూడా కోర్సులు అందిస్తోంది. దానికి 50 వేల మంది వరకూ దరఖాస్తు చేసుకున్నట్టు సమాచారం.

త్వరలో క్వాంటమ్ హ్యాకథాన్ ఫైనల్

క్వాంటమ్ టెక్నాలజీస్‌ను ప్రోత్సహించడంలో భాగంగా ఉన్నత విద్యామండలి ఇటీవల అమరావతి క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్‌ను నిర్వహించింది. రాష్ట్ర వ్యాప్తంగా 30వేల మంది ఇంజనీరింగ్ విద్యార్థులు దీనిలో పాల్గొన్నారు. క్వాంటమ్ టెక్నాలజీలో ప్రాబ్లమ్స్‌కు పరిష్కారం చూపడంపై ఈ పోటీలు జరిగాయి. త్వరలో జరగబోయే ఫైనల్స్‌కు 700 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. సీఎం చంద్రబాబు సమక్షంలో పోటీలు నిర్వహించేందుకు మండలి సిద్ధమైంది.

క్వాంటమ్ కోర్సులో ఇదొక రికార్డు

'ఎన్‌పీటీఈఎల్ అందిస్తున్న కోర్సుకు ఏపీ నుంచి 60 వేల మంది విద్యార్థులు నమోదుచేసుకోవడం ఓ మైలురాయి. టెక్నాలజీలో రాష్ట్రాన్ని గ్లోబల్ హబ్‌గా మార్చాలన్న సీఎం చంద్రబాబు మార్గనిర్దేశంలో ఇది సాధ్యమైంది. అమరావతి క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్ ద్వారా ఇంత పెద్దఎత్తున విద్యార్థులు క్వాంటమ్ కోర్సు నేర్చుకునేందుకు ముందుకొచ్చారు. తద్వారా క్వాంటమ్ టెక్నాలజీస్ లేబొరేటరీలకు మాత్రమే పరిమితం కాదని నిరూపించారు. భవిష్యత్తులో క్వాంటమ్ టెక్నాలజీ దేశాల ఆర్థిక, వ్యూహాత్మక అధికారాన్ని నిర్దేశిస్తుంది.'

- కె.మధుమూర్తి; ఉన్నత విద్యా మండలి చైర్మన్

భూముల మార్కెట్ విలువలు పెంపు

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పాటు, మౌలికసదుపాయాల కల్పన, వాస్తవ మార్కెట్ విలువలకు, ప్రభుత్వ నమోదు విలువలకు మధ్య ఉన్న వ్యత్యాసం తగ్గించడం కోసం ధరలు పెంచినట్లు ప్రభుత్వం తెలిపింది.

ప్రభుత్వానికి రాబడి.. భూముల మార్కెట్ విలువలు పెంచడం వల్ల ప్రభుత్వానికి ఆదాయం పెరుగుతుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారా ఖజానాకు రూ.13,150 కోట్ల ఆదాయం వస్తుందని బడ్జెట్‌లో అంచనా వేశారు. నవంబరు నాటికి రూ.7,132 కోట్లు వచ్చినట్లు కాగ్ వెల్లడించింది. సాధారణంగా ప్రభుత్వాలు చట్టప్రకారం ఎప్పటికప్పుడు భూముల మార్కెట్ విలువలు పెంచుతూ ఉంటాయి. నగరాలు, పట్టణాల విస్తరణ, అభివృద్ధి ప్రాజెక్టుల వల్ల భూములకు డిమాండ్ పెరుగుతుంది. అలాగే బహిరంగ మార్కెట్‌లో ఉన్న ధరలకు అనుగుణంగా ప్రభుత్వ ధరలను కొంతమేర మెరుగుపరచాలన్న ఉద్దేశంతో భూముల విలువలను ప్రభుత్వాలు పెంచుతాయి. దీని వల్ల రిజిస్ట్రేషన్ చార్జీలు, స్టాంపు డ్యూటీల రూపంలో ఆదాయం పెరుగుతుంది.



మంగళవారం రాజధాని అమరావతిలో గణతంత్ర దినోత్సవ వేడుకలకు రిహార్సల్స్ చేస్తున్న భద్రతా బలగాలు

తొలిసారి 'అమరావతి'లో గణతంత్ర వేడుకలు

రాయపూడిలో ముస్తాబైన పెరేడ్ గ్రౌండ్

- గ్యాలరీలు, శకటాల కోసం అంతర్గత రహదారులు
- ఐజీ రాజకుమారి నేతృత్వంలో రక్షక దళాల మాక్‌డ్రిల్

గుంటూరు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్ర కలల రాజధాని అమరావతి గణతంత్ర వేడుకలకు ముస్తాబయింది. ఇప్పటి వరకూ విజయవాడ ఇందిరా గాంధీ స్టేడియంలో జరుగుతున్న ఈ వేడుకలకు తొలిసారిగా ప్రజా రాజధాని వేదికయింది. ఈ నేపథ్యంలో భారీ స్థాయిలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. రాజధాని గ్రామం రాయపూడిలోని ఈ 3, ఈ 4 రోడ్ల మధ్య స్థలంలో పెరేడ్ గ్రౌండ్‌ను రూపొందించారు. వేడుకలకు వచ్చే వీవీఐపీలు, వీఐపీలు, ప్రజల కోసం విడివిడిగా గ్యాలరీలు నిర్మించారు. రక్షక దళాల కవాతుకు, వివిధ ప్రభుత్వ శాఖలు రూపొందించే ప్రగతి రథాల కదలికకు ప్రత్యేకంగా ట్రాక్‌ను, అంతర్గత రోడ్లను నిర్మించారు. పనులన్నీ దాదాపుగా కొలిక్కి రావడంతో మంగళవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. దీనిలో రెడ్‌క్రాస్‌తో పాటు కర్ణాటకకు చెందిన పోలీసు దళాలు కూడా పాల్గొనడం విశేషం. ఆంధ్రప్రదేశ్ స్పెషల్ పోలీస్(ఏపీఎస్‌పీ) ఐజీ బీ.రాజకుమారి నేతృత్వంలో పోలీసులు, ఎన్‌సీసీ క్యాడెట్లకు శిక్షణ నడుస్తోంది. మరోవైపు వివిధ శాఖల ప్రగతి రథాలు వేడుకకు సిద్ధమవుతున్నాయి.

తీర్పు ప్రతులతో మీకేంటి ప్రయోజనం?

- ఏసీబీ కోర్టు తీర్పు రికార్డులు కోరిన పిటిషనర్‌కు హైకోర్టు ప్రశ్న

అమరావతి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ప్రతిపక్షనేత చంద్రబాబు, ఇతరులపై నమోదైన కేసులపై ఏసీబీ కోర్టు ఉత్తర్వుల ప్రతులు థర్డ్ పార్టీకి ఇచ్చే విషయంలో హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఆ కేసుల విషయంలో రికార్డులు ఇచ్చేందుకు నిరాకరిస్తూ విజయవాడ ఏసీబీ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ దాఖలైన క్రిమినల్ రివిజన్ పిటిషన్లపై మంగళవారం హైకోర్టు విచారణ జరిపింది. విచారణ సందర్భంగా న్యాయస్థానం స్పందిస్తూ.. తీర్పు ప్రతులు పొందడానికి సహజంగా మూడో పక్షాన్ని అనుమతించబోమని, ఏసీబీ కోర్టు తీర్పు ప్రతులతో పిటిషనర్ పొందే ప్రయోజనం ఏమిటి? అని ప్రశ్నించింది. ఈ వ్యవహారంపై వివరాలు సమర్పించాలని సీఐడీని ఆదేశిస్తూ విచారణను ఫిబ్రవరి 3కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఫైబర్‌గ్రిడ్, మద్యం పాలసీలకు సంబంధించి చంద్రబాబు తదితరులపై వైసీపీ ప్రభుత్వం నమోదు చేసిన కేసులను ఏసీబీ కోర్టు మూసివేసిందని, ఈ కేసుల తీర్పు ప్రతులు, రికార్డులు ఇవ్వాలని కోరగా కోర్టు నిరాకరించిందని పేర్కొంటూ విశ్రాంత రైల్వే ఉద్యోగి యేము కొండలరావు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. పిటిషనర్ తరఫున న్యాయవాది జడ శ్రవణ్‌కుమార్ సీఐడీ తరఫున అదనపు పీపీ పాణిని సోమయాజి వాదనలు వినిపించారు.

ఊగిసలాట వద్దు!

(మొదటి పేజీ తరువాయి)

తదుపరి దర్యాప్తుపై ట్రయల్ కోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ ఆయన కుమార్తె సునీత నర్రెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. మంగళవారం జస్టిస్ సుందరేశ్, జస్టిస్ కోటీశ్వర్‌సింగ్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ జరిపింది. సునీత తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించారు. "సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు మేం సీబీఐ కోర్టును ఆశ్రయించాం. అయితే మేం దాఖలు చేసిన పిటిషన్‌లో లేవనెత్తిన ఏ ఒక్క అంశాన్నీ కోర్టు పరిగణనలోకి తీసుకోలేదు. పిటిషన్‌లో అసలు ప్రస్తావించని అంశాలను పరిగణనలోకి తీసుకుంది" అని వివరించారు. రూ.4 కోట్ల లావాదేవీలకు సంబంధించి సీబీఐ దర్యాప్తు అసంపూర్తిగా ఉందని, దీనిపై మరింత లోతుగా విచారణ జరగాల్సి ఉందని వాదించారు. హత్య జరిగిన రోజు ఉదయం నాలుగు గంటలకు నడిచిన వాట్సాప్ కాల్స్, అప్పుడు జరిగిన సంభాషణల వివరాలపై సీబీఐ దృష్టి సారించలేదని తెలిపారు. వివేకా చనిపోయిన విషయం బయటి ప్రపంచానికి తెలియకముందే జగన్‌కు తెలిసిపోవడంపైనా, ఓబుల్ రెడ్డి, భరత్ యాదవ్ పాత్రపై దర్యాప్తు జరగలేదని వాదించారు. అప్రూవర్‌కు స్నేహితుడైన సయ్యద్ మున్నా బ్యాంకు లాకర్లలో ఉన్న లెక్కలో లేని డబ్బు, నగల గురించి సరైన విచారణ జరగలేదని కోర్టు దృష్టికి లూథ్రా తీసుకెళ్లారు. ఈ సమయంలో కోర్టు జోక్యం చేసుకుంటూ.... మినీ ట్రయల్ కోరుకుంటున్నారా? అని లూథ్రాను ప్రశ్నించింది. ఒకవేళ మిమ్మల్ని హైకోర్టుకు వెళ్లమని చెబితే, అక్కడ మరో పదేళ్లు పడుతుందని అభిప్రాయపడింది. "దర్యాప్తు పట్ల సంతృప్తిగా ఉన్నారా? మీరు ఇంకా దర్యాప్తు చేయాల్సిన అంశాలు ఏమైనా ఉన్నాయా?" అని సీబీఐని ప్రశ్నించింది. సీబీఐ న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఇంకా ఏవైనా నిర్దిష్టమైన అంశాలుంటే విచారించడానికి అభ్యంతరం లేదని తెలిపింది. అయితే, దర్యాప్తును ఇప్పటికే పూర్తి చేసినందున దీనికోసం కోర్టు నుంచి ఆదేశాలు రావాల్సి ఉందని పేర్కొంది. దీనిపై స్పందించిన ధర్మాసనం, ఊగిసలాట వద్దని మందలించింది "మీరు ఎప్పుడూ అస్పష్టతతో ఉంటా"రని వ్యాఖ్యలు చేసింది. వివేకా హత్య కేసులో ఇంకా తదుపరి దర్యాప్తు కావాలంటే, తాము ఉత్తర్వులు జారీ చేస్తామని, ఎవరెవరిని కస్టడీలోకి తీసుకుని విచారించాలనుకుంటున్నారనేది స్పష్టంగా చెప్పాలని జస్టిస్ సుందరేశ్ వ్యాఖ్యానించారు. ఇది సున్నితమైన అంశమని, దీనికి తార్కిక ముగింపు దొరకాలన్నారు. దీనిపై స్పందించిన సీబీఐ న్యాయవాది.. ఇంకా దర్యాప్తు చేయాల్సిన అంశాలు, ఎవరినైనా విచారించాలా అన్నది నిర్ణయించుకునేందుకు సమయం కావాలన్నారు. ఆ విజ్ఞప్తిని మన్నించిన ధర్మాసనం... సీబీఐకి రెండు వారాల గడువు ఇస్తూ, తదుపరి విచారణను ఫిబ్రవరి 5కి వాయిదా వేసింది.

నంబర్లు ఇచ్చి.. ఆ ఫోన్లను ట్యాప్ చేయించారా!?

- టీ-మాజీ మంత్రి హరీశ్‌కు సిట్ ప్రశ్నలు

హైదరాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఎస్‌ఐబీ కార్యాలయంలో కాకుండా ఒక న్యూస్ చానల్ యజమానికి చెందిన ప్రదేశంలో ఫోన్ ట్యాపింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసిన అంశంపై సిట్ అధికారులు తెలంగాణ మాజీ మంత్రి హరీశ్ రావును ప్రశ్నించినట్లు తెలిసింది. 'ఆ న్యూస్ చానల్ యజమానికి, అతనికి సహకరించిన ఎస్‌ఐబీ బృందానికి మీరేమైనా ఫోన్ నంబర్లు ఇచ్చి ట్యాపింగ్ చేయాలని కోరారా? లేకపోతే నాటి ఎస్‌ఐబీ బృందంలోని తిరుపతన్న, ప్రణీత్‌రావు, చానల్ యజమాని శ్రవణ్ రావుతో ఫోన్లో అన్నిసార్లు ఎందుకు మాట్లాడారు!?' అని ప్రశ్నించినట్లు సమాచారం. ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి హరీశ్ రావును హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని సిట్ కార్యాలయంలో అధికారులు మంగళవారం ఏడున్నర గంటలపాటు విచారించారు. సాయంత్రం 6.30 గంటల తర్వాత సిట్ అధికారులు వాంగ్మూలం నమోదు చేసి ఆయనను పంపివేశారు. హరీశ్‌ను ప్రధానమైన ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారించామని, మరోసారి ఆయనను పిలిచే అవకాశం ఉందని సిట్ అధికారులు చెబుతున్నారు. హరీశ్ వాంగ్మూలాన్ని నమోదు చేశామన్నారు. హరీశ్ విచారణ సందర్భంగా ఆయన మద్దతుదారులు, బీఆర్‌ఎస్ శ్రేణులు జూబ్లీహిల్స్ పోలీసు స్టేషన్‌కు పెద్దఎత్తున తరలి వచ్చారు. అక్కడ వారు ఆందోళనకు దిగడంతో ఉద్రిక్తతకు దారి తీసింది.



వ్యానులో పశువులను కుక్కి ఉరితాళ్ల మాదిరిగా బిగించిన దృశ్యం

పశువుల తరలింపులో అమానుషం

మినీ వ్యాన్‌లో 18 జీవాలను కుక్కి రవాణా

ఊపిరాడక మూడు మూగజీవాలు మృతి

ఇచ్ఛాపురం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఐదు పశువులకు మించి పట్టని వాహనంలో 18 పశువులను కుక్కేశారు. తల అటూఇటూ తిప్పే వీలు కూడా లేకుండా వాటిని కట్టేశారు. నీరు, గడ్డి కూడా అందుబాటులో లేకుండా చేశారు. ఇలా పశువులకు నరకం చూపిస్తూ వాటిని తరలిస్తున్నారు. మొత్తం మూడు వాహనాలు, ఒక్కోదానిలో 18 పశువులను తరలిస్తున్నారు. ఒడిశా నుంచి ఇచ్ఛాపురం వస్తున్న ఈ వాహనాలను చూసిన ఒడిశాలోని పితాతొళి గ్రామస్థులకు అనుమానం వచ్చి ఆపాలని ప్రయత్నించారు. అయితే, వాహనదారులు వాటిని ఆపకుండా గ్రామస్థులపైకి దూకించి తప్పించుకుపోవాలని ప్రయత్నించారు. ఇలా రెండు వాహనాలు గ్రామస్థుల నుంచి తప్పించుకున్నాయి. అయితే, మూడో వాహనాన్ని వాసంతి అనే మహిళ, గ్రామస్థులు వెంబడించారు. ఇచ్ఛాపురం సమీపంలోని పురుషోత్తపురం వద్ద రైల్వేట్రాక్ పక్కనే ఒక మట్టి రోడ్డు ఉంది. అక్కడికి వచ్చాక ఆ మూడో వాహనం గోతిలో దిగబడడంతో నిలిచిపోయింది. వాహనంలో ఉన్న ముగ్గురు వ్యక్తులు వెంటనే పారిపోయారు. గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు హుటాహుటిన అక్కడకు చేరుకున్నారు. పశువులను అతి కష్టమ్మీద బయటకు తీశారు. అప్పటికే అందులో మూడు పశువులు చనిపోయి ఉన్నాయి. ఇచ్ఛాపురం పట్టణంలోనే ఓ వ్యాపారి ఒడిశాలో వీటిని కొనుగోలు చేసి తీసుకొస్తున్నట్టు సమాచారం.



చనిపోయిన మూడు పశువులు

కోస్తాలో దట్టంగా పొగమంచు

వంద మీటర్ల కంటే తక్కువగా విజిబులిటీ

మరో 2 రోజులు ఉంటుందన్న వాతావరణ కేంద్రం

విశాఖపట్నం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): కోస్తాలోని పలు జిల్లాల్లో మంగళవారం ఉదయం దట్టంగా పొగమంచు కురిసింది. పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, ఏలూరు, పశ్చిమ గోదావరి, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో మంచు ఎక్కువగా కురిసిందని విశాఖపట్నం వాతావరణ కేంద్రం తెలిపింది. కొన్నిచోట్ల ఉదయం విజిబులిటీ వంద మీటర్ల కంటే తక్కువగా నమోదైందని పేర్కొంది. మరో రెండు రోజులపాటు తెల్లవారుజాము నుంచి ఉదయం పది గంటల వరకూ పొగమంచు కురుస్తుందని, వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. మరోవైపు కోస్తా, రాయలసీమల్లో చలి తీవ్రత పెరిగింది. ఉత్తరాది నుంచి చలిగాలులు వీస్తుండడంతో రాష్ట్రంలో కనీస ఉష్ణోగ్రతలు మూడు నుంచి నాలుగు డిగ్రీలు తక్కువగా నమోదయ్యాయి. అరకులోయలో 5.7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. మరో రెండు, మూడు రోజులు చలి తీవ్రత ఉంటుందని వాతావరణ కేంద్రం తెలిపింది.



ఆంధ్రప్రదేశ్ అడ్వాంటేజ్ అంశంపై సీఐఐ అల్పాహార భేటీలో సీఎం చంద్రబాబు అభివాదం







దావోస్ ప్రపంచ ఆర్థిక సదస్సులో మంగళవారం గూగుల్ క్లౌడ్ సీఈవో థామస్ కురియన్, వరల్డ్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ ఆర్గనైజేషన్ డైరెక్టర్ జనరల్ డరేన్ టాంగ్, యూఏఈ మంత్రి అల్ మార్రితో ముఖ్యమంత్రి చంద్రబాబు

సీఐఐ ఆధ్వర్యంలో బిజినెస్ బ్రేక్ ఫాస్ట్

భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) నిర్వహించిన బిజినెస్ బ్రేక్ ఫాస్ట్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ ముఖర్జీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి మాస్టర్‌కార్డు, కాగ్నిజెంట్ సీఈవోలు సహా విదేశీ కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. 'భారత్ కేంద్రంగా అభివృద్ధి-ఏపీ సానుకూలత' అనే అంశంపై చంద్రబాబు ప్రారంభోపన్యాసం చేశారు. 'ఇంధనం, డిజిటల్ ఇన్‌ఫ్రా, లాజిస్టిక్స్, తయారీ రంగాల్లో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు ఆంధ్రప్రదేశ్ గమ్యస్థానం. రాష్ట్ర ప్రభుత్వ పాలసీలు, గ్రీన్ ఎనర్జీ, టెక్నాలజీ తదితర రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు రాష్ట్రంలో సానుకూల వాతావరణం ఉంది. క్లీన్ ఎనర్జీ ఉత్పత్తి సహా 25 పాలసీలు, గ్రీన్ అమ్మోనియా, గూగుల్ పెట్టుబడులు రాష్ట్రంలో సానుకూల వాతావరణానికి ప్రత్యక్ష ఉదాహరణ. విశాఖ సీఐఐ భాగస్వామ్య సదస్సులో సాధించిన పెట్టుబడులు ఏపీ బ్రాండ్ ఇమేజ్‌ను ప్రపంచానికి చాటి చెప్పాయి' అని చంద్రబాబు అన్నారు. రాష్ట్రంలో స్పేస్ సిటీ, పోర్టులు, ఎయిర్ పోర్టులు, హైవే కనెక్టివిటీ తదితర అంశాలపై దృష్టి పెట్టామని వెల్లడించారు. దేశానికి వచ్చిన విదేశీ పెట్టుబడుల్లో 25 శాతం ఆంధ్రప్రదేశ్‌కే వస్తున్నాయని వివరించారు. ఈ సెషన్‌కు హాజరైన విదేశీ పారిశ్రామిక ప్రతినిధులను సీఎం చంద్రబాబు దగ్గరకు వెళ్లి పలకరించారు.

91 వేలకోట్ల పెట్టుబడి.. లక్ష ఉద్యోగాలు

(మొదటి పేజీ తరువాయి)

పాల్గొన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పలు సంస్థలు ముందుకొచ్చాయి. సీఎం చంద్రబాబుతో ఐబీఎం ఛైర్మన్, సీఈవో అర్వింద్ కృష్ణ సమావేశమయ్యారు. అమరావతిలో క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్ ఏర్పాటుపై చర్చించారు. రాష్ట్రంలో క్వాంటమ్ ఇన్నోవేషన్ సెంటర్ నెలకొల్పాలని ఈ సందర్భంగా ఐబీఎం ఛైర్మన్‌ను చంద్రబాబు కోరారు. రాష్ట్రంలో పది లక్షల మంది యువతకు ఐబీఎం శిక్షణ ఇవ్వాలని ఈ సమావేశంలో పాల్గొన్న ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ కోరారు. దేశవ్యాప్తంగా 50 లక్షల మంది యువతకు ఏఐలో శిక్షణ ఇవ్వాలని నిర్ణయించినట్లుగా అర్వింద్ వెల్లడించారు. రాష్ట్ర ప్రతిపాదనలను పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం గూగుల్ క్లౌడ్ సీఈవో థామస్ కురియన్‌తో చంద్రబాబు సమావేశమయ్యారు. విశాఖ ఏఐ డేటా సెంటర్ నిర్మాణంపై ఇరువురి మధ్య చర్చ జరిగింది. గూగుల్ ఏఐ డేటా సెంటర్ ఏర్పాటుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందుతుందని ఈ సందర్భంగా కురియన్‌కు చంద్రబాబు భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో



దావోస్‌లో ఇండియా లాంజ్‌ను కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషితో కలిసి ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు

మంత్రులు లోకేశ్, టీజీ భరత్ పాల్గొన్నారు.

ఆర్ఎంజెడ్ భారీ పెట్టుబడులు

విశాఖ, ఉమ్మడి అనంతపురం జిల్లా టేకులోడులో ప్రఖ్యాత రియల్ ఎస్టేట్ సంస్థ ఆర్ఎంజెడ్ భవిష్యత్ తరం డిజిటల్ ఇన్‌ఫ్రా, ఇండస్ట్రియల్, ఇన్‌ఫ్రా, లాజిస్టిక్స్ పార్కులను ఏర్పాటు చేసేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. మంత్రి లోకేశ్, ఆర్ఎంజెడ్ ఛైర్మన్ సమక్షంలో ఈ ప్రకటన చేశారు. ఆర్ఎంజే సంస్థ 10 బిలియన్ డాలర్ల (రూ.91 వేలకోట్లు) పెట్టుబడితో, లక్ష మందికి ఉద్యోగావకాశాలు కల్పించే ప్రతిపాదనలు చేసింది. వీటికి సూత్రప్రాయంగా అంగీకరించారు.

- విశాఖ కాపులుప్పాడలోని ఫేజ్-1 ఐటీ పార్కులో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ) పార్కు అభివృద్ధి చేయాలని ఆర్ఎంజెడ్ ప్రతిపాదించింది. పది మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మిస్తామని పేర్కొంది.
- విశాఖపట్నం రీజియన్ పరిధిలో ఒక గిగావాట్ సామర్థ్యంతో హైపర్ స్కేల్ డేటా క్లస్టర్‌ను 500 నుంచి 700 ఎకరాల్లో ఏర్పాటు చేస్తామని ఆర్ఎంజెడ్ ప్రతిపాదించింది. ఈ ప్రాజెక్టు డిజిటల్, ఏఐ వర్క్‌లోడ్‌కు సహకరిస్తుంది. హరిత విద్యుత్తు వినియోగంతో ఈ డేటా క్లస్టర్‌ను నడుపుతామని వెల్లడించింది.
- ఉమ్మడి అనంతపురం జిల్లాలో టేకులోడు ఇండస్ట్రియల్ పార్కులో 1000 ఎకరాల్లో ఇండస్ట్రియల్ అండ్ లాజిస్టిక్స్ పార్కును స్థాపిస్తామని ఆర్ఎంజెడ్ వెల్లడించింది. ఈ పార్కులో ఇండస్ట్రియల్ యాంకరింగ్, తయారీ పరిశ్రమ, వేర్ హౌసింగ్, లాజిస్టిక్స్ వ్యవహారాలు ఉంటాయని పేర్కొంది.

యూఏఈ ఆర్థిక మంత్రితో సీఎం చంద్రబాబు భేటీ

రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ క్లస్టర్ ఏర్పాటు చేసేందుకు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ సూత్రప్రాయంగా అంగీకరించింది. యూఏఈ ఆర్థికమంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మార్రీతో సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. ఏపీ-యూఏఈ మధ్య ఆర్థిక భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడంపై ఇద్దరూ చర్చించారు. యూఏఈకి చెందిన దాదాపు 40 సంస్థలు రాష్ట్రంలో తమ వాణిజ్యాన్ని నిర్వహించేందుకు సంసిద్ధత వ్యక్తం చేశాయి. ఆహార భద్రత, లాజిస్టిక్, పోర్టు ఆధారిత పరిశ్రమలు, పునరుత్పాదక విద్యుత్తు, పర్యాటకం, మౌలిక వసతుల కల్పన రంగాల్లో పెట్టుబడుల అవకాశాలపై చర్చించారు. యూఏఈకి చెందిన షరీఫ్ గ్రూప్ ఏపీలో మల్టీమోడల్ లాజిస్టిక్ పార్క్ ఏర్పాటు చేసే ప్రతిపాదనలపైనా చర్చలు జరిగాయి. లైట్ గేజ్ స్టీల్ ఫ్రేమింగ్ సాంకేతికతతో అమరావతిలో ఆధునిక నిర్మాణ యూనిట్, డీపీ వరల్డ్‌తో కలసి రాష్ట్రంలో భారీ పోర్టు టెర్మినల్, లాజిస్టిక్స్, మౌలిక వసతుల అభివృద్ధి, ఏడీఎన్ఓసీ సంస్థ ద్వారా ఫ్లోటింగ్ స్టోరేజీ, విశాఖలో లులూ గ్రూప్ మెగా షాపింగ్ మాల్ నిర్మాణంపైనా చర్చించారు. యూఏఈతో వ్యూహాత్మక భాగస్వామ్యం ద్వారా ఏపీలో పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు, ఎగుమతులు మరింత వేగంగా పెరుగుతాయని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోకి పెట్టుబడులపై చంద్రబాబు ప్రతిపాదనలపై యూఏఈ ఆర్థికమంత్రి సానుకూలంగా స్పందించారు. భవిష్యత్తులో యూఏఈ సంస్థలు మరింత సహకారం అందించేందుకు సిద్ధంగా ఉంటాయని వెల్లడించారు. రాష్ట్రంలో యూఏఈ సంస్థల భాగస్వామ్యానికి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

దావోస్‌లో నేడు...

అమరావతి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో సీఎం చంద్రబాబు బుధవారం, మూడోరోజు ప్రముఖ కంపెనీల అధినేతలు, సీఈవోలతో సమావేశం కానున్నారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరం కాంగ్రెస్ సెంటర్‌లో జరిగే పారిశ్రామిక పురోగతి అంశంపై నిర్వహించే సెషన్‌లో సీఎం పాల్గొంటారు. హొరాసిస్ ఛైర్మన్ ఫ్రాంక్ జర్గెన్ రిక్టర్, తమారా హాస్పిటాలిటీ సంస్థ ఫౌండర్ ఎస్‌డీ శిబులాల్, కాలిబో ఏఐ అకాడమీ వ్యవస్థాపకుడు రాజ్ వట్టికుట్టి, సీఈఓ స్కాట్ సాండ్‌షాఫర్ తదితరులతో సీఎం సమావేశమవుతారు. అనంతరం ఏపీసీఎన్ఎఫ్ నిర్వహించే 'హీలింగ్ ప్లానెట్ త్రూ రీ జెనరేటివ్ ఫుడ్ సిస్టమ్' చర్చావేదికలో పాల్గొంటారు.

అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలి

- ఒక తరం అభివృద్ధి చెందేలా ప్రభుత్వ నిర్ణయాలు
- 'వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్‌ప్రెన్యూర్'పై చర్చలో సీఎం చంద్రబాబు

అభివృద్ధిలో అందరినీ భాగస్వాములను చేయాలన్న సంకల్పంతోనే వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్‌ప్రెన్యూర్ విధానాన్ని అమలు చేస్తున్నామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయం కుటుంబంలోని ఒక తరానికి మేలు చేయాలన్నారు. తన ఆలోచనలు ఎప్పుడూ ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధిపైనే ఉంటాయని చెప్పారు. దావోస్ ఆర్థిక సదస్సులో పలువురు పారిశ్రామికవేత్తలతో ఆయన భేటీ అయ్యారు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్‌ప్రెన్యూర్ విధానంపై చర్చ జరిగింది. భారతదేశం ఇప్పుడు ఉత్పత్తి రంగం వైపు చూస్తోందని, దానిని అందిపుచ్చుకునే దిశగా ఈ సరికొత్త విధానం తెచ్చామని చంద్రబాబు అన్నారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా పారిశ్రామికవేత్తలు కావాలనుకునేవారికి మార్గనిర్దేశం చేస్తున్నామన్నారు. పారిశ్రామికాభివృద్ధికి మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని చెప్పారు. ఎంఎస్ఎంఈలను ప్రోత్సహించడం ద్వారా లోకల్ బ్రాండ్లకు మద్దతుగా ఉంటున్నామని చెప్పారు. గతేడాది మహిళా దినోత్సవం నాడు లక్ష మంది మహిళా పారిశ్రామికవేత్తలను చేస్తామని ప్రకటించామని, విడతల వారీగా మహిళలను పారిశ్రామికవేత్తలుగా చేస్తామని చెప్పారు.

ఉత్పత్తి.. బ్రాండింగ్ ముఖ్యం

"నైపుణ్యం ఉన్న మానవ వనరులను కంపెనీలకు అందించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇలా చేయగలిగితేనే రాష్ట్రాభివృద్ధితో పాటు ప్రజలు కూడా అభివృద్ధి సాధిస్తారు. ఎన్నో రంగాల్లో అభివృద్ధి జరుగుతోంది పారిశ్రామికవేత్తలుగా ఎదిగాక ఉత్పత్తులను తయారు చేయడంతో పాటు బ్రాండింగ్‌నూ మార్కెట్ చేయడం అత్యవసరం. డ్వాక్రా మహిళల ఉత్పత్తులకూ బ్రాండింగ్ కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం" అని సీఎం అన్నారు.

స్టార్టప్‌కు డబ్ల్యూఐపీఓ సహకారం అందించాలి

రాష్ట్రంలో స్టార్టప్ వ్యవస్థకు వరల్డ్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ ఆర్గనైజేషన్ సహకారం అందించాలని సంస్థ డైరెక్టర్ జనరల్ డారెన్ టాంగ్, డైరెక్టర్ అనిల్ మార్తిని చంద్రబాబు కోరారు. దావోస్ పర్యటనలో ఉన్న చంద్రబాబును వారు కలిశారు. ఆవిష్కరణలకు ప్రోత్సాహం, మేధోసంపత్తి హక్కుల రక్షణ, స్టార్టప్ ఎకోసిస్టమ్, పరిశోధన-అభివృద్ధి, పేటెంట్ వ్యవస్థ బలోపేతం అంశాలపై చర్చించారు. ఏపీని నాలెడ్జ్ ఎకానమీ, ఇన్నోవేషన్ ఆధారిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు.

అత్యుత్తమ నగరంగా అమరావతి

ప్రపంచంలో అత్యుత్తమ, అత్యంత సుందరమైన నగరంగా అమరావతిని తీర్చిదిద్దుతామని, ఈ ప్రయత్నంలో అందరూ భాగస్వాములు కావచ్చని చంద్రబాబు ఆహ్వానించారు. పెట్టుబడిదారులకు ఏపీ కంటే మెరుగైన గమ్యస్థానం లేదన్నారు. ప్రధాని మోదీ రూపంలో దేశానికి బలమైన నాయకత్వం ఉందని అన్నారు. భారత్ వేగంగా అభివృద్ధి చెందుతోందని, ఏపీ మరింత వేగంగా ముందుకు సాగుతోందని అన్నారు.

జీవితాలను ఏఐ మెరుగుపరచాలి: సత్య నాదెళ్ల

విద్యా రంగం ఫలితాల నుంచి ప్రభుత్వ రంగ సామర్థ్యం వరకు ప్రతి ఒక్కరి జీవితాలను మెరుగుపరచడమే కృత్రిమ మేధస్సు (ఏఐ) లక్ష్యండగా ఉండాలని మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల అన్నారు. దావోస్ సదస్సులో ఆయన మాట్లాడారు. జీవితంలో అన్ని అంశాలలో ఏఐ పాత్రను పరిశీలించాల్సిన అవసరముందన్నారు.

కల్యాణదుర్గంలో 'స్కై ఫ్యాక్టరీ'!

- ఎలక్ట్రిక్ వర్టికల్ టేకాఫ్, ల్యాండింగ్ విమానాల తయారీ కేంద్రం ఏర్పాటు
- 1,300 కోట్ల పెట్టుబడితో.. 500 ఎకరాల్లో.. సర్లా ఏవియేషన్ సంస్థ సన్నాహాలు

అనంతపురం జనవరి 20(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా కల్యాణదుర్గం నియోజకవర్గానికి మహర్దశ పట్టనుంది. కల్యాణదుర్గం మండలం తిమ్మసముద్రం గ్రామ సమీపంలో 500 ఎకరాల్లో రూ.1,300 కోట్లతో ఎలక్ట్రిక్ వర్టికల్ టేకాఫ్, ల్యాండింగ్ (ఈవీటీవోఎల్) విమానాల తయారీ కేంద్రం ఏర్పాటు చేసేందుకు సర్లా ఏవియేషన్ ముందుకొచ్చింది. ఆ మేరకు ఆ కంపెనీ ప్రతినిధులు మంగళవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఈ విమానాల తయారీ కర్మాగారానికి స్కై ఫ్యాక్టరీగా నామకరణం చేశారు. ప్రాజెక్టు మొదటి దశలో 150 ఎకరాల్లో రూ.330 కోట్ల పెట్టుబడితో మ్యాన్యుఫ్యాక్చరింగ్ అండ్ టెస్టింగ్ క్యాంపస్ ఏర్పాటు చేస్తారు. 2029 నాటికి పూర్తిస్థాయిలో పరిశ్రమను నెలకొల్పాలని ఆ సంస్థ లక్ష్యంగా నిర్ణయించుకుంది. ఈ పరిశ్రమ పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చాక ఏడాదికి 1,000 ఎయిర్‌క్రాఫ్ట్‌లు ఉత్పత్తి చేయాలని భావిస్తున్నారు. దీని ద్వారా పట్టణ వాయు రవాణాకు ఒక పూర్తిస్థాయి వ్యవస్థను నెలకొల్పాలని ఆ కంపెనీ భావిస్తోంది. ఈ పరిశ్రమ క్యాంపస్‌లో అత్యాధునిక సాంకేతికతతో పనిచేసే రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్లు, ల్యాబ్‌లు, విమాన టెస్టింగ్ సౌకర్యాలు, 2 కిలోమీటర్ల పొడవైన రన్‌వేలు నిర్మించనున్నారు. ఇక్కడ పైలట్లకు శిక్షణ ఇస్తారు. ఈ ప్రక్రియకు సంబంధించి సర్లా ఏవియేషన్ ఇప్పటికే బెంగుళూరులో క్షేత్రస్థాయిలో పరిశోధనలు చేస్తోంది. ఈవీటీవోఎల్ ఎయిర్‌క్రాఫ్ట్‌ల తయారీ ద్వారా వాణిజ్య ఎయిర్ ట్యాక్సీ సేవలు అందుబాటులోకి వస్తాయి. ఈ పరిశ్రమతో వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. ఆరు సీట్లు ఉండే ఈ విమానాలు ఒకసారి చార్జింగ్ చేస్తే దాదాపు 160 కిలోమీటర్ల దూరం, గంటకు 250 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయి. వీటిద్వారా మెట్రో పాలిటన్ నగరాలు, విమానాశ్రయాల మధ్య అనుసంధానం మెరుగుపడుతుంది.

చంద్రబాబు విజన్‌కు నిదర్శనం: ఎమ్మెల్యే అమిలినేని

రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాలను సైతం అభివృద్ధి చేయాలని సీఎం చంద్రబాబు సంకల్పించారని, ఆయన విజన్‌కు తిమ్మసముద్రంలో ఏర్పాటు చేయనున్న ఈవీటీవోఎల్ విమాన తయారీ కేంద్రం నిదర్శనమని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. ఈ కర్మాగారం ఏర్పాటుతో ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని, దీనికి అవసరమైన అన్ని సౌకర్యాలు సమకూర్చేందుకు సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. ఇందులో అర్హత, నైపుణ్యం కలిగిన యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఎమ్మెల్యే తెలిపారు.

పరిశ్రమలను తరిమేసిన క్రెడిట్ జగన్‌దే: కలిశెట్టి

అమరావతి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొచ్చేందుకు 75 ఏళ్ల వయసులో చంద్రబాబు కష్టపడుతుంటే జగన్ ఓర్వలేకపోతున్నారు. ఆయనపై లేనిపోని విమర్శలు చేస్తున్నారు' అని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు విమర్శించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'జగన్ చేసిన పనుల క్రెడిట్‌ను కూటమి కొట్టేస్తుందని కోడి గుడ్డు మంత్రిగా పేరుపొందిన అమర్‌నాథ్ అనడం హాస్యాస్పదం. బాబాయిని వేసిన క్రెడిట్, తల్లిని, చెల్లినీ ఇంటి నుంచి తరిమేసిన క్రెడిట్ మాకొద్దు. రాష్ట్రంలో ఉన్న పరిశ్రమలను తరిమేసిన క్రెడిట్ జగన్‌దే. అలాంటి వ్యక్తి నుంచి క్రెడిట్ చోరీ చేయాల్సిన గతి కూటమికి పట్టలేదు' అని ఎంపీ అన్నారు.







జపాన్ బ్యాంక్ ఫర్ ఇంటర్నేషనల్ కోఆపరేషన్ ఎండీ షిగెటో, కాగ్నిజెంట్ ప్రతినిధులు, ఆర్ఎంజెడ్ గ్రూప్ ప్రతినిధులతో మంత్రి లోకేశ్ భేటీ

పెట్టుబడుల గమ్యం ఏపీ

- ఆవిష్కరణలు-పరిశ్రమల మధ్య అంతరాలు లేకుండా నిర్మాణాత్మక చర్యలు
- రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా రాష్ట్రంలో ఆవిష్కరణలకు ప్రోత్సాహకాలు
- పెట్టుబడిదారులకు భరోసా కల్పిస్తున్నాం.. ఇన్నోవేషన్స్‌పై దావోస్ సదస్సులో లోకేశ్

అమరావతి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో ఆవిష్కరణల కోసం స్థానికంగా క్యాపిటల్‌ను సమీకరించి, దీర్ఘకాలిక రాబడులను ఇచ్చే ఆవిష్కరణల ఎకోసిస్టమ్‌ను ఏర్పాటు చేస్తూ విశ్వసనీయ చర్యలు తీసుకుంటున్నామని ఐటీ మంత్రి లోకేశ్ వెల్లడించారు. దావోస్ ప్రపంచ ఆర్థిక సదస్సు వేదికగా మంగళవారం 'పెట్టుబడులను బలోపేతం చేయడంలో మనం ఎక్కడ?' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో లోకేశ్ మాట్లాడారు. పెట్టుబడులను ఆకర్షించడమంటే కేవలం సంస్థలను తీసుకురావడం కాదని, ఆవిష్కరణలకు అవసరమైన స్థిరమైన ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేయడమని అన్నారు. భారత్‌లో పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ గమ్యస్థానంగా మారిందని పేర్కొన్నారు. తమ రాష్ట్రంలో ఆవిష్కరణలు, పరిశ్రమల మధ్య అంతరాన్ని తగ్గించేందుకు నిర్మాణాత్మక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా స్టార్టప్‌లకు ప్రోత్సాహకాలను కల్పిస్తున్నామన్నారు. విశాఖలో గూగుల్ క్లౌడ్, సిస్కో, ఎల్ అండ్ టీ టెక్నాలజీ సర్వీసెస్ భాగస్వామ్యంతో ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీలతో పాటు ఆర్ అండ్ డీపై ప్రత్యక్షంగా పెట్టుబడి పెడుతున్నామన్నారు.

పెట్టుబడిదారులకు భరోసా ఇస్తున్నాం

తమ రాష్ట్రంలోని స్థానిక ప్రతిభ ప్రపంచ సవాళ్లకు పరిష్కారం చూపుతుందని లోకేశ్ అభిప్రాయపడ్డారు. భారతదేశంలో మొట్టమొదటిసారిగా పెట్టుబడిదారులకు భరోసా ఇస్తున్నామన్నారు. 2047 నాటికి క్లీన్ ఎనర్జీ లక్ష్యాలను సాధించేందుకు ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీని తెచ్చామన్నారు. రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు రాబట్టి, 167 గిగావాట్ల క్లీన్ ఎనర్జీని సాధించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామన్నారు. క్వాంటమ్ కంప్యూటింగ్ కోసం క్వాంటమ్ వ్యాలీ, దేశంలోనే మొట్టమొదటి డ్రోన్ సిటీ, స్పేస్ సిటీలను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. గ్రీన్ ఎనర్జీ రంగంలో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడుల సాధన లక్ష్యంలో ఇప్పటికే రూ.5.22 లక్షల కోట్ల పెట్టుబడులను సాధించామన్నారు.

విశాఖలో రీజనల్ టెక్నాలజీ ఆపరేషన్స్ హబ్

గ్లోబల్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్, డేటా సెంటర్ సర్వీసులలో పేరొందిన అమెరికాకు చెందిన బహుళజాతి సంస్థ ఐరన్ మౌంటైన్ ప్రెసిడెంట్, సీఈవో విలియం మీనేతో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. స్కిల్డ్ వర్క్‌ఫోర్స్, గ్లోబల్ కనెక్టివిటీని మెరుగుపరచడానికి భారత్, ఏపీఏసీ డేటా సెంటర్లకు మద్దతుగా డేటా సెంటర్ హబ్‌గా అభివృద్ధి చెందుతున్న విశాఖలో రీజనల్ టెక్నాలజీ ఆపరేషన్స్ హబ్ నెలకొల్పాలని కోరారు. డేటా మేనేజ్‌మెంట్, సెక్యూర్ స్టోరేజీ టెక్నాలజీస్, నెక్స్ట్ జెన్ డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై దృష్టి సారించాలన్నారు. రాబోయే మూడు నాలుగేళ్లలో క్లౌడ్, ఎంటర్‌ప్రైజ్, హైపర్ స్కేల్ విభాగాల నుంచి డిమాండ్‌ను అంచనా వేయాలన్నారు. క్వాంటమ్‌లలో ఏఐ-రెడీ మౌలిక సదుపాయాలను నిర్మించడంపై ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు.

ఓడరేవుల అభివృద్ధికి సహకరించండి

జపాన్ బ్యాంక్ ఫర్ ఇంటర్నేషనల్ కోఆపరేషన్ (జేబీఐసీ) ఎండీ షిగెటోతో భేటీ సందర్భంగా ఏపీలో ఓడరేవుల అభివృద్ధికి సహకరించాలని లోకేశ్ కోరారు. ఓడరేవుల ఆధారిత మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఇంధన భద్రత, ఇతర కేంద్రీకృత రంగాలకు నిధులు సమకూర్చడం, ఎఫ్‌డీఐలను సులభతరం చేయడంలో ఏపీకి సంస్థాగత భాగస్వామ్యం వహించాలని కోరారు. నౌకల నిర్మాణం, సెమి కండక్టర్, ఆటోమొబైల్స్, ఫుడ్ ప్రాసెసింగ్, ఇండస్ట్రియల్ మాన్యుఫాక్చరింగ్ రంగాల్లో జపాన్ విదేశీ పెట్టుబడులకు మార్గదర్శనం చేయాలన్నారు. సీబీఐసీ కారిడార్ వెంట జపాన్ ఇండస్ట్రియల్ టౌన్‌షిప్ అభివృద్ధి చేయాలని కోరారు.

డేటా సెంటర్ పనులు వేగవంతం చేయండి



బ్రూక్‌ఫీల్డ్ ఎసెట్ మేనేజ్‌మెంట్ ప్రెసిడెంట్ కానర్ టెస్కీతో మంత్రి లోకేశ్

బ్రూక్‌ఫీల్డ్ ఎసెట్ మేనేజ్‌మెంట్ ప్రెసిడెంట్ కానర్ టెస్కీతో మంత్రి లోకేశ్ విడిగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇటీవల విశాఖ సీఐఐ భాగస్వామ్య సదస్సులో కుదుర్చుకున్న ఒప్పందాల మేరకు గిగావాట్ స్కేల్ క్లీన్ ఎనర్జీ పవర్ డేటా సెంటర్ ప్లాట్‌ఫాం పనులను వేగవంతం చేయాలని కోరారు. గ్రిడ్ స్కేల్ స్టోరేజీ అవసరాలకు అనుగుణంగా బ్యాటరీ స్టోరేజీ సోలార్ సెల్, మాడ్యూల్ తయారీ సౌకర్యాలను కూడా ఏర్పాటు చేయాలని, కృష్ణపట్నం పోర్టు పరిసరాల్లో పారిశ్రామిక క్లస్టర్ సమీపాన గ్రీన్ మాలిక్యూల్/హైడ్రోజన్ లింక్డ్ పైలట్ ప్రాజెక్టుల ఏర్పాటును పరిశీలించాలని కోరారు. ఏపీ ఐటీ కారిడార్‌లో మిశ్రమ వినియోగానికి భారీ స్థాయిలో వాణిజ్య, ఐటీ కార్యాలయాలను అభివృద్ధి చేయాలన్నారు. ఏపీ-బ్రూక్‌ఫీల్డ్ సంయుక్తంగా చేపట్టే ప్రాజెక్టులకు సహకరించేందుకు నిర్మాణాత్మక యంత్రాంగాన్ని సిద్ధం చేయాలని కోరారు. రాష్ట్రంలో 12 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నామని బ్రూక్‌ఫీల్డ్ ఎసెట్ మేనేజ్‌మెంట్ ప్రెసిడెంట్ కానర్‌టెస్కీ తెలిపారు. క్లీన్ ఎనర్జీ, ట్రాన్స్‌మిషన్ డేటా సెంటర్లను ఏర్పాటు చేయనున్నామని టెస్కీ వివరించారు.

నూతన సమాచార కమిషనర్ల ప్రమాణ స్వీకారం



మంగళవారం ప్రమాణ స్వీకారం తర్వాత సీఎస్ విజయానంద్‌తో సమాచార కమిషన్ చీఫ్ కమిషనర్, కమిషనర్‌లు

అమరావతి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సమాచార కమిషన్‌కు తాజాగా నియమితులైన కమిషనర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే విజయానంద్ ప్రమాణ స్వీకారం చేయించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో తొలుత రాష్ట్ర సమాచార కమిషన్ చీఫ్ కమిషనర్‌గా వజ్జా శ్రీనివాసరావుతో సీఎస్ ప్రమాణం చేయించారు. అలాగే సమాచార కమిషనర్లుగా నియమితులైన పరవాడ సింహాచలం నాయుడు, వంటేరు రవిబాబు, ఆదెన్న గాజుల, వట్టికూటి శరత్‌చంద్ర కళ్యాణ చక్రవర్తి ప్రమాణం చేశారు. గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆదేశాల మేరకు నూతన కమిషనర్లతో సీఎస్ ప్రమాణం చేయించి, వారికి పుష్పగుచ్ఛాలు అందించి ప్రభుత్వం తరఫున శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర సర్వీసెస్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్, రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి భరత్ మాట తప్పారు

- ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తల ధ్వజం
- ఇన్సెంటివ్స్ బకాయిల కోసం ఏపీఐఐసీ వద్ద ధర్నా



ఏపీఐఐసీ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న పారిశ్రామికవేత్తలు

అమరావతి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక రాయితీల బకాయిలను సంక్రాంతిలోపు పూర్తిగా చెల్లిస్తామని హామీ ఇచ్చిన మంత్రి టీజీ భరత్ మాట తప్పారని ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలు విమర్శించారు. గత నాలుగు సంవత్సరాలుగా తమకు రావాల్సిన రాయితీలను విడుదల చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తుందంటూ ధ్వజమెత్తారు. మంగళవారం రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలు మంగళగిరిలోని ఏపీఐఐసీ కార్యాలయం వద్ద ధర్నాకు దిగారు. ఇన్సెంటివ్స్ బకాయిలు చెల్లించాలంటూ నినాదాలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గత అక్టోబరులో నిధులు విడుదల చేసినప్పటికీ.. పరిశ్రమలశాఖ అధికారులు కొంతమందికి మాత్రమే చెల్లించారని, ఇంకా 50శాతం మందికి పైగా ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు రాయితీ డబ్బులు చెల్లించలేదన్నారు. గత డిసెంబరులో ఏపీఐఐసీ ఎదుట ధర్నాకు దిగినప్పుడు... సంక్రాంతిలోపు ఇన్సెంటివ్స్ బకాయిలు పూర్తిగా చెల్లిస్తామని మంత్రి భరత్ హామీ ఇచ్చారని, సంక్రాంతి వెళ్లిపోయినా మాట నిలబెట్టుకోలేకపోయారని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అనార్‌బాబు, జాయింట్ సెక్రటరీ పెనుమాల నాగకుమార్, మహిళా నాయకురాళ్లు కారెం సత్యనారాయణమ్మ, పాలా నాగలక్ష్మి తదితరులు మాట్లాడుతూ... మంత్రి భరత్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోనందునే ధర్నాకు దిగాల్సివచ్చిందని తెలిపారు. సంఘ రాష్ట్ర నాయకులు జంగా త్రిమూర్తులు, చిన్న మౌలాలి, వరికూటి నీరజ, డాక్టర్ మద్దాల బిందు, కనపర్తి విజయరాజు, సరిహద్దు దయాకర్, కొడాలి రాంబాబు, జగదీష్, వి.భక్తవత్సలం తదితరులు ఈ ధర్నా కార్యక్రమానికి నాయకత్వం వహించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.